సాహితి
గత వారం పుస్తకాల పై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

గుంటూరు

fb.com/vaartha Digital


ముంబయి పేలుళ్ల కేసుపై సుప్రీం స్టే

లోయలో పడిన బస్సు: ఏడుగురి మృతి

9లో

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

25-7-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 174 పేజీలు: 12 వెల: 6.50



గురువారం లండన్‌లో బ్రిటన్ ప్రధాని కీర్‌స్టార్మర్‌తో భేటీ అయిన ప్రధాని మోడీ

# భారత్, బ్రిటన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

**ఉభయ దేశాల మధ్య ఐదేళ్లలో 120 బిలియన్ డాలర్ల వాణిజ్యం**

**సుంకాల తగ్గింపుతో చౌకగా వివిధ వస్తువులు**

**వస్త్రాలు, తోలు, రత్నాలు, ఆభరణాలు, ఇంజినీరింగ్ వస్తువుల ధరలు బాగా తగ్గే అవకాశం**

**లండన్,జూలై 24:** భారత్‌బ్రిటన్‌లమధ్య జరిగిన స్వేఛ్ఛా వాణిజ్య ఒప్పందం వల్ల ఇరుదేశాలకు పరస్పరం ప్రయోజనం చేకూరనుంది. ముఖ్యంగా ఇరుదేశాల ఎగుమతులు, దిగుమతులపై భారీగా విధిస్తున్న సుంకాలను తొలగించడం లేదా తగ్గించడమే లక్ష్యంగా ఈ ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందంవల్ల యుకెలో భారతీయ ఉత్పత్తులు, భారత్‌లో యూకే ఉత్పత్తులు చౌక ధరకు లభించే అవకాశం ఏర్పడుతుంది. అందుకే 2030 నాటికి ఇరుదేశాలు తమ వాణిజ్యాన్ని 120 బిలియన్ యూఎస్ డాలర్లమేర పెంచుకోవాలని కోరుకుంటున్నాయి. ఈ డీల్ వల్ల భారత్ నుంచి యుకెకు జరిగే దాదాపు 99 శాతం ఎగుమతులపై సుంకాలను తొలగించడం లేదా తగ్గించడం జరుగుతుంది. దీని వల్ల భారత్‌కు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. ముఖ్యగా వస్త్రాలు, తోలు, పాదరక్షలు, క్రీడా వస్తువులు, బొమ్మలు, సముద్ర ఉత్పత్తులు, రత్నాలు, ఆభరణాలు, ఇంజినీరింగ్ వస్తువులు, ఆటో విడిభాగాలు, ఇంజిన్లు, సేంద్రీయ రసాయ >>2

# రూ. 70 వేల కోట్ల పెట్టుబడులు

## ప్రాజెక్టులు ప్రారంభమైతే లక్ష ఉద్యోగాలు

**ఎలక్ట్రానిక్స్ తయారీ పాలసీకి కేబినెట్ ఆమోదం**

**4.45 ఎకరాల్లో పీనం పీపుల్ సంస్థ ఏర్పాటు**

**విశాఖలో సిఫి భారీ డేటా సెంటర్**

**పరదేశిపాలెంలో సిఫికి 50 ఎకరాలు కేటాయింపు**

**సిఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ సమావేశం**



గురువారం సచివాలయంలో జరిగిన మంత్రి మండలి సమావేశంలో సిఎం చంద్రబాబు, మంత్రులు

**విజయవాడ,జూలై 24,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రాభివృద్దికి జగన్,వైఎస్సార్సీ నేతలు ఎన్ని అడ్డంకులు పెట్టినా పెట్టుబడులు రాకుండా అడ్డుకోలేక పోయారని సిఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేసారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం సచివాలయంలో కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులతో సిఎం చర్చించారు.వాటితో పాటు తన సింగపూర్ పర్యాటనంశాల గురించి మాట్లాడారు. మంత్రి మండలి భేటీలో దగ్గరదగ్గర 50 వరకు అజెండా అంశాలపై చర్చించారు. వెనుకబడిన ప్రాంతాల్లో ఎక్కువ పెట్టుబడులు వచ్చేలాచూడాలని సిఎం చంద్రబాబు సూచించారు. తిరుపతి తొక్కిసలాట ఘటనలో విశ్రాంత న్యాయ మూర్తి నివేదిక ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. నాలా ఫీజు అంశంపైనా చర్చించారు. రెవెన్యూతో పాటు పంచాయతీ శాఖ అంశాలు నాలాతో ముడిపడి ఉండటంతో వచ్చే కేబినెట్‌లో మరోసారి చర్చించాలని నిర్ణయించారు. ఎపిలో మొత్తం రూ.70 వేల కోట్లు పెట్టుబడులకు కేబినెట్ ఆమోదం తెలిపింది.
వీటన్నింటినీ గ్రౌండ్ చేయించిన పక్షంలో, లక్షమందికి ఉద్యోగాలు వస్తాయని సిఎం తెలిపారు. వీటిని మనం వెంటబడి గ్రౌండ్ చేయించాలని సూచించారు. ఐటి, రెన్యువబుల్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్, డ్రోన్, ఆటోమొబైల్స్ రంగాల్లో ఈ పరిశ్రమలు వస్తున్నాయని ముఖ్యమంత్రి వివరించారు. త్వరలో ఇల్లు లేని నిరుపేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇచ్చే కార్యక్రమం వెంటనే చేపట్టాలని.. ఈ విషయంపై అందరూ దృష్టి సారించాలని మంత్రులకు మార్గనిర్దేశం చేశారు సిఎం చంద్రబాబు. క్వాంటం వ్యాలీ మాదిరిగా మనం గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీలో కూడా అందరి కంటే ముందు ఉండాలని, దీనివల్ల మనకు ప్రయోజనం ఎక్కువగా ఉంటుందని చెప్పుకొచ్చారు. సింగపూర్‌తోసంబంధాలపై సిఎం >>2

# విశాఖ, విజయవాడ మెట్రో ప్రాజెక్టులకు నేడు టెండర్లు

## మొత్తం రూ. 21,616 కోట్ల వ్యయం, రెండు దశల్లో నిర్మాణం

**విజయవాడ,జూలై 24,ప్రభాతవార్తప్రతినిధి:** విశాఖపట్నం, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టులకు శుక్రవారం టెండర్లు పిలవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రాజెక్టు వ్యయంలో 40 శాతం పనులకు తొలుత టెండర్లు పిలవనుంది. మొత్తం రూ.21,616కోట్లతో ఈ రెండు ప్రాజెక్టులకు టెండర్లు ఆహ్వానించనున్నారు.
విశాఖ మెట్రోరైలుకు రూ.11,498కోట్లతో, విజయవాడ మెట్రోకు రూ.10,118 కోట్లతో టెండర్లు పిలవనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల 50:50 భాగస్వామ్యంతో ఈప్రాజెక్టుల నిర్మాణాలు జరగనున్నాయి. విశాఖ మెట్రోకు రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద వీఎంఆర్డీఎనుంచి రూ.4,101 కోట్లు ఇవ్వాలని నిర్ణయించారు. విజయవాడ మెట్రోకు సిఆర్డీఏ నుంచి రూ.3,497 కోట్లు కేటాయించనున్నారు. విశాఖ, విజయవాడ మెట్రోరైల్ ప్రాజెక్టుల తొలిదశ డిపిఆర్‌కు ఇప్పటికే ప్రభుత్వం ఆమోదం తెలిపింది. విశాఖ తొలిదశలో 46కిలోమీటర్ల మేర 3 కారిడార్లను నిర్మించనున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ నుంచి కొమ్మాది వరకు 34 కిలోమీటర్లు ఒకటో కారిడార్, గురుద్వారనుంచి పాతపోస్టాఫీస్ వరకు 5 కిలోమీటర్లు 2వకారిడార్, తాడిచెట్లపాలెం నుంచి చిన వాల్తేర్‌వరకు 6 కిలోమీటర్లు 3వ కారిడార్ నిర్మించనున్నారు. రెండోదశలో కొమ్మాదినుంచి భోగాపురం వరకు 30 కి.మీ మరో కారిడార్ నిర్మించనున్నారు. విజయవాడ మెట్రో రైల్ రెండు దశలుగా చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. మొదటి దశలో రెండు కారిడార్‌లు, రెండో దశలో మరో కారిడార్ నిర్మాణం చేపట్టేలా ప్రణాళికలు రూపొందించారు. మొదటి దశలో కారిడార్ 1ఏగా గన్నవరం నుంచి పండిట్ నెహ్రూ బస్టాండ్ వరకూ, కారిడార్ 1 బిగా పండిట్ నెహ్రూ బస్టాండ్ నుంచి పెనమలూరు వరకూ మెట్రోరైల్ ప్రాజెక్టు చేపట్టనున్నారు. ఇక రెండో దశలో కారిడార్ 3గా పండిట్ నెహ్రూ బస్టాండ్ నుంచి అమరావతి వరకూ ప్రాజెక్టు నిర్మించాలని నిర్ణయించారు. మొదటి దశ కారిడార్ 1ఏ, 1బిలను 38.4 కిలోమీటర్ల మేర నిర్మించాలని డిపిఆర్‌లో ప్రతిపాదించారు.

# ఏవియేషన్ హబ్‌గా ఎపి

**రూ. 600 కోట్లు పెట్టుబడులకు 'స్కైబర్డ్' సుముఖత**

**హెలీటాక్సీ సంస్థ నుంచి రూ. 210 కోట్ల పెట్టుబడులు: మంత్రి జనార్ధన్ రెడ్డి**



**విజయవాడ,జూలై24,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి రాబోయే రోజుల్లో 'ఏవియేషన్ హబ్' గా మారబోతుందని.. రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.. నేడు సచివాలయంలోని ఆర్ బీ శాఖా కార్యాలయంలో మంత్రి బిసి జనార్ధన్ రెడ్డిని పలువురు పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు మర్యాదపూర్వకంగా కలిశారు.. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు 3 సంస్థలు తమ ఆసక్తిని మంత్రికి తెలియజేయడం జరిగింది.
రాష్ట్రంలో గతేడాది కాలంలో విజనరీ లీడర్ సిఎం చంద్రబాబునాయుడు, యువనేత లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో పెట్టుబడులకు సానుకూల వాతావరణం ఏర్పడిందని.. దీంతో రాబోయే రోజుల్లో ఎపి పెట్టుబడులకు స్వర్గధామంగా మారబోతుందని మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి తెలిపారు.. ముఖ్యంగా నేడు దేశంలో ప్రముఖ ఏవియేషన్ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి సానుకూలత వ్యక్తం చేయడం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే తలమానికమని మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. నేడు ఆయా ఏవియేషన్ సంస్థల ప్రతినిధులతో మంత్రి జనార్ధన్ రెడ్డి జరిపిన చర్చలు ఫలప్రదం కావడంతో, రాష్ట్రంలో పెట్టుబడి పెట్టేందుకు ఏవియేషన్ సంస్థలు సుముఖత తెలపడం జరిగింది. ఈ సందర్భంగా ఆయా సంస్థల ఆలోచనలు, దీర్ఘకాలిక వ్యూహాలతో కూడిన సమగ్ర నివేదికను మంత్రికి అందజేయడం జరిగింది. రాబోయే రోజుల్లో పూర్తిస్థాయి ప్రతిపాదనలతో ముందుకు వస్తే, రాష్ట్రంలో ఆయా సంస్థల ఏర్పాటుకు త్వరిత గతిన అనుమతులు మంజూరు చేస్తామని ఆ సంస్థ ప్రతినిధులకు మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి హామీ ఇవ్వడం జరిగింది.

**రూ. 600 కోట్ల పెట్టుబడులకు స్కై బర్డ్ ఏవియేషన్ ప్రవేట్ లిమిటెడ్ సుముఖత**

మంత్రి జనార్ధన్ రెడ్డితో జరిగిన సమావేశంలో స్కై బర్డ్ ఏవియేషన్ ప్రవేట్ లిమిటెడ్ సంస్థ రూ. 600 కోట్లతో ఫుల్ ఫ్లైట్ సిమ్యులేషన్ సెంటర్ ఏర్పాటుకు ఆసక్తిని కనబర్చింది. రూ. 210 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఎఫ్‌టీఓ హెలీ టాక్సీ సర్వీసెస్ సంస్థ సుముఖత వ్యక్తం చేసింది.
రాష్ట్రంలో ఔత్సాహిక యువతకు పైలెట్‌లుగా శిక్షణ ఇవ్వడానికి ఫ్లైయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేయడానికి పెలిక్సీ ఏవియేషన్ అకాడమీ తమ ఆసక్తిని వ్యక్తం చేయడం జరిగింది.
ఏవియేషన్‌రంగంలో అపారఅనుభవం ఉన్న ఇటువంటి జాతీయ స్థాయి గుర్తింపు పొందిన సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావడం నిజంగానే ఆంధ్రప్రదేశ్‌కు శుభపరిణామమన్నారు. ఇప్పటికే ఈప్లెన్ కంపెనీ బ్లూజే ఏవియేషన్, మాగ్నమ్‌వింగ్స్, సరళ ఏవియేషన్ సంస్థ, గోల్డెన్ ఎప్యూలెట్స్ ఏవియేషన్ అకాడమీ సంస్థ హరిబన్ ఏరోనాటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి ప్రముఖ సంస్థలు మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి కనబర్చడమే కాదు, గతంలో మంత్రిని స్వయంగా కలిసి వారి ఆలోచనలు, కార్యాచరణ ప్రణాళికలు తెలియజేయడం జరిగింది. మొత్తంగా రాష్ట్రంలో ఏవియేషన్ రంగంలో 9 ఫ్లైయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్స్ సంస్థలు, 2 ఫ్లైట్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీలు, >>2

# ముగ్గురు పిల్లల్ని కంటే ఆస్తిపన్ను మినహాయింపు

**మాతృత్వ సెలవులు 12కు పెంపు**

**విజయవాడ.జూలై24,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయాన్ని తీసుకుంది. ముగ్గురు పిల్లల్ని కంటే ఆస్తిపన్ను మినహాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఐవిఎఫ్ చికిత్స ఖర్చును భరించి మాతృత్వ సెలవులను 6 నుంచి 12 నెలలకు పెంచాలని, తల్లులకు వర్క్ ఫ్రం హోం సౌకర్యంకల్పించాలని ప్రభుత్వం భావిస్తుంది. ఎక్కువ మంది పిల్లలను కన్నవారే నిజమైన దేశభక్తులు అన్న సిఎం చంద్రబాబు మాటలకు అనుగుణంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాష్ట్ర జనాభాను పెంచేందుకు పలు ప్రతిపాదనలతో పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ ముసాయిదా సిద్ధమవుతుంది.రాష్ట్రంలో సంతానోత్పత్తి తగ్గుదల, వృద్ధ జనాభా పెరుగుదల వంటి సవాళ్లను దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్ పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ ముసాయిదాను ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. స్వల్ప, మధ్య, దీర్ఘకాలాల్లో అనుసరించాల్సిన వ్యూహాలను అధికారులు రూపొందిస్తున్నారు. సంతానోత్పత్తి రేటునుపెంచే చర్యల్లో భాగంగామేధావులు, నిపుణుల సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని పలు ప్రోత్సాహకాలను ముసాయిదాలో ప్రతిపాదించారు. రాష్ట్రంలో రెండుపాయింట్ ఒకటిగాఉండాల్సిన సంతానోత్పత్తిరేటు ఒకటి పాయింట్ ఐదుకు తగ్గింది. ఈపరిణామం ఆందోళన >>2

# రాష్ట్రంలో వెయ్యి కోట్లతో కొత్త రోడ్లు

**• మరో రూ. 500 కోట్లతో రహదారులకు మరమ్మతులు • ప్రతి 50 కి.మీకి సిసి కెమెరా: సిఎం చంద్రబాబు**

**విజయవాడ, జూలై 24,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని 2,000 కిలోమీటర్ల మేర రాష్ట్ర, జిల్లా రహదారులను రూ.1,000 కోట్లతో కొత్తగా నిర్మించాలని సిఎం చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి అంచనాలు, టెండర్ల ప్రక్రియను వెంటనే మొదలుపెట్టాలని సూచించారు. మరో రూ.500 కోట్లతో రాష్ట్రంలో దెబ్బతిన్న మిగిలిన రహదారుల మరమ్మతులు వర్షాకాలంలోనూ కొనసాగించాలని... వీలున్నంత త్వరగా వీటిని పూర్తి చేయాలని స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలో ఆర్ అండ్ బి అధికారులతో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి... రాష్ట్రంలోని రహదారుల పరిస్థితిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.
గత ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు రహదారుల నిర్మాణం, మరమ్మతులపై తీవ్ర నిర్లక్ష్యం చూపడంతో అధ్వాన్నంగా తయారయ్యాయని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రంలో ఇంకా ఎన్ని రోడ్లు మరమ్మతులు చేయాలి.. ఏవి కొత్తగా నిర్మించాలి.. నిర్వహణకు ఏ రహదారులు ఇవ్వాలి... అనేదానిపై 15 రోజుల్లోగా నివేదిక సమర్పించాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. సంప్రదాయ విధానంలో రోడ్లు నిర్మించడం వల్ల ఆర్థికంగా భారం కావడంతో పాటు, నాణ్యత విషయంలోనూ అనుకున్నంత స్థాయిలో లేవని... అందుకే, రహదారుల నిర్మాణంలో అత్యాధునిక విధానాలను అనుసరించాలని సూచించారు. మరోవైపు ఇప్పటికే రాష్ట్రంలో 20,000 కి.మీ. మేర రహదారులను గుంతలు లేకుండా మరమ్మతులు పూర్తి చేశామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు.

**జాతీయ ప్రమాణాలతో రాష్ట్ర రహదారులు**

జాతీయ రహదారుల తరహాలో రాష్ట్ర రహదారులు ఉండాలి. ప్రతీ రహదారి నిర్దేశిత ప్రమాణాలతో నిర్మించాలి. వర్షాకాలం ముగిసిన వెంటనే నవంబర్ నుంచి కొత్త రహదారుల నిర్మాణం చేపట్టాలి. ఏ రోడ్డు ఏకాంట్రాక్టర్ నిర్మించారు, ఎవరు మెయింటైన్ చేస్తున్నారు.. అనే వివరాలు ఆన్‌లైన్‌లో ఉంచాలి. ప్రతీ 50 కి.మీ. చొప్పున అన్ని రహదారులపై సిసి కెమేరాలు ఏర్పాటు చేయాలి. రాష్ట్రంలోని అన్ని రహదారుల్లో మరమ్మత్తుల నిర్వహణను కాంట్రాక్టర్లకు అప్పగించి.. వర్షాకాలంలో రోడ్లు పాడవ్వకుండా కాపాడుకునేలా చర్యలు తీసుకోవాలి అని ముఖ్యమంత్రి అన్నారు.

**పిపిపి విధానంలో రోడ్ల అభివృద్ధికి ప్రతిపాదనలు**

12,653 కి.మీ పొడవున రాష్ట్ర హైవేలు ఉండగా.. ఇందులో 20కి.మీ. కన్నా పొడవైన రోడ్లను పిపిపి విధానంలో అభివృద్ధిచేయడానికి ఆస్కారం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి తెలి >>2



# చైనా సరిహద్దుల్లో కూలిన రష్యా విమానం

**49 మంది మృత్యువాత!**

**మాస్కో, జూలై 24:** రష్యాకు చెందిన ఎఎన్-24 విమానం రాడార్ నుంచి సంబంధాలు తెగిపోయి చైనా సరిహద్దుల్లోని తూర్పు ప్రాంతంలో కుప్పకూలింది. ప్రమాద సమయంలో విమానంలో దాదాపు 49 మంది వరకు ప్రయాణికులు ఉన్నారని తెలుస్తోంది. తొలుత విమానం అదృశ్యమైనట్లు వార్తలు రాగా, కాసేపటి క్రితమే కూలిపోయిందని అధికారులు నిర్ధరించారు. రష్యన్ వార్తా కథనాల ప్రకారం.. గురువారం తెల్లవారుజామున 49 మంది ప్రయాణికులతో వెళ్తున్న రష్యా విమానం తొలుత అదృశ్యమైంది. సైబీరియాకు చెందిన అంగారా ఎయిర్‌లైన్స్ ఎఎన్-24 విమానం బ్లాగోవెష్‌చెన్స్క్ నుంచి చైనా సరిహద్దుల్లో ఉన్న టిండా ప్రాంతానికి బయల్దేరింది. మరికొద్ది సేపటికి ల్యాండింగ్ అయ్యే సమయానికి ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లతో విమానానికి సంబంధాలు తెగిపోయాయి.
దీంతో అప్రమత్తమైన యంత్రాంగం వెంటనే ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టింది. అదృశ్యమైన కొద్దిసేపటికే రష్యా అత్యవసర పరిస్థితుల మంత్రిత్వ శాఖ విమానం 'కూలిపోతున్న ఫ్యూజ్‌లేజ్' కనుగొన్నట్లుతెలిపింది. అయితే ఆ విమానం ల్యాండ్ అయ్యేందుకు 15 కిలోమీటర్ల దూరంలో ఉండగా కూలిపోయినట్లు >>2

# సిట్ విచారణకు శ్రావణ్ కుమార్

**స్కాంలో తెలంగాణ కీలక వ్యక్తుల పాత్ర**

**విజయవాడ,జూలై24,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో వెలుగు చూసిన లిక్కర్ స్కామ్ అనేక మలుపులు చోటు చేసుకుంది.తెలంగాణలోని కీలక వ్యక్తుల పాత్రకూడా ఈ స్కామ్‌లో వెలుగు చూస్తోంది. తాజాగా ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న శ్రవణ్‌రావు లిక్కర్ స్కామ్‌లో కూడా జోక్యం చేసుకున్నట్లు తేలింది. దీంతో ఆయనకు నోటీసులు ఇచ్చిన సిట్ అధికారులు విచారణకు పిలిచారు. సిట్ పిలుపు మేరకు శ్రవణ్‌రావు విజయవాడలో విచారణకు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో వెలుగు చూసిన లిక్కర్ స్కామ్‌లో డబ్బులను హవాలా రూపంలో చేతులు మారినట్లు సిట్ తేల్చింది. ఇలాంటి డబ్బులను మార్చేందుకు చాలా పెద్ద నెట్‌వర్క్ పని చేసిందని మొన్న కోర్టుకు సమర్పించిన ఛార్జ్‌షీట్‌లో పేర్కొంది. ఇలాంటి నెట్‌వర్క్‌లోని కీలకవ్యక్తులకు ఈ >>2


# బంగాళాఖాతంలో అల్పపీడనం కేంద్రీకృతం

**మరో 48 గంటలు వర్షాలు**

**విజయవాడ,జూలై24,ప్రభాతవార్తప్రతినిధి:** ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం కేంద్రీకృతమై ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. ఇది రానున్న 24 గంటల్లో పశ్చిమవాయువ్య దిశగా కదులుతూ పశ్చిమబెంగాల్, బంగ్లాదేశ్ తీరాలను ఆనుకుని ఉన్న వాయువ్య బంగాళాఖాతంలో మరింత బలపడేం >>2

# క్వాంటం వ్యాలీలో క్యుపిఐఎఐ భాగస్వామ్యం

**సిఎం చంద్రబాబుతో సంస్థ వ్యవస్థాపకుడు నాగేంద్ర నాగరాజన్ భేటీ**



గురువారం సిఎం చంద్రబాబుతో క్యూపిఐఎఐసంస్థ వ్యవస్థాపకులు భేటీ దృశ్యం

**విజయవాడ జూలై 24,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమరావతి క్వాంటం వాలీలో క్యూపిఐఎఐ భాగస్వామ్యం కానుంది. నేషనల్ క్వాంటం మిషన్‌లో భాగంగా దేశంలోనే తొలిసారిగా అమరావతిలో ఏర్పాటుచేస్తున్న క్వాంటంవ్యాలీలో క్యూపీఐఎఐకూడా భాగస్వామ్యం వహించనుంది. దీనిలో అధునాతన 8 క్యూబిట్ క్వాంటం కంప్యూటర్ ఏర్పాటుకు క్యూపిఐఎఐ సంస్థ ముందుకు వచ్చింది. ఈ అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ సంస్థ వ్యవస్థాపకులు నాగేంద్ర నాగరాజన్‌తో చర్చించారు. ప్రజల ప్రయోజనాల కోసం ఉపకరించే ఆవిష్కరణలు, అలాగే, విద్యార్థుల పరిశోధనలకు ఉపయోగపడేలా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సిఎం అన్నారు. దీనితో పాటు అమరావతిలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి క్యూపిఐఎఐను కోరారు. తద్వారా విద్యార్థులు, పరిశోధకులు,స్టార్టప్‌లు, క్వాంటంఅల్గారిథంలు, అప్లికేషన్‌లను రూపొం >>2

25-7pg2exHMNWJQE.qxd:25-7pg2exHMNWJQE.qxd 01/01/01 9:54 AM Page 1





గురువారం న్యూఢిల్లీలో రాష్ట్రపతి ముర్మును కలిసిన పలువురు కళాకారులు

# కూలిన రష్యా విమానం

>> అధికార వర్గాలు తెలిపాయి.

**సహాయక చర్యల్లో పాల్గొన్న రెస్క్యూ సిబ్బంది**

చైనా సరిహద్దుల్లోని టిండా విమానాశ్రయానికి చేరువలోనే విమానప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో విమానంలో ఐదుగురు పిల్లలు, ఆరుగురు సిబ్బందితోపాటు 34 మంది ప్రయాణికులు ఉన్నారని రష్యన్ మీడియా కథనాలు తెలిపాయి. సహాయ చర్యల కోసం ప్రత్యేక దళాలను ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు. కాగా, ఘటనా స్థలంలో భారీగా మంటలు చెలరేగాయి. రెస్క్యూ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని సహాయక చర్యల్లో పాల్గొన్నారు. విమానం తొలుత ల్యాండింగ్‌కు ప్రయత్నించగా అది విఫలం కాగా, మరోసారి ల్యాండింగ్ చేసేటపుడు ప్రమాదానికి గురైనట్లు తెలుస్తోంది. కాగా, ఈ ప్రమాదంలో ఎవరూ బతికే అవకాశం లేదని రష్యా వార్త కథనం ఒకటి ప్రకటించింది. ఘటనాస్థలిలో విమాన శకలాలకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. పైలట్ తప్పిదం, ల్యాండింగ్ సమయంలో వాతావరణం అనుకూలించకపోవడమే ప్రమాదానికి కారణం కావచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత సంవత్సరం సెప్టెంబరులో, ముగ్గురు వ్యక్తులతో వెళ్తున్న రాబిన్సన్ ఆర్66 హెలికాప్టర్ ఇదే అమూర్ ప్రాంతంలో అదృశ్యమైంది. ఈ ప్రాంతంలో మాస్కోకు తూర్పున దాదాపు 6,600 కి.మీ దూరంలో ఉంది.



గురువారం సండ్రింగ్‌హామ్ ప్యాలెస్‌లో కింగ్ ఛార్లెస్-3ని కలుసుకున్న ప్రధాని మోడీ

# రూ. 70 వేల కోట్ల పెట్టుబడులు

>> చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విడిపోయినప్పుడు మనం చూపించిన చొరవతో సింగపూర్ ప్రభుత్వం ముందుకు వచ్చి మనకు సహాయం చేసిందని గుర్తుచేశారు. సింగపూర్ ప్రభుత్వం కూడా అలానే సహాయం చేసిందని ఉద్ఘాటించారు సిఎం చంద్రబాబు. గతంలో అమరావతి రాజధానిలో స్టార్టప్ ఏరియా అభివృద్ధికి సింగపూర్ కన్సార్టియం ముందుకు వచ్చిందని.. ప్రభుత్వం మారిన తర్వాత ఆ కంపెనీ నిర్వాహకులను అప్పటి సిఎం జగన్ వెళ్లగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ కంపెనీ నిర్వాహకులపై జగన్ ప్రభుత్వం అవినీతి ముద్ర వేసిందని ధ్వజమెత్తారు. సింగపూర్ కన్సార్టియం నిర్వాహకులపై కేసు పెట్టేందుకు కూడా ప్రయత్నం చేశారని.. దీంతో వాళ్లు ఎపిపై పూర్తిగా అసంతృప్తి వ్యక్తం చేశారని అన్నారు. సింగపూర్‌తో సంబంధాలు అన్నింటిని కూడా జగన్ చెడగొట్టారని.. అందుకనే వాళ్లతో మళ్లీ మన సంబంధాలను పునరుద్ధరించుకోవాలని సూచించారు సిఎం చంద్రబాబు. సింగపూర్ కన్సార్టియం నిర్వాహకులు సీడ్ క్యాపిటల్ మినహా ఏ ప్రాజెక్ట్ అయినా చేపడతామని అంటున్నారని సీఎం గుర్తుచేశారు. 2024 నుంచి 2025 సంవత్సరానికి నీటి పన్నుపై వడ్డీని పూర్తిగా రద్దు చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. తిరుపతి తొక్కిసలాటపై జస్టిస్ సత్యనారాయణ మూర్తి ఇచ్చిన కమిషన్ నివేదికపై చర్చించారు. ఇరువురు అధికారులపై చర్యలు తీసుకోవాలని మంత్రి మండలి ఆదేశాలు జారీ చేసింది. గో సంరక్షణ అధికారి, మరో డిఎస్పీపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కేబినెట్ ఆదేశించింది. అప్పటి తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడుకి క్లీన్ చిట్ ఇచ్చింది ఏక సభ్య కమిషన్. భవనాల క్రమబద్ధీకరణ విషయంలో మరోసారి చర్చించి నిర్ణయం తీసుకోవాలని, అలాగే ఒక స్పష్టమైన చట్టం తేవాలని కేబినెట్ భావించింది. ఈ సారి క్రమబద్ధీకరణ చేసిన తర్వాత చట్టం తీసుకువచ్చి భవిష్యత్‌లో ఏలాంటి అక్రమ నిర్మాణాలు చేయకుండా చూడాలని నిర్ణయించింది కేబినెట్. ఇలా ఎన్ని రోజులు క్రమబద్ధీకరణ చేసుకుంటూ వెళ్తామని కేబినెట్‌లో వ్యాఖ్యానించారు మంత్రి నాదెండ్ల మనోహర్. అందువల్లే మరోసారి చర్చించి నిర్ణయం తీసుకుందామని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

16వేల 466 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సిఫీ సంస్థ అంగీకారం, సిఫీకి భూకేటాయింపు, ప్రభుత్వ సహకారం, పలు కంపెనీలకు భూకేటాయింపులు విశాఖను ఐటీ హబ్ గా మార్చేలా కార్యాచరణ, ఏపీలో సిద్ధమవుతోన్న పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీ.. వీరికి ఆస్తి పన్ను మినహాయింపు, ఐవీఎఫ్ చికిత్స, తల్లులకు వర్క్ ఫ్రం హోం. ఎలక్ట్రానిక్స్ తయారీ పాలసీకి ఆమోదం, ఏపీలో దాదాపు 150 బిలియన్ డాలర్ల వ్యాపారం లక్ష్యంగా పాలసీ, 4.45 ఎకరాల్లో పీనం పీపుల్ సంస్థ ఏర్పాటుకు ఆమోదం పీనం సంస్థ ద్వారా 207 కోట్ల రూపాయల పెట్టుబడులు, విశాఖలో సిఫి సంస్థ రూ.16వేల 466 కోట్లతో డేటా సెంటర్ ఏర్పాటు, పరదేశిపాలెంలో సిఫి సంస్థకు 50 ఎకరాలు కేటాయింపు, మధురవాడలో సిఫి సంస్థకు 3.6 ఎకరాలు ఇవ్వడానికి ఆమోదం, మధురవాడలో సత్వ నిర్మాణ సంస్థకు 30 ఎకరాలు ఆమోదం. మంత్రిమండలి భేటీలో నాలా ఫీజు అంశంపై చర్చించారు. రెవెన్యూతో పాటు పంచాయతీ శాఖ అంశాలు నాలాతో ముడిపడి ఉన్నాయి. దీంతో వచ్చే మంత్రివర్గ సమావేశంలో ఈ విషయంపై లోతుగా చర్చించి కీలక నిర్ణయం తీసుకుందామన్నారు.. తిరుపతి తొక్కిసలాటపై విశ్రాంత న్యాయమూర్తి నివేదిక ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ మేరకు డిఎస్పీ, గోసంరక్షణాధికారిని విచారణ కమిటీ బాధ్యుల్ని చేసింది. ఈ నివేదిక ఆధారంగా వారిపై క్రిమినల్ చర్యలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. విశాఖలో ఐటీ సేవల కోసం పలు కంపెనీలు ప్రతిపాదనలు ఇచ్చాయన్నారు. ఎస్ఐపీబీ పెట్టుబడులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది 4.45 ఎకరాల్లో పీనం పీపుల్ సంస్థ ఏర్పాటుకు కేబినెట్ సమ్మతించినట్లు వివరించారు. ఈ సంస్థ ద్వారా రూ.207 కోట్ల పెట్టుబడులు, 2500 మందికి ఉపాధి లభించనుందని పార్థసారథి వెల్లడించారు.

# భారత్, బ్రిటన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

>> నాలు వంటి రంగాలకు ప్రయోజనం చేకూరనుంది. మరోవైపు యుకెకు కూడా ఈ ఎఫ్‌టీఏ వల్ల ప్రయోజనం చేకూరుతుంది. ఎలా అంటే, యూకే నుంచి భారత్‌కు దిగుమతి అయ్యే దాదాపు 90 శాతం ఉత్పత్తులపై దశల వారీగా సుంకాలను తగ్గిస్తారు. అయితే తక్షణమే 64 శాతం సుంకాల కోత ఉంటుంది. ఈ డీల్ వల్ల బ్రిటీష్ వారికి చెందిన ఆహార, పానీయాల రంగం తక్షణమే లబ్ధి పొందనుంది. ముఖ్యంగా యుకె నుంచి భారత్‌కు వచ్చే స్కాచ్, విస్కీలపై సుంకాలు తగ్గనున్నాయి. ప్రస్తుతం యుకె స్కాచ్, విస్కీలపై భారత్ 150 శాతం మేర టారిఫ్‌లు వసూలు చేస్తోంది. కానీ కొత్త ఒప్పందం ప్రకారం, విస్కీ, జిన్‌పై సుంకాలు 75 శాతం మేర తగ్గుతాయి. రానున్న పదేళ్ల కాలంలో ఈ సుంకాలు 40శాతానికి తగ్గుతాయి.

అంతేకాదు ఈ ఒప్పందంలో ఐటి, ఆర్థిక, వృత్తిపరమైన సేవలు (ఆర్కిటెక్చర్, ఇంజినీరింగ్‌తో సహా), విద్యా సేవలపై కూడా సుంకాలు తగ్గనున్నాయి. ఈ డీల్ వల్ల భారతీయ నిపుణులు యుకెకు వెళ్లే అవకాశం సులభతరం అవుతుంది. తాత్కాలిక ప్రాతిపదిన యూకేకు వెళ్లే భారతీయ కార్మికులకు, వారి యజమానులకు సామాజిక భద్రతా సహకారాల నుంచి 3 సంవత్సరాల మినహాయింపును ఇస్తుంది. మరీ ముఖ్యంగా ఎఫ్‌టిఎ తర్వాత సోషల్ సెక్యూరిటీ కంట్రిబ్యూషన్స్ చెల్లింపు రెండు చోట్ల కాకుండా కేవలం భారతదేశంలో మాత్రమే జరుగుతుంది. టారిఫ్ రేటు కోటా వ్యవస్థ కింద ఆటోమోటివ్ సుంకాలను కూడా 100 శాతం నుంచి 10 శాతానికి తగ్గించనున్నారు. దీని వల్ల భారత ఆటోమొబైల్ రంగానికి పెద్ద సవాల్ ఏర్పడుతుంది. కచ్చితంగా చెప్పాలంటే ఇది మేక్ ఇన్ ఇండియాకు విరుద్ధంగా ఉండనుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

భారత్ 2028 నాటికి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అందులో భాగంగా యూకేతో ఇప్పుడు ఎఫ్‌టీఏ చేసుకుంది. అయితే ఆటో కోటా వివరాలు, కార్బన్ సరిహద్దు పన్నుల లాంటి సమస్యలు ఇంకా వెల్లడి కావాల్సి ఉంది.

భారత్, యూకే మధ్య ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందం (బీఐటీ)పై కూడా చర్చలు జరుగుతున్నాయి. ఇరుదేశాలు సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంచుకోవడానికి ప్రయత్నిస్తున్నాయని ప్రధాని మోడీ యూకేకు వెళ్లే ముందే చెప్పారు. "మా సహకారం వాణిజ్యం, పెట్టుబడి, సాంకేతికత, ఆవిష్కరణ, రక్షణ, విద్య, పరిశోధన, స్థిరత్వం, ఆరోగ్యం, ఇరుదేశాల ప్రజల మధ్య సంబంధా లతో సహహా విస్తృత శ్రేణి రంగాలకు విస్తరించిందని అన్నారు. ఇరుదేశాల శ్రేయస్సు, వృద్ధి, ఉద్యోగాల సృష్టిని పెంపొందించే లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. యూకే పర్యటన తరువాత మోడీ మాల్దీవులను సందర్శించనున్నారు.

# ఎఫ్‌టిఎపై సంతకాలు చేసిన బ్రిటన్, భారత్ వాణిజ్య మంత్రులు

**లండన్,జూలై 24:** భారత్ బ్రిటన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరింది. భారత ప్రధాని నరేంద్ర మోడీ, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ సమక్షంలో రెండు దేశాల వాణిజ్య మంత్రులు పీయూష్ గోయల్, జోనాథన్ రేనాల్డ్స్ ఎఫ్‌టిఎపై సంతకాలు చేశారు. ఒప్పందంతో రెండు దేశాల మధ్య వాణిజ్యం 34బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా వేస్తున్నారు. ఒప్పందంపై సంతకాలు చేసిన అనంతరం మాట్లాడిన ప్రధాని మోడీ, భారత్ బ్రిటన్ భాగస్వామ్యంలో విజన్ 2035 లక్ష్యంగా సాగుతున్నామని అన్నారు. బ్రిటన్, భారత్ భాగస్వామ్యంతో కొత్త అధ్యాయం ప్రారంభమవుతోందని తెలిపారు. రక్షణ, భద్రత, ఏఐ, విద్య తదితర రంగాల్లో బ్రిటన్, భారత్ కొత్తపుంతలు తొక్కనుందని అభిప్రాయపడ్డారు. ఆరు బ్రిటన్ వర్సిటీలు భారత్‌లో క్యాంపస్‌లు ఏర్పాటు చేస్తున్నాయని వెల్లడించారు. పహల్గాం ఘటనను ఖండించిన బ్రిటన్ ప్రధానికి ధన్యవాదాలు. తీవ్రవాదం విషయంలో రెండు అభిప్రాయాలు ఉండే అవకాశం లేదు. ప్రజాస్వామ్య స్వేచ్ఛను దుర్వినియోగం చేసేవారి పట్ల కఠినంగా ఉంటాం. అహ్మదాబాద్ విమాన దుర్ఘటన మృతుల్లో బ్రిటన్‌లోని ఎన్నారైలు ఉన్నారు. అహ్మదాబాద్ విమాన దుర్ఘటన మృతులకు మరోసారి సంతాపం తెలుపుతున్నా. ఎన్నారైలు భారత సంస్కృతి సంప్రదాయాలను కాపాడుతున్నారు. క్రికెట్ అనేది కేవలం ఆట కాదు. క్రికెట్ అంటే ఓ పాషన్. క్రికెట్ తరహాలో భారత్‌బ్రిటన్ దీర్ఘకాల భాగస్వామ్యం మేం కోరుతున్నాం. బ్రిటన్ ప్రధాని ఆతిథ్యానికి ధన్యవాదాలు. భారత్‌కు రావాలని ఆహ్వానిస్తున్నానని నరేంద్ర మోడీ అన్నారు. ఇరుదేశాల సంబంధాల్లో ఇది చారిత్రాత్మక రోజు. నాకు సంతోషంగా ఉంది. కొన్నేళ్ల తర్వాత ఇరుదేశాల మధ్య సమగ్ర ఆర్థిక వాణిజ్య ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం కేవలం ఆర్థికపరమైనదే కాదు. సహజ సమృద్ధి పథకం కూడా అని నరేంద్రమోడీ అన్నారు.

## ఊర్లు, మండలాల పేర్లు మార్పులపై కీలక నిర్ణయం

**విజయవాడ,జూలై24,ప్రభాతవార్తప్రతినిధి:** ఊర్లు, మండలాల పేర్లు మార్పులపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందు కోసం ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. ప్రజలనుంచి వచ్చే వినతులను పరిశీలించి, తగు సిఫార్సులు చేసేందుకు ఈ మంత్రివర్గ ఉప సంఘాన్ని ప్రభుత్వం నియమించింది. ఊరి పేరు చివర పెంట అని కానీ, ముందు పంది అనికానీ ఉంటే వాటినిపలకడానికి ఆయా గ్రామాల ప్రజలకు ఇబ్బందిగా ఉంటుంది. ఈ విధమైన పేర్లను మార్చాలని ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను ప్రభుత్వం పరిష్కరించ నుంది. కాగా రాష్ట్రంలోని పలు గ్రామాలు, మండలాలు, జిల్లాలపేర్లు, సరిహద్దుల్ని మార్చాలంటూ ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాల నుంచి ఏప్పటి నుంచో విజ్ఞప్తులు వస్తున్న విషయం తెలిసిందే. వీటిని పరిశీలించి తగు సిఫారసులు చేసేందుకు ఏపీ ప్రభుత్వం ఏడు గురు మంత్రులతో ఉపసంఘాన్ని నియమిం చింది. ఈ కమిటీలో పి.నారాయణ, వంగల పూడి అనిత, అనగాని సత్యప్రసాద్, బీసీ జనార్దన్‌రెడ్డి, నిమ్మల రామానాయుడు, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్‌లను సభ్యు లుగా నియమించింది. రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కన్వీనర్‌గా వ్యవహరించను న్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయతో దశాబ్దాలుగా తమ గ్రామాల పేర్లు మార్చా లని డిమాండ్‌చేస్తున్నవారి ఆకాంక్ష నెరవేరనుంది.

## అమరావతి ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మాణ పనులు ఆరు నెలల్లో ప్రారంభం!

**భూమి కోసం 5,200 కోట్లు...మొత్తం అంచనా వ్యయం 21వేల కోట్లు**

**అనుమతుల కోసం కేంద్ర పర్యావరణ, అటవీ శాఖలకు లేఖలు**

**విజయవాడ,జూలై24.ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి అవుటర్ రింగ్ రోడ్డును (ఓఆర్ఆర్)140 మీటర్లకు విస్తరించి, గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టుగా పట్టాలెక్కించడానికి జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్)శరవేగంగా అడుగులు వేస్తోంది. ప్రాజెక్టు నిర్మాణంలో అత్యంత కీలకమైన తొలి అడుగు ఆర్థిక ప్రతిపాదనల రూపకల్పనకు సిద్ధమవుతుంది. సాధారణంగా ఒక గ్రీన్‌ఫీల్డ్ రహదారి ప్రాజెక్టును పట్టాలెక్కించాలంటే కనిష్టంగా ఏడాది కాలం పడుతుంది. అయితే అమరావతి ఓఆర్ఆర్ నిర్మాణ పనులను ఆరు నెలల్లో ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు. టెండర్ల దశకు ప్రాజెక్టును వీలైనంత త్వరగా తీసుకొని వెళ్లాలని భావిస్తున్నారు. టెండర్లు పిలిచిన తర్వాత ఆలస్యం కాకుండా పనులు ప్రారంభం కావాలంటే భూములు సిద్దంగాఉండాలి. అందుకనే భూ సేకరణలో భాగంగా నోటిఫికేషన్ ఇవ్వాల్సిందిగా ఎన్‌హెచ్ అధికారులు ఐదు జిల్లాల జాయింట కలెక్టర్లను ఇప్పటికే కోరారు.. అందులో భాగంగా కన్సల్టెన్సీ సంస్థ ఇప్పటికే క్షేత్రస్థాయిలో సర్వే చేస్తోంది. అమరావతి డివిజన్ ఎన్‌హెచ్ అధికారులు గతంలో 70 మీటర్ల వెడ్పుతో ఓఆర్ఆర్ నిర్మాణానికి ఆర్థిక ప్రతిపాదనలు రూపొందించారు. వాటిలో ప్రధానంగా భూ సేకరణ, నిర్మాణ వ్యయం అంతర్భాగంగా ఉంటాయి.

ప్రాజెక్టుకు మొత్తంగా రూ.16,200 కోట్లు ఖర్చవుతుందని, అందులో భూసకరణకు రూ.2600 కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు. కేంద్రప్రభుత్వం ఆమోదించింది. ఓఆర్ఆర్ వెడల్పును 140 మీటర్లకు విస్తరించడానికి కేంద్రం ఆమోదన తెలిపిన నేపథ్యంలో తిరిగి ఆర్థిక ప్రతిపాదనలను రూపొం దించాల్సి వచ్చింది. రెట్టింపు భూసేకరణ చేయాల్సి ఉండటంతో అందుకు గతంలో కేటాయించిన దానికంటే రెట్టింపు.. అంటే సుమారుగా రూ.5,200 కోట్లు వ్యయం అవుతుందని భావిస్తున్నారు. దీనితో పాటు సహజంగానే నిర్మాణ ఖర్చు కూడా పెరుగుతుంది. మొత్తం మీద 140 మీటర్ల వెడల్పున ఓఆర్ఆర్‌ను విస్తరించాలంటే సుమారుగా రూ.21 వేల కోట్లు వ్యయాన్ని ఎన్‌హెచ్ వర్గాలు అంచనా వేస్తునానయి. కన్సల్టెన్సీ సంస్థ సర్వే రిపోర్టులను క్రోడీకిరించి, రెండు నెలల్లోగా కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపిచాలని ఎన్‌హెచ్ అధికారులు బావిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే క్షేత్రస్థాయిలో పనులకు శ్రీకారం చుడతారు. ఓఆర్ఆర్ గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టు, దీనిని పట్టాలెక్కించడానికి ప్రభుత్వాల లోని పలు శాఖలతో సమన్వయం చేసుకోవాల్సి ఉంటుంది.

# కొత్త రోడ్లు

>> పారు. 20 కి.మీ. కన్నా పొడవైన రాష్ట్ర హైవేలు మొత్తం 260 వరకు ఉన్నాయి. అంటే 10,200 కి.మీపొడవైన రాష్ట్ర హైవేలను పిపిపి విధానంలో చేపట్టేందుకు వీలుంది. వీటిలో అత్యధిక రద్దీ ఉన్న 1,332 కి.మీ పొడవైన 18 రహదారులను ఫేజ్ 1, ఏ కింద..., 40 కి.మీ. కన్నా ఎక్కువ పొడవున్న 67 రహదారులు మొత్తం 3,854 కి.మీ మేర ఫేజ్ 1, బీ కింద..., అలాగే, 20 నుంచి 40 కి.మీ. మధ్య ఉన్న 175 రహదారులు మొత్తం 5,039 కి.మీ. ఫేజ్ 2 కింద... అదనంగా 115 కి.మీ పొడవున్న యలమంచిలి గాజువాక, గాజుల మండ్యం (శ్రీసిటీ(సెజ్)రోడ్లు కూడా పిపిపి విధానంలో నిర్మించేందుకు ప్రతిపాదనలు రూపొందించారు. దీనిపై మరింత అధ్యయనం చేసి తుది నివేదిక ఇవ్వాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు.

## అల్పపీడనం కేంద్రీకృతం

>> దుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయన్నారు. ఇది ఆ తదుపరి 48 గంటల్లో పశ్చిమ బెంగాల్, ఉత్తర ఒడిశా తీరాల వైపు కదులేందుకు అవకాశం ఉందని ప్రఖర్ జైన్ పేర్కొన్నారు. దీని ప్రభావంతో కోస్తాంధ్రలో ఆదివారం వరకు అక్కడక్కడ భారీ వర్షాలు నమోదయ్యేందుకు ఛాన్స్ ఉందన్నారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని సూచించారు. పిడుగులతో కూడిన వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

అల్పపీడనం ప్రభావంతో శుక్రవారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురంమన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోపలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని వెల్లడించారు. మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసేందుకు ఆస్కారం ఉందని తెలిపారు.

## వారం - వర్జ్యం

25-07-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
పాడ్యమి రా.11.27
పుష్యమి సా.4.05
వర్జ్యం : తె.4.48-6.24
దు.ఉ.8.22-9.14, 2) మ.12.41-1.33
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** చర్చలు మందకొడిగా సాగుతాయి. బంధువుల నుండి కీలక సమాచారం అందుతుంది. అందరిలోనూ గుర్తింపు పొందుతారు.

**వృషభం:** ఉద్యోగులలో బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు. మీ ప్రయత్నాలు అనుకూలిస్తాయి.

**మిథునం:** కాంట్రాక్టులు దక్కించు కొంటారు. సేవాకార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. ఇంటాబయటా అనుకూలం.

**కర్కాటకం :** జీవిత భాగస్వామ్య సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**సింహం:** సన్నిహితుల నుండి కీలక సమాచారం అందుకొంటారు. కుటుంబ సభ్యుల నుండి సాయం అందుతుంది.

**కన్య :** ఆర్థిక లావాదేవీలు కొంత నిరాశ పరుస్తాయి. ముఖ్యమైన పనులలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి.

**తుల :** సోదరులను కలిసి ఆనందంగా గడుపుతారు. ఆదాయమార్గాలు మెరుగు పడును. ఇంటా బయటా ప్రోత్సాహం.

**వృశ్చికం:** కళాకారులు, రాజకీయ, పారిశ్రామిక రంగాల వారికి ప్రభుత్వ రంగాల నుండి ఆహ్వానాలు అందుతాయి.

**ధనుస్సు:** ఆస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. గృహ నిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి.

**మకరం:** ఎంతో కాలంగా వేధిస్తున్న సమస్యలు కొంతవరకు తీరుతాయి. వృత్తి, వ్యాపారాలు లాభిస్తాయి.

**కుంభం:** కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన వుంటుంది. విలువైన వస్తు వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు.

**మీనం :** దూరప్రాంతాల నుండి శుభ వార్తలు అందుకొంటారు. ప్రముఖులతో ఉత్తర ప్రత్యుత్తరాలు సాగిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోలి, హైదరాబాద్

# ఏవియేషన్ హబ్‌గా ఎపి

>> 5 ఈవీ టోల్స్ కంపెనీలు, 2 ఎమ్ ఆర్ ఓ, 3 సిమ్యులేషన్స్ సెంటర్లు రానున్నాయి.

**మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనతో పెట్టుబడుల వరద..**

రాష్ట్రంలో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనతో సుస్థిరమైన, నమ్మకమైన కంపెనీలు సంస్థలు, పరిశ్రమలు, భారీగా పెట్టుబడులు పెట్టడానికి రాష్ట్రానికి క్యూ కట్టడం, తద్వారా స్థానికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగడం ద్వారా నిరుద్యోగానికి అడ్డుకట్ట వేయగలమనేది మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి విశ్వాసం. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధే లక్ష్యంగా.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరుగాంచిన సంస్థలతో అనునిత్యం ప్రత్యేకంగా చర్చలు జరపడం జరుగుతోంది.. గత వైసీపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ ఇమేజ్‌ను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పూర్తిగా దిగజార్చిన క్రమంలో.. నేడు పెట్టుబడిదారుల్లో సడలిన నమ్మకాన్ని తిరిగి నిలబెట్టి, వారికి భరోసా కల్పించాల్సిన అవసరం కూటమి ప్రభుత్వంపై పడింది.

# ఆస్తిపన్ను మినహాయింపు

>> కలిగిస్తోందని నిపుణులు తెలుపుతున్నారు. 2047 నాటికి రాష్ట్రంలో వృద్ధులు 23 శాతంకి చేరే అవకాశం ఉందని సూచిస్తున్నారు. ప్రస్తుతం 13-15 శాతం మధ్య ఉన్నట్లు నిర్ధారించారు. రాష్ట్రంలో 12 శాతం మంది దంపతులకు పిల్లలు పుట్టే విషయంలో లోపాలున్నాయి. వీరిలో కొందరు సమస్య పరిష్కారానికి ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్ ఐవీఎఫ్ చికిత్స కోసం వైద్యులను సంప్రదిస్తున్నారు. ఈ చికిత్స ఖర్చుతో కూడుకున్నది. సాధారణంగా మూడు సైకిల్స్‌లో చికిత్సను చేస్తారు. ఒక్కో సైకిల్‌కు రూ.85వేలు వరకు ఖర్చు అవుతుందని అంచనా. ఐవీఎఫ్ తర్వాత కొందరికి పిల్లలు పుడుతున్నారు. ఈ చికిత్సకు ప్రభుత్వ పరంగా ఆర్థికసాయం అందించాలని ముసాయిదాలో చేర్చారు. ముగ్గురు లేదా నలుగురు పిల్లలు కలిగిన వారికి ఆస్తి పన్ను మినహాయించాలని, మూడో బిడ్డను కన్న తల్లులకు ప్రోత్సాహకంగా రూ.50 వేల చొప్పున ఇవ్వాలని నాలుగోబిడ్డకూ ఈవిధానాన్ని కొనసాగించాలని నిర్ణయించినట్లు సమాచారం!

# రేపటినుంచి సిఎం సింగపూర్ పర్యటన

**విజయవాడ,జూలై 24,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించటమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సింగపూర్‌లో పర్యటించనున్నారు. ఈ నెల 26 నుంచి 31 తేదీ వరకు 6 రోజుల పాటు ఆయన ఆ దేశంలో పర్యటించి దిగ్గజ సంస్థల ప్రతినిధులు, యాజమాన్యాలు, ప్రముఖులు, పారిశ్రామిక వేత్తలతో భేటీ కానున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత దావోస్ పర్యటనకు వెళ్లిన సిఎం...రెండో విదేశీ పర్యటనగా సింగపూర్‌కు వెళుతున్నారు. బ్రాండ్ ఎపి ప్రమోషన్ తో రాష్ట్రానికి పెట్టుబడులను సాధించేందుకు ఈ పర్యటనను వేదిక చేసుకోనున్నారు. ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన పారిశ్రామిక పాలసీలు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలను వివరించి పెట్టుబడుదారులను ఆహ్వానించనున్నారు. పోర్టులు, ఎయిర్ పోర్టులు, హైవేలు, హార్బర్లు, భూముల లభ్యత, కనెక్టివిటీ, 1053 కి.మీ తీర ప్రాంతం, నిపుణులైన మానవ వనరులు గురించి వివరించనున్నారు. అలాగే పారిశ్రామిక వేత్తలను పెట్టుబడులు పెట్టాల్సిందిగా కోరనున్నారు. 6 రోజుల పర్యటనలో సీఈఓలు, కంపెనీల ప్రతినిధులతో భేటీ కానున్నారు. మొదటి రోజు సింగపూర్ సహా సమీప దేశాల్లో నివసిస్తున్న ప్రవాసాంధ్రుల సంఘం నిర్వహించే తెలుగు డయాస్పోరా సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొననున్నారు. ఎపిలో పెట్టబడులపై ఆయా దేశాల వారిని ఆహ్వానించనున్నారు.

# మంత్రి నిమ్మలపై దాడి కేసు సిఐడికి అప్పగింత

**పాలకొల్లు, జూలై 24, ప్రభాతవార్త :** గత వైఎస్సార్సీ ప్రభుత్వంలో మంత్రి నిమ్మల రామానాయుడుపై జరిగిన దాడికి సంబందించిన కేసును సిఐడికి అప్పగించారు. అప్పట్లో దాడి ఘటనపై పాలకొల్లు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా, వైఎస్సార్సీ రాజకీయ ప్రమేయంతో కేసు నమోదు చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 2022లో చేసిన ఫిర్యాదును కేసుగా నమోదు చేశారు. నర్సాపురం డిఎస్పి విచారణనేపథ్యంలో తాజాగా దీనిపై లోతుగాదర్యాప్తు జరిపేందుకు సిఐడికి బదలాయిస్తూ డిజిపి ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడ సిఐడి డిఎస్పీ మోహన్ నేతృత్వంలో అయిదుగురు సభ్యులతో కూడిన సిట్ ను ఏర్పాటు చేశారు. ఈ కేసుకు సంబందించి పూర్తి వివరాల్లోకి వెళ్తే 2022 లో వైసిపి ప్రభుత్వంలో పాలకొల్లు పట్టణ టిడ్కో గృహాల కాలనీ వద్ద జరిగిన గృహాల పంపిణీ కార్యక్రమం జరిగింది. అప్పటి మంత్రులు ఆదిమూలం సురేష్, కారుమూరి నాగేశ్వరరావు, కొట్టు సత్యన్నారాయణ, మరియు అప్పటి నర్సాపురం ఎమ్మెల్యే ముదునూరి ప్రసాద రాజు గార్లు పాల్గొన్నారు. ప్రొటోకాల్ ప్రకారం నాటి అధికారిక ఇళ్ళ పంపిణీ సభకు స్దానిక శాసన సభ్యుడు డాక్టర్. నిమ్మల రామానాయుడు అధ్యక్షత వహించవలసి ఉండగా, అధికారుల పిలుపు మేరకు సభాకార్యక్రమంలో పాల్గొనడానికి, సభావేదికపైకి అప్పటి స్దానిక ఎమ్మెల్యేగా ఉన్న నిమ్మల రామానాయుడు, అప్పటి ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ వేదిక పైకి ఎక్కుచుండగా, ప్రొటోకాల్ లేకుండా సభావేదిక కు సంబందం లేని, వైసిపి కార్యకర్తలు మరికొంతమంది కిరాయి మూకలను కుట్రపూరితంగా వేదికపై ఉంచి స్దానిక శాసనసభ్యులు నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ ను, వేదిక పైకి వస్తుండగా, వారిని రాకుండా నిరోధించి వారిపై భౌతిక దాడికి పాల్పడ్డారు.

# క్యూపిఐఎఐ భాగస్వామ్యం

>> దించు కునేందుకు అవకాశం ఏర్పడుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. వివిధ రంగాల్లో క్వాంటం కంప్యూటింగ్ సేవలు రాష్ట్రంలో వివిధ పంటల సాగులో కచ్చితత్వం, తెగుళ్లకు సంబంధించిన అంశాలను అంచనా వేసేందుకు క్వాంటం కంప్యూటింగ్ ఉపకరించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. అదే సమయంలో వ్యవసాయ ఉత్పత్తి పెరిగేలా సూచనలు, సలహాలను సకాలంలో ఇవ్వటం ద్వారా రైతుల ఆదాయాలను మెరుగుపడేందుకు ఈ సాంకేతికత దోహద పడాలని సీఎం పేర్కొన్నారు. రాష్ట్రంలో నీటి వనరులను సమర్ధంగా నిర్వహించేందుకు వీలుగా క్వాంటం టెక్నాలజీని వాడాలన్నారు. వ్యాధుల నిర్ధారణ, మెడికల్ లాజిస్టిక్స్ తదితర అంశాల్లోనూ క్వాంటం సిమ్యులేషన్‌ను సమర్ధంగా వినియోగించవచ్చని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. యువతకు నైపుణ్యాలనుకల్పించే అంశంలోనూ క్వాంటం టెక్నాలజీ సహకారాన్ని తీసుకునేలా ప్రభుత్వం యోచన చేస్తోంది. క్వాంటం లాంటి ఆధునిక సాంకేతికత ద్వారా సామాన్య ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితుల్ని మెరుగు పర్చేలా ప్రభుత్వం కార్యాచరణ చేస్తోంది. విద్య, పరిశోధన, ఇన్నోవేషన్ రంగాల్లో డీప్‌టెక్ ద్వారా సమాజానికి విస్తృత ప్రయోజనాలు కల్పించటమే ఉద్దేశంగా క్యూపిఐఏఐ, నేషనల్ క్వాంటం మిషన్, అమరావతి క్వాంటం వ్యాలీ పనిచేస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

# సిట్ విచారణకు శ్రావణ్ కుమార్

>> శ్రవణ్‌కుమార్ షెల్టర్ ఇచ్చినట్టు స్పష్టమైంది. దుబయ్‌లో తనకు ఉన్న ఫ్లాట్‌లోనే నిందితులుగా ఉన్న చాణక్య, కిరణ్‌కు ఆశ్రయం ఇచ్చారని తేల్చారు. ప్రస్తుతం శ్రవణ్ రావు తెలంగాణలో దర్యాప్తు జరుగుతున్న ఫోన్ ట్యాపింగ్‌లో కేసులో కీలక నిందితుడిగా ఉన్నారు. బిఆర్ఎస్ హయాంలో ఐటి సలహాదారుగా పని చేసిన శ్రవణ్‌రావు ఆంధ్రప్రదేశ్‌లో లిక్కర్ స్కామ్‌లో జోక్యం చేసుకున్నారని సిట్ అధికారులు అనుమానిస్తున్నారు. అందుకే ఆయనకు రెండు రోజుల క్రితం నోటీసులు ఇచ్చారు. గురువారం విచారణకు రావాలని ఆదేశించారు. దీంతో ఆయన ఇవాళ విచారణకు హాజరయ్యారు. లిక్కర్ ద్వారా వచ్చిన సొమ్మును దుబయ్ చేరవేయడంలో కిరణ్‌కుమార్ కీలక పాత్ర పోషించారని సిట్ ఇప్పటికే ఛార్జ్‌షీట్‌లో పేర్కొంది. కిరణ్‌తోపాటు చాణక్య కొరియర్లుగా వ్యవహరించాలని తెలిపింది. కిరణ్ అనేవ్యక్తి ఇప్పటి వరకు 29 సార్లు దుబయ్ వెళ్లినట్టు కూడా తెలిపింది. వెళ్లినప్పుడల్లా శ్రవణ్ ఫ్లాట్‌లోనే ఉన్నట్టు నిర్ధారించారు. దాన్ని షెల్టర్‌గా లిక్కర్ స్కామ్ నిందితులు వాడుతున్నట్టు తేల్చారు. వీళ్లంతా ఆ ఫ్లాట్‌లో ఉన్నప్పటికీ ఖాళీగా ఉన్నట్టే శ్రవణ్ చూపించారని స్పష్టమైంది. దీంతో ఆయన్ని పిలిచి ఈ విషయాలపై ప్రశ్నిస్తున్నారు.

శ్రవణ్ కేవలం ఫ్లాట్ అద్దెకు ఇచ్చారా లేకుంటే హవాలలో కూడా ఆయన పాత్ర ఉందా అనే కోణంలో ప్రశ్నిస్తున్నారు. అక్కడకు వచ్చిన తర్వాత కిరణ్, చాణక్య ఏం చేసేవాళ్లు. వీళ్లతో ఆయనకు ఏమైనా ఆర్థిక లావాదేవీలు జరిగాయా అనే విషయంపై ఆరా తీస్తున్నారు. ఇప్పటికే ఆ ఫ్లాట్‌లో వీళ్లు ఉన్నట్టు సాంకేతిక ఆధారాలు సేకరించిన అధికారులు వాటిని ఆయన ముందు పెట్టి ప్రశ్నించనున్నారు. బ్యాంకు అకౌంట్ వివరాలు కూడా చెక్ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. మద్యం కుంభకోణంలో ప్రధాన నిందితుడైన రాజ్ కసిరెడ్డికి కూడా శ్రవణ్‌కుమార్‌కు సాన్నిహిత్యం ఉందని తేలింది. ఆ వివరాలపై కూడా కూపీ లాగతున్నారు.



పవన్ కల్యాణ్‌కు కరచాలనం చేస్తున్న సిఎం చంద్రబాబు

# హరిహర వీరమల్లు సూపర్‌హిట్ కావాలి

## - సిఎం చంద్రబాబు

**విజయవాడ,జూలై 24,ప్రభాతవార్త ప్రతినిధి:** పవన్‌కళ్యాణ్ నటించిన హరిహర వీరమల్లు' సూపర్‌హిట్ కావాలని సిఎం చంద్రబాబు ఆకాంక్షించారు. చిత్రం విడుదల సందర్భంగా ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. 'పవన్ అభిమా నులు, ప్రేక్షకులు ఎన్నాళ్ళుగానో ఎదురుచూస్తున్న హరిహరి వీరమల్లు వారి ముందుకు వచ్చింది. డిప్యూటీ సిఎంగా కీలక భాధ్యతలు నిర్వర్తిస్తూనే...సమయాన్ని సర్ధుబాటు చేసుకొని పవన్ నటించిన ఈ సినిమా అన్ని వర్గాలనూ ఆకట్టుకోవాలని ఆకాంక్షిస్తున్నాను' అని చంద్రబాబు పేర్కొన్నారు. చంద్రబాబ మాటలు విజయ సంకేతాలు –డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ గత పదేళ్ళలో సిఎం చంద్రబాబుతో పలుసార్లు సమావేశమైనా ఎప్పుడూ సినిమాల ప్రస్తావన రాలేదు. ఈ రోజు హరిహర వీరమల్లు చిత్ర విజయాన్ని కాంక్షించినందుకు ఆయనకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. ఆ మాటలు విజయ సంకేతాలు. నా భాధ్యతలు నిర్వర్తిస్తూనే...సినిమాలో నటించే వెసులుబాటు కల్పించారు'అని హరిహర వీరమల్లు సినిమా విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ సిఎం చంద్రబాబు పెట్టిన పోస్టుపై పవన్ కళ్యాణ్ స్పదించించారు. ఇక మంత్రి మండలి సమావేశం సందర్భంగా ఎదురుపడ్డ సీఎం చంద్రబాబు,డీసీఎం పవన్ కల్యాణ్‌ను ఆప్యాయంగా పలకరించారు.కరచాలనం చేసారు.

# ఆందోళన వద్దు.. త్వరలోనే మిగిలిన సొమ్ము జమచేస్తాం

## సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్

**విజయవాడ,జూలై 24.ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలు/కళాశాలల్లో 9, 10 తరగతులు, ఇంటర్మీడియట్ 1, 2వ సంవత్సరం చదువుతున్న షెడ్యూల్డ్ కుల విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ విజ్ఞప్తి చేసారు.ఈ మేరకు సాంఘిక సంక్షేమశాఖ ఒక ప్రకటనను విడుదల చేసింది.

రాష్ట్రంలో 9,10 తరగతులు, ఇంటర్మీడియట్ 1,2 సంవత్సరం చదువుతున్న ఎస్సీ విద్యార్థులు 3.93 లక్షల మంది ఉన్నారు. తల్లికి వందనం పథకంలో వీరికి సంబంధించి కొంత వాటాను కేంద్రం భరిస్తుంది. ఆ సొమ్ము బ్యాంక్ లింకేజి అయిన విద్యార్థులు/ తల్లి దండ్రుల అకౌంట్ లో మరో 20రోజుల్లో జమ అవుతుంది. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే వారికి ఆర్థిక వెసలుబాటు కల్పించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఆ కేటగిరీలోని విద్యార్థులకు తమ వాటా నిధులు రూ.382.66 కోట్లు జమ చేసింది. ఈ కారణంగా 9, 10 తరగతులు చదివే ఎస్సీ డే స్కాలర్ విద్యార్థులకు సంబంధించి వారి తల్లి బ్యాంకు ఖాతాకు రూ.10,900/ , హాస్టల్ విద్యార్థుల తల్లి బ్యాంకు ఖాతాకు రూ.8,800/ చొప్పున జమ చేయడం జరిగింది.

అదేవిధంగా ఇంటర్మీడియట్ 1, 2వ సంవత్సరం చదువుతున్న ఎస్సీ విద్యార్థులకు రూ.5,200/ నుండి రూ.10,972/ వరకు నేరుగా విద్యార్థుల సొంత బ్యాంకు ఖాతాలకు జమ చేయబడింది.

# జనాభా పెరుగుదల మేరకు ఆహార ఉత్పత్తులు పెంచాలి

## - వ్యవసాయ అనుబంధరంగాలలో 8.8 శాతంవృద్ధిరేటుతో అగ్రస్థానంలో రాష్ట్రం : గవర్నర్ అబ్దుల్ నజీర్



విద్యార్ధినికి పట్టా ప్రధానం చేస్తున్న గవర్నర్

**గన్నవరం, ఉంగుటూరు, జూలై 24, ప్రభాతవార్త :** శరవేగంగా పెరుగుతున్న దేశ జనాభాకు అనుగుణంగా ఆహార ఉత్పత్తులను పెంచాల్సిన ఆవశ్యకత ఉందని రాష్ట్రగవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ అభిప్రాయం వ్యక్తం చేసారు. ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 57వ స్నాతకోత్సవాన్ని గురువారం ఉదయం కృష్ణాజిల్లా, ఉంగుటూరు మండలం ఆత్కూరు గ్రామంలోని స్వర్ణభారత్‌ట్రస్ట్ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన గవర్నర్ వ్యవసాయపరిశోధనలో ప్రతిభ కనపరచిన శాస్త్రవేత్తలకు బహుమతులు అందించారు. 46 మందికి డాక్టరేట్‌లు, 196మందికి పోస్టుగ్రాడ్యుయేట్, 1420మంది గ్రాడ్యుయేట్‌లకు పట్టాలు ప్రధానం చేసారు. ఈసందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ 2050 నాటికి దేశజనాభా 1.6 బిలియన్‌లకు పెరిగే అవకాశం ఉందని, ఈమేరకు ఆహార ఉత్పత్తులకు డిమాండ్ 400 మిలియన్ టన్నులకు చేరుకుంటుందన్నారు. పెరుగుతున్న జనాభాకు సరిపడా ఆహారధాన్యాలు, పప్పుదినుసులు తదితర ఆహార ఉత్పత్తులను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం తక్కువ స్థలంలో అధిక దిగుబడులిచ్చే నూతన వంగడాలను సృష్టించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలకు సూచించారు. 2024-25 సంవత్సరంలో వ్యవసాయ అనుబంధ రంగాలలో మన రాష్ట్రం 8.8శాతం వార్షిక వృద్ధిరేటు సాధించి దేశంలోనే ప్రధమస్థానంలో నిలవటం అభినందనీయమన్నారు. దేశ జిడిపికి వ్యవసాయ రంగం 16శాతం వరకు దోహదపడిందని, ఈరంగంలో దేశవ్యాప్తంగా 46.1శాతం మందికి ఉపాధినిస్తున్నట్లు వివరించారు. మనదేశం తృణధాన్యాల ఉత్పత్తిలో స్వయం సంవృద్ధిని సాధించిందని, పోషకాహారలోప సమస్యల నివారణకు పప్పుధాన్యాల ఉత్పత్తిపై దృష్టిసారించాల్సిన అసవరం ఉందని తెలిపారు. ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం మన ఒక్కరాష్ట్రానికే కాకుండా దేశం వ్యాప్తంగా సేవలు అందిస్తుందన్నట్లు గవర్నర్ పేర్కొన్నారు. ఈవిశ్వవిద్యాలయం శాస్త్రవేత్తల నిరంతర కృషి ఫలితంగా 2023-24లో జాతీయస్థాయిలో అధికదిగుబడినిచ్చే 25 రకాల మేలైన వంగడాలను విడుదల చేసినట్లు చెప్పారు. తద్వారా రైతుల ఆదాయం పెంపొందించటంలో సహాయపడినట్లు తెలిపారు. ఈవిశ్వవిద్యాలయం వివిధ పంటలలో 10,215 క్వింటాళ్ళ బ్రీడర్ విత్తనాలు, 17,240 క్వింటాళ్ళ ఫౌండేషన్ ధృవీకరణ విత్తనాలు ఉత్పత్తి చేయటంతోపాటు వాటిని ప్రభుత్వ ప్రయివేటు సంస్థల ద్వారా రైతులకు అందించినట్లు గవర్నర్ తెలిపారు. కృషివిజ్ఞాన కేంద్రాలు, ఏరువాక కేంద్రాలు, క్షేత్రపరిశీలనలు, చీడపీడల నిర్ధారణ సర్వేల ద్వారా అధిక ఉత్పాదకతను, ఆహార భద్రతను సాధించటానికి ఈవిశ్వవిద్యాలయం చేసిన కృషి మరువలేనిదన్నారు.

మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పంటలు సాగుచేసుకుని రైతులు లాభాల బాట పట్టాలని రైతులకు సూచించారు.

# దేశంలోనే అత్యుత్తమంగా మంగళగిరి జెమ్స్ అండ్ జ్యువెలరీ పార్కు!

## అధికారులతో మంత్రి నారా లోకేష్ సమీక్ష



**మంగళగిరి,జులై 24, ప్రభాతవార్త :** దేశంలో అత్యుత్తమ మోడల్ లో మంగళగిరి జెమ్స్ అండ్ జ్యువెలరీ పార్కు నిర్మాణం చేపట్టాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరి జెమ్స్ అండ్ జ్యువెలరీ పార్కు ఏర్పాటుపై అధికారులతో మంత్రి సమీక్షి ంచారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... మంగళగిరిలో ఏర్పాటు చేయబోతున్న జెమ్స్ అండ్ జ్యువెలరీ పార్కుతో పాటు కేంద్ర ప్రభుత్వ సహకారంతో కామన్ ఫెసిలిటీ సెంటర్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఇందులో ఆభరణాల తయారీలో ప్రపంచస్థాయి శిక్షణ అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. దేశంలో టాప్ 20 ఆభరణాల తయారీసంస్థలు మంగళగిరి పార్కులో తయారీ యూనిట్లు, రిటైల్ షాపులు స్థాపించేలా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఉడిపిలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ జెమ్స్ అండ్ జ్యువెలరీ (ఐఐజిజె) పనితీరును అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. దీనిపై స్కిల్ డెవలప్ మెంట్ సిఇఒ గణేష్ కుమార్ స్పందిస్తూ త్వరలో ఏర్పాటుచేసే కామన్ ఫెసిలిటీ సెంటర్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా ప్రతిఏటా 4వేలమందికి అధునాతన ఆభరణాల తయారీలో శిక్షణ ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

# 120కిలోల గంజాయితో 8మంది అరెస్ట్

## - నిందితుల నుండి మూడు కార్లు, 9 సెల్ ఫోన్లు స్వాధీనం - పరారైన మరో నిందితుడిని అరెస్టు చేసేందుకు చర్యలు - విజయనగరం ఎస్పీ వకుల్ జిందాల్



**విజయనగరం, జూలై 24 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయనగరం జిల్లా భోగాపురం మండలం రాజాపులోవ వద్ద భోగాపురం పోలీసులు మరియు ఈగల్ పోలీసులకు వచ్చిన ఖచ్చితమైన సమాచారం మేరకు విజయనగరం నుండి మూడు కార్లలో వస్తున్న 8మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి 47 ప్యాకెట్లలోగల 120కిలోల గంజాయిని, తొమ్మిది సెల్ ఫోన్లను సీజ్ చేసినట్లు గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ వెల్లడించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ జూలై 24న భోగాపురం పోలీసులకు వచ్చిన ఖచ్చితమైన సమాచారంతో రాజాపులోవ జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేపట్టగా, విజయనగరం నుండి మూడు కార్లలో వస్తున్న ఎనిమిది మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి 47 ప్యాకెట్లులో గల 120కిలోల గంజాయి, 9 సెల్ ఫోన్లు, ఒడి 05 హెచ్ 8352 నంబరుగల ఆల్టో కారు, ఓఆర్ 15ఎం 7782 నంబరు గల సాంత్రో కారు, యుపి 24 బిఎల్ 0902 నంబరు గల షిఫ్ట్ కారును సీజ్ చేసామన్నారు. పట్టుబడిన నిందితుల్లో కొర్రా కిరణ్ (21), మనోజ్ బిసాయ్ (20), బిజేంద్ర (46), పాజిల్ (30), ముఖ్తర్ అహ్మద్ (43), రామ్మోహన్ (21), సోను (34), శిల్పి (30)లుగా విచారణలో గుర్తించామన్నారు. నిందితులు గంజాయిని ఉత్తర ప్రదేశ్, ఢిల్లీలకు రవాణా చేయాలనే ఉద్ధేశ్యంతో ఒడిస్సా రాష్ట్రంకు చెందిన గంజాయి వ్యాపారులతో సంబధాలున్నాయన్నారు. అజిత దడక అలియాస్ ఒజి అలియాస్ మహేష్ దడక అనే నిందితుడు పరారయ్యారని, అతడిని త్వరలో పట్టుకుంటామని జిల్లా ఎస్పీ తెలిపారు. ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన నిందితులకు ఒడిస్సాలో గంజాయి వ్యాపారులతో ఉన్న పరిచయాలతో గంజాయిని ఒడిస్సాలో కొనుగోలు చేసి, ట్రెయిన్, కార్లలో ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలకు తరలించేందుకు ప్రణాళిక రూపొందించుకున్నట్లుగా తెలిపారు.

# నవయుగ కవిచక్రవర్తి గుర్రం జాషువాకు వైఎస్ జగన్ నివాళులు

**విజయవాడ,జూలై24,ప్రభాతవార్తప్రతినిధి:** నవయుగ కవిచక్రవర్తి గుర్రం జాషువా వర్ధంతి సందర్భంగా వైఎస్సార్‌సిపి అధినేత వైఎస్ జగన్‌మోహనరెడ్డి ఆయనకు ఘన నివాళు లర్పించారు. వైఎస్ జగన్ ట్విట్టర్ వేదికగా జాషువాను జగన్‌ను స్మరించుకున్నారు. కవిత్వం ద్వారా సామాజిక విప్లవానికి బీజం వేసిన నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా అన్నారు.జఆన్యాయానికి వ్యతిరేకంగా,దళితుల హక్కుల కోసం ధైర్యంగా నిలబడి రచనలు చేసిన గొప్ప వ్యక్తి ఆయన'అని నివాళు లర్పించారు. తెలుగు సాహిత్యానికి విశ్వవ్యాప్త గుర్తింపు తీసుకుని వచ్చిన మహానీయుడు జాషువా అన్నారు.ఆయన ప్రతి రచన జీవితానుభవాలనుంచి వచ్చిందన్నారు.

# మద్యం ముడుపుల కేసులో శర్వాణి డిస్టిలరీస్ డైరెక్టర్ చంద్రారెడ్డికి నోటీసులు

**విజయవాడ,జూలై24,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ మద్యం ముడుపుల కేసులో శర్వాణీ డిస్టిలరీస్ డైరెక్టర్ చంద్రారెడ్డికి ఈడీ నోటీసులు పంపింది. అక్రమ నగదు లావాదేవీల నిరోధక చట్టానికి (పీఎంఎల్‌ఏ) చట్టం క్రింద ఈడీ కేసు దర్యాప్తు చేసోంది. ఈ నెల 28న విచారణకు హాజరుకావాలని చంద్రారెడ్డికి నోటీసులు ఇచ్చింది. ఇప్పటికే సిట్ అధికారుల నుంచి పూర్తి సమాచారం సేకరించిన ఈడీ...సిట్ ప్రిలిమినరీ ఛార్జిషీటు వేయడంతో దర్యాప్తు ప్రారంభించింది.ఆంధ్రా బ్రాండ్ పేరిట భారీగా మద్యం తయారీ అయింది. ఏపీ బేవరేజెస్ కార్పొరేషన నుంచి ఈ బ్రాండ్ భారీగా కొనుగోళ్ళు జరిగాయి. ఇపపటికే సిట్ అధికారుల నుంచి మద్యం కేసుకు సంబంధించి పూర్తి సమాచారం ఈడీ సేకరించింది. ఇక వరుసగా దర్యాప్తు ప్రారంభించాలని ఈడీ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే సిట్ ప్రిలిమినరీ ఛార్జిషీటు వేయడంతో దర్యాప్తు ప్రారంభించింది.

# అసాంఘిక శక్తులకు అడ్డాగా మారిన రైల్వే కాలనీలు

## - కాలనీలను సందర్శించిన డిఆర్ఎం గుప్తా

**గుంతకల్లు రైల్వే, జూలై 24,ప్రభాతవార్త** అసాంఘిక శక్తులకు రైల్వే డివిజనల్ ప్రధాన కేంద్రమైన గుంతకల్లు రైల్వే కాలనీలు అడ్డాగా మారింది. పట్టణంలో అధికభాగం రైల్వే ప్రాంతాలతోనే ఉంది. ముంబై-చెన్నై ప్రధాన రైలు మార్గం దక్షిణాదిన పోర్టర్ లైన్, శాంతినగర్, అరవింద్ నగర్, రైల్వే కోర్ట్స్, ట్విన్‌లైన్, రైల్వే గ్రౌండ్, కమ్యూనిటీహాల్, డివిజనల్ రైల్వే ఆసుపత్రి, విద్యుత్ లోకోషెడ్, డీజిల్ షెడ్, డిటిటిసి, ఇంజనీరింగ్ ట్రైనింగ్ సెంటర్, డిఇఎన్ సెంట్రల్ తదితర కార్యాలయాలు వందలాది రైల్వే సిబ్బంది, క్వార్టర్సులు ఉన్నాయి. అలాగే ముంబై-చెన్నై ప్రధాన రైలు మార్గం ఉత్తరాదిన డిఆర్ఎం కార్యాలయం, రైల్వే ఎస్పీ కార్యాలయం, వివి నగర్, ప్రభాత్ నగర్, మోహిద్దీనాబాద్, హనుమాన్ నగర్‌లలో వివిధ రైల్వే కార్యాలయాలు, రైల్వే సిబ్బంది నివాసగృహాలు, అతిథి గృహాలున్నాయి. శాంతి భద్రతల పరి రక్షణలో భాగంగా సంబంధిత రైల్వే అధి కారులు ఇటీ వల కాలంలో రైల్వే ప్రాం తాలలో సిసి కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటుగా ప్రహారీగోడలను సైతం నిర్మిస్తున్నారు. అర్బన్ సిఐ మనోహర్ పర్యవేక్షణలో వన్‌టౌన్ పోలీసులు, రోజుకు రెండు పర్యాయాలు రైల్వేకాలనీలలో గస్తీ తిరుగుతున్నారు.

# తిరుమల సమాచారం

## వేంకటేశ్వరస్వామి సేవలో జీవితం అంకితం

### - హైదరాబాద్ వనస్థలిపురంలోని 'ఆనందనిలయం' టిటిడికి విరాళం - విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి భాస్కర్‌రావు భక్తిభావం



**తిరుమల,జూలై 24ప్రభాత వార్తప్రతినిధి:** తన జీవితం దేవదేవుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి సేవలో అంకితం కావాలని ఆకాంక్షించిన విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి స్వర్గీయ వైవిఎస్ఎస్ భాస్కర్‌రావు తనకు చెందిన 3కోట్ల రూపాయలు విలువైన నివాసగృహాన్ని, 66లక్షలు రూపాయలు నగదు విరాళంగా వీలునామాతో ప్రకటించారు. హైదరాబాద్ వనస్థలిపురంలోని 3,500 చదరపు అడుగులు గల "ఆనందనిలయం"భవనాన్ని ఆధ్యాత్మిక కార్యకలాపాల కోసం ఉపయోగించాలన్న ఉద్దేశ్యంతో ఆయన టిటిడికి విరాళంగా ఇస్తున్నట్లు వీలునామారాశారు. అంతేగాక ఆయన ఫెన్షన్ బ్యాంకు ఖాతాలో ఉన్న 66లక్షలు రూపాయలు నగదును వివిధ పథకాలకు అందేలా చూసుకున్నారు. ఈ మొత్తాన్ని గురువారం మధ్యాహ్నం ఆయన కోరిక మేరకు ట్రస్టీలు ఎం.దేవరాజ్‌రెడ్డి, వి.సత్యనారాయణ, బి.లోకనాథ్‌లు వీలునామా ప్రకారం టిటిడికి చెందాల్సిన ఆస్తి పత్రాలు, చెక్కులను శ్రీవారి ఆలయంలోపల రంగనాయకుల మండపంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి అందజేశారు. తన ఖాతాలో బ్యాంకులో దాచుకున్న నగదును టిటిడి ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు 36లక్షలు, ఎస్వీ సర్వశ్రేయస్‌ట్రస్ట్‌కు 6లక్షలు, ఎస్వీ వేదపరిరక్షణ ట్రస్ట్‌కు 6లక్షలు, ఎస్వీ గోసంరక్షణ ట్రస్ట్‌కు 6లక్షలు, ఎస్వీ విద్యాదానట్రస్ట్‌కు 6లక్షలు, శ్రీవాణిట్రస్ట్‌కు 6లక్షలు విరాళంగా అందించాలని ఆయన వీలునామాలో కోరారు. ఈమేరకు ట్రస్టీలు ఈ మొత్తాన్ని టిటిడికి అందించారు. ఈ సందర్భంగా తిరుమలలో భాస్కర్‌రావు ట్రస్టీలను టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

## సాలకట్ల బ్రహ్మోత్సవాలకు ఆలయ గోపురాలు, ప్రాంగణం అలంకరణలు



**తిరుమల,జూలై 24ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలలో ఏడాదిలో తొమ్మిదిరోజులు వరుసగా జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలకు కలియుగవైకుంఠంగానే టిటిడి అలంకరణలతో తీర్చిదిద్దుతుంది. ఇందులో భాగంగానే సెప్టెంబర్ 23నుండి మొదలుకానున్న శ్రీవారి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు తిరుమలలో ఏర్పాట్లు వేగంగా సాగుతున్నాయి. తొమ్మిదిరోజులు పాటు జరిగే దేవుని ఉత్సవాలకు దేశవిదేశాల ఉండి అశేషంగా భక్తులు తరలివస్తారనే ముందుచూపుతో అన్ని విధాలా అవసరమైన ఏర్పాట్లు, సౌకర్యాలు,గ్యాలరీలు నిర్మాణం, ఆలయానికి ఎదురుగా చలువపందిళ్ళు, జర్మన్‌షెడ్లు,ఆస్థాన మండపం వద్ద భక్తులు వానకు తడవకుండా ఉండేలా షెడ్ల నిర్మాణం జరుగుతోంది. ఆలయం పై బాగంలో విద్యుత్అలంకరణలు, ఆలయ ప్రాంగణం ప్రహరీగోడలపై ఆధ్యాత్మికత ఉట్టిపడేలా విద్యుద్దీపాల చిన్నపాటి కటౌట్లు ఏర్పాటుచేసే పనులు మొదలయ్యాయి. గురువారం ఉదయం టిటిడి విద్యుత్‌శాఖ సిబ్బంది ఈ పనులు చేపట్టడం మొదలుపెట్టారు. మాఢవీధుల్లో ఎండకు.వానకు రక్షణగా గ్యాలరీలు నిర్మితమవుతున్నాయి. ఇంజనీరింగ్ పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ ఏడాది సాలకట్ల బ్రహ్మోత్సవాలు మాత్రమే జరగనున్నాయి.ఈ వాహనసేవలను భక్తుల మధ్య జరిపించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం సిద్దమవుతోంది. ఆలయం పరిసరాలు ,మాఢవీధుల్లో గ్యాలరీలు, ఇనుప పైపులతో నింపేస్తున్నారు. బ్రహ్మోత్సవాలకు కొండను సర్వాంగసుందరంగా ముస్తాబుచేసే పనులు ఆరంభమయ్యాయి.

## అన్నప్రసాదం ట్రస్ట్‌కు భూరి విరాళం - రూ.2కోట్లు అందజేత



తిరుమల, జూలై 24ప్రభాతవార్తప్రతినిధి: ధార్మికసంస్థ తిరుమలతిరుపతిదేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు ట్రస్ట్‌లు, పథకాలకు భక్తులైన దాతలు తమ వంతుగా విరాళాలందించి అవసర మైన వారికి సేవ లందించేందుకు ముం దుకు వస్తున్నారు. ఇందులో భాగంగా తిరుమలకు వచ్చిన భక్తులు ఆకలిఅనేది తెలియకుండా రుచిగా శుచిగా అన్నప్రసాదాలు అందిస్తున్న ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు ఓ దాత భూరీగా 2కోట్ల రూపాయలు విరాళం అందించారు. గురువారం ఉదయం హైదరాబాద్‌కు చెందిన ట్రినిటి కంబైన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు వేర్వేరుగా చెక్కుల రూపంలో ఆ సంస్థ ప్రతినిధులు 2కోట్లు విరాళాలను టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి అందజేశారు. దాత ప్రతినిధులను ప్రత్యేకంగా అభినందించారు.

### కామన్‌వేడినీళ్ల స్నానపుగదులు క్లోజ్

**తిరుమల,జూలై 24ప్రభాత వార్తప్రతి నిధి:** తిరుమ లలో సామాన్య భక్తులకు వేడినీళ్ళు అందించే కామన్ స్నానపగదులు మూతబడ్డాయి.ఈ గదులు గత నెల రోజులుగా తెరచు కోలేదు. వినియోగం లోకి తీసుకురాక మూతబడినవి.


**ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY**
Lenin Center, Governorpet, Vijayawada - 520 002 (A.P.)

**E PROCUREMENT TENDER NOTICE**

| NIT No. | Name of work | Estimate Cost |
|---|---|---|
| 59/MAU61-USI0TT(RRW)/5/2025-TT | Providing BT Hot mix Road and central divider with Street lighting for Extension of Mahanadu Road from Ballemvari Street to Poranki – Nidamanuru main Road. | Rs.3355.00 Lakhs |
| 60/MAU61-USI0TT(RRW)/6/2025-TT | Widening & Providing BT Hot mix Road with central divider lighting at Ballemvari Street Road from Bandar Road to HT Line Road Junction. | Rs.2980.00 Lakhs |
| 61/ MAU61-USI0TT(RRW)/7/2025-TT | Widening & Providing BT Hot mix Road, Central Divider and Street Lighting to HT Line Road from Ballemvari Street Junction to Nidamanuru Main Road Junction. | Rs.3495.00 Lakhs |

APCRDA invites tenders for the following works for which the bids can be downloaded on AP e-procurement portal from **25.07.2025 to 11.08.2025 upto 14:00 Hrs.** Due date for submission of Bid **11.08.2025 up to 15.00 Hrs,** Technical bid opening **11.08.2025 @16.00 Hrs.** For further details please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in**

Sd/- Commissioner, APCRDA, Vijayawada


# తిరుమలలో మరో మినీసచివాలయం!

## - పాత అన్నపూర్ణ క్యాంటీన్ స్థానంలో అధునాతన సిఆర్ఒ

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** రాష్ట్రప్రభుత్వం తరహాలో అనేక శాఖలతో పాలనసాగించే సచివాలయం తరహాలో హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంలో మినీసచివాలయం(తిరుపతిలోని పరిపాలనభవనం)లాగే తిరుమలలో కూడా మరో మినీసచివాలయం నిర్మాణానికి అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. ఇప్పటికే తిరుమలలో ఉన్న కేంద్రీయ విచారణ కార్యాలయం (సిఆర్ఒ)భవనం పాతది కావడం ,భక్తుల సేవలకు తగ్గట్లు సౌకర్యాలు లేకపోవడంతో నూతన సిఆర్ఒ భవనాన్ని అత్యాధునిక హంగులతో అన్ని విభాగాలు ఒకే ప్రాంగణంలో ఉండేలా నిర్మాణం చేయనున్నారు. దీనిపై తాజాగా టిటిడి పాలకమండలి ఛైర్మన్ బిఆర్‌నాయుడు ఆమోదముద్ర వేశారు. తిరుమలలో ప్రధానంగా వసతి కల్పన, దర్శనం, పరకామణి పర్యవేక్షణ, అదనపు ఇఒ కార్యాలయం, జెఇఒ కార్యాలయం ,డిప్యూటీ ఇఒలు, రెవెన్యూ,పంచాయతి విభాగాలు,కీలకమైన విజిలెన్స్ విభాగం, కమాండ్ కంట్రోల్ రూమ్ ఇతరత్రా విభాగాలు ఒక్కోచోట ఉన్నాయి. వీటన్నిటినీ ఒకే గొడుగుక్రిందకు తీసుకువచ్చేలా అందరు అధికారులు ఒకేప్రాంగణంలో అందుబాటులో ఉండి భక్తులకు సేవలందించడంలో సమన్వయంగా పనిచేసేలా చూడాలనేది ప్రస్తుత బోర్డు ,అధికారుల ఆలోచన. దీనిపై ఇప్పటికే తీసుకున్న నిర్ణయం మేరకు డిఎంబి రోడ్డులోని పాత అన్నపూర్ణక్యాంటీన్ భవనాన్ని సిఆర్ఒగా అధునాతనంగా నిర్మించేందుకు ప్రతిపాదనలు తయారుచేశారు. ఈభవనం చుట్టూ సరైన పార్కింగ్ సౌకర్యం కూడా కల్పించేదిశగా అడుగులు వేయనున్నారు. ఈ విషయంపై టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ప్రత్యేక దృష్టి సారించారు.. టిటిడిలో ప్రస్తుతం 7,300మంది వరకు వివిధ హోదాల్లో ఉద్యోగులు, అధికారులు, సిబ్బంది పనిచేస్తున్నారు. వీరిలో 2వేలమంది వరకు తిరుమలలోనే ఉన్నారు. టిటిడి పరిపాలనలో మినీసెక్రటేరియట్ పరిపాలన కార్యాలయం సముదాయం ఉండాలనే ముందుచూపుతో అధికారులు ఆలోచన ఉంది.

# బిసి హాస్టళ్లలో క్రీడలను ప్రోత్సహించే ప్రణాళిక : మంత్రి సవిత

**విజయవాడ,జూలై24,ప్రభాతవార్తప్రతినిధి:** క్రీడల్లో బీసీ హాస్టళ్ల విద్యార్థులు రాణించేలా ప్రణాళికలు రూపొందించామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. హాస్టళ్లలో క్రీడా వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి సవితను శాప్ ఛైర్మన్ రవినాయుడు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీసీ హాస్టళ్లలో క్రీడా వసతుల కల్పనపై ఇరువురు చర్చించారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ, విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. తల్లిదండ్రులకు, ఇంటికి దూరంగా ఉండే విద్యార్థులకు క్రీడలు ఎంతో ఉపశమనం కలిగిస్తూ మానసిక ఒత్తిడిని దూరం చేస్తాయన్నారు. అదే సమయంలో క్రీడల్లో సత్తా చాటే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో, బీసీ హాస్టళ్లు, ఎంజేపీ స్కూళ్లో క్రీడలకు అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. ఇప్పటికే స్పోర్ట్స్ కిట్లు విరివిగా అందజేస్తూ, మండల, జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఎందరో విద్యార్థులు పలు క్రీడల్లో సత్తా చాటుతున్నారన్నారు.


pnb Housing Finance Limited

నమోదిత కార్యాలయం: 9వ అంతస్తు, అంతరిక్ష భవన్, 22, కె.జి. మార్గ్, న్యూఢిల్లీ-110001. ఫోన్లు : 011-23357171, 23357172, 23705414, వెబ్ www.pnbhousing.com

శాఖా కార్యాలయం : #39-3-1, 2వ అంతస్తు, అంజనేయులు జెవెల్లర్స్‌పైన, M.G రోడ్, విజయవాడ-520010.

తేదీ నాటికి సవరించిన విధంగా సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 యొక్క రూల్ 3(1)తో చదువబడే, సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 యొక్క చాప్టర్ III యొక్క సెక్షన్ 13(2) క్రింద ప్రకటన

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ("చట్టంగా"గా ఇటుపై రిఫర్ చేయబడును) మా విజయవాడ కార్యాలయంచే ఉన్న #39-3-1, 2వ అంతస్తు, అంజనేయులు జెవెల్లర్స్ పైన, ఎం.జి.రోడ్డు, విజయవాడ-520010చే చాప్టర్ III యొక్క సెక్షన్ 13(2) క్రింద, PNB హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ ("PNBHFL" గా ఇటు పై రిఫరు చేయబడును) డిమాండు నోటీసును జారీ చేసినారు. ఇన్‌స్టాల్‌మెంట్లు/వడ్డీ తిరిగి చెల్లించని కారణంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా/నేషనల్ హౌసింగ్ బ్యాంక్ మార్గదర్శకాలు ప్రకారం మీ అకౌంట్లను నిరర్ధక ఆస్తులుగా వర్గీకరించబడిన కారణంగా దిగువ పేర్కొన్న రుణగ్రహీతలు/సహరుణగ్రహీతలు/హామీదారులందరికీ మా అధీకృత అధికారి ద్వారా సదరు డిమాండు నోటీసు జారీ చేయబడినది. ప్రిన్సిపల్, వడ్డీ వగైరాల యొక్క ఇన్‌స్టాల్‌మెంట్ల చెల్లింపులో మీ ద్వారా విషయాల్లో విఫలమైనారు. రావలసిన బకాయి మొత్తం దిగువ పేర్కొనబడినది. తదుపరి కారణాల వలన మేము భావించునది ఏమనగా, డిమాండు నోటీసు సర్వీసును అతిక్రమించినారు మరియు సదరు చట్టం యొక్క సెక్షన్ 13(2) క్రింద అవసరమైన విధంగా ఈ డిమాండు నోటీసు ప్రచురించబడినది. అప్ టు డేట్ వడ్డీ మరియు ఛార్జీలతోపాటు పైన తెలిపిన మొత్తం ఈ డిమాండు నోటీసు ప్రచురణ తేదీ నుండి 60 రోజులలోగా PNBHFL కు చెల్లించవలెనని మీకు ఇందుమూలముగా పిలుపు ఇవ్వడమైనది, లేనిచో రుణగ్రహీతలు మరియు హామీదారుల యొక్క సెక్యూర్డ్ ఆస్తులు స్వాధీనం చేసుకొనుటతోపాటు సెక్యూర్డ్ ఆస్తులు అన్ని లేదా ఏదైనా ఒకటి లేదా అంతకు మించి దానిపై సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) యొక్క ఏర్పాట్లు అన్ని లేదా ఏదైనా దాని క్రింద PNBHFL ద్వారా అవసరమైన చర్య తీసుకొనబడును. పబ్లిక్ లేదా ప్రైవేటు ట్రీటీ నుండి టెండర్లు, కొటేషన్లు కోరుట ద్వారా బహిరంగ వేలం ద్వారా సెక్యూర్డ్ ఆస్తుల అమ్మకం కొరకు నోటీసు ప్రచురణ తేదీ వరకు మాత్రమే PNBHFL ద్వారా సంభవించు అన్ని ధరలు, ఛార్జీలు మరియు ఖర్చులతోపాటు రావలసిన మొత్తం బకాయి చెల్లింపు/టెండరు క్రింద సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 యొక్క సెక్షన్ 13 సబ్-సెక్షన్ (8) యొక్క ఏర్పాట్లను మీరు గమనించగలరు. పబ్లిక్ లేదా ప్రైవేటు ట్రీటీ నుండి టెండరు, కొటేషన్లను పిలుచుట ద్వారా బహిరంగ వేలం ద్వారా సెక్యూర్డ్ ఆస్తుల అమ్మకం కొరకు నోటీసు ప్రచురణ తేదీలోగా PNBHFL ద్వారా సంభవించు ఖర్చులు మరియు ఛార్జీలు, ధరలతోపాటు రావలసిన మొత్తం బకాయిలను టెండరు చేయనిచో ఆటుపై సెక్యూర్డ్ ఆస్తులను తిరిగి రాబట్టుటకు మీకు అవకాశం లేదు. పైన తెలిపిన సెక్యూర్డ్ ఆస్తులు ఏదైనా ఇతర విధంగా లేదా అమ్మకం, లీజు ద్వారా గానీ బదిలీ చేయుట నుండి సదరు చట్టం యొక్క సెక్షన్ 13(13) క్రింద తదుపరి మీరు నిషేధించబడినారు.

| రుణ అకౌంట్ నంబరు(లు) | రుణగ్రహీత మరియు సహరుణగ్రహీత పేరు/చిరునామా | హామీదారు పేరు/చిరునామా | తనఖా పెట్టిన ఆస్తి(లు) | డిమాండ్ నోటీసు తేదీ | డిమాండ్‌నోటీసు తేదీ నాటికి బకాయి మొత్తం |
|---|---|---|---|---|---|
| HOU/VJWD/1218/626130 B.O.: విజయవాడ | శ్రీ చల్లా ఏడుకొండల శ్రీనివాసరెడ్డి S/o. కృష్ణారెడ్డి చల్లా. ఇం.నం. 11 7 9/1, నరేంద్రనగర్, నరసారావుపేట, గుంటూరు, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్- 522601, వద్ద కూడా అందుబాటులో: 200, మిడిల్‌సెక్స్, ఎస్సెక్స్, TPK, న్యూజెర్సీ, పార్సిప్పనీ, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా, శ్రీమతి చల్లా జ్యోతిర్మయి W/o. చల్లా ఏడుకొండల శ్రీనివాస రెడ్డి, 10040, ఫాక్స్ Denct ఎల్లికాట్ సిటీ, ఎండి న్యూజెర్సీ, పర్సిప్పనీ, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా, వద్ద కూడా అందుబాటులో: ఇం.నం. 11 7 9/1, నరేంద్రనగర్, నరసారావుపేట, గుంటూరు, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522601, శ్రీమతి లక్ష్మీ సాయి కుమారి పొనుగంటి, M/o. చల్లా ఏడుకొండల శ్రీనివాసరెడ్డి, ఇం.నం.11 7 9/1, నవోదయనగర్, నరసారావుపేట, గుంటూరు, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522601. అందరూ అందుబాటులో వద్ద: బ్లాక్ బి, 4వ అంతస్తు, లక్ష్మీనిలయం, వార్డ్ నం.2, ఇం.నం.2 16 480 శ్యామలానగర్, మాస్టర్ మైండ్స్ దగ్గర, గుంటూరు సిటీ, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ 522006. | NA | సెక్యూర్డ్ ఆస్తి వివరాలు: షెడ్యూల్ ఎ: గుంటూరు జిల్లా, నల్లపాడు ఉప-జిల్లా, నల్లపాడు గ్రామం మరియు పంచాయతీ ఏరియా పరిధిలో, ప్రస్తుతం గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ ఏరియాలో, నల్లపాడు గ్రామం వద్ద ఇం.నం.లు 272 మరియు 273, 2-14-156 ఇం.నం. ప్రక్కన, 7744చ.గజాల విస్తీర్ణం యొక్క స్థలం. దాని సరిహద్దులు ఈ విధంగా : తూర్పు: రోడ్. పడమర : ఉడుముల కృష్ణారెడ్డికు చెందిన భూమి. ఉత్తరం: ఉడుముల అంజిరెడ్డికు చెందిన భూమి. దక్షిణం: బొర్రా శివరామకృష్ణయ్యకు చెందిన భూమి. షెడ్యూల్ 'బి': ఒక అవిభాజ్య, అనిర్దేశిత, మరియు విభజనకు వీలుకాని వాటా, 77.60 చ.గజాల విస్తీర్ణం కొలత. 7744చ.గ. యొక్క స్థలం మొత్తం విస్తీర్ణంలో మరియు దానిలోని గుంటూరు జిల్లా, ఎక్స్‌టెన్షన్ శ్యామలానగర్, 11వ లేన్, లక్ష్మీనిలయం, 'బి' (లోటస్) బ్లాక్, యొక్క నాల్గవ అంతస్తులో ఉన్న 401నం. కలిగిన అందులోని ఒక ఫ్లాట్‌తో సహా, 1772చ.అ. బిల్ట్ అప్ ఏరియాతో (కామన్ ఏరియాలు కలిపి) స్టిల్ట్ ఫ్లోర్‌లో ఒక కార్ పార్కింగ్‌తో సహా. సరిహద్దులు ఈ విధంగా: తూర్పు: కామన్ కారిడార్, పడమర: బహిరంగం. ఉత్తరం: బహిరంగం. దక్షిణం: బహిరంగం. | 15-జూలై-2025 | రూ. 30,81,714.22 (రూపాయలు ముప్పై లక్షల ఎనభై ఒక్క వేల ఏడు వందల పద్నాలుగు మరియు ఇరవై రెండు పైసలు మాత్రమే) 11-07-2025 నాటికి |

ప్రదేశము : విజయవాడ, తేదీ: 25-07-2025 సం/- అధీకృత అధికారి, PNB హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్.

విచారణకు భయపడి పారిపోయే వ్యక్తి,
తన నేరాన్ని తనకు తానుగా అంగీకరించినట్టే!

-వైరస్

# కాగితాల్లోనే గిరిజన సంక్షేమం!

గిరిజన సంక్షేమం, అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తున్నామని, దేశవ్యాప్తంగా వేలాది కోట్ల రూపాయలు వెచ్చిస్తామని ఒకపక్క నేతలు గొప్పలు చెప్పుకుంటున్నా మరోకపక్క కనీస వైద్య సదుపాయాలు లేక అర్థాకలితో అల్లాడుతున్న కోట్లాది మంది గిరిపుత్రుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. వైద్యసదుపాయం మాట అటుంచి కడుపు నిండా తిండి లేక, పౌష్టికాహారం లోపించి ఎందరో గిరిపుత్రులు క్రమేపీ కనుచూపు కోల్పోతున్నారనే వార్తలు చూసి ఆవేదన చెందని ప్రజాస్వామ్యవాదులు ఉండరు. భావిభారత పౌరులుగా ఎదగాల్సిన వేలాది మంది గిరిజన బాలలు రేచీకటి, గ్లోకోమా, క్యాటరాక్ట్, విటమిన్ ఏ లోపంతో అంధులుగా మారుతున్నారనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. సర్వేంద్రియాల్లో కళ్లు అత్యంత ప్రధానమైనవి. అవే మూసుకుపోయి అంధులుగా మారితే ఆ వ్యక్తితోపాటు ఆ కుటుంబం పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో ఊహించుకోచ్చు. అవిద్య, అజ్ఞానం, మూఢత్వం, దారిద్ర్యం ప్రకృతితోపాటు తోటి మానవుడు చేస్తున్న దోపిడీలతో నేటికీ గిరిజన ప్రాంతాలు అతలాకుతలం అవుతున్నాయి. ఆదివాసులకు ప్రత్యేక ప్యాకేజీలంటూ కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తున్న వేలాది కోట్ల నిధుల్లో నాలుగోవంతు కూడా వారికి చేరడం లేదనే విమర్శలను కొట్టివేయలేం. స్వాతంత్య్రం వచ్చి ఏడున్నర దశాబ్దాలు దాటిపోయినా వారి కోసం ప్రత్యేకంగా సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థలు ఏర్పాటు చేసినా ఆశించిన మేరకు ప్రయోజనాలు చేకూరడం లేదు. ఇప్పటికీ దేశవ్యాప్తంగా ఎన్నో వేలాది గిరిజన గ్రామాలకు, గూడాలకు రహదారి సౌకర్యాలు లేవు. నడవడానికి కూడా సరైన బాటలు లేని గ్రామలు ఎన్నో ఉన్నాయి. ప్రాణాపాయ స్థితుల్లో కూడా డోలె కట్టి మోసుకుపోతున్న దృశ్యాలు నేటికీ కన్పిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో కూడా గిరిజన ప్రాంతాల పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నది. ముఖ్యంగా రోడ్లు లేకపోవడంతో వర్షాకాలంలో ఎలాంటి ఆపద వచ్చినా వైద్య సహాయం కోసం గ్రామాలు దాటలేని పరిస్థితి. ఇటీవల ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రహదారులులేని గిరిజన గ్రామాలకు రోడ్లు వేయించే ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ఇక ఆరోగ్యం విషయంలో పూర్తిగా నిర్లక్ష్యం చేశారు, చేస్తున్నారనే చెప్పొచ్చు. ఎండాకాలం పోయి, వర్షాకాలం ఆరంభమైన సమయంలో పాత నీరు, కొత్తనీరు కలయికతోపాటు వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల మలేరియా వంటి వ్యాధులు విజృంభించడంతో ఎందరో గిరిపుత్రులు అసువులు బాస్తున్నారు. వాస్తవంగా ఆదివాసుల ఆరోగ్యపరిస్థితి అధ్యయనం చేసేందుకు ప్రఖ్యాత గ్రామీణ ఆరోగ్యరంగ నిపుణులు డాక్టర్ అభయ్ బంగ్ నేతృత్వంలో కేంద్రప్రభుత్వం కమిటీని నియమించింది. ఆ కమిటీ గిరిజన ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి సమగ్ర అధ్యయనం అనంతరం 2018లో తమ నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. అందులో ఎన్నో విస్తుపోయే విషయాలు వెల్లడించింది. మలేరియా కేసులు అత్యధికంగా ముప్పైశాతం ఆదివాసి ప్రాంతాల్లోనే వెలుగు చూస్తున్నాయని, ప్రతినలుగురు గిరిజనుల్లో ఒకరు అధిక రక్తపోటుతో బాధపడుతున్నారని తెలిపింది. మరోకపక్క దేశంలో ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఆదివాసుల్లో పొగాకు వినియోగం ఎక్కువగా ఉందని, దానివల్ల జరిగే హాని గురించి వారికి అంతగా అవగాహన కల్పించకపోవడంతో పదిహేనేళ్ల వయసు నుంచే దీనికి అలవాటుపడుతున్నారు. ఫలితంగా అధికశాతం క్షయవ్యాధిబారిన పడుతున్నట్లు ఆ నివేదికలో పేర్కొన్నారు. ఇక ఐదేళ్లలోపు ఆదివాసి చిన్నారుల్లో నలభైశాతం పౌష్టికాహారం కొరవడి వయసుకు తగ్గ బరువు, ఎత్తు లేక గిడసబారిపోతున్నట్లు కమిటీ గమనించింది. ఇతర విషయాలు ఎలా ఉన్నా గిరిజనుల విషయంలో వైద్యసేవలు నిర్లక్ష్యం చేయడం క్షమార్హంకాదు. వైద్యం, విద్య విషయాల్లో ప్రత్యేక శ్రద్ధవహించి వారికి కేటాయించిన నిధులు అందేలా చూడడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి దీనిని అధిగమించి వారికి కేటాయించిన నిధులు వారి సంక్షేమం కోసమే ఉపయోగించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. అందులో భాగంగా 1970లో సాంఘిక సంక్షేమ శాఖ నుంచి విడదీసి ప్రత్యేక గిరిజన సంక్షేమ శాఖను ఏర్పాటు చేశారు. అదిలాబాద్ జిల్లాకు చెందిన కొట్నాక భీమ్‌రావు తొలిగిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టగానే ఎంతోకాలంగా మూలనపడి ఉన్న హేమండర్ఫ్ నివేదికలోని సిఫార్సులను అమలు చేసేందుకు నడుం బిగించారు. ఆనాడే గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఐటిడిల ఏర్పాటుకు నాంది పలికారు. అప్పటి నుంచి రాష్ట్రంలో ఏర్పాటైన తొమ్మిది ఐటిడియేల ద్వారా వందలాది కోట్లు యేటా వెచ్చిస్తూనే ఉన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య కేంద్రాలను ప్రారంభించారు. భవనాలు నిర్మిస్తున్నారు. డాక్టర్లు కిందిస్థాయి ఉద్యోగులను నియమిస్తున్నారు. కానీ వారిని గిరిజన ప్రాంతాలకు పంపి సకాలంలో వైద్యసహాయం అందించడంలో విఫలమవుతున్నారనే చెప్పొచ్చు. అందుబాటులో ఉండడం లేదనేది కాదనలేని వాస్తవం. దీనికితోడు సరఫరా అవుతున్న మందులు నాసిరకం, నకిలీవి కావడంతో రోగాలు తగ్గక, నమ్మకం సన్నగిల్లి గిరిజనులు నాటు వైద్యంవైపు మొగ్గుచూపుతున్నారు. పసర్లు, వేర్లతో వచ్చీరాని వైద్యం చేసుకొని కొందరు ఆరోగ్యం చెడగొట్టుకుంటుండగా మరికొందరు ప్రాణాలే తీసుకుంటున్నారు. ఇప్పటికైనా పాలకులు రాజకీయాలకు అతీతంగా వారి అభ్యున్నతికి పాటుపడాలి. ముఖ్యంగా విద్య, వైద్యం వంటి కనీస సదుపాయాలను అందించాల్సిన బాధ్యత నేతలపై ఉంది. దీనిని విస్మరిస్తే చరిత్ర క్షమించదు.



విషం ఒకసారి మాత్రమే పని చేస్తుంది. కానీ చెడు గ్రంథం నిరంతరాయంగా ప్రజల మనసుల్ని కలుషితం చేస్తూంటుంది.

జాన్ ముర్రే



ఈ ప్రపంచం మార్పును ద్వేషిస్తుంది. కానీ మార్పు మాత్రమే అభివృద్ధిని కనపరచగల ఏకైక సాధనం.

కాథరింగ్

## ప్రజావాక్కు



### షుగర్ మాత్రలు అందుబాటులో ఉంచాలి

రాష్ట్రవ్యాప్తంగా మధుమేహగ్రస్తుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతూ ఉంది. మారుతున్న జీవన శైలితో షుగర్ లెవల్స్ కూడా రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. 25ఏండ్ల వయస్సు దాటిన వారిలోనూ షుగర్ బయటపడుతోంది. ఈ క్రమంలో ఇన్సులిన్ వినియోగించే వారి సంఖ్య పెరిగింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పీహెచ్‌సీలతోపాటు హైదరాబాద్ నగరంలోని ప్రధాన ఆస్పత్రులైన గాంధీ, ఉస్మానియాలోనూ షుగర్ ఇన్సులిన్ నిల్వలు నిండుకున్నాయి. దాదాపు మూడు నెలలుగా సరఫరా నిలిచిపోవడంతో మధుమేహ బాధితులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్థిక భారంతోబయటకొనలేక, సర్కార్‌ఆస్పత్రుల్లో అందుబాటులో లేక మరోవైపు రోగుల్లో షుగర్ లెవల్స్ పెరుగుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. కొన్ని ఆస్పత్రుల్లో నో స్టాక్‌బోర్డులు ఏర్పాటుచేయగా మరికొన్నిఆస్పత్రుల్లో నిల్వలు లేవని వెనక్కి పంపిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు జిల్లా ఆసుపత్రుల్లో షుగర్‌ను తగ్గించే మందులు ఇంజెక్షన్‌లు అందుబాటులో ఉంచాలి.

- కామిడి సతీష్ రెడ్డి, జయశంకర్, భూపాల్ పల్లి జిల్లా

### ఆన్‌లైన్ బెట్టింగ్‌ను నియంత్రించాలి

ఇటీవల ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ యువతను వేగంగా ముప్పుతెచ్చే మాయా వలగామారాయి. క్రీడలు, ఫాంటసీ గేమ్స్ పేరిట నడుస్తున్న ఈ యాప్స్ డబ్బు ఆశ చూపించి విద్యార్థులు, నిరుద్యోగులను అప్పులఊబిలోకి నెట్టేస్తున్నాయి. చాలాసందర్భాల్లో ఆర్థిక భారం భరించలేక యువత ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ప్రస్తుతంఉన్న చట్టాల్లో బెట్టింగ్‌కుసంబంధించిన నిర్వచనం స్పష్టంగా లేకపోవడం వల్ల ఈ యాప్స్ ఖిస్కిల్ గేమ్స్ పేరిట చట్టాలను దాటవేస్తున్నాయి. అయితే గేమ్‌లు పేరుకుగానీ, గెలుపోటములు పూర్తిగా డబ్బుపై ఆధారపడుతున్నాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం జిల్లా

### నైతిక విద్యను బోధించాలి

చదువుతోపాటు విద్యార్థులుమంచితనం, నిజాయితీ, క్రమశిక్షణ, బాధ్యత వంటి నైతిక విలువలతో పెరుగుతుంటేనే సమాజానికి వారు ఆస్తిగా మారగలుగుతారు. పాఠశాల స్థాయిలోనుంచే నైతికబోధన కార్యక్రమాలను ప్రవేశపెట్టాలి. మంచి, చెడుమధ్యతేడావివరించేబోధన అవసరం.

- ఎమ్. రాజేష్, నల్గొండ

### కృత్రిమ మేధతో ఎన్ని లాభాలో అన్ని నష్టాలు

ఈ మధ్య అందరి నోట కుత్రిమ మేధ ఉపయోగం వలన ఎన్ని లాభాలు పొందవచ్చునో, ఎంతబాగా అన్నిరంగాలలో అభివృద్ధి చెందవచ్చునో దేశాధి, రాష్ట్రాల నేతలు ఈ సాంకేతిక విద్యకు ప్రథమ తాంబూలం ఇచ్చిగౌరవిస్తున్నారు. మోకాళ్ళ ఆపరేషన్లు, గుండె శస్త్రచికిత్సలు ఈ మేధ ఉత్పత్తి చేసిన రోబోలతో చేయిస్తున్నారు. ఇంజనీరింగ్ విద్యలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్ అనేకోర్సును అన్నిఇంజనీరింగ్ కాలేజీల్లోనూప్రవేశపెట్టారు. అంతా బాగానేఉంది. ఈ విజ్ఞానం ముదిరి అనేక ఆ సాంఘిక అరాచక విన్యాసాలకు దారితీస్తోంది. స్త్రీల ఫొటోలు తీసి వారిని అసభ్యంగా చూపిస్తున్నారు. ఈ మధ్య అమెరికా మాజీ ప్రెసిడెంట్ అయిన ఒబామాను ప్రస్తుత ప్రెసిడెంట్ డోనాల్డ్ ట్రంప్ సమక్షంలో చేతులు వెనక్కు కట్టి కారాగారంలో పెట్టినట్టు అన్ని రకాల మీడియాలలో విస్తృత ప్రచారంచేసారు. ఇది అత్యంత అవమానకరమైన సన్నివేశం. దీన్ని ప్రపంచ దేశాలన్ని చాలా సీరియస్‌గా భావించి ఖండించాలి.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### తెలంగాణకు నీళ్ల శాతం పెంచాలి

గోదావరి బనకచర్ల వివాదం ముదిరి పాకాన పడుతోంది. ఈ బేసిన్‌ల గురించి రైతులు కూడా తెలుసుకుంటున్నారు. చైతన్యవంతులుఅవుతున్నారు. అది తెలంగాణ ఉద్యమం ద్వారా వారికి వచ్చిన చైతన్యం ఎందుకంటే ఉద్యమ నినాదమే నీళ్లు, నిధులు, నియామకాలు కావున ఈనీళ్లు తెలంగాణకే ప్రాణావసరం. తెలంగాణలో గోదావరి 79శాతం కృష్ణ 68శాతం పారుతుంది. పారకం ఆధారంగా నీళ్లు ఇచ్చిన తెలంగాణ లో గోదావరిలో నీటి వాటా ఎక్కువగా దక్కాలి. ఆ దిశగా ప్రభుత్వం ప్రయత్నం చేయాలి. మహబూబ్ నగర్ వలసలు తెలంగాణ ఉద్యమంలో ఒకప్రధానఅంశంగా ఉంది కావున కృష్ణనదినీళ్లు తీసుకరావాలి.

-భారత అవినాష్, జనగామ

### మీటింగ్‌లు పెట్టొద్దు

తెలంగాణ రాష్ట్రంలో ఉన్నఎస్సీ, ఎస్టీ, బీసీ, భవనాలలో, డాక్టర్. బి. ఆర్. అంబేద్కర్ భవనాలలో రాజకీయపార్టీల మీటింగ్స్ పెట్టొద్దు అని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఒక ఆర్డర్ జారీ చేయాలి. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్. అంబేద్కర్ భవనంలో జాతీయ పార్టీలు, సీ.పీఐ. వంటి రాజకీయ పార్టీల మీటింగ్స్ పెట్టిన ఆపార్టీ నేతలపై చట్టరీత్య చర్య తీసుకోవాలి. కుల సంఘాల మీటింగ్ ఏర్పాటు చేయాలి.

-రాపాక రవీందర్, జనగాం

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# యువతలో రాజకీయ స్పృహ పెరగాలి

**యువత తలుచుకుంటే సాధించలేనిది ఏదీ లేదు అని గ్రహించాలి. రాజకీయాలు అంటే డబ్బులు సంపాదించడం కాదు అని తెలిపాలి. సమాజం సర్వతో ముఖాభివృద్ధి చెందాలని నడుం బిగించాలి. గత చరిత్ర తిరగేయాలి. స్ఫూర్తి పొందాలి. అమెరికా సహకారం తో ఇజ్రాయెల్, పాలస్తీనా, గాజా పై చేస్తున్న అమానుష దాడులకు వ్యతిరేకంగా ఒక విద్యార్థి చేసిన ప్రసంగం యావత్ ప్రపంచాన్ని ఆలోచింప చేసింది. ఆ విధంగా నేటి మన యువత దేశంలో ప్రస్తుతం ఉన్న రాజకీయాల్లో అప్రజాస్వామిక విధానాలపై కలం, గళంవిప్పాలి. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజాప్రతినిధులుగా రావాలి. భారత రాజ్యాంగ నిర్మాతలు, సంఘసంస్కర్తలు, స్వాతంత్ర్యసమర యోధులు ఆశించిన సమసమాజ నిర్మాణానికి, అభ్యుదయ భావాలతో పారదర్శకంగా పరిపాలన ప్రజలకు అందించడానికి యువత రాజకీయాల్లోకి రావాలిసిన అవసరం ఉంది.**

ఐ.ప్రసాద రావు

ప్రపంచంలోనే అత్యధిక యువత ఉన్న దేశంగా భారత్ ప్రస్తుతం కొనసాగుతుంది. ముఖ్యంగా నేటి యువత అకడమిక్ సామర్థ్యాలు సాధించడం ద్వారా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కోసం దేశ విదేశాలకు పయనం అవుతున్నారు. గత మూడు దశాబ్దాలుగా సాఫ్ట్‌వేర్ రంగంలో యువత ఆరితేరి, అత్యధిక జీతభత్యాలు అందిపుచ్చుకుని 'స్వయం' అభివృద్ధికి పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతోంది. అంతేకానీ, రాష్ట్ర రాజకీయాల్లో, దేశ రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించాడానికి కనీసం ఆసక్తి చూపకపోవడం శోచనీయం. దీంతో రాష్ట్ర, జాతీయ రాజకీయాల్లో వృద్ధ నేతలు, రాజకీయ వారసులే ఈ రాజకీయ వ్యవస్థను నడుపుతున్న పరిస్థితి ఏర్పడింది. ఇటువంటి పరిస్థితులను అందరూ పరిశీలించవలసిన అవసరం, విశ్లేషణ చేసి భారత్ భవిష్యత్తు రాజకీయ వ్యవస్థను పటిష్టం చేయడానికి, అభివృద్ధి అందరికీ అందుబాటులోకి తెచ్చే విధంగా సమున్నత రాజకీయ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ప్రస్తుతం ఉన్న రాజకీయ నాయకులు, వ్యవస్థ, పార్టీలు దాదాపు అన్ని వృద్ధ నేతలు, వారసత్వ నేతలతో నిండుపోయింది. దీనికితోడు అవినీతి కంపు కొడుతోంది. హత్యా రాజకీయాలు, అక్రమ సంపాదన దారులు, అఘాయిత్యానికి పాల్పడిన వారితో నిండుకుండలా పార్లమెంటు, శాసనసభలు, శాసనమండలి నిండిపోతున్న పరిస్థితి. పార్లమెంటు సమావేశాలు కానీ, శాసనసభ సమావేశాలు కానీ దాదాపు అన్ని అధికార, ప్రతిపక్ష పార్టీలు, నేతలు ఒకరు మీద ఒకరు బురద రాజకీయాలు, ఆరోపణలు చేసుకోవడం పరిపాటిగా మారింది. ప్రజా సమస్యలపై చర్చలు దాదాపు కనుమరుగవుతున్నాయి. తరచూ 'వాయిదాల పర్వం' కొనసాగుతోంది. చాలా చట్టాలు ముఖ్యంగా ఆర్థిక, సంస్కరణల బిల్లులు, అర్థవంతమైన చర్చలు లేకుండానే మూజువాణి ఓటుతో ఆమోదం పొందడం జరుగుతుంది. ఇటువంటి పరిణామాలు భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు ఏమాత్రం శ్రేయోష్కరం కాదు. మెజారిటీ ఉందని అధికార పక్షం, వారు అనుకున్న బిల్లులను ఏదో ఒక రూపంలో ఆమోదం పొందడం జరుగుతుంది. కనీసం మేధావులు, ప్రతిపక్ష పార్టీల సీనియర్ నేతలు అభిప్రాయాలు సలహాలుతీసుకోకుండా ఏకపక్షంగా ఇటీవల కాలంలో అనేక ముఖ్యమైన బిల్లులు చట్టాలుగా మారుతున్న పరిస్థితి. ఉదాహరణకు యన్.ఈ.పి 2020, వక్ఫ్ బోర్డు చట్టం వంటివి ఉన్నాయి. గతంలో వ్యవసాయ చట్టాలు, రైతుల నిరవధిక పోరాటం ద్వారా రద్దు చేయవలసి వచ్చింది. అంతేకానీ పార్లమెంటు చర్చలు ద్వారా కాలేదు అని గ్రహించాలి. భారతదేశానికి స్వాతంత్ర్యం కోసం, బ్రిటిష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా అనేక మంది యువకులు భగత్ సింగ్, సుఖ్‌దేవ్, అల్లూరి సీతారామరాజు, సుభాష్ చంద్రబోస్ వంటి ఎందరో యువకులు పోరుబాట పట్టారు. దేశ రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించారు. స్వామి వివేకానంద కూడా తన ప్రసంగాలు ద్వారా యువతలో చైతన్యం నింపారు. శ్రీశ్రీ వంటి రచయితలు యవ్వన కాలంలోనే కలంతో సమాజాన్ని చైతన్యవంతం చేసారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యార్థి దశ నుంచి రాజకీయాల్లో ఆరితేరినవారే. మరి నేటి యువత కేవలం తమ వ్యక్తిగత జీవితం, అభివృద్ధికే పరిమితం అవుతున్నారు. ఈ పరిస్థితి మారాలి. యువత రాజకీయ రంగ ప్రవేశం చేయాలి. దీనికి ప్రధాన




కారణం ప్రస్తుత రాజకీయాలు 'ఖరీదుగా' మారిపోయాయి. పంచాయతీ వార్డు మెంబర్ ఎన్నిక నుంచి దేశ పార్లమెంట్ సభ్యులు ఎన్నిక వరకు లక్షలు నుంచి వందల కోట్ల రూపాయలు ఖర్చు చేయవలసిన పరిస్థితి ఏర్పడింది. దీంతో సామాన్య, పేద మధ్యతరగతి యువత నేటి ఎన్నికలరంగం నుంచి దూరంగా నిలబడి ఉంది. ప్రజాస్వామ్యం ధనస్వామ్యంగా మారిపోయింది. దీనికి తోడు 'రాజకీయ నేతలు వారి కుటుంబ సభ్యులను వారసత్వంగా' ముందుగా ప్లాన్ ప్రకారం ఎస్టాబ్లిష్ చేయడం జరుగుతుంది. అన్నిటికీమించి, తల్లిదండ్రులు తమ పిల్లలను ఉద్యోగస్తులుగా, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌లుగా, డాక్టర్లుగా చూడాలనుకుంటున్నారు తప్పా, ప్రజా ప్రతినిధులుగా ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనలో లేరు. దీనికి కుటుంబ నేపథ్యం, రాజకీయ అవగాహన లేకపోవడం, ఇతర రాజకీయ ఆర్థిక సామాజిక అంతరాలు కారణాలుగా కనపడుతుంది. గత కాలంలో ఉన్నత చదువులు చదివే కళాశాలల్లో, యూనివర్సిటీల్లో విద్యార్థులకుసంఘాలు ఉండేవి. ఎన్నికల్లో పోటీ చేయడం, రాజకీయ అవగాహన కలిగి ఉండటం, చర్చలు, సేవలు అందించే అంశాలను తెలియజేయడం జరిగేది. విద్యార్థి దశలోనే లోకల్ సమస్యలు, జాతీయ అంతర్జాతీయ ఆర్థిక సామాజిక రాజకీయ అంశాలపై అవగాహన కలిగి ఉండే పరిస్థితి. ముఖ్యంగా సోషల్ సైన్సెస్ వంటి సబ్జెక్ట్స్ ఎక్కువగా చదివే పరిస్థితి. దేశం కోసం, సమాజ కోసం మంచి చేయాలనే తపన, సేవాభావం కలిగి ఉండే విధంగా తర్ఫీదు ఉండే పరిస్థితి. నేడు కేవలం 'స్టెమ్' వంటి సబ్జెక్ట్‌లకే ఎక్కువ మంది పరిమితం అవుతున్నారు. దీంతో యువత రాజకీయాల్లోకి రావాలనే ఆలోచన, ఆసక్తి చూపకపోవడం గమనించవలసిన విషయం. కొన్ని చోట్ల ఓటు వేయడానికి కూడా బద్ధకంగా ఉండుట అత్యంత బాధాకరమైన విషయం. మరి ఇటువంటి పరిస్థితుల్లో దేశంలో ఉన్న అనేక ఆర్థిక, సామాజిక రాజకీయ అంతరాలు తగ్గించాలంటే, రాజ్యాంగ ఆశయాలు నెరవేరాలంటే ప్రతీ పౌరుడు ఆలోచన చేసే సమయం ఆసన్నమైంది. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలకు సేవాభావం కలిగించే విధంగా తర్ఫీదు ఇవ్వాలి. రాజకీయ వ్యవస్థను పటిష్టం చేయడానికి, పారదర్శకంగా పరిపాలన ప్రజలకు అందించాడానికి తమ పిల్లలను ఆదర్శవంతమైన రాజకీయ నాయకులుగా తీర్చిదిద్దడంలో ప్రముఖ పాత్ర పోషించాలి. విద్యార్థులు కూడా కేవలం తమ అకడమిక్ చదువులకే పరి మితం కాకుండా, జాతీయ అంతర్జాతీయ ఆర్థిక రాజకీయ పరిస్థితులపై అవగాహన కలిగి ఉండాలి. గతంలో అనేక మంది విద్యార్థులు ఉన్నత చదువులు చదివి, ఉద్యోగాలు విడిచి పెట్టి దేశ రాజకీయాల్లో ప్రముఖ పాత్రపోషించారు. ముఖ్యంగా డాక్టర్లు, న్యాయవాదులు అనేక మంది గతంలో దేశ రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించారు. ఒక డాక్టర్ గా, ఇంజనీర్‌గానే కాకుండా ఒక మంచి రాజకీయ నాయకు డుగా కూడా మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకోవచ్చు అని యువత గ్రహించాలి. దేశంలో ఉన్న అవినీతి, అక్రమ సంపాదన, అఘాయిత్యాలు, అంతరాలు తగ్గించాలంటే యువత రాజకీయాల్లోకి రావాలి. గుత్తాధిపత్యంగా ఉన్న, ఏకపక్షంగా ఉన్న రాజకీయ పార్టీలకు ధీటుగా యువత రాజకీయాల్లోకి రావాలి. యువత తలుచుకుంటే సాధించలే నిది ఏదీ లేదు అని గ్రహించాలి. రాజకీయాలు అంటే డబ్బులు సంపాదించడం కాదు అని తెలిపాలి. సమాజం సర్వతో ముఖాభివృద్ధి చెందాలని నడుం బిగించాలి. గత చరిత్ర తిరగేయాలి. స్ఫూర్తి పొందాలి. అమెరికా సహకారం తో ఇజ్రాయెల్, పాలస్తీనా, గాజా పై చేస్తున్న అమానుష దాడులకు వ్యతిరేకంగా ఒక విద్యార్థి చేసిన ప్రసంగం యావత్ ప్రపంచాన్ని ఆలోచింప చేసింది. ఆ విధంగా నేటి మన యువత దేశంలో ప్రస్తుతం ఉన్న రాజ కీయాల్లో అప్రజాస్వామిక విధానాలపై కలం, గళం విప్పాలి. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజా ప్రతినిధులుగా రావాలి. భారత రాజ్యాంగ నిర్మాతలు, సంఘసంస్కర్తలు, స్వాతంత్ర్యసమర యోధులు ఆశించిన సమసమాజ నిర్మాణానికి, అభ్యుదయ భావాలతో పారదర్శ కంగా పరిపాలన ప్రజలకు అందించడానికి యువత రాజకీయాల్లోకి రావాలిసిన అవసరం ఉంది. ●

# శాంతి చర్చలకు ఉక్రెయినే ముందడుగు వేయాలి

కనుమ ఎల్లారెడ్డి

రష్యా, ఉక్రెన్ యుద్ధం తీవ్ర రూపం దాల్చే స్థితిలో ఉంది. రష్యా చేస్తున్న దాడులతో కుంగిపోయిన ఉక్రెన్‌కు అగ్రదేశం, జర్మనీ, నెదర్లాండ్ దేశాలు ముందుకు వచ్చాయి. వీటితోపాటు నాటో కూటమి తోడైందని భోగట్టా. రష్యా దాడులు అడ్డుకోవడంలో ఉక్రెయిన్‌కు అండగా ఈ దేశాలు రక్షణగా 'ప్యా ట్రియట్' క్షిపణులను అందిస్తోందని సమాచారం. ఈ ప్యాట్రియట్ క్షిపణులు రష్యా ప్రయోగించే డ్రోన్లు, విమానాలను అడ్డుకుంటుందని నాటో కమాండర్ క్రిస్టొఫర్ గ్రీన్ కెవిచ్ ప్రకటించారు. అయితే ఈ ప్యాట్రియేట్ క్షిపణులకు రుసుం చెల్లించాలని అగ్రరాజ్యం పేర్కొంది. సుమారు పది దేశాలు ఇటువంటి వ్యవస్థను కలిగి ఉన్నాయి. ఏవి కలిగి ఉన్న అగ్రదేశానికి సాటి రావు. 60 నుంచి 160 కిలోమీటర్ల వరకు బాలిస్టిక్ క్షిపణులు నివారించడానికి ఇవి దోహదపడతాయి. రష్యా ప్రయోగించే కలిబర్, ఇస్కాండర్ క్షిపణులను నాశనం చేయగలవు. వీటి లక్ష్యలను చూసి రష్యా ఎటువంటి ఆందోళనకుగురికాలేదు. పై హెచ్చు మా ఆత్మ విశ్వాసమే మా బలం. అటువంటి వాటికి, మేము ఎన్నటికీ బెదరం వాటిని కూడా పతనం చేయగల సత్తా మా రక్షణ వ్యవస్థకు ఉంది. ఇలా పరస్పర మాటల ప్రచ్ఛన్న యుద్ధంతో రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ఇప్పట్లో ఆగే దిశలో లేదు. శాంతికి కృషి చేయాలనే తలంపు లేకపోవడం, పైగా ఉక్రెయిన్‌కు తగిన సహాయం చేస్తామని యూరోపియన్ దేశాలు ప్రకటించడం యుద్ధం భీకరంగా కొనసాగే లక్షణాలు పొడచూపుతున్నాయి. విశ్వంలో భారత్ ఒక్కటే శాంతికి కృషి చేసే దేశంగా పేరుఉంది. భారత్, రష్యాను బుజ్జగిస్తే యుద్ధం ఆగి పోయే పరిస్థితి ఉంది. కాని భారత్‌కు ఆ అవకాశం దొరకలేదు. అవకాశం వచ్చినా రష్యా పర్యటనకు భారత్ ప్రధాని మోదీ వెళ్ళినా పుతిన్ తో భేటీ అవ్వడం, " ఇది యుద్ధల యుగం "కాదు. మీరు శాంతికి అడుగు వేయాలి అని చెప్పడం, అదే దిశలో ఉక్రెన్ అధ్యక్షుడు జెలెన్ స్కి ఒక యుద్ధ పిపాసి తో భారత్ ప్రధాని కలవడం విచార కరం అని యుద్ధం ఆగే మార్గాలు భారత్‌చేసే ప్రయత్నాలు బూడిదలో పోసిన పన్నీరు అయింది. వీటిమీద ఇక వ్యాఖ్యనించడం వృధా అని, జెలెన్ స్కి అగ్రదేశంపైనే నమ్మకం పెట్టుకోవడం, అగ్రదేశం పంపిణీ చేస్తున్న ఆయుధాలను వాడటం మాకే విజయం దక్కుతుందని అనుకోవడం భ్రమ. రష్యా దాడిలో అస్తవ్యస్తమైన ఉక్రెయిన్ ఎప్పటికీ రష్యాను గెలవలేదు. అందుకే ఉక్రెయిన్ అగ్రదేశం, యూరోపియన్ దేశాల మద్దతుపై ఆధారపడింది. ఉక్రెయిన్ అదుపులోకి వచ్చేందుకు, పూర్తిగా నాశనం చేసేంత వరకు రష్యా దాడులను ఉక్రెయిన్ అడ్డుకోలేదు. అందుకే ఉక్రెయిన్ 'ప్యా ట్రియేట్' క్షిపణులను ప్రయోగించడానికి సిద్ధమైంది. అందుకే రష్యా మేము దేనికి బెదరం అనే ధీమాతో ఉంది. యుద్ధంతో ఆర్థికంగా దేశాలు నష్టపోతాయి. వివిధ రాజకీయాలు దేశాలను చుట్టుముడతాయి. జెలెన్ స్కి ఇతర దేశాలపై ఆధారపడటం తప్పా ఏమి చేయలేని స్థితి. అతను అన్ని ఆలోచించి రష్యాతో శాంతికి బాటలు వేస్తే యుద్ధం ఆగుతుంది. పౌరుల కోసం, దేశ భద్రత కోసం, పురోభివృద్ధి కోసం జెలెన్ స్కి ఈ ప్రతిపాదన చేయాలి. ఒక అడుగు ముందుకు వేసి, ఒక దేశ అధ్యక్షుడిగా తన దేశాన్ని, ప్రజలను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే రష్యా దాడులతో ఉక్రెయిన్ ఎంతో నష్టాన్ని మూటగట్టుకుంది. అనేక అందమైన భవనాలుకూలిపోయాయి. వాటి పునర్నిర్మాణం బహుకష్టం. రష్యాకునష్టం వచ్చినా అది తట్టుకోగలదు. సామ్యవాదం అక్కడ ఉంది. ఉక్రెయిన్ ఇతర దేశాల ఆయుధాలతోనే రష్యాను ఢీ కొడుతోంది. తాజాగా ఆస్ట్రేలియా కూడా ఉక్రెయిన్‌కు సహాయం అందించటానికి ముందుకు వచ్చింది. ఇలా దేశాలుఉక్రెయిన్‌కు అండగా ఉంటున్నాయి. జెలెన్‌స్కి దేశాలపైఆధారపడటం మానుకోవాలి. తానే స్వయంగా రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీ కావాలి. తన డిమాండ్లు ఆయన ముందుకు తేవాలి. ముఖ్యంగా ఉక్రెయిన్ అభివృద్ధికి మాట పొందాలి. తన స్వీయరక్షణకు అండగా ఉండాలని, ఉక్రెయిన్‌కు అన్నివిధాలా సహాయ, సహకారాలు అందించాలని రష్యాను కోరాలి. సమస్యను అతనే పరిష్కారం చేయాలి. దేశాల అండనే ఉక్రెయిన్ కొంప ముంచింది. అదే అతను చేసిన తప్పు. ఎవరో ఏదో చేస్తాం అనే భ్రమలోనే జెలెన్ స్కి ఉన్నాడు. తనకు అండగాఉన్న దేశాలతోనే రష్యాతో పోరాడుతున్నాడు. అందరూ సహాయం చేస్తామని అంటున్నారే కాని యుద్ధం ఆపే మాటలు ఎవరు తీసుకురావడం లేదు. అందుకే ఉక్రెయిన్‌కు ఎంత సహాయం చేసినా రష్యాను ఏమిచేయలేదు. అనవసరంగా దేశ పౌరుల ప్రాణాలు పోతాయి, సైన్యం కూడా దీర్ఘకాల యుద్ధంతో నీరసపడి పోయింది. ముఖ్యంగా ఆర్థిక వ్యవస్థ చిన్నా భిన్నం అయింది. బేషాజాలకు పోకుండా దేశ సంక్షేమం కోసం తన ప్రవర్తన మార్చుకోవాలి. రష్యాతో శాంతి చర్చలకు తానే ముందుకు రావాలి. ●

# విద్యావ్యవస్థలో ప్రమాణాలు మెరుగుపడాలి..

డాక్టర్. వై. సంజీవ కుమార్

నాటి విద్యావ్యవస్థలో ఆధునిక వసతులు లేకున్నా, ఉపాధ్యాయులు, లెక్చెరర్లు, ప్రొఫెసర్లు నిజాయితీగా, నిబద్ధతతో ప్రతి విద్యార్థిపట్ల శ్రద్ధ తీసుకోని, నాణ్యమైన విద్యను అందించేవారు. అప్పటి చిన్నారులే నేడు అత్యున్నతమైన స్థానాలలో ఉన్నారు. కఠినమైన దండన విధించే స్వేచ్ఛ ఉండేది విద్యాపకులకు. నేటి విద్యా వ్యవస్థలో అన్ని ఆధునీకమే అయినా సరైన విద్యను అందించలేకపోతున్నారు. నేడు అన్ని హంగులు, ఆర్భాటాలే, ప్రచారంలో తల్లిదండ్రుల ఆలోచనలను, ఆశలను గాలిలో విహరింప చేస్తున్నారు. నాడు ఉన్నతమైన విద్యలోకి అడుగు వేయడానికి పిల్లల మైండ్ సర్దుబాటు అవుతుందా లేదా, ఆ చదువుకు తట్టుకోగలరా లేదా అనేవి అన్ని అలోచించి అడుగు ముందుకు వేసేవాళ్లు. నేడు ప్రతి తల్లిదండ్రి కోరిక పిల్లలు ఇంజనీర్లు, డాక్టర్లు, పెద్ద ఉన్నతమైన స్థానంలోకి వెళ్ళాలి అనే ఆశలతోనే ఉంటున్నారు. వీళ్ల ఆలోచనలకూ తగ్గట్టు కార్పొరేట్ విద్యాసంస్థలు గాలిలో మెడలు కట్టిస్తున్నారు. తల్లిదండ్రులు తమ స్తోమతను మించి అడుగు ముందుకు వేస్తున్నారు. మరీ ముఖ్యంగా తమ పిల్లలు వత్తిడిని తట్టుకోగలరా లేదా అనేది ఆలోచించడం మానేశారు. ఉపాధ్యాయుల దండనకు కూడా తల్లిదండ్రులు యుద్ధానికి వెళ్తున్నారు. చదువుల్లో వెనకపడ్డాము అని ఆత్మహత్యలు చేసుకుంటున్నారు, చదువు అందరికి అవసరమే అలా అని ప్రాణాలు తీసుకునే చదువులు అవసరం లేదు. తల్లిదండ్రుల అత్యాశకు విద్యార్థులు వత్తిడికి లోనవుతూ బలిదానం చేసుకుంటున్నారు. ప్రభుత్వాలు క్షత్రస్థాయి పరిశీలన చేయడంలేదు. విద్యార్థులకు సరైన అవగాహనా కలిపించే వాళ్లు కరువైనారు. ప్రమాదం జరిగినప్పుడే హడావుడి చేసి మర్చిపోతున్నారు. నేటి విద్యావ్యవస్థలో వంద శాతంలో నుంచి 0.01 శాతం మంది మాత్రమే ఉన్నతచదువులో రాణిస్తున్నారు. మిగితా 99.99విద్యపట్ల అవాహనలేకపోవడం, వత్తిడికి లోనవడం, అనేక ఇతర కారణాల వలన మధ్యలో విఫలమవుతున్నారు. మరి కొందరు అన్నిట్లో ఉన్నతమైన మార్కులు వచ్చినా, చదివిన చదువులో ప్రాక్టికల్ నాలెడ్జి లేకపోవడం వలన కూడా విఫలమవుతున్నారు. పదవతర గతి తరవాత సరైన అవగాహనా లేకపోవడం వలననే అనేక మంది విద్యార్థులు వేసే తప్పటడుగు వాళ్ల జీవితాలలో భారీమూల్యం చెలించుకోవలసి వస్తుంది. పలానా వాళ్లు ఈ కోర్స్ తీసుకున్నారు మనము కూడా ఆ కోర్స్ తీసుకోవాలి. వాళ్లు ఈ పని



చేసారు, నేను ఈ పని చేయాలి. వాళ్ళు ఎంసెంట్‌కి ప్రిపేర్ అవుతున్నారు, నేను ప్రిపేర్ అవ్వాలి, వాళ్ళు పాలనా కాలేజీలో చేరినారు, మేము మా పిల్లలను అందులో చేర్పించాలి, అనే ఆలోచనల నుంచి బయటపడ్డప్పుడే విద్యావ్యవస్థలో వారికి ఏది అవసరం, ఏది చేయగలరు అనే మార్గం గోచరిస్తుంది. హంగు హార్భాటాలు ప్రచారం చేసుకునే విద్యాసంస్థలలో చేరాలి. అక్కడ చేరితేనే స్టేటస్ పెరుగుతుంది అనే ఆలోచనల నుంచి తల్లిదండ్రులు బయటకు రావాలి. ఎనిమిదవ తరగతి నుంచే ప్రతి విద్యార్థికి చదువులలో రకాలు, ఎం చదివితే ఏ వైపు వెళ్తే ఏవిధంగా జీవితం ఉంటుంది అనేది తెలియజేయగలిగితే పదవతరగతి వచ్చేసరికి వాళ్ల ఆలోచ నలు పరిణితి చెంది వాళ్లు విజయం సాధిస్తారు అనుకునే కోర్స్ లోనే చేరుతారు. అలానే కష్టపడతారు. విజయం సాధిస్తారు, చదువుతోపాటు చిన్నప్పటినుంచే విద్యార్థులకు ఆటల పట్ల అవగహన కలిపించే విధంగా ప్రతి శనివారం ఆటల రోజుగా నిర్ణయించి అన్ని రకాల ఆటలు ఆడిస్తే విద్యార్థులలో ఆత్మస్థైర్యంతోపాటు ఆటల్లో ప్రావిణ్యం పొందే అవకాశం ఉంటుంది. నచ్చిన ఆటను స్ఫూర్తిగా తీసుకోని ఆటలో రాణించడానికి అవకాశం ఉంటుంది. ఎప్పటికప్పుడు భవిష్యత్‌లో అన్ని రంగాలలో వచ్చే మార్పులను వివరించగలితే వాళ్ల మేధాశక్తి పెరుగుతుంది. ఉన్నతమైన ఆలోచనల తో ముందుకు సాగుతారు. ప్రభుత్వ విద్యావ్యవస్థ విషయానికి వస్తే నేటికీమరుగుదొడ్లు, మూత్రశాలలు లేని పాఠశాలు దర్శనమిస్తాయి. ఉపాధ్యాయులు టెక్నాలజీ తగ్గట్టు విద్యార్థులకు నెరిపించే నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ప్రతిబడిలో ఉన్నతమైన ప్రమాణాలు పాటించినప్పుడే విద్యార్థులకు చిన్నప్పటినుంచే మంచి అవగాహనా అలవర్చుకోవడానికి అవకాశముంటుంది. విద్యా వ్యవస్థను ఎప్పటికప్పుడు ఆధునీకరించుకోవలసిన బాధ్యత ప్రభుత్వానికుంది. తల్లిదండ్రులు కూడా పాఠశాలలో, కళా శాలల్లో చేర్పించాము, మా పనైపోయింది అనే భావననుంచి బయటకు వచ్చి వాళ్ళు ఎలా చదువుతున్నారు, వాళ్ల విద్యాప్రమాణాలు ఎంతవరకు మెరుగుపడ్డాయి, పిల్లల ప్రవర్తన ఎలాఉంది అన్ని గమనిస్తూ లోపాలను సరిచేస్తూ ఉన్నప్పుడే వాళ్లు ఉన్నతమైన చదువు చదవడానికి అవకాశం ఉంటుంది. ఉన్నతమైన స్థానాలను పొందేమార్గం ఏర్పడుతుంది. ప్రభుత్వ ఉపాధ్యాయులకు ప్రభుత్వం నిర్వహించే వివిధ కార్యక్రమాల నుంచి మినహాయింపు ఇచ్చి ఉపాధ్యాయులను ఉపయోగించుకోవడం తగ్గించి వాళ్లు పిల్లలకు బోధించే విద్యకు మెరుగైన ప్రమాణాలు జోడించి ప్రతి సంవత్సరం ఒక నెలరోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వగలిగితే ఉపాధ్యాయులు కూడా విద్యలో మెరుగవుతారు. విద్యార్థులకు మరింత సరికొత్త విద్యను అందించే అవకాశం ఉంటుంది. మార్పు ఒక్కరోజుతో సాధ్యంకాదు, నిరంతర ప్రక్రియ మార్పులు కొనసాగించినంతకాలం విద్యలో అనేక పెనుమార్పులు సంభవిస్తాయి. చదువును ఆధునీకరణ చేయడానికి అవకాశం ఉంటుంది. ●

# గుంటూరు వార్త

## కార్యాలయంలో కానరాని ఇంజినీరింగ్ అధికారులు!



**కారంపూడి, జులై 24 ప్రభాతవార్త:** మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అధికారులు కనుమరుగయ్యారు. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎక్కడ అనేది కనిపించడం లేదు. కార్యాలయంలో మాత్రం తలుపులు తీసి ఉంటాయి కానీ, అధికారులు కనిపించడం లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి. నెలలో ఏదో ఒకరోజు మొక్కుబడిగా కార్యాలయానికి రావడం ఆరోజు ఉన్న పనులను పూర్తి చేసుకుని వెళుతున్నట్లు తెలుస్తుంది. సంబంధిత ఉన్నతాధికారులు వచ్చిన సమయంలో కనపడతారే తప్ప మిగిలిన రోజుల్లో వారి జాడ కనిపించడం లేదు.

# స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలి

-అట్టహాసంగా పీ4 కార్యక్రమం ప్రారంభం
-బంగారు కుటుంబాలుగా మార్చడమే ప్రభుత్వ ధ్యేయం
-జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి

**చేబ్రోలు(పొన్నూరు), జూలై 24,ప్రభాతవార్త:** 2047నాటికి విజన్ స్వర్ణాంధ్ర సాధన కోసం నిర్దేశించిన పది లక్ష్యాల్లో భాగంగా పేదరికం నిర్మూలనకు సమాజంలోని ఉన్నత స్థాయిలోని వ్యక్తులు మార్గదర్శకులుగా ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పిలుపునిచ్చారు. చేబ్రోలు మండల పరిధిలోని నారాకోడూరు గ్రామంలో గురువారం పీ4కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ అట్టడుగున ఉన్న కుటుంబాలను బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దడానికి అవసరమైన







సహాయాన్ని అందించే కార్యక్రమమే పీ4 అని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పీ4 కార్యక్రమాన్ని ఉగాది రోజున అమరావతిలో ప్రారంభించారన్నారు. అదే రోజు మేఘా కంపెనీ కృష్ణాజిల్లాలోని వారి స్వంత గ్రామాన్ని దత్తత తీసుకోవడం జరిగిందన్నారు. అదేవిధంగా తాడికొండ,పొన్నూరులో జరిగిన కార్యక్రమంలోనూ పై డేటా సొల్యూషన్స్, స్పిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు, ఐఎంఏ వైద్యులు దాదాపు 200కుటుంబాలను దత్తత తీసుకున్నారన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా మార్చి నుంచి ఇంటింటికి సర్వే నిర్వహించి ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం సహాయం అవసరమైన బంగారు కుటుంబాలను గుర్తించడం జరిగిందన్నారు. నారాకోడూరు గ్రామంలో ఇప్పటి వరకు 217 బంగారు కుటుంబాలను గుర్తించడం జరిగిందన్నారు. బంగారు కుటుంబాల జాబితాను గ్రామ సభలో ప్రదర్శించడం జరిగిందన్నారు. దీనిలో అర్హత ఉన్నవారిని చేర్పులకు,అనర్హుల తొలగింపులపై గ్రామ సభలో చర్చించి అభిప్రాయాలు తెలియజేయాలన్నారు. గ్రామ సభలో అమోదించిన బంగారు కుటుంబాల తుది జాబితాను ఆన్‌లైన్ నమోదు చేయడం జరుగుతుందన్నారు. దీని వల్ల సహాయం అందించాల్సిన మార్గదర్శులు దత్తత తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. బంగారు కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలపైనా నీడ్ అసెస్మెంట్ సర్వే జరుగుతుందన్నారు. వీటి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. బంగారు కుటుంబాలను దత్తత తీసుకునే మార్గదర్శులు వారి అవకాశం మేరకు దీర్ఘకాలిక, స్వల్పకాలికంగా ఆర్థికంగా, ఆర్థికేతరంగా సహాయం అందించవచ్చన్నారు. బంగారు కుటుంబాల్లో పిల్లలకు విద్య, ఉన్నత ఉద్యోగాల సాధనపై అవగాహన కల్పించడం, వారి ఆర్థికాభివృద్ధికి సలహాలు అందించవచ్చన్నారు. సమాజంలో ఉన్నత స్థానాల్లో ఉన్న ఎన్ఆర్ఐలు, వ్యాపారవేత్తలు, వైద్యులు, ఇంజనీర్లు, కార్పొరేట్ కంపెనీల నిర్వాహకులు, ఇతర ఆర్థిక స్తోమత కలిగిన వ్యక్తులు తమ పరిసర ప్రాంతాల్లోని బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా ప్రభుత్వ అధికారులతో పాటు, స్థానిక పెద్దలు సహకారం అందించి పీ4 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సిన్హా మాట్లాడుతూ ఉన్నతస్థాయిలో ఉన్నవారు సమాజం పట్ల బాధ్యతతో మార్గదర్శులుగా అట్టడుగున ఉన్న పేద కుటుంబాలను బంగారు కుటుంబాలుగా ఆర్థికాభివృద్ధికి సహాయం అందించడమే పీ4 కార్యక్రమ ప్రధానోద్దేశమన్నారు. పేదరిక నిర్మూలనే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రారంభించిన పీ4 కార్యక్రమం స్ఫూర్తిని మరింత ముందుకు తీసుకువెళ్ళడానికి సమాజంలోని ఉన్నతస్థానాల్లోని వ్యక్తులు ముందుకు రావాలన్నారు. గ్రామ సభ అనంతరం మండల పరిధిలోని మంచాల గ్రామానికి వెళ్ళి సచివాలయ ఉద్యోగులతో కలిసి బంగారు కుటుంబాల ఇంటింటికి వెళ్ళి నీడ్ అసెస్మెంట్ సర్వేను నిర్వహించారు. బంగారు కుటుంబాల సభ్యుల వివరాలను, వారికి కావాల్సిన సహాయాలను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలుసుకొని నీడ్ అసెస్మెంట్ సర్వే యాప్‌లో స్వయంగా నమోదు చేశారు. ఈ సందర్భంగా మంచాల గ్రామంలో పలువురు రైతులు ఎరువులు రైతు సేవాకేంద్రం ద్వారా సరఫరా చేయాలని, గ్రామంలో పక్కా డ్రెయిన్లు నిర్మాణం చేయాలని, పారిశుద్ధ్యం పనులు సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్‌ను కోరారు. అందుకు స్పందిస్తూ నాగలక్ష్మి రైతు సేవా కేంద్రానికి అవసరమైన ఎరువుల సరఫరా కోసం చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారిని ఫోన్‌లో ఆదేశించారు. గ్రామంలో డ్రెయిన్లలో మురుగునీరు నిల్వ లేకుండా శుభ్రపరచాలని, దోమలు వ్యాప్తి చెందకుండా ప్రతి రోజు రాత్రి ఫాగింగ్ చేయాలని, లార్వాల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని పంచాయితీ కార్యదర్శిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఈవో వి.జ్యోతిబసు, సీపిఓ శేషశ్రీ, నియోజకవర్గ ప్రత్యేకాధికారి డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి,చేబ్రోలు మండల ప్రత్యేకాధికారి, భూగర్భజలవనరుల శాఖ ఉప సంచాలకులు వందనం,తహశీల్దార్ శ్రీనివాసశర్మ, ఎంపిడిఓ ఊహారాణి,గ్రామస్తులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## సిఆర్డీఏ జాబ్ మేళాలో 102 మందికి
# ఉద్యోగ అవకాశాలు

**తుళ్ళూరు,జూలై 24,ప్రభాతవార్త :** స్థానిక సీఆర్డీఏ స్కిల్ హబ్ ప్రాంగణంలో గురువారం జాబ్ మేళా నిర్వహించారు.ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంతాభివృద్ధి సంస్థ



(ఏపి సిఆర్డీఏ),నైపుణ్యాభివృద్ధి మరియు శిక్షణా శాఖ సంయుక్తాధ్వర్యంలో ఈ మేళా నిర్వహించగా మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్,ఎఫ్‌ట్రానిక్స్ సిస్టం ప్రైవేట్ లిమిటెడ్,డిక్సన్ టెక్నాలజీస్,హావెల్స్ ఇండియా,కురాకు ఫైనాన్షియల్ సర్వీసెస్,ఫోర్ట్ మేనేజ్‌మెంట్ సంస్థలు పాల్గొన్నాయి.మొత్తం 400కి పైగా టెక్నికల్ ఉద్యోగాల భర్తీ కోసం ఈ మేళా నిర్వహించగా, 318మంది అభ్యర్థులు హాజరయ్యారు.ఈ సందర్భంగా 102మందికి ఉద్యోగ అవకాశాలు లభించగా,వీరిలో 30మందికి ఆయా సంస్థల హెచ్‌ఆర్ ప్రతినిధులు తక్షణమే ఆఫర్ లెటర్లు అందించారు.కార్యక్రమంలో ఏపి ఎస్ఎస్‌డిసి ప్లేస్‌మెంట్ అధికారి అరుణకుమారి,సీఆర్డీఏ డిసిడిఓ బి.శ్రీనివాసరావు,సీనియర్ లైవ్‌లీ హుడ్ ఆఫీసర్ శంకర్,జూనియర్ లైవ్‌లీ హుడ్ స్పెషలిస్టులు క్రాంతికుమార్,నరసింహం,వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## పేదరిక నిర్మూలనకు వ్యాపార సంస్థలు ముందుకు రావాలి : ఎమ్మెల్యే మాధవి

**గుంటూరు క్రైమ్, జూలై 24, ప్రభాతవార్త :** సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించి పేదరికం లేని సమాజాన్ని రూపొందించాలన్నదే పి-4 కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యమని దీని




కోసం వ్యాపారవేత్తలు,వివిధ రంగాల్లో ఉన్న ప్రముఖులు ముందుకు రావాలి పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు.గురువారం ఎమ్మెల్యే గళ్ళా మాధవి తన క్యాంపు కార్యాలయంలో నగరంలో ఉన్న బిల్డర్స్,ఇంజనీర్స్,కళాశాల యజమానులు, పలు రంగాల వ్యాపారవేత్తలతో సమావేశం నిర్వహించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ...ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న పేదల జీవన ప్రమాణాలు పెంచాలనే సదుద్దేశ్యం దేశంలో ఎక్కడాలేని విధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పి-4 కార్యక్రమాన్ని చేపట్టారని, దీనికి సమాజంలో ఉన్న ధనవంతులు ముందుకు రావాలన్నారు.ప్రభుత్వం, ప్రైవేటుతో పాటు ప్రజలు భాగస్వాములై పేదరిక నిర్మూలన కోసం పని చేయాల్సి ఉంటుందని, సంపదలో ఉన్నత స్థితిలో ఉన్న వారిలో 10శాతం మంది అట్టడుగున ఉన్న వారిలో 20శాతం మంది పేదలను దత్తత తీసుకోవాల్సి ఉంటుంది.దీని ద్వారా ఆర్థిక అసమానతలు రూపుమాపవచ్చని ప్రభుత్వం భావిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ఇప్పటికే పశ్చిమలో 20వేల బంగారు కుటుంబాలను గుర్తించామని,ఈ కుటుంబాలను మార్గదర్శులుగా ఆదుకోవడానికి ముందుకు రావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.ఎమ్మెల్యే కోరినట్లు పలు కుటుంబాలకు మార్గదర్శకులుగా మారటానికి తాము సిద్ధంగా ఉన్నామని వారు తెలిపారు.ఈ సమావేశంలో మేయర్ కోవెలమూడి రవీంద్ర,యాగంటి దుర్గారావు ,గుమ్మడి హరిబాబు, అంకారావు, నాగవంశీ,డిఎస్సార్,మాస్టర్ మైండ్స్ మోహన్,సరిపూడి అనిల్, పెరుమాళ్ళు మలినేని ఇంజనీరింగ్ కాలేజీ ప్రతినిధులు, బంగారు బాబు, బొమ్మిడాల రామ్‌ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## కోనూరులో ఎటువైపు చూసినా ఇసుక అక్రమ డంపింగే

**పెదకూరపాడు, (అచ్చంపేట) జూలై 24 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కోనూరు గ్రామంలో కృష్ణానది నుంచి ఇసుకను ట్రాక్టర్ల సాయంతో సేకరించి ఖాళీ స్థలాల్లో అక్రమంగా డంపింగ్ చేశారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. సీతారాముల స్వామి ఆలయ సమీపంలో అధిక శాతం ఇసుకను డంప్ చేసి వర్షాకాలంలో ఇసుకను అధిక ధరలకు విక్రయించడం పరిపాటిగా మారిందని స్థానిక ప్రజలు అంటున్నారు. రెవిన్యూ సిబ్బంది, మండల తహశీల్దార్ పరిశీలించి అనధికారికంగా ఉంచిన ఇసుక కుప్పలను సీజ్ చేసి ప్రభుత్వం ఏర్పాటు చేసిన డంపింగ్‌కు తరలించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## అధికారులు బదిలీపై వెళ్లినా బోర్డు మారదే!

**కారంపూడి, జులై 24 ప్రభాతవార్త:** అధికారుల బదిలీలు జరిగాయి. మండలంలోని వివిధ శాఖల అధికారులను ప్రభుత్వం ఇటీవల కాలంలో బదిలీ చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా అన్ని శాఖల అధికారుల పేర్లు, వారి హోదా, సెల్ నంబర్లు మండల పరిషత్ కార్యాలయంలో బోర్డు ఏర్పాటు చేశారు. అధికారులు బదిలీపై వెళ్లి నెలలు గడుస్తున్నా ఇప్పటికీ వారి పేర్లు ఉండటంతో కార్యాలయానికి వచ్చిన ప్రజలకు అర్థం కావట్లేదు. ప్రస్తుతం బాధ్యత వహిస్తున్న ఏపీఓ నాగేశ్వరరావు, హౌసింగ్ ఏఈ బాబురావు, వ్యవసాయ శాఖ అధికారి పోట్ల నరసింహారావు, ఏపీఎం లింగారెడ్డి బదిలీలపై కారంపూడి మండలానికి వచ్చినా, గతంలో పనిచేసిన అధికారుల పేర్లే సూచిక బోర్డులో ఉండటంతో మండల ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. అయినప్పటికీ మండల పరిషత్




కార్యాలయంలో ఇప్పటికీ సూచిక బోర్డులో పేర్లు మార్పులు చేర్పులు చేయలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బోర్డులపై ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న అధికారులు పేర్లు రాయాలని ప్రజలు కోరుతున్నారు.

## పి4 పథకంతో పేద కుటుంబాలకు భరోసా : ఎమ్మెల్యే చదలవాడ

**ఫిరంగిపురం, జూలై 24 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అద్భుతమైనటువంటి



ఆలోచనలతో రాష్ట్రంలో అమలవుతున్న పి-4 పథకంతో పేద కుటుంబాలకు భరోసా లభించిందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వార్డుస్థాయి పి-4 కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు మాట్లాడారు. పి-4 కార్యక్రమం ఎంతో ప్రతిష్ఠాత్మకమైందని తెలిపారు. స్థానిక అభివృద్ధికి ఈ కార్యక్రమం ఊతమిస్తుందన్నారు. ప్రజలు, ప్రభుత్వం, ప్రైవేట్ సంస్థల సహకారంతో పేదరిక నిర్మూలనకు కృషి చేస్తామన్నారు. సమాజంలో ఆర్థిక స్థిరత్వం, సామాజిక సమానత్వం పి-4తో సాధ్యమవుతుందన్నారు. రాష్ట్ర జనాభా అభివృద్ధికి అనుగుణంగా సంక్షేమ కార్యక్రమాలు అమలవుతాయని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జశ్వంత్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

# పార్టీ పటిష్టతకు కార్యకర్తలే అండ

### మాజీ ఎంపి మోదుగుల వేణుగోపాలరెడ్డి

**కొల్లిపర, జులై 24 (ప్రభాతవార్త) :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కార్యకర్తలే అండని మాజీ ఎంపి మోదుగుల వేణుగోపాలరెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం మండల కేంద్రమైన కొల్లిపర పాల కేంద్రం కళ్యాణ మండపంలో బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వైసిపి మండల అధ్యక్షుడు కల్లం వెంకటప్పారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ జగన్మోహనరెడ్డి పక్షాన ప్రజలు ఉన్నారని, మరలా ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మోసపూరిత వాగ్దానాలతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. చనిపోయిన తరువాత రాజశేఖర్‌రెడ్డి విలువ తెలిసిందన్నారు. ముఖ్యమంత్రిగా ఓడిపోయిన తరువాత జగన్మోహనరెడ్డి విలువ ప్రజలకు తెలిసిందన్నారు. కూటమి ప్రభుత్వం అన్ని విధాల పేద ప్రజలను మోసగించిందని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం



అమలు కాని హామీలు ఇచ్చి పేద ప్రజలను మోసగించినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో ఇప్పటికే వ్యతిరేక కనిపిస్తుందన్నారు. సమావేశంలో గ్రామ సర్పంచ్ పిల్లి రాధిక, ఎంపిపి భీమవరపు పద్మావతి, జిల్లా కార్యదర్శి జొన్నల శివారెడ్డి, మండల ఉపాధ్యక్షులు బొల్లిముంత పోతురాజు, యూత్ అధ్యక్షులు ఈదా యశ్వంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 8,9 వార్డులో బాబుషూరిటీ మోసంగ్యారంటీ



**మంగళగిరి, జూలై 24, ప్రభాతవార్త :** మంగళగిరి పట్టణ 8,9 వార్డు బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ..మంగళగిరి నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ దొంతిరెడ్డి వేమారెడ్డి పాల్గొని ప్రసంగించారు. చంద్రబాబు నాయుడు మోసం చేయడం మొదటిసారి కాదు ఆయన రాజకీయ ప్రారంభమై వెన్నుపోటుతో మొదలైందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి రావడానికి దొంగ హామీలే ఇచ్చారని ఆరోపించారు. ఎన్నికలకు ముందు కరెంటు బిల్లు తగ్గిస్తానని చెప్పి, అధికారం లోకి రాగానే మూడు వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపారని ఆరోపించారు. సంవత్సర కాలంలోనే అప్పులు లక్షల కోట్లుకు పెంచి మధ్యతరగతి వారిపై పన్నుల రూపంలో భారాన్ని మోపారన్నారు. జగన్మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధి కార్యక్రమాలన్నీ కూటమి ప్రభుత్వం చేసినట్టు ప్రచారం చేసుకుంటు న్నారని ఎద్దేవా చేశారు.ఈ కార్యక్రమంలో మంగళగిరి పట్టణ గౌరవాధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు, గుంటూరు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ దామర్ల కుబేర స్వామి, గుంటూరు జిల్లా యాక్టివిటీ కార్యదర్శి మల్లవరపు సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

## మీకు మార్గదర్శిగా ఉంటా,
# మీ పిల్లలను బాగా చదివించే బాధ్యత నాది

## 10 కుటుంబాలను దత్తత తీసుకున్న బాపట్ల జిల్లా కలెక్టర్

**బాపట్ల,జులై24,ప్రభాతవార్త:** ఒక ఇంజనీర్, డాక్టర్, రాజకీయ నాయకుడుని చేయాలనే లక్ష్యంతో పది కుంటుంబాలను దత్తుతు తీసుకుంటున్నానని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళీ తెలిపారు. పి4 బంగారు కుటుంబాలతో చెరుకుపల్లిలోని ఎండిఓ కార్యాలయం వద్ద గురువారం గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పి4 విధానంలో చెరుకుపల్లి మండలం తూర్పుపాలెం, బలుసులపాలెం, కుంబాలవారిపాలెం, ఆరంబాక గ్రామాలలోని అత్యంత నిరుపేదలైన పది గిరిజన యానాది బంగారు కుటుంబాలను కలెక్టర్ దత్తత తీసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దత్తతు తీసుకున్న వారి కుటుంబ రాజకీయ నాయకుడు రావాలి, మీ పిల్లలు ఎంతవరకు చదువుకుంటే అంతవరకు మీకు ప్రోత్సాహం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. బంగారు కుటుంబాలకు చేయూతనందించడానికి కలెక్టర్ ముందుకు రావడంపై గ్రామ సభకు హాజరైన అధికారులు, ప్రజలు హర్షద్వానాలతో అభినందనలు తెలిపారు. సమాజంలో అత్యంత నిరుపేదలుగా ఉన్న బంగారు కుటుంబాల ఆర్థిక అభివృద్ధికి చేయూతనందిస్తామని కలెక్టర్ వెంకట మురళి తెలిపారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నతమైన ఆలోచనలతో పి4 విధానాన్ని ప్రవేశపెట్టారన్నారు. సమాజంలో ఆర్థికంగా అత్యంత వెనుకబడిన వారు, అట్టడుగున ఉన్న



జీవనం, ఆర్థిక స్థితిగతులపై స్వయంగా తెలుసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. ఎలుకలు పట్టడం, పాచి పని, పొలాలలో ఎరువులు చల్లడం వంటి చిన్న చిన్న పనులతో కుటుంబానికి నెలకు కనీసం రూ.10 వేలు కూడా ఆదాయం రావడం లేదని బంగారు కుటుంబాల వారు కష్టాలను చెప్పుకోవడంతో బాద వేసిందన్నారు. ప్రతి కుటుంబానికి ఉపాధి హామీ పథకం కింద జాబ్‌కార్డు జారీ చేస్తా మన్నారు. ఆ కుటుంబాలకు బ్యాంకు ఖాతాలు లేకపోవడంతో తక్షణమే బ్యాంకు ఖాతాలు ఇప్పిస్తామన్నారు. వారి జీవనశైలిని తెలుసుకున్న కలెక్టర్ ఒక్కొక్క కుటుంబానికి రూ.50 వేల నుంచి రూ.65 వేల వరకు ఆర్థిక సహాయం చేస్తామన్నారు. ఆరు కుటుంబాలకు ఇల్లు మంజూరు, మిగిలిన వారికి ఇంటి స్థలం, ముగ్గురికి ఆటోలు, లైసెన్సులు, ఒకరికి బడ్డీకొట్టు, మిగిలిన వారికి ఉపాధి హామీ పథకం కింద పని కల్పిస్తామన్నారు. ఇద్దరు ఆడపిల్లలు ఉన్న పోలమ్మ కుటుంబానికి వాత్సల్య పథకం వర్తింప చేస్తామన్నారు. ఉప్పు దుర్గ కుమార్తెకు సైకిల్, ఏడుకొండలు కుటుంబానికి మెడికల్ పింఛన్ కొరకు వైద్య పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. మీ కుటుంబాల అవసరాలు ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి వాట్సాప్ గ్రూపులో ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని వారికి భరోసా ఇచ్చారు. మీకు అండగా ఉంటాను. మీ కుటుంబాలలో ఇంజినీర్, డాక్టర్, నిరుపేద కుటుంబాలను ఎంపిక చేసామన్నారు. జిల్లాలో 62 వేల బంగారు కుటుంబాలను గుర్తించగా, నీడ్ బేస్డ్ సర్వే ద్వారా అనర్హులను తొలగించామన్నారు. ప్రస్తుతం 58 వేల బంగారు కుటుంబాలు బాపట్ల జిల్లాలో ఉన్నాయన్నారు. వారికి సహాయం చేయడానికి నాలుగు వేల మంది మార్గదర్శిలు ముందుకు వచ్చారన్నారు. బంగారు కుటుంబాలను ఆగస్టు 15వ తేదీ లోగా వారికి అనుసంధానిస్తున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం చాలా బాగుందన్నారు. అదే స్ఫూర్తితో చెరుకుపల్లి మండలం మారుమూల ప్రాంతాలలోని అత్యంత నిరుపేదలైన 10 యానాది కుటుంబాలను దత్తత తీసుకున్నట్లు వివరించారు. ఆకుటుంబాలకు ఎలాగైనా సహాయం అందించే లక్ష్యంతో ఒక వాట్సాప్ గ్రూపులో ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. జాగా లేని వారికి ఇంటి స్థలం, గూడు లేని వారికి పక్కా గృహం నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే నగదు, నా వంతు సాయంగా కలిపి రూ.నాలుగు లక్షలు ఇస్తామన్నారు. మెరుగైన వైద్యం, ఉపాధి హామీ పథకం కింద పని దినాలు, జోవనోపాధికి యూనిట్లు ఏర్పాటు చేస్తామన్నారు. వారి పిల్లల చదువులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రేపల్లె ఆర్డిఓ రామలక్ష్మి, సిపిఓ షాలేమ్ రాజు, డి ఆర్ డి ఎ పి డి శ్రీనివాసరావు, స్థానిక తహసిల్దార్, ఎంపీడీవో, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జోరువానలో ఉత్సాహంగా సుపరిపాలనలో తొలి అడుగు


**గుంటూరు తూర్పు, జులై 24 (ప్రభాతవార్త) :** జోరువానలోనూ సుపరిపాలన-తొలి అడుగు కార్యక్రమం గురువారం 50వ డివిజన్‌లో ఉత్సాహంగా సాగింది. నగర మేయర్ కోవెలమూడి నానితో కలిసి తమ ఇంటి



ముంగిటకు వచ్చిన ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్‌కు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ప్రజల వద్దకు వెళ్ళి తమ పరిపాలన ఏడాది ప్రోగ్రెస్ గురించి ఎమ్మెల్యే నసీర్ అడిగి తెలుసుకున్నారు. ఏడాది ప్రోగ్రెస్ సూపర్ సక్సెస్‌గా ఉందని ప్రజలు కితాబిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ పించన్లు నాలుగు వేల రూపాయలు పెంచిప్రతి నెలా ఇంటికే తీసుకొచ్చి అందిస్తున్నందుకు అవ్వతాతలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. ప్రతి వార్డులో సీసీ రోడ్లు, డ్రైయిన్ల నిర్మాణానికి వందల కోట్లతో పనులు చేపట్టామని వెల్లడించారు. సీఎం చంద్రబాబునాయుడు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ 4 కార్యక్రమం ద్వారా బంగారు కుటుంబాల జీవన ప్రమాణాలు పెంచబోతున్నామని తెలిపారు. దీని కోసం ప్రతి ఒక్కరూ మార్గదర్శకులను గుర్తించాలని పిలుపునిచ్చారు. ఏడాది పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని, అన్ని రంగాల్లో పురోగతి సాధించామని చెప్పారు. విద్యా, వైద్య రంగాల్లో పురోగతి సాధించామని తెలిపారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో గత ప్రభుత్వ వైఫల్యాలను అధిగమిస్తూ డ్రెయిన్ల నిర్మాణానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇదే సమయంలో రోడ్ల నిర్మాణాలు వేగ వంతంగా చేపడుతున్నామని, అంతర్గత రోడ్లను సైతం సీసీ రోడ్లుగా మారుస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి మహంకాళి, నరసింహారావు, గోళ్ళ ప్రభాకర్, కో క్లస్టర్ ఇన్‌చార్జి వంగర ఏడుకొండలు, డివిజన్ అధ్యక్షులు బాజీ, గిరి, రమణ, కేసాని ప్రసాద్, సుభాని, దేశబోయిన శ్రీనివాస్‌యాదవ్, రావూరి మోహన్‌కృష్ణ, కోట గోపాల్, కార్పోరేటర్ ముప్పవరపు భారతి, గుడిమెట్ల దయారత్నం, రాచకొండ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## బంగారు కుటుంబాల అభివృద్ధే లక్ష్యం : పల్నాడు జిల్లా కలెక్టర్

**నరసరావుపేట టౌన్, జూలై 24 ప్రభాతవార్త :** బంగారు కుటుంబాల అభివృద్ధే లక్ష్యమని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అన్నారు. గురువారం మండలంలోని దొండపాడు గ్రామంలో గ్రామ సభలను నిర్వహించారు. ఆర్డీవో మధులత, ఎంపిడివో టి.వి.కృష్ణకుమారి తదితరులు కార్యక్రమంలో పాల్గొని



మాట్లాడారు. పేదరికం అనేది లేకుండా చేయడమే లక్ష్యంగా మార్గ దర్శకులు పని చేయాలన్నారు. ఊరిలో పెద్దవారు లేని వారికి సహాయం చేయడం, వారి కుటుంబాలను ఆదుకోవడం చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు మార్గదర్శకులు ఆ కుటుంబాలను ఆదుకుంటే పూర్తిగా పేదరికం తొలగించబడుతుందని కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలియజేశారు.

## ఘనంగా గుర్రం జాషువా వర్ధంతి వేడుకలు

**సత్తెనపల్లి (టౌన్ జులై 24ప్రభాతవార్త) :** సత్తెనపల్లిపట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డు నందు నవయుగ కవి చక్రవర్తి కవి కోకిల కళాపూర్ణ కవి దిగ్గజ విశ్వకవి సామ్రాట్ పద్మభూషణ్ గుర్రం జాషువా వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన.శాసన సభ్యులు కన్నా లక్ష్మి నారాయణ ఈ కార్యక్రమం లో తెలుగుదేశం పార్టీ వివిధ హోదాల్లో వున్న రాష్ట్ర జిల్లా నియోజకవర్గ పట్టణ వార్డు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



# 2న విజ్ఞాన్స్ స్నాతకోత్సవాలు

-ముఖ్య అతిథులుగా ఏపి గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్
-ఐఐఎం రాయ్‌పూర్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రామ్‌కుమార్ కాకాని
-గౌరవ అతిథులుగా ఐల్యాబ్స్ గ్రూప్ ఫౌండర్ చింతలపాటి
-నలుగురికి గౌరవ డాక్టరేట్లు ప్రధానం
-3200మందికి పైగా విద్యార్థులకు డిగ్రీలు

**పొన్నూరు, జూలై 24,ప్రభాతవార్త:** ఆగస్టు 2వ తేదీన విజ్ఞాన్స్ యూనివర్సిటీ 13వస్నాతకోత్సవం, 3వ తేదీన విజ్ఞాన్స్ యూనివర్సిటీ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ 3వ పాలిటెక్నిక్ ఎడ్యుకుషన్ మొదటి స్నాతకోత్సవాలను కలిపి సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్ గురువారం తెలిపారు. చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైస్ చాన్సలర్ నాగభూషణ్ మాట్లాడుతూ ఆగస్టు 2న జరిగే



13వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్, గౌరవ అతిథులుగా ఐల్యాబ్స్ గ్రూప్ ఫౌండర్ చింతలపాటి శ్రీనివాసరాజు, జెన్ టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ అట్లూరి, మ్యూజిక్ గురు, ఇండియన్ ప్లేబాక్ సింగర్ కంపోజర్, లిటిల్ మ్యూజిసియన్స్ అకాడమీ ఫౌండర్ డాక్టర్ కొమాండూరి రామాచారి హాజరవుతారన్నారు. ఆగస్టు 3న జరిగే ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ 3వ పాలిటెక్నిక్ ఎడ్యుకేషన్ మొదటి స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా ఐఐఎం రాయ్‌పూర్ మాజీడైరెక్టర్ డాక్టర్ రామ్‌కుమార్ కాకాని, గౌరవ అతిథిగా విజయవాడలోని ఆర్ఆర్ స్పోర్ట్స్ ఫౌండర్ గల్లా రాధా రాణి హాజరవుతారని తెలిపారు.

**3200మందికి పైగా డిగ్రీలు అందజేత:**

ఆగస్టు 2న జరిగే 13వ స్నాతకోత్సవం సందర్భంగా తమ యూనివర్సిటీ రెండు వేల మందికి పైగా విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేయనుందని వీసి నాగభూషణ్ తెలిపారు. 13వ స్నాతకోత్సవంల సందర్భంగా 26మంది విద్యార్థులకు బ్రాంచ్‌ల వారీగా అత్యుత్తమ ప్రతిభ చూపిన వారికి బంగారు పతకాలు అందజేస్తామన్నారు. వీటితో పాటు బెస్ట్ అవుట్ గోయింగ్ స్టూడెంట్ మెడల్, ఎండోమెంట్ అవార్డులు, బహుముఖ ప్రతిభ కనబరిచిన విద్యార్థికి ఛైర్మన్ బంగారు పతకం, బెస్ట్ ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, సోషల్ ఎంగేజ్‌మెంట్ అవార్డు, బెస్ట్ లీడర్ మెడల్స్ ఉంటాయన్నారు. వివిధ విభాగాలలో అద్భుత ప్రతిభ చూపిన విద్యార్థులకు కూడా ప్రత్యేక బహుమతులు ఇస్తున్నట్లు చెప్పారు. ఆగస్టు 3న జరిగే ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ 3వ, పాలిటెక్నిక్ ఎడ్యుకేషన్ మొదటి స్నాతకోత్సవం సందర్భంగా తమ యూనివర్సిటీ 12వందల మందికి పైగా విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేయనుందన్నారు.

**నాలుగురికి గౌరవ డాక్టరేట్లు:**

13స్నాతకోత్సవాన్ని పురస్కరించుకొని విజ్ఞాన్స్ యూనివర్సిటీ వివిధ రంగాలలో వారు అందించిన సేవలు, కృషికి గాను ముగ్గురు ప్రముఖులకు గౌరవ డాక్టరేట్‌లను ప్రదానం చేయనుందని చెప్పారు. హైదరాబాద్‌లోని ఐల్యాబ్స్ గ్రూప్ ఫౌండర్ చింతలపాటి శ్రీనివాసరాజు, హైదరాబాదులోని జెన్ టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ అట్లూరి, మ్యూజిక్ గురు, ఇండియన్ ప్లేబాక్ సింగర్ కంపోజర్, లిటిల్ మ్యాజిసియన్స అకాడమీ ఫౌండర్ డాక్టర్ కొమాండూరి రామాచారిలు గౌరవ డాక్టరేట్‌లు అందుకోనున్నారని వెల్లడించారు. ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ 3వ పాలిటెక్నిక్ ఎడ్యుకేషన్ మొదటి స్నాతకోత్సవాన్ని పురస్కరించుకొని విజయవాడలోని ఆర్ఆర్ స్పోర్ట్స్ ఫౌండర్ గల్లా రాధా రాణికి గౌరవ డాక్టరేట్‌ను అందజేస్తామని పేర్కొన్నారు ఆగస్టు 2,3న జరిగే స్నాతకోత్సవ కార్యక్రమాల్లో విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ ఛైర్మన్, నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, వర్సిటీ వీసి పి.నాగభూషణ్, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు, అకడమిక్ కౌన్సిల్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, స్నాతకోత్సవ కన్వీనర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొంటారని తెలిపారు.

## శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం

**మంగళగిరి, జులై 24, ప్రభాతవార్త:** శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు నేతృత్వంలో అమావాస్యను పురస్కరించుకుని మంగళగిరి శ్రీ పానకాల లక్ష్మీ



నరసింహ స్వామివారి దేవస్థానం మెట్ల మార్గం వద్ద భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. మంగళగిరి పవిత్ర పుణ్య క్షేత్రంలోని దేవాలయాల దర్శనార్థం విచ్చేసిన సుమారు 2 వేల మంది భక్తులు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నప్రసాదాన్ని స్వీకరించారుఈ సందర్భంగా శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు మాట్లాడుతూ పరమశివుని ఆశీస్సులతో గత 2 సంవత్సరాలుగా నిర్విరామంగా ప్రతి నెలా వచ్చే అమావాస్య సందర్భంగా తమ ట్రస్ట్ ద్వారా 40 మంది దాతల సహకారంతో భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహిస్తున్నామని అన్నారు. అలాగే వేసవికాలంలో తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో మూడు నెలల పాటు చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రతిరోజు పాదచారులకు, ఆర్టీసీ బస్సులు, ఆటోల ప్రయాణికులకు చల్లటి మినరల్ వాటర్ ను ఉచితంగా పంపిణీ చేశారు. ప్రతి సోమవారం 1000 మందికి మజ్జిగ పంపిణీ కార్యక్రమాలను చేశామని అన్నారుఆధ్యాత్మిక భావంతో, ధార్మిక సేవలో భాగంగా ప్రతి నెలా అమావాస్య నేపథ్యంలో వ్యయ ప్రయాసలను అధిగమిస్తూ ఏర్పాటు చేస్తున్న అన్న ప్రసాద వితరణ బృహత్తర కార్యక్రమానికి తమ ట్రస్ట్ సభ్యులు, దాతలు ఎంతో ప్రోత్సాహం అందిస్తున్నారని వారికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు, జనసేన పార్టీ సీనియర్ నాయకులు తిరుమలశెట్టి కొండలరావు, వాకర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పుప్పాల కోటేశ్వరరావు, ట్రస్టు సభ్యులు నంగళం ప్రసాద్, కర్నాటి శివసత్యనారాయణ, వేల్పూరి శంకర్రావు, కఠారి విష్ణుమూర్తి, దుంపల సోములు, ఝగ్గా శ్రీనివాసరావు, దామర్ల వీరస్వామి, దామర్ల మల్లి, పాపిశెట్టి నాగరాజు, దుంపల నరసింహరావు, రెడ్డి వీర రాఘవులు, ఊటుకూరి సత్యనారాయణ మూర్తి, రెడ్డి సుబ్బారావు, తుమ్మా వెంకటేశ్వర రావు, నల్లమోలు నాగరాజు, శ్రీహరిరావు, పెరుమాళ్ళ సుబ్రహ్మణ్యం, పంచల శివన్నారాయణ, అన్నపురెడ్డి రామకృష్ణారెడ్డి, శ్రీనాథ్, కొండా శివమ్మ, వల్లంశెట్టి విజయ కుమార్, యమ్ సుజాత, బేతపూడి మధుబాబు, గండికోట రాజారావు, గండికోట అచ్చయ్య, నంధ్యాల గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు

## పట్టణాన్ని సుందరంగా ఉంచుదాం!

### మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు

**పొన్నూరు, జూలై 24,ప్రభాతవార్త:** స్వర్ణపురి పట్టణాన్ని సుందరంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా



మెలగాలని మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు కోరారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు పలు వార్డుల్లో పర్యటించి వర్షపునీరు నిల్వ ఉన్న చోట వాటిని బయటకు పంపే ఏర్పాట్లను పరిశీలించారు. పలు వార్డుల్లో పిచ్చి మొక్కలు ఉండడాన్ని గుర్తించిన కమిషనర్ వాటిని తొలగించాలని మునిసిపల్ పారి శుధ్యకార్మికులను ఆదేశించారు. అదే విధంగా రైల్వే స్టేషన్ రోడ్డులో పెద్ద ఎత్తున పేరుకుపోయిన పిచ్చిమొక్కలను, ముళ్ళ పొదలను తొలించే విధంగా కార్మికులను ఆదేశించారు. ప్రయాణీకులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చేయడమే ధ్యేయంగా పురపాలక సంఘం పనిచేస్తు ఒదన్నారు. పట్టణ పౌరులు కూడా తమ ఇంటి పరిసరాలలో వర్షపునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. అదేవిదంగా పిచ్చిమొక్కలను, ముళ్ళ పొదలను కూడా తొలగించే విధంగా ఆయా ఖాళీ స్థలాల యజమానులు చూడాలన్నారు. పిచ్చి మొక్కలు, ముళ్ళపొదలు వల్ల విష జంతు వులు సంచరించే అవకాశం ఉందన్నారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## కాకుమాను రూరల్ గూడెం వద్ద రైతుల ఆందోళన

**కాకుమాను జులై 24(ప్రభాతవార్త) :** మండల కేంద్రం కాకుమాను గ్రామంలోని రూరల్ గూడెం వద్ద గురువారం ధాన్యం రైతులు ఆందోళనకు దిగారు .ఇటీవల ప్రభుత్వం పొగాకు కొనుగోలు కేంద్ర



గూడెంలో ఏర్పాటు చేసింది.అధికారులు లోపల ఉన్న ధాన్యం తీసుకెళ్లాలని రైతులను పిలిచి ఆదేశించారు. ఇప్పటికిప్పుడు ధాన్యం తీయమంటే ఎక్కడికి తీసుకెళ్లాలని రైతులు అధికారులతో వాదనలకు దిగారు.పొగాకు పండించిన వారే రైతుల ధాన్యం పండించిన వారు రైతులు కాదా అని వారు ఆందోళన చెందారు.వరి ధాన్యాన్ని గూడెంలో భద్రపరచుకోవడానికి పెట్టాము గాని ప్రతిసారి ఇటువంటి అటు ఇటు మార్చడానికి పెట్టలేదని రైతులు తెలిపారు. ఇవాళ ఖాళీ చేయమంటే వరి ధాన్యపు బస్తాలను ఏక్కడికి తీసుకెళ్లాలి అంటూ రూరల్ గూడెం యజమానిపై ధ్వజమెత్తారు.ఖాళీ చేయకుండా ఉన్న వరి ధాన్యపు బస్తాలు రైతులు సంతకం పెట్టి వెళ్లవలసిందిగా రూరల్ గూడెం యజమాని రైతులను కోరారు.ఎక్కడకన్నా తీసుకెళ్లాలంటే మాకు అవకాశం లేదు గవర్నమెంట్ తీయమని అడిగితే వారే వరి ధాన్యం కొనే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుకుంటున్నారు.

## ఘనంగా మహాకవి గుర్రం జాషువా వర్ధంతి

**వినుకొండ,జులై24,ప్రభాతవార్త:** మహాకవి గుర్రం జాషువా వర్ధంతి పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ వినుకొండ నియోజకవర్గ ఇంచార్జ బోయపాటి రామాంజనేయులు



ఆధ్వర్యంలో స్థానిక ఎన్నార్టీ రోడ్డులోని జాషువా విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ జాషువా చేసిన సాహిత్య, సామాజిక సేవలను కొనియాడారు. జాషువా ఆశయాలను ముందుకు తీసుకువెళ్ళాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక రుగ్మతలపై పోరాడిన గొప్ప వ్యక్తి గుర్రం జాషువా : తెదేపా నాయకులు

**వినుకొండ,జులై24,ప్రభాతవార్త:** నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా వర్ధంతి సందర్భంగా చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు ఆదేశాల మేరకు తెదేపా నాయకులు స్థానిక మున్సిపల్ కారాలయం వద్ద ఉన్న జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సమాజంలో సామాజిక రుగ్మతలపై పోరాడిన వ్యక్తి జాషువా అని



అటువంటి గొప్ప మహనీయులు వినుకొండ ప్రాంతానికి చెందిన వారు కావడం గర్వకారణంగా ఉందన్నారు. జాషువా ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 26న మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం

**ప్రత్తిపాడు,జూలై24, (ప్రభాతవార్త):** నియోజక వర్గంలోని రూరల్ మండల సర్వసభ్య సమావేశం ఈనెల 26న జరగనుందని ఎంపీడీవో బండి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.26వ తేదీ శనివారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్తు అధ్యక్షురాలు ఇంటూరి పద్మావతి అధ్యక్షతన మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరుగుతుందని తెలిపారు.సమావేశంలో వర్షాకాలం నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకుంటున్న చర్యలు, ఉపాధి హామీ పనులు,పాఠశాలల స్థితిగతులు,గ్రామాల్లో పారిశుద్ధం,నీటి సరఫరా తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

## గార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో గంగిశెట్టి శివకుమార్‌కు సత్కారం

**చిలకలూరిపేట, జులై24,ప్రభాతవార్త:** చందమామ పత్రిక సహాయ సంపాదకులుగా పనిచేయడం వలన బాలల సాహిత్యంపై మక్కువ ఏర్పడిందని, బాల్యం నుండే కథలు రాసే అలవాటు ఉండేదని, ఈ ఏడాది బాల సాహిత్యంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన డాక్టర్ గంగిశెట్టి శివకుమార్ అన్నారు. స్థానిక స్వచ్ఛంద సేవాసంస్థ గార్డ్స్ ఆధ్వర్యంలో మహకవి జాషువా 55వ



వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు అజయ్‌బాబు పాల్గొని మాట్లాడుతూ దళితుల ఆక్రందనలు, ఆకలికేకలు కవిత్వకరించి, అనాధలను, అభాగ్యులను కవితా వస్తువులుగా ఎన్నుకొని ఎక్కుపెట్టిన సమాజాన్ని వెక్కిరించి, ధిక్కరించిన కవి దిగ్గజం జాషువా అని అన్నారు. అనంతరం పట్టణంలోని జాషువా విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గంగిశెట్టి శివకుమార్‌ను గార్డ్స్ సంస్ద సభ్యులు ఘనంగా సత్కరించారు. విద్యార్దులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఎక్సైజ్ సిఐ గోరంట్ల నారాయణ, డాక్టర్ పివి సుబ్బారావు, తోట రామచంద్రప్రసాద్, గార్డ్స్ సంస్ద సభ్యులు గేరా యాకోబు, దాసరి చిట్టిబాబు, బాలల రచయిత దార్ల బుజ్జిబాబు, డాక్టర్ చుక్కా విన్సెంట్‌పాల్, దారా కొండయ్య, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు బొప్పూడి వెంకటేశ్వర్లు, టి సుధాకర హరిప్రసాద్, జనక్రాంతి పార్టీ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## బాపూజి వృద్ధాశ్రమంలో అన్నదాం

**చిలకలూరిపేట,జులై24,ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ నాయకుడు, కౌన్సిలర్ జాలాది సుబ్బారావు సతీమణి



జాలాది సునీత 6వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని బాపూజి వృద్దాశ్రమంలో గురువారం వృద్దులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాలాది సుబ్బారావు, న్యాయవాది కె రామకృష్ణ, టిడిపి నాయకుల గడిపూడి దశరధరామయ్య, తిరుపతయ్య, ఏసురత్నం, సాంబయ్య, మీరావలి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక రుగ్మతలను సాహిత్యం ద్వారా ఎత్తి చూపిన ధిశాలి గుర్రం జాషువా


**గుంటూరు విద్య,జూలై 24,ప్రభాతవార్త :** సామాజిక రుగ్మతలను సాహిత్యం ద్వారా ఎత్తి చూపిన ధిశాలి గుర్రం జాషువా అని జాషువా రచనలు సమసమాజానికి బాటలు వేశాయని స్వర్ణాంధ్ర ఎమ్మార్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఏసుబాబు మాదిగ అన్నారు.గుర్రం జాషువా వర్ధంతి సందర్భంగా ఏసుబాబు మాదిగ స్థానిక నగరంపాలెం జిల్లా కోర్టు కూడలిలో ఉన్న గుర్రం జాషువా విగ్రాహానికి పూల మాలల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. చరిత్రకారుడు,కవి, సాహితీ వేత్త,అణగారిన వర్గాల అణచి వేతలపై తన సాహిత్యంతో



సమరం చేసిన సామాజికవేత్త గుర్రం జాషువా అని కొనియాడారు.గుర్రం జాషువా ఆశయ సాధనకోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు.

## ఏసి కళాశాల్లో ఇన్‌కంట్యాక్స్ ఆవిర్భావ దినోత్సవం,అవగాహన సదస్సు

**గుంటూరు విద్య,జూలై 24,ప్రభాతవార్త :** ఇన్‌కం ట్యాక్స్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆంధ్రక్రైస్తవ కళాశాల్లో ఇన్‌కం టాక్స్ పై అవగాహన సదస్సు నిర్వహించారు.సమావేశానికి ముఖ్యఅతిధిగా ఇన్‌కం ట్యాక్స్ డిప్యూటీ కమీషనర్ పి.ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రేమ్‌సాగర్ విద్యార్థులను




ఉద్దేశించి మాటా్లడుతూ ఇన్‌కం టాక్స్ ప్రాముఖ్యతను తెలియజేశారు.145కోట్ల జనాభాలో ఎంతమంది ఇన్‌కమ్ టాక్స్ పే చేస్తున్నారు,తద్వారా వచ్చిన డబ్బును భారత ప్రభుత్వం ఏవిధంగా వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో ఉపయోగపెడుతుందనేది పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కలిగించారు. వివిధ అంశాలపై పది ప్రశ్నలు క్విజ్ పోటీ నిర్వహించి విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు.విద్యార్థులు ఉపయో గార్థం కళాశాల్లోని గ్రంధాలయానికి కొన్ని పుస్తకాలు బహుమతిగా అందజేశారు.సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొమ్మాలపాటి మోజస్ విద్యార్థులకు ఇన్‌కం టాక్స్ ప్రాముఖ్యతను వివరించారు,ఈ అవగాహన కార్యక్రమాన్ని ఆంధ్రక్రైస్తవ కళాశాల్లో జరిపినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. అవగాహన సదస్సులో వైస్ ప్రిన్సిపల్ శాలిని,డాక్టర్ బి.విజయ్‌కుమార్,ఐక్యూ ఏసి సమన్వయకర్త డాక్టర్ పి.ఎం.వినయ్ తేజ,కామర్స్ డిపార్ట్మెంట్ విభాగాధిపతి టి.చంద్రబాబు కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది,ఇన్‌కం ట్యాక్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## కాకుమాను వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో చోరీ

కాకుమాను జులై 24 (ప్రభాత వార్త)మండల కేంద్రం కాకుమాను వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది.గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం వెనుక నుండి వచ్చి గేటు పగులకొట్టి హుండీ ఎత్తుకెళ్లినట్టు ఆలయ కమిటీ తెలిపింది.గురువారం ఆలయ కమిటీ సభ్యులు స్తానిక పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు. ఎస్ ఐ పృథ్వి ఏక్ నాథ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్‌గా నియమితులైన పిల్లి కోటిని అభినందించిన తెదేపా ఎస్సీసెల్ నాయకులు

**చిలకలూరిపేట,జులై24,ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీలో కష్టపడేవారికి విలువ ఉంటుంది అనటానికి ఉదాహరణ పిల్లి కోటి అని చిలకలూరిపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్‌గా శాసనసభ్యుడు




ప్రత్తిపాటి పుల్లారావు నియమించటమేనని టిడిపి ఎస్సి సెల్ నాయకులు తెలియచేశారు. చిలకలూరిపేట పట్టణ సిబిఎన్ ఆర్మిగా, నియోజకవర్గ ఐటిడిపి అధ్యక్షులుగా సోషల్ మీడియాలో తెలుగుదేశం పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేసిన వ్యక్తి పిల్లి కోటికి ప్రత్తిపాటి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్‌గా నియమించేదానికి కృషి చేసినందుకు వారు ధన్యవాదాలు తెలిపారు. కాగా బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పిల్లి కోటిని ఎస్సి సెల్ నాయకులు కలసి సత్కరించి అభినందనలు తెలియచేశారు.

## రోటరి ఉచిత ఆరోగ్య కేంద్రానికి రూ 25వేలు ఆర్థిక సహాయం అందజేత

**చిలకలూరిపేట, జులై24,ప్రభాతవార్త:** పట్టణంలోని నరసరావుపేట రోడ్డులోగల రోటరిక్లబ్ కమ్యూనిటి హాల్‌నందు నిర్వహిస్తున్న ఉచిత



ఆరోగ్య కేంద్రానికి ఇన్నర్‌వీల్ క్లబ్ మాజీ అధ్యక్షురాలు పి రమాదేవి గురువారం రూ 25వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. రమాదేవి పుట్టినరోజును పురస్కరించుకొని ఒక మంచి కార్యక్రమానికి సహాయం చేయాలనే ఉద్దేశంతో పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్న రోటరి వైద్యశాలకుఈ మొత్తాన్ని అందిస్తున్నట్లు ఆమె వివరించారు. ఈ సందర్భంగా రమాదేవిని రోటరిక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పుటూరి ప్రసాద్, బోడి రామసుబ్బారావు, రోటరి వైద్యశాల డాక్టర్ కందుల రంగారావులు ఆమెను అభినం దించారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు నార్నె జయలక్ష్మీ, కరణం విజయలక్ష్మీ, రోటరి డైరక్టర్లు దండా లక్ష్మీనారాయణ,తొట్టెంపూడి వెంకటేశ్వరరావు,గోగినేని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చేయూత నిస్తున్న తెలుగు సొసైటీ ఆఫ్ అమెరికన్ చికాగో ప్రతినిధులు

**చిలకలూరిపేట,జులై24,ప్రభాతవార్త:** చిలకలూరిపేట మండలంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న 4,800 మంది విద్యార్దులకు రూ 3.63 లక్షల విలువచేసే భోజనప్లేట్లు, రూ 2.50 లక్షలు విలువచేసే నోట్ పుస్తకాలను తెలుగు సొసైటీ ఆఫ్ అమెరికన్ చికాగో సంస్ద ప్రతినిధులు అందచేశారు. వీటిని గురువారం స్దానిక మండల



విద్యాశాఖాధికారి కార్యాలయంలో చిలకలూరిపేట మండల విద్యాశాఖాధికారి ఎ శ్రీనివాసరావు చేతుల మీదుగా ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులకు అందచేశారు. ఈ కార్యక్రమాన్ని మండలంలో పనిచేస్తున్న ఉపాద్యాయుడు ఘంటసాల కరిముల్లా వారి సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## పల్నాడు బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో సాతులూరు గ్రామంలో ఉచిత రక్తదాన శిబిరం

**నాదెండ్ల,జులై24,ప్రభాతవార్త:** మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ పుట్టినరోజును పురస్కరించుకొని సాతులూరు గ్రామంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. పల్నాడు బ్లడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఈ శిబిరంలో మండలానికి చెందిన తెలుగుయువతకు చెందిన నాయకులు, కార్యకర్తలు, ఈ రక్తదాన




శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. వీరందరికి బండారుపల్లి సత్యనారాయణ అభినందనలు తెలియచేశారు.

## యడవల్లి గ్రామానికి చెందిన ఆలా బంగారమ్మ భౌతికకాయానికి నివాళులు అర్పించిన మర్రి రాజశేఖర్

**చిలకలూరిపేట,జులై24,ప్రభాతవార్త:** యడవల్లి గ్రామ నాయకులు ఆలా శేషయ్య సతీమణి



బంగారమ్మ గురువారం మరణించారు. విషయం తెలుసుకున్న శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ యడవల్లి గ్రామంలోని వారి నివాసానికి వెళ్లి బంగారమ్మ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆమె భర్త శేషయ్యను, వారి కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. రాజశేఖర్‌తో పాటు గ్రామానికి చెందిన వేజర్ల కోటేశ్వరరావు, గాయాల నాగయ్య, కొమిరిశెట్టి శ్రీను, తోట పుల్లారావు, ముత్యాల వెంకయ్య, ముత్యాల రామారావు, మహంకాళి వెంకయ్య, మహంకాళి సుబ్బారావులు పాల్గొని నివాళులు అర్పించారు.

## వినియోగదారుల హక్కుల రక్షణ చట్టం 2019 ఎంతో పటిష్టమైనది

### మండల విద్యాశాఖాధికారి ఎ శ్రీనివాసరావు

**చిలకలూరిపేట,జులై24,ప్రభాతవార్త:** వినియోగ దారుల హక్కుల రక్షణ చట్టం గురించి ప్రతి ఒక్క పౌరుడు, ప్రతి ఒక్క విద్యార్ధి అవగాహన కలిగి



ఉండాలని చిలకలూరిపేట మండల విద్యాశాఖాధి కారి ఎ శ్రీనివాసరావు అన్నారు. గురువారం కన్స్యూమర్ రైట్ ప్రొటెక్షన్ ఫోరం వారు రూపొందించిన వినియోగదారుల హక్కులను తెలియచేసే పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 వినియోగదారుల హక్కుల రక్షణ చట్టం ఎంతో పటిష్టమైనదని అన్నారు. వినియోగదారులు తాను నష్టపోయినప్పుడు చాలా తక్కువ ఖర్చుతో వినియోగదారుల కోర్టు ద్వారా నష్టపరిహారం, మానసిక వ్యధకు కూడా పరిహారం పొందవచ్చునని తెలిపారు. ముఖ్యంగా విద్యార్దులు స్ట్రీట్ ఫుడ్ తినటం ఆరోగ్యానికి హానికరమని తెలిపారు. కల్తీ ఆహారం గురించి, తూకాలలో వ్యత్యాసాలు తదితర అంశాలపై ఫోరం సభ్యులు అవగాహన కల్పించడం అభినందనీయమని తెలిపారు. ఉన్నతాధికారులను సంప్రదించి విద్యార్దులకు ఈ చట్టం గురించి అవగాహన తరగతులు, వినియోగదారుల హక్కుల పరిరక్షణ ఫోరం వంటి సంస్దల ఆధ్వర్యంలో నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం సభ్యులు కెబి రోడ్‌లో గల పెట్రోల్ బంకు వద్ద వినియోగదారుల హక్కుల పరిరక్షణ ఫోరం సభ్యులు వినియోగ దారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో యంఈఓ 2 రత్నకళ, కన్స్యూమర్ రైట్ ప్రొటెక్షన్ ఫోరం అధ్యక్షులు మురికిపూడి ప్రసాద్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి రవినాయక్, కోశాధికారి బేబి విక్రం, కార్యదర్శి గాలయ్య, సహయ కార్యదర్శి పొన్నం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## నవయుగ కవిచక్రవర్తి విశ్వమానవుడు గుర్రం జాషువా

గుంటూరు కల్చరల్,జూలై 24,ప్రభాతవార్త : పుట్టుకతో దళితుడై,కృషితో కవిశేఖరుడై నవయుగ కవిచక్రవర్తి యై తన కవితాయాత్ర విజయకేతనాన్ని తెలుగు సాహితీ గగనంలో ఉవెత్తున ఎగరేసిన విశ్వమానవుడు గుర్రం జాషువా అని అవగాహన సంస్థ సభ్యులు నివాళులర్పించారు.సంస్థ కార్యాలయంలో జరిగిన వర్ధంతి కార్యక్రమంలో సాహితీవేత్త ముప్పాళ్ళ వి.ఎస్.ప్రసాదరావు మాట్లాడుతూ నిత్య జీవితంలో కానీ,సాహితీ జీవితొంలో కానీ




ఎన్ని కష్టాలు ఎదురైనా ఓటమి జాషువా దరిచేరలేదన్నారు.కవి బండికల్లు జమదగ్ని మాట్లాడుతూ గుర్రం జాషువాది ఆధునిక తెలుగు కవుల్లో విశిష్ట స్థానమన్నారు.అంటరాని కులానికి చెందిన యువకుడు తన బాధను గబ్బిలం ద్వారా కాశీవిశ్వనాధుడికి పంపే సన్నివేశాలను గబ్బిలం లో అద్భుతంగా వర్ణించారన్నారు.కళాసాధ అధ్యక్షుడు బిళ్ళా అశోక్ మాట్లాడుతూ కవికోకిల,కవి విశారద,కవి దిగ్గజ,నవయుగ కవిచక్రవర్తి అనేక బిరుదులు,వందలాది పురస్కారాలు జాషువాను వరించాయన్నారు.సభలో రచయిత్రి పింగళి భాగ్యలక్ష్మీ, సాహితీవేత్త వి.వి.రావ్,సత్యనారాయణ లు ఘనంగా నివాళులర్పించారు.

# ఆదాయపన్ను చెల్లించడం భారం కాదు బాధ్యత

## -ఆదాయ పన్నుశాఖ అధికారి జె.జి.ఎస్.కిషోర్‌కుమార్

**తెనాలి, జులై 24 (ప్రభాతవార్త) :** ఆదాయపన్ను చెల్లించడం భారం అని కాకుండా బాధ్యతగా భావించి పన్నులు సకాలంలో చెల్లించి దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని ఆదాయపన్ను శాఖ అధికారి జె.జి.ఎస్.కిషోర్‌కుమార్ పిలుపునిచ్చారు. జాతీయ ఆదాయపన్ను దినోత్సవాన్ని పురస్కరించుకుని



స్థానిక బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సదస్సుకు నెహ్రూనికేతన్ మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ వి.దాసరి అధ్యక్షత వహించారు. కిషోర్‌కుమార్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ భారతదేశంలో మొదటిసారి ఆదాయపన్ను విధించిన రోజుకు గుర్తుగా ఏటా జులై 24న ఆదాయపన్ను దినోత్సవంగా జరుపుతారని అన్నారు. విద్యార్థి దశ నుండి ప్రతి ఒక్కరికీ ఆదాయపు పన్ను చెల్లించడం గురించి అవగాహన కల్పించవలసిన అవసరం ఉందన్నారు. బ్రిటీషు వారు 1860జులై 24లో ఆదాయపు పన్ను చట్టాన్ని అమలులోకి తెచ్చారని, అనేక సవరణల అనంతరం భారత ప్రభుత్వం 1961లో చేసిన చట్టమే ప్రస్తుతం అమలు జరుగుతున్నట్లు కిషోర్‌కుమార్ అన్నారు. ప్రజలు ఆదాయపు పన్నుతో పాటు చెల్లించే పలు రకాల పన్నుల రూపంలో వచ్చిన డబ్బును ప్రభుత్వం దేశాభివృద్ధికి వినియోగిస్తుంది. అందువల్ల సకాలంలో ఆదాయపు పన్నులను చెల్లించి దేశాభివృద్ధికి దోహదపడాలని కిషోర్‌కుమార్ సూచించారు. అనంతరం దృశ్య, శ్రవణ మాధ్యమం ద్వారా ఆదాయ పన్ను చెల్లింపుకు సంబంధించిన లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. తరువాత పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ నేపథ్యంలో నెహ్రూనికేతన్ మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ వి.దాసరి కిషోర్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెనాలి ఆదాయపు పన్ను కార్యాలయ ఇన్‌స్పెక్టర్లు టి.శంకరరావు, పి.శ్రీనివాసరావు, ఆఫీసు సూపరింటెండెంట్ ఘట్టమనేని సాయిరేవతి, సిబ్బంది, నెహ్రూనికేతన్ అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## పద్మభూషణ్ నవయుగ కవిచక్రవర్తి గుర్రం జాషువా

**సత్తెనపల్లిటౌన్,జులై 24ప్రభాతవార్త :** సత్తెనపల్లి పట్టణంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జాషువా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిఅనంతరం ర్యాలీగా వెళ్లి రైల్వే స్టేషన్ రోడ్డులోని వావిలాల



పార్క్ వద్ద ఉన్న జాషువా విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సమన్వయక డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి మాట్లాడుతూ సంఘసంస్కర్త కవి కోకిల నవయుగ కవి చక్రవర్తి విశ్వ కవి సామ్రాట్ గా ప్రసిద్ధి చెందిన గుర్రం జాషువా ని నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ఆయన ఎన్నో సంస్కరణ పుస్తకాలు రాశారని జాషువా శాసనమండలి సభ్యులుగా కూడా పనిచేశారని ఆంధ్ర విశ్వవిద్యాలయం కళా ప్రపూర్ణ బిరుదుతో సత్కరించారని ఆయన సేవలకు భారత ప్రభుత్వం పద్మభూషణ్ అవార్డుతో సత్కరించారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జిల్లా నియోజకవర్గ పట్టణ మండల గ్రామ పార్టీ అనుబంధ విభాగాల బాధ్యులు ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అభివృద్ధి అంటేనే తెలుగుదేశం

## దివ్వెల శ్రీనివాసరావు

**సత్తెనపల్లిటౌన్,జులై 24 ప్రభాతవార్త :** సత్తెనపల్లి నియోజకవర్గం అభివృద్ధి లో సింహభాగం తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడే అదే పరంపరను కొనసాగిస్తున్న కన్నా లక్ష్మీనారాయణ సత్తెనపల్లి పట్టణ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులుదివ్వెల



శ్రీనివాసరావు,గురువారం సత్తెనపల్లి ప్రెస్ నోట్ తెలిపారు.ఈ సందర్భంగా దివ్వెల శ్రీనివాసరావు మాట్లాడుతూ సత్తెనపల్లి పట్టణంలో మెయిన్ రోడ్డులో సెంటర్ లైటింగ్ వచ్చిందన్నా ,సత్తెనపల్లి ప్రజలు కలలో కూడా ఊహించని అంశం తారకరామ ప్రాజెక్ట్, వావిలాల స్మృతి వనం ,అతిపెద్ద ప్రభుత్వ అతిథి గృహాలు ,పట్టణ ఆధునీకరణకు పెద్దపీట వేశారు,సత్తెనపల్లి నియోజకవర్గం పరిధిలో హిందూ మహాప్రస్థానాలు ,సిమెంట్ రోడ్డులు,మరుగు దొడ్లు ఇలా చెప్పుకొంటూ పోతే సత్తెనపల్లి నియోజకవర్గం యొక్క ముఖచిత్రం మారింది.దీనికి ప్రధాన కారణం గతంలోచేసిన తెలుగుదేశం పార్టీ శాసన సభ్యులు సౌమ్యులు అభివృద్ధి ప్రధాత లు అవ్వటం,గతంలో సత్తెనపల్లి నియోజకవర్గం లో జరిగిన అభివృద్ధి స్వర్గీయ కోడెల శివప్రసాద్ పాలన సమయంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోనే చెప్పుకోదగ్గ అభివృద్ధి జరిగింది అని,అదే పరంపరను సీనియర్ రాజకీయ నాయకులు మాజీ మంత్రి వర్యులు మరియు సత్తెనపల్లి నియోజకవర్గం శాసన సభ్యులు కన్నా లక్ష్మీనారాయణ కూడా ఒక్క సంవత్సర కాలంలోనే గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలో జరిగిన నిర్మాణాలు దాదాపు 80 శాతం పూర్తి అయి గత వై.సి.పి సమయంలో ఒక్క తట్టమట్టి కూడా వేయక ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నది అన్న సామెత ను రుజువు చేశారు.కన్నాలక్ష్మీనారాయణ శాసన సభ్యులు అయిన మొదటిరోజు నుంచే నియోజకవర్గంలో అభివృద్ధి పదంలో నడిపిస్తూ,గతంలో ఆగిన నిర్మాణ పనులు పూర్తి చేసి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నారు. నిరంతరం నియోజకవర్గం యొక్క ప్రజలకు అందుబాటులో ఉంటూనే, సంబంధితశాఖా మంత్రు లను కలిసి నియోజకవర్గం యొక్క అభివృద్ధి కి అవసరమైన నిధులను సమకూరుస్తూ అనేకమంది కూటమి ప్రభుత్వం లో ఉన్న మంత్రులను పిలిచి వారి యొక్క చేతులమీదుగా ఆయా నిర్మాణాలను ప్రారంభించి నియోజకవర్గం యొక్క ప్రజలకు అందుబాటులోకి తెస్తూ అభివృద్ధిలో అదే పరంపరను కొనసాగిస్తున్నారు అని తెలిపారు.

# హెచ్ఐవి వ్యాధి పై అవగాహన

**సత్తెనపల్లిటౌన్,జులై 24, ప్రభాతవార్త :** సత్తెనపల్లి పట్టణంలోని ఏరియా హాస్పిటల్ నందు డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ ఆంధ్రప్రదేశ్ వారి ఆదేశ్యల మేరకు ప్రతి నెల నాలుగవ గురువారం హెచ్ ఐ వి మరియు ఎయిడ్స్ వ్యాధి



పై సమగ్ర అవగాహనా ఆ వ్యాధికి లభిస్తున్న సేవలు మరియు పరీక్షలు వివరించడంలో భాగంగా అవగాహనా కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమం లో హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు , సి ఎస్ ఆర్ ఎం ఓ డాక్టర్ కృష్ణమూర్తి, ఐసిటిసి విభాగాధిపతి డాక్టర్ ప్రవీణ్ ,హెడ్ నర్స్ రాధ పాల్గొని ఎయిడ్స్ మరియు హెచ్ఐవి వ్యాధి పట్ల లభిస్తున్న అన్నిరకాల సేవలను, పరీక్షలను సమగ్రంగా అవగాహనా లో వివిధ రకాల ఆరోగ్య సేవల కోసం వచ్చిన ప్రజలకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐసిటిసి సిబంది కౌన్సిలర్ రఘునాథ్ ,ల్యాబ్ టెక్నీషియన్ షేక్ సుభాని,అనూష , స్టాఫ్ నర్స్ మరియు ఎన్ జి వొ హ్యాండ్స్ ఆఫ్ కంపెషన్ సిబంది పాల్గొన్నారు .

## హరిహర వీరమల్లు విజయోత్సవ ర్యాలీ

**పొన్నూరు, జులై 24,ప్రభాతవార్త:** పట్టణంలో పవర్‌స్టార్ పవన్‌కళ్యాణ్ నటించిన హరిహర వీరమల్లు సినిమా రిలీజ్ సందర్భంగా పట్టణంలో భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. జనసేన నాయకుడు, రాధారంగా మిత్రమండలి కన్వీనర్ యన్నం నాయుడు ఆధ్వర్యంలో భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యన్నం నాయుడు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ సినీ, రాజకీయ రంగాల్లో తాను అంటే ఏమిటో నిరూపించుకున్నా రన్నారు. హరిహర వీరమల్లు సినిమా పవన్ కళ్యాణ్‌కు విశేషమైన కీర్తి ప్రతిష్టలు తెచ్చిపెట్టిందన్నారు. ప్రేక్షకులు, అభిమానులు సినిమా చూసి ఎంతో మురిసిపో యారన్నారు. ఈ సినిమా కనీ, వినీ ఎరుగని రీతిలో విజయవంతమైం దన్నారు.ఐలాండ్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద కేక్‌కోసి అభిమానులకు పంపిణీ చేశారు.

## పేద విద్యార్థుల విద్యాభ్యాసానికి దాతలు చేయూతనివ్వాలి

### -సామాజిక కార్యకర్త పడవల లోకేశ్వరరావు

**పొన్నూరు, జులై 24,ప్రభాతవార్త:** పేద విద్యార్థుల విద్యాభ్యాసానికి దాతలు చేయూతనివ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని సామాజిక కార్యకర్త పడవల లోకేశ్వరరావు అన్నారు. పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో



559/600సాధించిన పంచుమర్తి జ్యోత్స్న అనే విద్యార్థికి సంబంధించిన ఫీజు రూ.25వేలు లోకేశ్వరరావు వివేకా డైరెక్టర్ ఉప్పల సుకుమార్‌బాబుకు అందజేశారు. ఈ సందర్భంగా లోకేశ్వరరావు మాట్లాడుతూ తాను కూడా చదువుకునే రోజుల్లో ఎన్నో ఇబ్బందులు పడ్డానన్నారు. తాను పడ్డ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని పేద విద్యార్థుల విద్యాభ్యాసానికి తాను సంపాదించిన దానిలో తనకు తోచినంత సహాయ సహకారాలు అందిస్తున్నట్లు చెప్పారు. జ్యోత్స్నలాంటి పేద విద్యార్థులు ఎంతోమంది ఉన్నారని, ఫీజు కట్టలేక విద్యాభ్యాసం ఆగిపోకూడదని, అందుకు దాతలు ముందుకు వచ్చి మరికొంత మంది పేద విద్యార్థులను చదివించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా లోకేశ్వరరావును కళాశాల డైరెక్టర్ ఉప్పల సుకుమార్‌బాబు, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కాకుమాను లాజర్‌బాబు, మన్నవ వెంకటేశ్వర గౌతమ్, చింతల నాగశ్రీనివాసరావు, మునిపల్లె మురళి తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

### -అర్బన్ సిఐ లావూరి వీరానాయక్

పొన్నూరు, జులై 24,ప్రభాతవార్త: విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అర్బన్ సిఐ లావూరి వీరానాయక్ సూచించారు. స్థానిక వివేకా కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ వీనారాయక్ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ళు మీ యొక్క పోన్లకు మెసేజ్‌లు పంపి ఓటీపి చెప్పమని అడుగుతారని, అటువంటి కాల్స్‌ను తిరస్కరించాలన్నారు. విద్యార్థులు సెల్‌పోన్‌కు, టీవీలకు



దూరంగా ఉండాలన్నారు. విద్యార్థి దశలో విద్యార్థి చేయవలసిన పనులను మాత్రమే చేయాలన్నారు. చదువు ద్వారానే సమాజంలో గుర్తింపు, గౌరవం లభిస్తాయన్నారు. మరీ ముఖ్యంగా విద్యార్థులు గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు ఉపయోగించడం చట్టరీత్యా నేరమన్నారు. అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలను నడపకూడదని చెప్పారు. మైనర్లు వాహనాలు నడిపి పట్టుబడితే తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. విద్యార్థులు చక్కాగా చదువుకొని మంచి విద్యార్థులుగా ఎదగాలన్నారు. లక్ష్యాలను నిర్దేశించుకొని లక్ష్యాన్ని చేరుకునేందుకు విశ్రమించకుండా ముందుకు సాగాలన్నారు. వివేకా కళాశాల డైరెక్టర్ ఉప్పల సుకుమార్‌బాబు మాట్లాడుతూ అర్బన్ సిఐ వీరానాయక్ చెప్పిన సూక్తులను పాటిస్తూ సమాజంలో మంచి విద్యార్థులుగా ఎదగాలన్నారు. విద్యార్థులు తమ భవిష్యత్తును ఇతర చెడు అలవాట్లకు అలవాటై నాశనం చేసుకోవద్దని సూచించారు. విద్యార్థులు లక్ష్యసాధనే ధ్యేయంగా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు మండలంలో బాబు షూరిటీ....మోసం గ్యారెంటీ

**పొన్నూరు, జులై 24,ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు వైకాపా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాబు షూరిటి...మోసం గ్యారెంటి కార్యక్రమాన్ని శుక్రవారం మండలంలోని కొన్ని గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు చింతలపూడి మురళీకృష్ణ తెలిపారు. సాయంత్రం 5.30గంటలకు జూపూడి, 6గంటలకు గోళ్ళమూడి పాడు, 6.30గంటలకు బ్రాహ్మణకోడూరు, 7గంటలకు వెల్లలూరు గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ బాధ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చింతలపూడి కోరారు.

## ఉప్పలపాడు జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు పంపిణీ

**ఫిరంగిపురం, జులై 24 ప్రభాతవార్త :** మండలంలోని ఉప్పలపాడు జెడ్పీ పాఠశాలలో కొత్తపల్లి రామకృష్ణ జ్ఞాపకార్థం వారి సతీమణి కోటేశ్వరమ్మ, కుమారులు శ్రీనివాసరావు, సురేష్‌లు రూ.5 వేలు విలువ చేసే స్టీల్ ప్లేట్లను



విద్యార్థులకు బహూకరించారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించి విద్యార్థులకు ప్లేట్లు ఎంతగానో ఉపయోగపడతాయని ఉపాధ్యాయులు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులు రామిరెడ్డి, వినోద్‌కుమార్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు ఏఏ మధుకుమార్, కె.వి.సుబ్బారెడ్డి, ఎన్.నాగేశ్వరరావు, సి.హెచ్.కోటేశ్వరరావు, కృష్ణ, ఆచార్యులు, సుధాకరరెడ్డి, రాజ్యలక్ష్మి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గుర్రం జాషువా వర్థంతి

నకరికల్లు, జులై 24 ప్రభాతవార్త : కవి కోకిల గుర్రం జాషువా వర్థంతి కార్యక్రమాన్ని గురువారం ఎమ్మార్పీయస్‌యస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గుంటూరు జిల్లా అధ్యక్షులు చింతిరాల మీరయ్య నాయకత్వంలో నిర్వహించారు. వ్యవస్థాపక అధ్యక్షులు సంజయ్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం జరిగిందని మీరయ్య తెలియజేశారు. ఆధునిక తెలుగు కవికోకిలగా, కవి చక్రవర్తిగా ఆయన అనేక బిరుదులు పొందారని తెలిపారు. ఎన్నో అవమానాలు ఎదురైనా కవిత్వాన్ని ఆయుధంగా చేసుకొని వారు ఎదిగారని, నేటియువతకు ఆయన ఆదర్శమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పరువయ్య, అనీల్‌కుమార్, సుధాకర్, ప్రశాంతి పాల్గొన్నారు.

# రెవిన్యూ శాఖ నిర్వహించే వివిధ అంశాలు,పనితీరును వేగవంతం చేయాలి

**బాపట్ల,జులై24,ప్రభాతవార్త:** రెవిన్యూ శాఖ నిర్వహించే వివిధ అంశాలు,పనితీరును వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అధికారులకు అదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో రెవెన్యూ శాఖ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకంకు సంబంధించి ఆధార వెరిఫికేషన్లను పూర్తి చేయాలని అదికారులకు సూచించారు. అన్నదాత సుఖీభవ కు సంబంధించిన ఆధార్ వెరిఫికేషన్, జాయింట్ ఎల్పిఎం సమస్యలు, వెబ్ లాండ్ లో మార్పులు చేర్పులను ఈనెల 25వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. రైతుల వద్ద నుంచి నీటి తీరువా వసూలు చేయుటకు చర్యలు తీసుకోవాలని ఆయన రెవిన్యూ అధికారులను ఆదేశించారు. ఇండ్ల స్థలాల కొరకు దరఖాస్తు చేసుకున్న వారి యొక్క దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని జిల్లా కలెక్టర్ రెవిన్యూ డివిజన్ అధికారులకు సూచించారు. ఆన్లైన్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులను గుర్తించాలన్నారు. ఇళ్ల స్థలాలకు వచ్చిన దరఖాస్తుల్లో ఎంతమందికి భూమి అందజేయగలరో,లేదో తగు వివరములను అందజేయాలని జిల్లా కలెక్టర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూముల్లో అనధికార కట్టడాల క్రమబద్ధీకరణకు వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హత మేరకు వాటిని క్రమబద్ధీకరణ చేయుటకు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆయన ఆదేశించారు.ప్రతి గ్రామంలో స్మశానవాటికల కొరకు స్థలాలను గుర్తించాలని, ప్రభుత్వ భూములు అందుబాటులో లేనియెడల ప్రైవేటు భూములను గుర్తించి, వాటికి చెల్లించే ధరలను నిర్ణయించి, ప్రతిపాదనలను అందజేయాలన్నారు. .ఏ ఒక్క గ్రామంలో కానీ, కాలనీలో



కానీ స్మశాన వాటికలు లేవనే ఫిర్యాదులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ పి టి ఎస్ యాప్ కు సంబంధించి తాసిల్దార్లకు ఎంపీడీవోలకు లాగిన్లు ఇవ్వడం జరిగిందని అందులో కార్యాలయంలో జరిగే ప్రతి ఉత్తర ప్రత్యుత్తరములను, మంజూరు చేసిన ఉత్తర్వులు, ఎల్డిస్ చేయబడిన ఫైల్స్ ను ఆన్లైన్లో అప్లోడ్ చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రతిరోజు రెవెన్యూ అంశాలపై రెవెన్యూ డివిజనల్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి రెవెన్యూ పనుల పురోగతిని పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ గంగాధర్ గౌడ్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి కనకరాజు, సిపిఓ షాలేమ్ రాజు, సర్వ శిక్ష అభియాన్ అధికారి నాగిరెడ్డి,బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి గ్లోరియా, చీరాల రెవెన్యూ డివిజన్ అధికారి చంద్రశేఖర్, రేపల్లె రెవెన్యూ డివిజన్ అధికారి రామలక్ష్మి,డిప్యూటీ కలెక్టర్ లవన్న, మండల తాసిల్దారులు పాల్గొన్నారు.

## రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

**మంగళగిరి, జులై 24, ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం రైతులకు ఎల్లవేళలా అండగా ఉంటుందని మంగళగిరి మార్కెట్ యార్డ్ ఛైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ తెలిపారు.పెదవడ్లపూడి గ్రామంలోని చైతన్య నగరంలో గల జ్ఞాన సాయిబాబా మందిరంలో బాబా కమిటీ ఆధ్వర్యంలో జవ్వాదిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని



నిర్వహించారు. జవ్వాది కిరణ్ చంద్ సత్కరించి, సన్మానం చేసిన బాబా కమిటీ సభ్యులందరికీ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం జవ్వాది కిరణ్ చంద్ మాట్లాడుతూ రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతులకు వ్యవసాయ సబ్సిడీ రుణాలు అందించడంలో అందిస్తుందని అన్నారు. అదేవిధంగా వ్యవసాయదారులకు వ్యవసాయ పరికరాలను అందిస్తూ రైతులకు అన్నదాతా సుఖీభవ పథకం, రైతులకు అనేక పథకాల ద్వారా కూటమి ప్రభుత్వం రైతులకు మరింత చేరువైందని చెప్పారు. మంగళగిరి వ్యవసాయ మార్కెట్ రైతులకు ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. రైతులకు వ్యవసాయానికి అవసరమైన ఎరువులఇచ్చేందుకు మందులు సబ్సిడీపై ఇచ్చేందుకు నా వంతు కృషి చేస్తానన్నారు. అదేవిధంగా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు వచ్చేంతవరకు మార్కెట్ యార్డు గోడౌన్లో రైతులు నిల్వ చేసుకోవచ్చని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు...

## అసమానతలు లేని సమాజం కోసం కృషి చేయడమే జాషువాకు నిజమైన నివాళి

**మంగళగిరి, జులై 24 ప్రభాతవార్త :** అసమానతలు లేని సమాజం కోసం కృషి చేయడమే గుర్రం జాషువాకు నిజమైన నివాళి అని జాషువా సాంస్కృతిక వేదిక విజయవాడ కార్యదర్శి జి నారాయణ అన్నారు. గురువారం మంగళగిరి పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జాషువా సాంస్కృతిక వేదిక విజయవాడ, మంగళగిరి పట్టణంలో గల ఎస్ఎల్ఎం చైతన్య హై స్కూల్ ఆధ్వర్యంలో గుర్రం జాషువా 54 వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి జాషువా సాంస్కృతిక వేదిక సభ్యులు పి ఐజాక్ న్యూటన్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర నాటక కళాపరిషత్ అధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరావు, ఎస్ ఎల్ ఎం చైతన్య హై స్కూల్ డైరెక్టర్ ఎస్ బాలకృష్ణ, ప్రిన్సిపల్ ఎస్ సాయి చందు, సిఐటియు నాయకులు జె వి రాఘవులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## బిసీల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

### పంచుమర్తి అనురాధ

**తాడేపల్లి,జులై 24,ప్రభాతవార్త :** బిసీల సంక్షేమమే తెలుగుదేశం పార్టీ లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందని శాసనమండలిలో చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ అన్నారు.సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంగళగిరి 8వ వార్డు డాక్టర్ ఆంజనేయకాలనీలో ఇంటింటికి



తిరుగుతూ కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు.2025-26వార్షిక బడ్జెట్‌లో బిసి సంక్షేమం కోసం రూ.47,456కోట్లు కేటాయించడం జరిగిందని నామినేట్ పోస్టుల్లో కూడా 34శాతం రిజర్వేషన్,చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్ అమలుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు పడవల మహేష్,తెలుగుదేశం పార్టీ బిసిసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు,రాష్ట్రస్థాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మున్నంగి శివ శేషగిరిరావు,పట్టణ పార్టీ ఉపాధ్యక్షురాలు వాసా పద్మావతి,పట్టణ కార్యదర్శి షేక్ రియాజ్,8వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్ష,కార్యదర్శులు అలుగూరి రాజశేఖర్,జొన్నాదుల నాగమల్లేశ్వరరావు,మాజీ మున్సిపల్ కౌన్సిలర్ వంగర లక్ష్మయ్య,గోవాడ దుర్గారావు,పట్టణ నాయకులు తిరుమలశెట్టి హనుమంతరావు,ఆకురాతి నాగేంద్రం,గోలి బాబురావు,బండారు సీతారామయ్య,అక్కల హరిబాబు,గొర్తి వెంకటయ్య,కాటాబత్తుల లలిత,గుత్తికొండ విజయకుమారి, మాధవి,ఆకురాతి కవిత తదితరులు పాల్గొన్నారు.

## కూటమి సర్కార్ వైఫల్యాలను ప్రజలు గుర్తించాలి

### -వైకాపా సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

**చేబ్రోలు (పొన్నూరు), జులై 24,ప్రభాతవార్త:** కూటమి సర్కార్



వైఫల్యాలను ప్రజలందరూ గుర్తించాలని వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పిలుపునిచ్చారు. చేబ్రోలు మండల పరిధిలోని శ్రీరంగపురం, తోట్లపాలెం, మంచాల, కొత్తరెడ్డిపాలెం, సీతాలమ్మ సెంటర్ వద్ద జరిగిన బాబు షూరిటీ...మోసం గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ కూటమి నాయకులు ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలను ఇచ్చి, అధికారంలోకి వచ్చి సంవత్సరం అయినా వాటిని అమలు చేయకుండా ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. అమలు చేసిన తల్లికివందనం, ఉచిత గ్యాస్ కూడా అర్హులకు ఇంకా అందలేదన్నారు. కొద్ది మందికి మాత్రమే అందజేసి మేము అన్నీ హామీలను అమలు చేశామని, ఇది మంచి ప్రభుత్వమని టిడిపి నాయకులు ప్రచారం చేసుకొంటున్నారన్నారు. ప్రజలు అందరూ ఎవరెవరికి ఏయే పథకాలు వచ్చాయో....గతంలో వచ్చిన పథకాతో బేరీజు వేసుకొని కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. ఇచ్చిన అన్నీ హామీలను నెరవేర్చే ఘనత, సత్తా ఒక్క మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డికే ఉందన్నారు. జగనన్న సుపరిపాలన అందించారన్నారు. జగన్మోహనరెడ్డి అధికారాన్నిచేపట్టాక రెండు సంవత్సరాలు కరోనా వచ్చినా పథకాలకు ఎక్కడా అంతరాయం లేకుండా అన్ని నెరవేర్చారన్నారు. ప్రకటించిన హామీలలో 99శాతం అమలు చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రజలు గుర్తించి రానున్న 2029లో జగన్మోహనరెడ్డి ప్రభుత్వాన్ని తెచ్చేవిధంగా ఆలోచన చేయాలన్నారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఆళ్ళ శ్రీరామ్‌రెడ్డి, నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు కొక్కిలిగడ్డ కిరణ్, నియోజకవర్గ అంగన్‌వాడీ అధ్యక్షురాలు జ్యోతి, గ్రామ పార్టీ అధ్యక్షుడు భాస్కరరావు,పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## డ్రైన్లు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి

**గుంటూరు తూర్పు, జులై 24 (ప్రభాతవార్త) :** శివారు ప్రాంతాల్లో అవుట్‌పాల్ డ్రైన్లు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, అంతర్గత డ్రైన్‌లు డ్రైన్లలో కిలిసే ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మెష్‌ల వద్ద నిలిచే వ్యర్థాలను తొలగిచాలని నగర కమీషనర్ పులి శ్రీనివాసులు ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. గురువారం కమీషనర్ గోరంట్ల, రెడ్డిపాలెం, సరస్వతి నగర్, జయంతి నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి, పారిశుద్ధ్య పనులను పరిశీలించి



తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ల వారీగా తమ పరిధిలో డ్రైన్ల శుభ్రంపై దృష్టి సారించాలన్నారు. ప్రజారోగ్య కార్మికులు తప్పని సరిగా మధ్యాహ్నం సమయంలో అంతర్గత డ్రైన్ల శుభ్రం చేయాలని ఆదేశించారు. వార్డ్‌ల వారీగా ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి స్థలాలు శుభ్రం చేసుకోవాలని నోటీసులు ఇవ్వాలన్నారు. స్పందించని వారి స్థలాల్లో జీఎంసి బోర్డ్‌లను ఏర్పాటు చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులను ఆదేశించారు. ప్రజల నుండి అందే ఫిర్యాదులను ప్రాధాన్యతగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయం పరిధిలో స్థానిక సమస్యల పరిష్కారంకు కార్యదర్శులు బాధ్యతగా ఉండాలన్నారు. ఆయన వెంట ఎస్ఎస్ ఐజాక్, టిపిఎస్ లక్ష్మణస్వామి, ఇంజనీరింగ్, ప్రజారోగ్య పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాయల కార్యదర్శులు పాల్గొన్నారు.

## మహంకాళి అమ్మవారి ఆలయానికి విరాళం అందజేత

**నకరికల్లు, జులై 24 ప్రభాతవార్త :** మండలంలోని ఇస్సపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయ పునర్ నిర్మాణ పనులకు దాతలు విరాళం అందజేశారు. వివరాలను ఈవో నలబోతు మాధవిదేవి గురువారం తెలియజేశారు. షిర్డిసాయి అన్నపూర్ణ కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని తెలియజేశారు. అమ్మవారి దేవస్థానంలో ప్రతి అమావాస్య రోజున అన్నప్రసాదం సమర్పించే దాతలు అందరూ కలిసి నూతన ఆలయ నిర్మాణ పనుల కోసం రూ.1.25 లక్షలు అందజేశారని తెలిపారు. దాతలు సమర్పించే కానుకలకు సమర్పించి ప్రభుత్వం ఆదాయపు పన్ను మినహాయింపును ఇస్తుందని ఈవో మాధవిదేవి తెలియజేశారు.

## ఆలయంలో ఎమ్మెల్యేచదలవాడ ప్రత్యేక పూజలు

**నకరికల్లు, జులై 24 ప్రభాతవార్త :** ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు గురువారం పట్టణంలోని ఆలయాలను సందర్శించారు. పాతూరు శివాలయంలో ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు ప్రత్యేక కార్యక్రమం లో పాల్గొన్నారు. దేవాలయ అర్చకులు, కమిటీ సభ్యులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న యాగం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ పాల్గొన్నారు.



అదే విధంగా స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబుకు స్వామివారి శేషవస్త్రాని, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

# 17వ వార్డులో "బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ"

తాడేపల్లి,జులై 24,ప్రభాతవార్త : పట్టణంలోని 17వ వార్డు ఆర్‌సిఎం చర్చ్ పక్కవీధిలో "బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ" కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంగళగిరి నియోజవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి,తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలసోమిరెడ్డి విచ్చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి సంవత్సరకాలం గడిచినా వాటిని అమలు చేయకుండా ప్రజలను ఎలా మోసం చేస్తున్నారు.ఎన్నికలకు ముందు అధికారం కోసం దొంగ హామీలిచ్చి ఇప్పుడు ఆ హామీలు అడిగే వారి మీద ఎలా కక్షపూరిత రాజకీయాలు చేసి కేసులు పెడుతున్నారు,బాబు చెప్పిన సూపర్ సిక్స్ హామీల ద్వారా ప్రజలకు రావలసిన సంక్షేమాలు ఈ సంవత్సర కాలంలో ఎంత మోసపోయారన్నది వివరించారు.అలాగే పార్టీ బలోపేతం కోసం వార్డు కమిటీలు వేసి క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని ఆదేశించారు.కార్యక్రమంలో నియోజకవర్గ ఆర్టిఐ విభాగ అధ్యక్షులు ఉండ్రు కళ్యాణ్,పట్టణ సోషల్ మీడియా అధ్యక్షులు తొట్టెంపూడి వికాస్,ఉపాధ్యక్షులు వేలు ప్లల ఎలీషా,ప్రధాన కార్యదర్శులు చిన్నపోతుల దుర్గారావు,షేక్ సర్దార్,చిట్టిమల స్నేహసంధ్య,పట్టణ మహిళా అధ్యక్షురాలు దర్శి విజయశ్రీ,రాష్ట్ర జిల్లా నియోజకవర్గ పట్టణ వివిధ విభాగాల నాయకులు,కార్యకర్తలు,స్థానిక మహిళలు,ప్రజలు పాల్గొన్నారు.

# మడ అడవుల దినోత్సవాన్ని జయప్రదంగా నిర్వహించాలి

**బాపట్ల,జులై24,ప్రభాతవార్త:** మడ అడవుల దినోత్సవాన్ని జయప్రదంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. మడ అడవుల దినోత్సవం నిర్వహణపై మొక్కలు నాటే



ప్రాంతాలను జిల్లా కలెక్టర్ గురువారం పరిశీలించారు.దీనిలో బాగంగా తొలుత సూర్యలంక తీర ప్రాంతం, నగర వనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మడ అడవుల దినోత్సవానికి బాపట్ల సూర్యలంకకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయితీశాఖ మంత్రి కె పవన్ కళ్యాణ్ జిల్లాకు రానున్నారన్నారు,మడ అడవులు వృద్ధి చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని అందులో భాగంగా మొక్కలు నాటుతామన్నారు. సూర్యలంకలోని అటవిశాఖ కు చెందిన నగరవనం, సూర్యలంక తీర ప్రాంతంలోని అటవీ భూములను కలెక్టర్ పరిశీలించి మడ అడవులు పెరగడం ద్వారా ప్రకృతి విపత్తుల మంచి తీవ్రమైన నష్టం జరగకుండా అరికట్టగలమన్నారు. వాటి ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. మొక్కలు నాటడానికి బాపట్ల రానున్న రాష్ట్ర మంత్రి పర్యటనను జయప్రదం చేయాలని అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. ఆయన వెంట జిల్లా అటవీ శాఖ అధికారి వినోద్ కుమార్, డిపిఓ ప్రభాకర్ డ్వామా పిడి విజయలక్ష్మీ , బాపట్ల ఆర్డీవో గ్లోరియా,తహశీల్దార్ సలీమా, తదితరులు పాల్గొన్నారు.

# పునర్విభజన అనంతరమే మహిళా రిజర్వేషన్లను అమలు చెయ్యాలి : కేసన శంకరరావు

**మంగళగిరి, జూలై 24, ప్రభావతవార్త:** చట్టసభలలో 33 శాతం మహిళలకు రిజర్వేషన్ల తో,కేంద్ర ఎన్డీఏ కూటమి ప్రభుత్వం చేసిన చట్టానికి,బీసీ మహిళలకు సబ్ కోటానిస్తూ సవరణ చేసి మాత్రమే అమలు జరపాలని, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు కేంద్రాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మంగళగిరి రాష్ట్ర కార్యాలయంలో ఆ మేరకు పలువురు బీసీ నాయకులుమహిళా నేతలతో కలిసి మీడియా సమావేశంలో వారు విజ్ఞప్తి చేశారు. జాతీయస్థాయిలో జన గణన లో కులగణన జరిగి,ఆపై నియోజకవర్గాల పునర్విభజన చేసిన అనంతరమే మహిళా రిజర్వేషన్లను అమలు జరపాల్సి ఉన్నదన్నారు. మహిళా రిజర్వేషన్లను దేశంలోని అన్ని వర్గాల మహిళలతో కలిపి 33 శాతం ఇవ్వడం వలన,బలహీన వర్గాలకు చెందిన ఓబీసీ మహిళలకు అన్యాయం జరుగుతుందన్నారు. ఎందుకంటే విద్యా పరంగాసాంఘికంగాఆర్థికంగా వెనుకబడిన ఓబిసి మహిళలు, అగ్రకుల మహిళలతో పోటీపడి గెలవడం అసాధ్యం అన్నారు. బలమైన ఓసి మహిళలతో, బలహీన వర్గాల మహిళలు పోటీ పడలేరని పునరుద్ఘాటించారు. అందుకే ఓబిసి మహిళలకు సబ్




కోటానిస్తూ సవరణ చేసి మాత్రమే,మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ వెనుకబడిన తరగతుల మహిళలు ఉద్యమించాల్సి వచ్చిందని శంకరరావు తెలియజేశారు. ఇంకా ఈ సమావేశంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుమ్మర క్రాంతి కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, విజయవాడ నగర అధ్యక్షులు చెప్పాడ చందు, మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి, రాష్ట్ర యువజన నాయకులు కిరణ్, పలువురు బీసీ నాయకులుమహిళా నేతలు పాల్గొని, ఈనెల 28 న,విజయవాడలో జరుగు ఓ బి సి మహిళల రిలే నిరాహార దీక్షను జయప్రదం చేయాలని కోరారు.

# ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**తాడేపల్లి,జూలై 24,ప్రభాతవార్త :** అభివృద్ధి సంక్షేమం సుపరిపాలన ఏడాదికాలంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అందించారని,ఆయన పిలుపుమేరకు విద్య,ఐటి శాఖ మంత్రి,స్థానిక శాసనసభ్యులు నారా లోకేష్ ఆదేశాలతో మంగళగిరి పట్టణ 5,6వార్డుల పరిధిలో 159,,160,161,164 బూత్‌ల్లో ఇంటింటికీ పర్యటించి ప్రభుత్వం సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు అందజేస్తున్నారు.ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తు న్నాయన్నారు.ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు.ఉచిత గ్యాస్ సిలిండర్లు,ఫింఛన్,తల్లికి వందనం డబ్బులు వచ్చాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజా సంక్షేమ అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటి అమలు చేస్తు_న్నామని కూటమి ప్రభుత్వ అభివృద్ధిని చూసి వైసీపీ కి నిద్ర రాలేదని ఏదో రకంగా బురదజల్లే కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు.మెగా డీఎస్సీ పూర్తి చేశామని అదేవిధంగా అన్నా క్యాంటిన్ ద్వారా పేదల కడుపు నింపుతున్నామని,ఉచిత ఇసుక అందజేశామని,ఇంటిలో ఎంతమంది ఉంటే అంతమందికి తల్లికి వందనం పథకం అమలు చేస్తున్నామని తెలిపారు.త్వరలో మరిన్ని ఈ అభివృద్ధి కార్యక్రమాలు శ్రీకారం చుడతామన్నారు,త్వరలో రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తామని,ఆదేవిధంగా మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం కూడా కల్పిస్తామన్నారు.కార్యక్రమంలో కూటమి నాయకులు,క్లస్టర్ ఇన్‌చార్జి గోవాడ దుర్గారావు,యూనిట్ ఇన్‌చార్జి అన్నం నాగబాబు,బూత్ ఇన్‌చార్జిలు జొన్నాదుల వెంకట రమానాజనేయులు,గోసాల రాఘవ,తుపాకుల సాంబశివరావు, మాదాసి గురుప్రసాద్,నీలం వెంకటరమణ,తోట గౌరీశంకర్,తేలు అయ్యప్ప,సూరబోయిన సాయి తదితరులు,నాయకులు పాల్గొన్నారు.

# అభివృద్ధి కార్యక్రమాలకు కార్యకర్తలు తరలిరావాలి: ఎమ్మెల్యే జూలకంటి



**కారంపూడి, జూలై 24 ప్రభాతవార్త:** కారంపూడి మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు, ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న తొలి అడుగు కార్యక్రమానికి హాజరవుతున్న రాష్ట్ర మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి కార్యక్రమం విజయవంతం చేయాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని కారంపూడిలో రూ.15 లక్షలతో నిర్మించనున్న మాల కమ్యూనిటీ హాలు శంకుస్థాపన, ఒప్పిచర్ల గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన టీడీపీ ఓడియు రాజుల కమ్యూనిటీ హాలు, రూ.20 లక్షలతో నిర్మించనున్న ముస్లిం కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని పార్టీ నేతలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు.

# వైకాపా రాష్ట్రకార్యదర్శిని సత్కరించిన కారంపూడి పట్టణ అధ్యక్షులు

**కారంపూడి, జులై 24 ప్రభాతవార్త:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా సీనియర్ వైసీపీ నాయకులు యనమల మురళీధర్‌రెడ్డి నియామకం పట్ల కారంపూడి పట్టణ వైసీపీ అధ్యక్షులు బొమ్మిన అల్లయ్య హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం గురజాలలో మురళీధర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అల్లయ్య మాట్లాడుతూ మురళీధర్‌రెడ్డి వైసీపీ బలోపేతానికి ఎంతగానో కృషి చేశారని, గురజాల నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలలో ఆయన సముచిత స్థానం సంపాదించారన్నారు. వైసీపీ కార్యకర్తలకు మురళీధర్‌రెడ్డి సేవకుడిగా, జగనన్నకు సైనికుడిలా పనిచేశారన్నారు. పల్నాడు ప్రాంత వైసీపీలో మురళీధర్‌రెడ్డి మంచి గుర్తింపు పొందారని, అలాంటి వ్యక్తిని వైసీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమించడం పట్ల పల్నాడు ప్రజల తరఫున మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ ఉపాధ్యక్షులు గురజాల రామారావు, నాయకులు కొత్త కాశిరెడ్డి, చల్లా కృష్ణ, బాషా తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జాషువా వర్ధంతి

పిడుగురాళ్ల, జూలై 24 ప్రభాతవార్త: పట్టణంలోని లెనిన్ నగర్‌లో గల కార్డ్స్ స్కూల్‌లో నవయుగ కవి చక్రవర్తి, పద్మభూషన్ గుర్రం జాషువా 54వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాషువా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్డ్స్ సంస్థ డిప్యూటి డైరెక్టర్ తాళ్లూరి అమరనాథ్ మాట్లాడుతూ సమాజంలో అసమానతలు పోవాలని తన



కలాన్ని ఖడ్గంగా చేసుకొని అస్పృశ్యతపై పోరాటం చేసిన మహాకవి జాషువా అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం లత, దయామణి, తాళ్లూరి సురేష్ చందు తదితరులు పాల్గొన్నారు.

# మంగళగిరిని గుంతలు లేని రోడ్లుగా తీర్చిదిద్దటమే లక్ష్యం



**మంగళగిరి, జులై 24, ప్రభాతవార్త :** మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధి లో గుంతలు లేని రోడ్లుగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా పనిచేయడం జరుగుతుందని నగర పాలక సంస్థ కమిషనర్ అలీం బాష పేర్కొన్నారు మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధి లోని రోడ్లపై ఏర్పడిన గుంతలను రానున్న 100 రోజులలో అన్ని రోడ్లను మరమ్మత్తులు నిర్వహించేలా ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.ఐటి, విద్యాశాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే నారా లోకేష్ రోడ్ల మరోతులకు సంబంధించి ప్రత్యేక వాహనము తెప్పించి ప్రారంబించిన విషయం సంగతి తెలిసిందే. ప్రతి రోజు నగరం లో క్షేత్ర స్తాయి తనిఖీల లో భాగంగా నగర లో పలు ప్రాంతాలలో గుంతలు ఎక్కువగా ఏర్పడుట తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు.ఈ మేరకు రోడ్ల మరమ్మత్తులు నిర్వహించేందుకు చేపట్టామని తెలిపారు. వర్షాల వలన కొంత మేరకు ఆటంకం కలుగుతున్నప్పటికీ రానున్న వంద రోజుల్లో మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ ను గుంతలు లేని రోడ్లుగా తీర్చిదిద్దటమే లక్ష్యం గా ప్రత్యేక కార్యచరణ చేపట్టినట్లు ప్రకటించారు. మీ ప్రాంతాలలో గుంతలు, ఏవైనా పారిశుద్ధ్య సమస్యల పరిష్కారం కొరకు నగర పాలక సంస్థ వారు ఏర్పాటు చేసిన ప్రత్యేక కాల్ సెంటర్ (7093912653, 08645295192) నెంబర్లకు సమాచారం తెలిపిన యెడల తగు పరిష్కార చర్యలు చేపట్టడం జరుగుతుందని. తెలిపారు.

# విత్తన దుకాణాల్లో వ్యవసాయశాఖ అధికారుల తనిఖీలు




**మాచర్ల, జులై 24 ప్రభాతవార్త:** మాచర్ల పట్టణంలోని పురుగుమందుల దుకాణాలను వ్యవసాయశాఖ అధికారులు గురువారం తనిఖీ చేశారు. మాచర్ల వ్యవసాయ సహాయ సంచాలకులు ఏడీఏ వి.జగదీశ్వరంరెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వులకు లోబడి సరైన అనుమతులు పొందిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను మాత్రమే అమ్మాలన్నారు. రైతులకు ప్రతి అమ్మకానికి బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని తెలిపారు. రైతులు తీసుకున్న బిల్లులు సీజన్ పూర్తయ్యే వరకు భద్రపరచుకోవాలని సూచించారు. ఎవరైనా అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఎరువులు, గోదాములను తనిఖీ చేసిన ఏవో సంధ్యారాణి

**పిడుగురాళ్ల, జూలై 24 ప్రభాతవార్త:** మండలంలోని గుంటూరు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ఎరువులు, పీఏసీఎస్ గోదాములను గురువారం ఏవో సంధ్యారాణి తనిఖీ చేశ్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎరువులు కావాల్సి న రైతులు సొసైటీలలో గానీ పట్టణంలోని ప్రైవేటు ఎరువుల దుకాణాల నుంచి గానీ ఎరువులను పొందవచ్చన్నారు. వ్యాపారులు ఎవరైనా ఎరువులన కృత్రిమ కొరత సృష్టించినా లేదా అధిక ధరలకు విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలో యూరియా 520 టన్నులు, డీఏపీ 310 టన్నులు, కాంప్లెక్స్ 730 టన్నులు, పొటాష్ 107, ఎస్ఎస్‌పీ 67 టన్నులు, మొత్తం 1734 మెట్రిక్ టన్నులు ప్రభుత్వం ద్వారా అందుబాటులో ఉంచామన్నారు. నానో యూరియా, నానో డీఏపీని రైతులు అన్ని పంటలపై ఉపయోగించుకోవచ్చన్నారు. పంట పెరుగుదల నాణ్యమైన దిగుబడులకు సహాయ పడుతుందన్నారు. నేల, నీరు, వాయు కాలుష్యాన్ని తగ్గిస్తుందన్నారు. నానో యూరియాని నీటిలో కరిగే ఎరువులు, సాగరిక, కొన్ని రకాల పురుగు మందులతో కలిపి వినియోగించవచ్చన్నారు. నాణ్యమైన అధిక దిగుబడులకు సహాయ పడుతుందన్నారు. అర లీటరు డీఏపీ, యూరియా ఎకరా మోతాదు సరిపోతుందన్నారు.

# వార్డుల్లో ఎమ్మెల్సీ ఆలపాటి పర్యటన

**తెనాలి, జులై 24 (ప్రభాతవార్త) :** తెలుగుదేశం పార్టీ అందిస్తున్న సుపరిపాలనపై ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ గురువారం 28, 29వార్డుల్లో ఇంటింటికి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన



మాట్లాడుతూ తల్లికి వందనం, ఉచిత గ్యాస్ ఇతర సంక్షేమ పథకాలు పంపిణీ, వంటి కార్యక్రమాలు నిర్వహించామని, గత ప్రభుత్వం ప్రజలు భయపడి విధంగా ప్రజలను నష్టానికి గురి చేసిందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజనరీ నాయకుడని, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండే విధంగా పరిపాలన నడిపిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థానిక నాయకులు, రావి కృష్ణమోహన్, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# 3వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు

**సత్తెనపల్లి, జూలై 24 ప్రభాతవార్త :** పట్టణంలోని 3వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని గురువారం శాసనసభ్యులు



కన్నా లక్ష్మీనారాయణ నిర్వహించారు. అదే విధంగా రూ.16 లక్షల వ్యయంతో ఆధునీకరణ చేసిన వాకింగ్‌ట్రాక్‌ను ఆయన ప్రారంభించారు. దీంతో పాటు 3వ వార్డులో రూ.12.3 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించబోతున్న సి.సి.రోడ్లు, డ్రైన్లకు శంఖుస్థాపన చేశారు. ప్రజలకు పథకాలు అందుతున్నాయో లేదో అనేదానిపై అధికారులు దృష్టి పెట్టాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తెలియజేశారు. రానున్న నాలుగేళ్ళలో మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వివిధ హోదాలలో ఉన్న పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# గుర్రం జాషువాకు నివాళులర్పించిన ఎమ్మెల్యే కన్నా

**సత్తెనపల్లి, జూలై 24 ప్రభాతవార్త :** ప్రముఖ నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువతకు ఆయన ఆదర్శం



అని తెలిపారు. అంతటి గొప్ప కవి పల్నాడు జిల్లా వారు కావడం అందరికీ గర్వకారణం అన్నారు. వారి రచనలు సమాజ పురోభివృద్ధికి, సమానత్వానికి బాట చూపాయని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తెలియజేశారు.

# మండలంలో బాబు షూరిటీ - మోసం గ్యారంటీ

**రాజుపాలెం, జూలై 24 ప్రభాతవార్త :** మండలంలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని వైకాపా ఆధ్వర్యంలో గురువారం




నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి పాల్గొని బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ అని ప్రతి ఇంటికి బాండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బాబు షూరిటీతో ప్రజలను మోసం చేశారన్నారు. మహిళలకు ఉచిత బస్సు అని చెప్పి సంవత్సరం దాటినా నేటి వరకు ఆ ఊసే లేదన్నారు. అలాగే నిరుద్యోగులకు ప్రతి నెల రూ.3 వేలు ఇస్తానని చెప్పి వారిని మోసం చేశారన్నారు. అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని డాక్టర్ సుధీర్‌భార్గవ్‌రెడ్డి విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత వైకాపాకే దక్కుతుందన్నారు. వైకాపా కార్యకర్తలపై ఎన్ని కేసులు పెట్టినా భయపడే ప్రసక్తే లేదన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీత శ్రీనివాసరెడ్డి, వైకాపా మండల కన్వీనర్ ఏపూరి శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా వైకాపా ప్రధాన కార్యదర్శి మర్రి సుబ్బారెడ్డి, పల్నాడు జిల్లా వైకాపా సెక్రటరీ భాష, మండల ఎస్సీ సెల్ కన్వీనర్ సీతారాములు, వైకాపా కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# గృహ నిర్మాణాలను పరిశీలించిన అధికారులు

**మాచర్ల, జులై 24 ప్రభాతవార్త:** మాచర్ల పట్టణ పరిధిలోని లేఅవుట్స్‌లో జరుగుతున్న గృహనిర్మాణాలను హౌసింగ్‌శాఖ డీఈఈ బి.బాలాజీనాయక్ అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా బాలాజీనాయక్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులు ప్రభుత్వం అదనంగా ఇచ్చే 50 వేల రూపాయలను



వినియోగించుకొని తమ ఇళ్లు పూర్తి చేసుకోవాలన్నారు. అదేవిధంగా ఆప్షన్-3 ద్వారా ఇల్లు నిర్మించని కాంట్రాక్టర్‌లకు నోటీసులు ఇప్పటికే ఇచ్చామన్నారు. వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ ఎస్.మరియదాసు, వర్క్ ఇన్‌స్పెక్టర్ కిన్నెర తేజ, అలీ, మహేంద్రకుమార్, అమరయ్య, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# డాక్టర్ చల్లగుండ్ల శ్రీరామమూర్తి సేవలు మరువలేనివి

**గురజాల, జూలై 24 ప్రభాతవార్త:** డాక్టర్ చల్లగుండ్ల శ్రీరామమూర్తి సేవలు మరువలేనివని పలువురు కొనియాడారు. గురువారం పట్టణంలోని శ్రీషిర్డీసాయి సత్యసాయి మందిరంలో డాక్టర్ శ్రీరామమూర్తి ప్రథమ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ



కార్యక్రమంలో డాక్టర్ రామమూర్తి సతీమణి విజయలక్ష్మి, కోడలు డాక్టర్ మీనా, కమిటి సభ్యులు పాల్గొన్నారు.

# రోడ్ల నిర్మాణానికి పెద్దపీఠ

## గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్

**గుంటూరు తూర్పు, జులై 24 (ప్రభాతవార్త) :** రాష్ట్రంలో విజనరీ పాలన సాగుతోందని, ఇది ఏపీ భవిష్యత్తును అద్భుతంగా మార్చబోతోందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద నసీర్ అన్నారు. గురువారం గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని శారదా కాలనీ 16వ లైను నుంచి 21వ లైను మెయిన్ రోడ్డు నిర్మాణానికి మేయర్ కోవెలమూడి నానితో కలిసి ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ రూ.26లక్షలతో చేపట్టిన రోడ్డు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వంలో శారదాకాలనీలో అడుగుపెట్టాలంటే భయపడే పరిస్థితి ఉండేదన్నారు. రోడ్లు అధ్వానంగా మారి వాహనదారులు రావాలంటే చుక్కలు కనిపించేవని తెలిపారు. అలాంటి పరిస్థితుల నుంచి సుందరమైన రోడ్ల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం నిబద్ధతతో పని చేస్తోందని చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో కేవలం ఏడాది కాలంలోనే వందల



కోట్ల రూపాయలతో రోడ్లు, డ్రైయిన్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. వర్షాలు వస్తే ఇళ్ళు నీటి మునిగిపోయేవని, ఇప్పుడు డ్రైయిన్ల నిర్మాణం ద్వారా ఈ సమస్యకు పరిష్కారం చూపబోతున్నామని వెల్లడించారు. సీఎం చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో స్వరాంధ్ర సాధనే లక్ష్యంగా పని చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గుంటూరు నగర మేయర్ కోవెలమూడి నాని, మద్దిరాల మ్యాని, క్లస్టర్ ఇన్‌చార్జి మహంకాళి నరసింహారావు, గోళ్ళ ప్రభాకర్, కో క్లస్టర్ ఇన్‌చార్జి వంగర ఏడుకొండలు, డివిజన్ అధ్యక్షులు బాజీ, గిరి, రమణ, కేసాని ప్రసాద్, సుభాని, దేశబోయిన శ్రీనివాస్‌యాదవ్, రావూరి మోహన్‌కృష్ణ, కోట గోపాల్, కార్పోరేటర్ ముప్పవరపు భారతి, గుడిమెట్ల దయారత్నం, రాచకొండ లక్ష్మయ్య పాల్గొన్నారు.

# 31వ తేది లోగా డిస్ప్లే ఫీజు బకాయిలు మొత్తం చెల్లించాలి

**గుంటూరు తూర్పు, జులై 24 (ప్రభాతవార్త) :** నగరపాలక సంస్థ పరిధిలోని మీడియా డివైజ్ డిస్ప్లే బోర్డ్స్ నిర్వాహకులు ఈనెల 31వ తేది లోపు డిస్ప్లే ఫీజు బకాయిలు మొత్తం చెల్లించాలని, లేని పక్షంలో 1వ తేది నుండి తొలగిస్తామని నగర



కమీషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. గురువారం నగరపాలక సంస్థ ప్రధాన కాకార్యాలయంలోని కమీషనర్ ఛాంబర్‌లో మీడియా డివైజ్ డిస్ప్లే బోర్డ్స్ నిర్వాహకులతో ఫీజుల బకాయిలపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ తొలుత ఏజన్సీల వారీగా డిమాండ్, బకాయిల వివరాలు అడిగి తెలుసుకుని మాట్లాడుతూ ప్రకటనల బోర్డ్స్ ఏజన్సీల నిర్వాహకులు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతో పాటు గతంలోని బకాయిలు మొత్తం ఈ నెలాఖరులోపు చెల్లించాలన్నారు. వార్డ్ సచివాలయాల వారీగా ఫీజులు చెల్లించిన చెల్లించని వారి వివరాలతో ఈనెల 31సాయంత్రానికి సమగ్ర నివేదిక ఇవ్వాలని, పట్టణ ప్రణాళిక అధికారులు ఆదేశించామన్నారు. నివేదిక మేరకు బకాయిలు చెల్లించని బోర్డలను సమూలంగా తొలగిస్తా మన్నారు. సదరు బకాయిల వసూళ్ళకు చట్ట ప్రారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగరంలోని ఆగస్ట్ 1నుండి అనధికార లేదా బకాయిలు ఉన్న సంస్థల ప్రకటనల బోర్డ్‌లు, హోర్డింగ్స్ ఉండడానికి వీలు లేదని, పట్టణ ప్రణాళిక అధికారులు మీడియా డివైజ్ డిస్ప్లే బోర్డ్స్ బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కేటాయించిన విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే పట్టణ ప్రణాళిక కార్యదర్శులు, అధికారులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కమీషనర్ చల్లా ఓబులేసు, సిటి ప్లానర్ రాంబాబు, డిసిపి సూరజ్‌కుమార్, ఏసిపి రెహ్మాన్, మీడియా డివైజ్ డిస్ప్లే బోర్డ్స్ నిర్వాహకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# నవయుగ కవిచక్రవర్తి గుర్రం జాషువకు నివాళి

**తెనాలి, జులై 24 (ప్రభాతవార్త) :** గుర్రం జాషువా విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో నవయుగ కవిచక్రవర్తి గుర్రం జాషువ 54వ వర్ధంతిని



పురస్కరించుకుని గురువారం ఉదయం స్థానిక బస్టాండ్ వద్ద జాషువ చౌక్‌లో కల జాషువ విగ్రహానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పవర్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ సిజిఎం కొండమూది సుధీర్‌బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమాజాభివృద్ధికి దోహదపడాలనే స్ఫూర్తిని మహాకవి జాషువ తన కవితల ద్వారా కల్గించారని అన్నారు. భరతజాతి గర్వించదగిన విశ్వకవి గుర్రం జాషువ నవ సమాజానికి పునాది వేసిన కవీశ్వరుడు అని సుధీర్‌బాబు అన్నారు. తెనాలి మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ అత్తోట నాగవేణి మాట్లాడుతూ మానవతా విలువలు కలిగిన, సమాజహితాన్ని కోరే రచనలు చేసిన పద్మభూషణ్ జాషువ కారణజన్ముడని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో గుర్రం జాషువా విజ్ఞాన సమితి ప్రధాన కార్యదర్శి పినపాటి రవికుమార్, ఉపాధ్యక్షుడు వేజండ్ల రత్నం, కొండమూది రమేష్, పి.రాజేంద్రప్రసాద్, బాలసాహితీవేత్త షేక్ అబ్దుల్ హకీంజాని, న్యాయవాదులు ఇందుపల్లి రాజారాం, బి.ప్రసాద్, వేజండ్ల శ్రీనివాస్, ఏ.శ్రీనివాసరావు, ఆర్టీసి ప్రేమ్‌కుమార్, గరికపాటి సుబ్బారావు, సుద్దపల్లి వెంకయ్య, ఐనాల మల్లేశ్వరరావు, పాల్‌రాజ్, జయరావ్, విన్సెంట్‌కుమార్ అత్తోట వ్యామ్‌బాబు, కనపర్తి డేవిడ్, ఆర్ అండ్ బి.రాజు తదితరులు పాల్గొన్నారు.

# బ్రహ్మంగారి దేవాలయంలో శాఖాంబరి అమ్మవారి ఉత్సవాలు

**తెనాలి, జులై 24 (ప్రభాతవార్త) :** పట్టణంలోని గాంధీచౌక్‌లో గల శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి దేవాలయంలో గురువారం శాకాంబరి అమ్మవారి ఉత్సవాలు ఆలయ ఈవో హరి ప్రసాద్, అర్చకులు జంపని నాగభాస్కర్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో విశేషంగా అలక రించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో హరిప్రసాద్ మాట్లాడ



తూ ఆషాడ మాసం సందర్భంగా పాడి పంటలు పుష్కలంగా పండి, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, గోవిందమాంబ, అమ్మవారికి శాకాంబరీదేవి అమ్మవారి ఉత్సవాలు నిర్వహిస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు పెద్ద ఎత్తున భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

# ఇళ్ళల్లో మోటార్లు,పంపులు చోరికి పాల్పడుతున్న దొంగ అరెస్టు


**తెనాలి, రూరల్ జులై 24 (ప్రభాతవార్త) :** మండల గ్రామమైన సంగంజాగర్లమూడిలో జరిగిన వరుస పంపుసెట్లు మరియు మోటార్ల దొంగ అయిన చిట్టిబోయిన పవన్ గోపి అలియాస్ బాబు సన్నాఫ్ శ్రీనివాసరావు 25సంగంజాగర్లమూడి గ్రామానికి చెందిన అతనిని, తెనాలి తాలుకా పోలీసులు గురువారం అతని ఇంటి వద్ద అరెస్టు చేసి అతని వద్ద నుండి సంగమేశ్వరస్వామి టెంపుల్, రైతు భరోసా కేంద్రం, కమ్మ స్మశాన వాటిక, గౌడ స్మశానవాడిక మరియు ఇతర ప్రదేశాలలో గల పంపుసెట్ యొక్క హ్యాండిల్‌ను మరియు కొన్ని ప్రదేశాల్లోనే మోటార్లను దొంగతనం చేసిన కేసులో పోలీస్ స్టేషన్లో రెండు కేసులు నమోదు చేసి, అరెస్టు చేసి కొన్ని పంపు చెట్లు ఉన్న రికవరీ చేసి, కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ 14రోజులు రిమాండ్ విధించారు. అనంతరం ముద్దాయిని నర్సరావుపేట సబ్ జైలుకు తరలించారు.

# నేడే అవధూత అయోధ్యస్వామి 20వ ఆరాధన

**పెదకూరపాడు, జూలై 24 ప్రభాతవార్త :** మండలంలోని 75 తాళ్ళూరు గ్రామంలో ఈ నెల 25న అవధూత అయోధ్యస్వామి 20వ ఆరాధన మహోత్సవం సందర్భంగా గురువారం ఆధ్యాత్మిక గురువులచే ఓం సాయినాథ జై అయోధ్యస్వామి జై అంటూ ఏకాహం భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. 25వతేదీ ఉదయం గణపతి పూజతో ప్రారంభించి వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ తెల్లవారుజామున ఓం సాయినాథ జై అయోధ్యస్వామి జై తాళ్ళూరు పురవీధుల్లో డప్పు, మంగళ వాయిద్యాలతో నగర సంకీర్తన జరుగుతుందన్నారు. అనంతరం అనంతరం వేద బ్రాహ్మణులచే గణపతి పూజతో ప్రారంభించి అయోధ్యస్వామి విగ్రహానికి పంచామృత అభిషేకాలతో రుద్రాభిషేకాలతో భక్తులచే ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలు జరుగుతాయన్నారు. అదే విధంగా ఆధ్యాత్మిక గురువులు అయోధ్యస్వామి జీవిత చరిత్ర సత్సంగం విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం జరుగుతుందని ఆశ్రమం కమిటీ నిర్వాహకులు తాటి కోటేశ్వరమ్మ రామకృష్ణ తెలిపారు. ఈ అయోధ్యస్వామి ఆరాధన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

# పేద విద్యార్థినికి ఆర్థిక సహాయం

**సత్తెనపల్లి, జూలై 24 ప్రభాతవార్త :** పేద విద్యార్థినికి ప్రముఖ యోగా గురువు రమేష్ గురువారం రూ.25 వేలు ఆర్థిక సహాయంగా అందించారు. మండలంలోని వెన్నాదేవి జెడ్పీ పాఠశాలలో పదవ తరగతిలో కొసనదేవి శ్రీ సాహితీ 565 మార్కులతో ప్రథమస్థానం సాధించింది. అయితే సాహితీ తండ్రి వెంకటేశ్వరరావు 13 ఏళ్ళ క్రితం మృతిచెందారు. తల్లి లక్ష్మిసాయి కూలీ పనులు చేసుకుంటూ ఆడపిల్లలను చదివిస్తుంది. సాహితీ ఉన్నత విద్యాభ్యాసానికి తేళ్ళ వెంకటేశ్వరరావు సరస్వతీ శిశుమందిర్‌లో ఈ



సహాయాన్ని అందజేసినట్లు రమేష్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మారె ్కట్‌యార్డు మాజీ ఛైర్మన్ మాదంశెట్టి వేదాద్రి, డి.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# థాయ్, కంబోడియా మధ్య 'వార్'!



## గ్యాస్‌స్టేషన్లపై రాకెట్లతో దాడులు.. 12 మంది మృతి

### ఆగ్నేయాసియాలో పరిస్థితులు ఉద్రిక్తం

**బ్యాంకాక్, జూలై 24:** రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్- ఇరాన్, ఇజ్రాయెల్-హమాస్ తర్వాత ఇప్పుడు మరో రెండు ఆసియా దేశాలు యుద్ధం బారిన పడ్డాయి. థాయ్‌లాండ్, కంబోడియా దేశాలమధ్య చాలా యేళ్లుగా కొనసాగుతున్న సరిహద్దు వివాదం మళ్లీ తీవ్రమైంది. ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం.. రెండు దేశాల మధ్య సరిహద్దుల్లో కాల్పులు జరిగాయి. అదే సమయంలో థాయ్‌లాండ్ వైమానిక దళం కంబోడియాలోని రెండు సైనిక స్థావరాలపై దాడి చేసింది. ఈదాడుల్లో కంబోడియా సైనిక స్థానవరాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. కంబోడియా దాడిలో థాయ్‌లాండ్‌లోని ఒక గ్యాస్‌సేష్టన్ ధ్వంసమైంది. దీని తర్వాత అనేక మీడియా నివేదికలలో థాయ్‌లాండ్ కంబోడియాపై వైమానికదాడులు చేసిందనికూడావార్తలు వస్తున్నాయి. థాయ్‌లాండ్‌లోని గ్యాస్‌స్టేషన్‌పై కంబోడియా బిఎం-21 రాకెట్‌తో దాడిచేసింది. దీంతో బ్యాంకాక్‌లో కలకలంరేగింది. ప్రాణలు కాపాడుకోవడానికి సైనికులు అనేక చోట్ల నేలపై పడుకని ఉన్నారు. ఈ సమయంలో చాలా మంది ప్రజలు గాయపడినట్లు నివేదికలు వస్తున్నాయి. ఇప్పటి వరకు అందిన ధ్రువీకరించని నివేదిక ప్రకారం.. ఈ ఘర్షణల్లో 12 మంది మరణించారు. చాలా మంది పిల్లలు, సాధారణపౌరులు గాయపడ్డారు.

**అమెరికా తన పౌరుల కోసం అడ్వైజరీ జారీ**

థాయ్‌లాండ్, కంబోడియా దేశాలమధ్య యుద్ధం ప్రారంభమైన తర్వాత అమెరికా రాయబార కార్యాలయం తన పౌరుల కోసం భద్రతా అడ్వైజరీని జారీ చేసింది. థాయ్‌లాండ్‌లోని అమెరికా కాన్సులెట్ తన పౌరులకు ఈ నెల 24న థాయ్‌లాండ్, కంబోడియాలో రాకెట్, అర్టిలరీ గన్‌లతో దాడులు జరిగినట్లు సమాచారం అందిందని వెల్లడించింది. సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న అమెరికా పౌరులందరికీ ఆ ప్రాంతాన్ని వెంటనే ఖాళీ చేయాలని, థాయ్‌లాండ్ ప్రభుత్వ అడ్వైజరీని పాటించాలని సలహా ఇచ్చారు. కంబోడియా రక్షణ ప్రతినిధి జనరల్ మాలి సోచెటా మాట్లాడుతూ.. థాయ్ సైనికుల చొరబాటు తర్వాత తాము ప్రతీకార చర్యలు తీసుకున్నామని చెప్పారు. కంబోడియా ప్రధాని మాట్లాడుతూ.. థాయ్‌లాండ్ తమ ఓదార్ మీంచే, ప్రేయ విహార్ ప్రావిన్స్‌లలోని ఆలయాలు, సైనిక స్థావరాలపై దాడి చేసిందని అన్నారు. తాము ఎల్లప్పుడూ శాంతియుత పరిష్కారాన్నే కోరుకుంటున్నామని ఆయన అన్నారు. అసలు ఈ సరిహద్దు వివాదంతోనే థాయ్ ప్రధాని ఏకంగా పదవిని కోల్పోయారు. ఉభయ దేశాల మధ్య 508 మైళ్ల సరిహద్దు ఉంది. దీనిలో అత్యధిక భాగాన్ని ఫ్రాన్స్ పాలన కింద ఉన్నప్పుడే గుర్తించారు. ఇరు దేశాలు శాంతియుతంగా కలిసి ఉంటు టన్నప్పటికీ.. సరిహద్దులు మాత్రం తరచూ ఘర్షణలతోరగులుతున్నాయి. ముఖ్యంగా ప్రముఖ ఆలయాలు ఉన్న ప్రీహ్ విహార్, ట మోన్‌థోమ్, ట మ్యూన్ థోమ్ ఉన్న పర్వతాలు, అరణ్యాలు కలగలిసిన ప్రాంతాల కోసం ఈ పోరాటం జరుగుతోంది. వీటిల్లో 9వ శతాబ్దానికి చెందిన ప్రీహ్ విహార్ కీలకమైంది. దీనిని ఖెమర్ పాలకులు నిర్మించారు. డాంగ్రెక్ పర్వతాల శిఖరం థాయ్‌ల్యాండ్‌కు అత్యంత సమీపంలో ఉంటుంది. ఈ ఆలయం కంబోడియాకు చెందుతుందని 1962లో అంతర్జాతీయ న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. దానిని థాయ్‌ల్యాండ్ అంగీకరించింది. కానీ, ఆ దేవాలయం కేంద్రంగా స్థానిక సెంటిమెంట్లు తరచూ వివాదాలకు కారణమవుతున్నాయి.



# ముంబై పేలుళ్ల కేసుపై సుప్రీం స్టే!

### బాంబే హైకోర్టు తీర్పుపట్ల అభ్యంతరం

**న్యూఢిల్లీ,జూలై 24:** దాదాపు రెండు దశాబ్దాల క్రితం జరిగిన ముంబయి రైలు పేలుళ్ల కేసులో నిందితులుగా ఉన్న 12 మందిని నిర్దోషులుగా ప్రకటిస్తూ బాంబేహైకోర్టు ఇటీవలఇచ్చిన తీర్పుపై తాజాగా సుప్రీంకోర్టు స్టే విధించింది. అయితే హైకోర్టు ఆదేశాలతో జైలు నుంచి విడుదలైన నిందితులను మళ్లీ అరెస్టు చేయాల్సిన అవసరం లేదని అత్యున్నత న్యాయస్థానం గురువారం ఉదయం వెల్లడించింది. మహారాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పీల్‌పై తమ స్పందన కూడా తెలియజేయాలంటూ నిందితులకు నోటీసులు జారీ చేస్తూ ఆదేశించింది. 2006 జులై 11వ తేదీన ముంబయి పశ్చిమ రైల్వేలైన్‌లోని పలు సబర్బన్ రైళ్లలో ఒక్కసారిగా వరుసగా బాంబు పేలుళ్లు చోటు చేసుకున్నాయి. దీంతో యావత్ దేశమంతా ఉలికిపడింది. ఆ మారణహోమంలో 189 మంది అమాయక పౌరులు ప్రాణాలు విడిచారు. మరో 800 మందికి పైగా గాయాలపాలయ్యారు. అయితే ఆ ఘటనపై సుదీర్ఘ దర్యాప్తు అనంతరం 2015 అక్టోబరులో ప్రత్యేక కోర్టు, 12 మంది నిందితులను దోషులుగా తేల్చింది. రైళ్లలో బాంబు అమర్చారన్న అభియోగాలపై ఐదుగురికి మరణశిక్ష విధించింది. మిగతా ఏడుగురికి జీవితఖైదు విధిస్తూ అప్పట్లో తీర్పు వెలువరించింది.

అయితే దోషుల్లో కమాల్ అన్సారీ అనే వ్యక్తి 2021లో కొవిడ్ కారణంగా నాగ్‌పుర్ జైల్లోనే చనిపోయాడు. ఆ తర్వాత ప్రత్యేక కోర్టు ఇచ్చిన తీర్పుపై దోషులు బాంబే హైకోర్టును కొన్నాళ్ల క్రితం ఆశ్రయించారు. దీనిపై సుదీర్ఘంగా విచారణ జరిపి ఉన్నత న్యాయస్థానం, ఆ 12 మందిని ఇటీవల నిర్దోషులుగా తేల్చింది. వారిపై ఉన్న అభియోగాలను నిర్ధరించడంలో ప్రాసిక్యూషన్ ఘోరంగా విఫలమైందని పేర్కొంది. అదే సమయంలో ఘటనలో ఎలాంటి పేలుడు పదార్థాలు వాడారన్నది నిరూపించలేకపోయారని తెలిపింది. దీంతో వారిని విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఆ తర్వాత హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీల్ చేసింది. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్‌వీ అంజారియాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం, హైకోర్టు ఇచ్చిన తీర్పుపై తాజాగా స్టే విధించింది.



## లోయలో పడిన బస్సు

### ఏడుగురు మృతి, 20 మందికిపైగా గాయాలు

**సిమ్లా, జులై 24:** హిమాచల్‌ప్రదేశ్ మండీ జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. గురువారం ప్రమాదవశాత్తూ ఒక బస్సు లోయలో పడింది. ఈ దుర్ఘటనలో ఏడుగురు ప్రయాణికులు మృతిచెందగా పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు, జిల్లా ఉన్నతాధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన బస్సు మాండీ నుంచి సర్కాఘాట్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం సంభవించిందని పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో ఐదుగురు ప్రయాణికులు అక్కడికక్కడే మరణించారని మరో ఇద్దరు ఆసుపత్రిలో చికిత్సపొందుతూ చనిపోయారని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మండి జిల్లా ఎస్పీ సాక్షివర్మ వివరించారు. అయితే ఈ ప్రమాదానికి గల కారణాలు అన్వేషిస్తున్నామన్నారు. సుమారు 25 మీటర్ల లోతుకు బస్సు దూసుకెళ్లింది.

## భారతీయులను నియమించుకోవడం ఇక ఆపేయండి: ట్రంప్

**వాషింగ్టన్, జూలై 24:** గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి భారీ టెక్ కంపెనీలు భారతీయులను నియమించుకోవడం నిలిపివేసి అమెరికన్లపై ఫోకస్‌పెంచాలని అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ సందేశం పంపించారు. టెక్ కంపెనీల గ్లోబలిస్టు మైండ్‌సెట్‌ను ఆయన విమర్శించారు. దేశంలో లభించిన స్వేచ్ఛను వాడుకుని చాలా టెక్ కంపెనీలు ఇతర దేశాల్లో పెట్టుబడులు పెడుతున్నాయన్నారు. తనపాలనలో ఆరోజులు ముగుస్తాయని హెచ్చరించారు. చాలా భారీ టెక్‌కంపెనీలుచైనాలో కంపెనీలు నిర్మిస్తూ భారతీయ ఉద్యోగులను నియమించుకుంటూ ఐర్లాండ్‌ను అడ్డంపెట్టుకుని తక్కువ లాభాలు చూపిస్తూ స్వేచ్ఛను అనుభ వించాయని, ఇక్కడిప్రజల అవకాశాలను పట్టించుకోకపోవడం నిర్లక్ష్యంచేయడం వంటివి చేసారని ఇక నాపాలనలో ఆరోజులు ఉండవని, ఎఐ రేసులో విజయం సాధించాలంటే సిలికాన్ వ్యాలీలో సరికొత్త దేశభక్తి అవసరమని అన్నారు. ఇక్కడఉన్న టెక్నాలజీ కంపెనీలు మొత్తం అమెరికా కోసమే దేశానికే మొదటి ప్రాధాన్యం ఇస్తూ పనిచేయాలి. మీరూ అదిచేయాలి. అదేనేను కోరుతున్నానని ట్రంప్‌అన్నారు.

## నటుడు దర్శన్‌కు బెయిల్ మంజూరు

### న్యాయాధికారం దుర్వినియోగమైందని వ్యాఖ్యానించిన సుప్రీంకోర్టు!



**బెంగళూరు, జులై 24:** రేణుకాస్వామి హత్య కేసులో నిందితుడిగా ఉన్న కన్నడ నటుడు దర్శన్‌కు కర్ణాటక హైకోర్టు బెయిల్ మంజూరుచేయడంపై సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసింది. న్యాయాధికారం దుర్వినియోగం అయిందని వ్యాఖ్యానించింది. హైకోర్టుచేసిన తప్పునే తాముపునరావృతం చేయబోమని ఆగ్రహం వ్యక్తంచేసింది. దోషిగా లేక నిర్దోషిగా ప్రకటించేందుకు తాము ఎలాంటి తీర్పును ఇప్పుడే ఇవ్వబోమని ప్రధాన నిందితురాలు పవిత్రగౌడ తరఫు న్యాయవాదికి స్పష్టం చేసింది. అరెస్టుకు తగిన ఆధారాలు లేవని బెయిల్ ఇచ్చినప్పుడు తీర్పు కాపీలో హైకోర్టుపేర్కొన్న భాషపైనా విచారం వ్యక్తం చేసింది. 'ట్రయల్ కోర్టు ఇలాంటి పొరపాటు చేసిందంటే దానిని పరిగణనలోకి తీసుకోవచ్చు. కానీ ఒక హైకోర్టు న్యాయమూర్తి అలా చేయడం ఆమోదయోగ్యమైంది కాదు' అని అత్యున్నత న్యాయస్థానం తీవ్రంగా స్పందించింది. వారం క్రితం కూడా ఈ కేసుపై సుప్రీంలో విచారణ జరిగింది. 'వాస్తవంగా చెప్పాలంటే హైకోర్టు తన విచక్షణాధికారం ఉపయోగించిన తీరుతో మేం ఏకీభవించలేకపోతున్నాం. బెయిల్ రద్దు చేయాలని వాళ్లు కోరుతున్నారు. మీ క్లయింట్ బెయిల్‌పై ఉన్నందున మీ వాదన వింటాం. హైకోర్టు ఇచ్చిన తీర్పును మీరు చూసే ఉంటారు' అని దర్శన్ తరఫు న్యాయవాది కపిల్ సిబాల్‌ను ఉద్దేశిస్తూ జస్టిస్ పార్దీవాలా వ్యాఖ్యానించారు.

## ఆస్ట్రేలియాలో జాత్యహంకారుల వెర్రి చేష్టలు

### ఆలయంపై పిచ్చి రాతలు



**కాన్‌బెర్రా, జూలై 24:** ఆస్ట్రేలియాలో ఓ భారతీయ విద్యార్థిపై ఇటీవల దాడి చేసిన కొందరు దుండగులు జాత్యహంకార వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటన మరువకముందే ఆ దేశంలో మరో జాత్యహంకార ఘటన చోటుచేసుకుంది. మెల్‌బోర్న్‌లోని బోరోనియాలో ఓ హిందూ ఆలయంపై గుర్తుతెలియని వ్యక్తులు విద్వేషపూరిత వ్యాఖ్యలు రాశారు. స్వామినారాయణ్ ఆలయం వద్ద ఈ నెల 21న ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. ఆలయం గోడలపై హిట్లర్ చిత్రాన్ని ఉంచి, దానిపై 'గో హోమ్ బ్రౌన్..' అని రాశారు. ఇక, ఇదే ప్రాంతంలోని ఆసియన్లు నడిపే హోటళ్లపై కూడా ఇలాంటి విద్వేషపూరిత రాతలే రాసినట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. హిందూ కౌన్సిల్ ఆఫ్ ఆస్ట్రేలియా అధ్యక్షుడు మకరంద్ భగవత్ ఈ ఘటనను ధ్రువీకరిస్తూ ఓ ప్రకటనను విడుదల చేశారు. ఇది తమను దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. దేవాలయాలు శాంతి, భక్తి, ఐక్యతకు నిలయంగా ఉంటాయని, అలాంటి వాటిని లక్ష్యంగా చేసుకొని ఇలా జాత్యహంకార చేష్టలకు పాల్పడటం సరైనది కాదన్నారు.

విక్టోరియా ప్రీమియర్ జసింత్ అల్లన్ దీనిపైస్పందిస్తూ.. ఈచర్యను ఖండిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులకు లేఖ రాశారు. అందులో విద్వేషంతో కూడిన ఈ జాత్యహంకార ఘటన తనను కలిచివేసిందన్నారు. ఇది కేవలం విధ్వంసంమాత్రమే కాదని, ఉద్దేశపూర్వకంగా చేసిన ద్వేషపూరిత చర్య అని ఆమె పేర్కొన్నారు. ఇలాంటి దాడులకు విక్టోరియాలో చోటులేదన్న ఆమె.. జరిగిన ఘటనపై విచారణకు ఆదేశించారు. ఈ విషయాన్ని పోలీసులు తీవ్రంగా పరిగణించి కారకులపై చర్యలు తీసుకోవాలన్నారు. కాగా, ఈ ఘటనపై విచారణను ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

## ఎయిరిండియా ప్రమాదం తర్వాత 112 మంది పైలట్లు సిక్‌లీవ్

**న్యూఢిల్లీ,జూలై 24:** అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమాన ప్రమాదం జరిగిన అనంతరం ఆ సంస్థకు చెందిన 100 మందికి పైగా పైలట్లు సిక్‌లీవ్‌తీసుకున్నారని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటుకు తెలియజేసింది.

గత నెల 12న ప్రమాదం సంభవించిన తర్వాత ఎయిరిండియాలో సిక్ లీవ్‌ల సంఖ్య పెరిగినట్లు ప్రభుత్వం పేర్కొంది. నాలుగు రోజుల వ్యవధిలో సెలవులు తీసుకున్న వారి సంఖ్య 112కు చేరుకుందని వెల్లడించింది. సిక్‌లీవ్ తీసుకున్న వారిలో 51 మంది కెప్టెన్లు (పైలట్ ఇన్ కమాండ్), 61 మంది పైలట్లు (ఫస్ట్‌ఆఫీసర్లు) ఉన్నారని పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ లోక్‌సభకు తెలియజేశారు. 2023లో విమాన యాన సంస్థలకు జారీ చేసిన నోటీసుల గురించి కూడా ఆయన లోక్‌సభకు వివరించారు. సిబ్బందికి వైద్యపరీక్షలు నిర్వహించే సమ యంలో మానసిక ఆరోగ్యాన్ని త్వరితగతిన అంచనా వేయడానికి అవసరమైన పద్ధతులు ఉండాలని ఆ నోటీసులలో పేర్కొన్నట్లు తెలిపారు.

## ధన్‌ఖడ్‌కు వీడ్కోలు సత్కారంపై ఎన్డీయే మౌనం

### అధికారిక నివాసాన్ని ఖాళీచేయనున్న ఉపరాష్ట్రపతి



**న్యూఢిల్లీ,జూలై 24:** ఉపరాష్ట్రపతిపదవికి రాజీనామా చేసిన జగ్‌దీప్ ధన్‌ఖడ్‌కు ఘనంగా వీడ్కోలు పలకాలని కాంగ్రెస్ పార్టీ కోరగా, కేంద్రం స్పందించలేదని సమాచారం. గురువారం రాజ్యసభలో ఏడుగురు సభ్యులకు వీడ్కోలు కార్యక్రమం ఉంది. ఈ నేపథ్యంలో బిఎసి సమావేశంలో కాంగ్రెస్ సీనియర్‌నేత జైరాం రమేశ్ ధన్‌ఖడ్‌కు కూడా వీడ్కోలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అయితే దీనిపై కేంద్రం స్పందించలేదు. కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, జెపి నడ్డాకూడా ఈ అంశంపై ఏమీ మాట్లాడలేదని అధికార వర్గాలు తెలిపాయి. అదే సమయంలో జైరాం రమేశ్ డిమాండ్‌కు మిగిలిన ప్రతిపక్ష నేతల నుండి కూడా మద్దతు లభించలేదని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ధన్‌ఖడ్ రాజీనామాపై ప్రతిపక్షాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఇలాంటి సమయంలో జైరాం రమేశ్ డిమాండ్‌పై కేంద్రం స్పందించకపోవడం గమనార్హం. ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నట్లు ధన్‌ఖడ్ సోమవారం ప్రకటించారు. ఆయన హఠాత్‌నిర్ణయం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. వ్యక్తిగత కారణాలవల్ల తాను రాజీనామా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అయితే ధన్‌ఖడ్ రాజీనామా వెనుక ఏదో పెద్ద కారణమే ఉందని ప్రతిపక్షాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. ధన్‌ఖడ్ రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం ఆమోదించారు.

**అధికారనివాసం ఖాళీచేస్తున్న ధన్‌ఖడ్**

ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన జగ్‌దీప్ ధన్‌ఖడ్ త్వరలో తన అధికారిక నివాసాన్ని ఖాళీ చేసే యోచనలో ఉన్నారు. ధన్‌ఖడ్ రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు. ధన్‌ఖడ్ తన వస్తువులను ప్యాక్ చేసుకోవడం ప్రారంభించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్ సమీపంలోని చర్చి రోడ్డులో నూతనంగా నిర్మించిన వైస్ ప్రెసిడెంట్ ఎన్‌క్లేవ్‌కు ధన్‌ఖడ్ గత ఏడాది ఏప్రిల్‌లో మారారు. ఉప రాష్ట్రపతి అధికారిక నివాసం, కార్యాలయంగా ఉండే ఈ ఎన్‌క్లేవ్‌ను సెంట్రల్ విస్టా డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా నిర్మించారు. గత 15 నెలలుగా జగ్‌దీప్ ధన్‌ఖడ్ అక్కడే నివాసం ఉంటున్నారు. ధన్‌ఖడ్‌కు లుటియన్స్ ఢిల్లీలో టైప్ -8 లేదా మరో ప్రాంతంలో బంగ్లా ఇచ్చే అవకాశం ఉందని పురపాలక శాఖ అధికారులు చెబుతున్నారు.

## అనిల్ అంబాని కంపెనీల్లో ఇడి సోదాలు!




**ముంబయి,జూలై 24:** ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీని ప్రభుత్వరంగ బ్యాంక్ ఎస్‌బీఐ ఫ్రాడ్ అని ప్రకటించిన రెండు రోజుల్లోనే ఆయనకు సంబంధించిన కంపెనీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) సోదాలు చేపట్టింది. గురువారం ఢిల్లీ, ముంబయిలోని అనీల్ అంబానికి సంబంధించిన సంస్థల్లో ఇడి అధికారుల సోదాలు నిర్వహించారు. రూ.3 వేల కోట్ల రుణాలకు సంబంధించిన కేసులో అనీల్ అంబానీ కంపెనీల్లో పాటు ఎస్ బ్యాంకులోనూ సోదాలు చేపట్టింది. మనీలాండరింగ్ కేసులో భాగంగా 50 ప్రాంతాల్లో ఇడి సోదాలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఏకకాలంలోనే 35 ప్రదేశాల్లో ఇడి అధికారులు తనిఖీలు నిర్వహించారు. 25మందిని ప్రశ్నించారు. సిబిఐ నమోదు చేసిన రెండు ఎఫ్‌ఐఆర్‌లు, హౌసింగ్ బ్యాంక్, సెబీ, నేషనల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ అథారిటీ, బ్యాంక్ ఆఫ్ బరోడా సమర్పించిన నివేదికల ఆధారంగా సోదాలు నిర్వహించినట్లు ఇడి అధికారులు తెలిపారు. బ్యాంకులు వాటాదారులు, పెట్టుబడిదారులు, ఇతర ప్రభుత్వ సంస్థలను మోసం చేయడం ద్వారా ప్రజా ధనాన్ని మళ్లించడానికి చేసిన పథకం వేసినట్లు ఈడీ ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందని చెప్పారు. ఎస్ బ్యాంక్ ప్రమోటర్‌తోసహా బ్యాంకు అధికారులకు లంచాలు ఇవ్వడం వంటి విషయాలు కూడా పరిశీలనలో ఉన్నాయని పేర్కొన్నారు.

2017-19 మధ్య కాలంలో ఎస్ బ్యాంకు నుంచి అనధికారికంగా రూ.3వేల కోట్ల రుణాలను ఇతరత్రా మార్గాల్లో మళ్లించారని ఆరోపణలపై దర్యాప్తు కొనసాగుతోంది. రుణం మంజూరు చేయడానికి ముందు యాస్ బ్యాంక్ ప్రమోటర్లకు సంబంధిత సంస్థల్లో నిధులు బదిలీ అయి నట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు ఇడి వర్గాలు తెలిపాయి. అనిల్ అంబానీ సంస్థలకు ఎస్ బ్యాంక్ ఇచ్చిన రుణాల్లో క్రెడిట్ అప్రూవల్ మెమోరాండమ్‌లు పాతవి. ఎటువంటి ఆర్థిక విశ్లేషణ లేకుండా పెట్టుబడులు ప్రతిపాదించడం బ్యాంక్ క్రెడిట్ పాలసీని ఉల్లఘంటన వంటి విషయాలను ఈడీ గుర్తించింది. ఈ రుణాలను నిబంధనలను విరుద్ధంగా గ్రూప్ సంస్థలు, షెల్ కంపెనీలకు మళ్లించారని ఈడీ వర్గాలు పేర్కొన్నాయి. ఆర్థికంగా బలహీనంగా ఉన్న సంస్థలకు రుణాలు, వాటికి సరైన డాక్యుమెంటేషన్ లేకపోవడం, రుణ గ్రహీతలకి ఒకే చిరునామా, సాధారణ డైరెక్టర్లు, ప్రమోటర్ సంస్థలకు నేరుగా రుణాల మళ్లింపు, జీపీసీ రుణాలను ఎవర్ గ్రీనింగ్ చేయడం, ఒకే రోజున రుణం దరఖాస్తు, మంజూరు, రుణాల మంజూరుకు ముందే డబ్బులు విడుదల, ఆర్థిక వివరాలను తప్పుగా చూపించడం వంటివి ఉన్నాయి.

## బంగారం దుకాణంలో దొంగతనం.. పట్టిచ్చిన పావ్‌బాజీ

### కర్ణాటకలో ఘటన!



**బెంగళూరు, జులై 24:** ఒక్కోసారి చిన్న చిన్న పొరపాట్లే భారీ కుంభకోణాలను, దొంగతనాలను బయటపెడుతుంటాయి. కర్ణాటకలోని కలబురిగిలో ఇదే తరహా ఘటన చోటు చేసుకుంది. పావ్‌బాజీ తినాలన్న కోరిక దాదాపు రూ.2.15 కోట్ల దొంగతనాన్ని బయటపెట్టింది. జులై 11న జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలను పోలీసులు తాజాగా వెల్లడించారు. కలబురిగిలోని మారాతుల్లా మాలిక్‌కు చెందిన బంగారు దుకాణంలో పట్టపగలే నలుగురు వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ప్రధాన సూత్రధారి ఫరూక్ అహ్మద్ మాలిక్ దుకాణం బయట గమనిస్తుండగా మిగతా ముగ్గురూ మాస్కులు ధరించి లోపలికి వెళ్లి యజమాని కాళ్లు, చేతులు కట్టేసి తుపాకీతో బెదిరించి బలవంతంగా లాక్ ఓపెన్ చేయించారు. డబ్బు, బంగారంతో అక్కడినుంచి పరారయ్యారు. మారాతుల్లా మాలిక్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు, ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. దుకాణం ముందున్న సిసిటివి ఫుటేజీలను పరిశీలించగా లోపలి నుంచి వచ్చిన ముగ్గురు నిందితులు బయట ఉన్న ఫరూక్ అహ్మద్ దగ్గరికి వచ్చి ఏదో మాట్లాడారు. అక్కడి నుంచి నలుగురు కలిసి వెళ్లిపోయారు. కొంత దూరం వెళ్లిన ఫరూక్ మళ్లీ వెనక్కి వచ్చి ప్లేట్ పావ్‌బాజీ తిని దుకాణదారుకు రూ.30ఫోన్‌పే చేశాడు. అదే అతడిని పట్టించింది. ఆ లావాదేవీ ద్వారా ఫోన్ నెంబర్‌ను గుర్తించిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా దాదాపు 3 కిలోల బంగారం, కొంత నగదును దొంగిలించినట్లు అంగీకరించాడు. అయితే పోలీసులు మళ్లీ తన దుకాణంపైనే సోదాలు నిర్వహిస్తారేమోనన్న భయంతో కేవలం 805 గ్రాముల బంగారం, కొంత నగదు పోయినట్లు మారాతుల్లా ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు.

# సంక్షిప్తంగా..

## టాటాసన్స్ ఛైర్మన్ జీతం రూ.155.81 కోట్లు



**న్యూఢిల్లీ,జూలై 24:** టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ. 155.81 కోట్ల జీతం అందుకున్నారు. గతేడాదితో పోలిస్తే ఆ మొత్తం 15 శాతం పెరిగింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి చంద్రశేఖరన్ వేతనంగా రూ. 135 కోట్లు అందుకున్నారు. కంపెనీ వార్షిక రిపోర్టు ద్వారా ఈ విషయం బయటకు వచ్చింది. 2025 ఆర్థిక సంవత్సరంలో ఆయన వేతనం రూపంలో రూ. 15.1 కోట్లు, ఇతర కమీషన్, లాభాల్లో భాగంగా రూ. 140.7 కోట్లు ఆర్జించారు. ఇక, టాటా సన్స్‌లో చేస్తున్న ఇతర ఉద్యోగుల్లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సౌరభ్ అగర్వాల్ 2025 వార్షిక సంవత్సరంలో రూ. 32.7 కోట్లు జీతంగా పొందారు. గతేడాదితో పోలిస్తే ఇది 7.7 శాతం అధికం. రతన్ టాటా మృతి తర్వాత టాటా సన్స్‌లో చేరిన నోయల్ టాటాకు రూ. 1.42 కోట్ల కమీషన్ వచ్చింది.

## మరోసారి రూ. లక్షదాటిన బంగారం

**ముంబయి,జూలై 24:** బంగారం, వెండి ధరలు తిరిగి పెరిగాయి. పసిడి ధర మరోమారు రూ. 1 లక్ష మార్కును అధిగమించగా, కిలో వెండి ధర రూ. 1.15 లక్షలకు చేరి సరికొత్త గరిష్ఠస్థాయిని నమోదు చేసింది. అంతర్జాతీయ పరిస్థితులు, దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితి కారణంగా వీటి ధరలు పెరిగాయి. ఇండియన్ బులియన్ అండ్ జ్యువెల్లర్స్ అసోసియేషన్ విడుదల చేసిన సమాచారం ప్రకారం, 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.99,508 నుండి రూ.1,00,533కు పెరిగింది. 22 క్యారెట్ల బంగారం ధర కూడా గణనీయంగా పెరిగింది. నిన్న రూ.91,149గా ఉన్న పసిడి ధర ఈరోజు రూ. 92,088కి చేరుకుంది. 10 గ్రాముల 18 క్యారెట్ల పసిడి ధర రూ. 74,631 నుండి రూ. 75,400కు పెరిగింది.

## దక్షిణాఫ్రికాలో ఏనుగు దాడి, సిఇఒ మృతి!

**న్యూఢిల్లీ, జులై 24:** ఏనుగు దాడిలో ఒక సంపన్న సిఇఒ ప్రాణాలు కోల్పోయారు. ఆయన దక్షిణాఫ్రికాలో విలాసవంతమైన గోండ్వానా ప్రైవేట్ గేమ్ రిజర్వ్‌కు సహ యజమానిగా వ్యవహరిస్తున్నారు. ఏనుగును పక్కకు తోలుతుండగా ఈ ఘటన చోటుచేసుకుందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఆ గేమ్ రిజర్వ్ సిఇఒ పేరు ఎఫ్‌సి కాన్రాడీ(39). దక్షిణాఫ్రికా ఎకోటూరిజంలో ఆయన అందరికీ సుపరిచితులు. రోజులాగే కార్యకలాపాలు పరిశీలిస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. టూరిస్టు లాడ్జిలకు దూరంగా ఏనుగుల గుంపును తోలుతుండగా ఒకటి మాత్రం విపరీతంగా ప్రవర్తించింది. తన దంతాలతో నెట్టి, పలుమార్లు తొక్కిందని, పక్కనే ఉన్న రేంజర్లు కాన్రాడీని రక్షించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయిందని వెల్లడించారు.

## పాక్‌డ్రోన్లను కూల్చివేసిన సరిహద్దు భద్రతా దళం

**అమృత్‌సర్, జూలై 24:** పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు పాల్పడుతూనే ఉంది. తాజాగా పంజాబ్‌లోని అమృత్‌సర్ సమీపంలో భారత్-పాకిస్థాన్ సరిహద్దు గుండా ఆయుధాలు, మత్తు పదార్థాలను మన దేశంలోకి పంపించేందుకు కుట్ర పన్నింది. ఈ క్రమంలో పాకిస్థాన్ పంపించిన ఆరు డ్రోన్లను బిఎస్‌ఎఫ్ కూల్చివేసింది. ఈ ఘటనలో మూడు తుపాకులు, మ్యాగజీన్లతో పాటు ఒక కిలో హెరాయిన్‌ను స్వాధీనం చేసుకుంది. ఈ మేరకు బిఎస్‌ఎఫ్ అధికారులు మీడియాకు వివరాలు వెల్లడించారు. బుధవారం రాత్రి అనుమానాస్పద వస్తువులు భారత్ భూభాగంలోకి వస్తున్నట్లు గుర్తించిన బీఎస్‌ఎఫ్ సిబ్బంది అప్రమత్తమైంది. అవి పాక్‌కు చెందిన డ్రోన్లుగా గుర్తించి వెంటనే ప్రతిస్పందించి వాటిని కూల్చివేసింది.

## కుప్పకూలిన మరో చిన్న విమానం, ఇద్దరు మృతి

**రోమ్,జూలై 24:** ఇటలీ ఉత్తరప్రాంతంలోని ఎ21 కోర్డామోల్లే ఓస్పిటేల్ హైవేపై తేలికపాటి చిన్నవిమానం కుప్పకూలి మొత్తం దగ్ధం అయిపోయింది. గురువారం ఉదయం జరిగిన ఈప్రమాదంలో విమానంలో ఉన్న ఇద్దరూ కూడా స్పాట్‌లోనే చనిపోయారు. అయితే హైవేపై కూలిపోయి మంటలు వ్యాపించడం రోడ్డుపై ఉన్న ఇద్దరుడ్రైవర్లు కూడా తీవ్ర గాయాలపాలయ్యారు. గాలిలోనే ఈ విమానానికి మంటలు వ్యాపించినట్లు చెపుతున్నారు. విమానంలో ఉన్న ఇద్దరు సెర్గియో రవాగ్లియా(75), అన్నా మారియా డి స్టెఫానో(50) అని గుర్తించారు. ఈ ప్రమాదంలో హైవేపై రెండు వాహనాలు దగ్ధం అయ్యాయి. ఒక డ్రైవర్‌ను ఆసుపత్రిలోచేరిస్తే మరో డ్రైవర్‌కు స్పాట్‌లోనే చికిత్సను అందిస్తున్నారు.

25-7Pg6exHMNWJQE.qxd:25-7Pg6exHMNWJQE.qxd 01/01/01 9:53 AM Page 1




# ఆగస్టు 15 నాటికి 15 లక్షల బంగారు కుటుంబాల దత్తత పూర్తి చేయాలి: సిఎస్



స్వర్ణ ఆంధ్ర పి4 ఫౌండేషన్,సిటీ గ్యాస్ పంపిణీ నెట్ వర్కుకు సంబంధించిన అంశాలపై సీఎస్ సమీక్ష

**విజయవాడ,జూలై 24,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఆగస్టు 15 నాటికి 15 లక్షల బంగారు కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకునే విధంగా లక్ష్యాన్ని పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సిఎస్) కె.విజయానంద్ జిల్లా కలెక్టర్లు,సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.స్వర్ణ ఆంధ్ర పి4 ఫౌండేషన్,సిటీ గ్యాస్ పంపిణీ నెట్ వర్కుకు సంబంధించిన అంశాలపై గురువారం రాష్ట్ర సచివాలయం నుండి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్ణ ఆంధ్ర పి4 కార్యక్రమానికి సంబంధించి రాష్ట్రంలో ఆగస్టు 15 నాటికి 15లక్షల బంగారు కుటుంబాలను మార్గదర్శులు ద్వారా దత్తత చేసుకోవాలని లక్ష్యం కాగా ఇప్పటి వరకు 6 లక్షల 57వేల బంగారు కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకోవడం జరిగిందని అన్నారు.మిగతా లక్ష్యాన్ని కూడా త్వరిత గతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అదే విధంగా నీడ్ అసెస్మెంట్ సర్వేను ఆగస్టు 5వ తేదీ లోగా పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు.ఇప్పటికే బంగారు కుటుంబాలను,మార్గ దర్శకులను గుర్తించినందున మార్గదర్శులచే బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సిఎస్ విజయానంద్ కలెక్టర్లు ఆదేశించారు. రాష్ట్రంలో సుమారు 540 వరకు కీపెర్ఫార్మెన్స్ ఇండికేటర్లను గుర్తించి అన్ని శాఖలకు పంపడం జరిగిందని వాటి గురించి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి వాటి లక్ష్య సాధనకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను సిఎస్ విజయానంద్ ఆదేశించారు .రానున్న కలక్టర్ల సమావేశంలో కీపెర్ఫార్మెన్స్ ఇండికేటర్లపై ప్రత్యేకంగా చర్చించడం జరుగుతుందని కావున దీనిపై కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు.తదుపరి అనంతపురం, చిత్తూరు, కడప,సత్యసాయి, తిరుపతి జిల్లాల్లో సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్ వర్కుకు సంబంధించిన అంశాలపై సిఎస్ విజయానంద్ ఆయా జిల్లాల కలెక్టర్లు ఇతర అధికారులతో సమీక్షించారు. ఈసమావేశంలో రాష్ట్ర ప్రణాళికా మరియు ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పియూష్ కుమార్ మాట్లాడుతూ స్వర్ణ ఆంధ్ర పి4 ఫౌండేషన్ పై ఆగస్టు మొదటి వారంలో ముఖ్యమంత్రి సమీక్షించనున్నారని కావున బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియ లక్ష్యాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు.అదే విధంగా కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లకు సంబంధించి 540 ఇండికేటర్లను గుర్తించి అన్ని జిల్లాలకు వివరాలను తెలియజేయడం జరిగిందని చెప్పారు. ఆజాబితా సిపిఓల వద్ద ఉందని కావున వెంటనే సిపిఓ,జిల్లా అధికారులతో సమావేశమై జిల్లా అధికారులకు తెలియజేసి వాటి లక్ష్య సాధనకు కృషి చేయాలని చెప్పారు.

# ప్రతి ఒక్కరికి మేలు జరిగేలా కూటమి పాలన: మంత్రి టిజి భరత్



సుపరిపాలన తొలి అడుగు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో మంత్రి టిజి భరత్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

**జగ్గయ్యపేటపెనుగంచిప్రోలు, జూలై 24, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి మేలు జరిగేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వ పరిపాలన కొనసాగుతుందని ఏపి పరిశ్రమలు, కామర్స్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టిజి భరత్ అన్నారు. ఎన్టిఆర్ జిల్లా జగ్గయ్యపేట అసెంబ్లీ పరిధిలోని పెనుగంచిప్రోలు మండలం తోటచర్ల గ్రామంలో మండల, గ్రామ పార్టీ ఆధ్వర్యంలో జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) సారథ్యంలో గురువారం నిర్వహించిన సుపరిపాలన తొలి అడుగు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్ర మంలో మంత్రి భరత్ పాల్గొ న్నారు. ఎమ్మెల్యే రాజగోపాల్‌తో పాటు మంత్రి భరత్ గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంవత్సర కాలంలో చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ వాటికి సంబంధించిన కరపత్రాలు పంచిపెట్టారు. మంత్రి భరత్ విలేకరులతో మాట్లాడుతూ రైతులకు ఉచిత విద్యుత్, పెన్షన్ల పెంపు, మహిళల డ్వాక్రా రుణమాఫీ, యువతకు ఉద్యోగ-ఉపాధి అవకాశాలు కల్పించటం వంటి పలు అంశాల్లో ప్రభుత్వం ప్రగతిశీల నిర్ణయాలు తీసుకున్నదన్నారు. ఈ విషయాలను ప్రతి ఇంటికి వెళ్ళి తెలియజేయటమే ఈకార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ఎమ్మెల్యే రాజగోపాల్ మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతోనే సుపరిపాలన సాధ్యమవుతుందన్నారు. ప్రజల అభి ప్రాయాలను స్వీకరిస్తూ మరింత ప్రజానుకూల పాలనకు అంకితమవుతామన్నారు. కార్యక్రమంలో తోటచర్ల గ్రామ ప్రజలు చూపిన ఆదరణకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. కాగా పెనుగంచిప్రోలు మండల టిడిపి అధ్యక్షులు చింతల సీతారామయ్య, తోటచర్ల మాజీ సర్పంచ్ వేముల సైదేశ్వరరావు, పార్టీ నాయకులు వేముల వెంకటేశ్వరరావు, క్లస్టర్ చుంచు రమేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి భరత్‌ను ఎమ్మెల్యే రాజగోపాల్ జగ్గయ్యపేటలోని తన నివాసానికి ఆహ్వానించారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర కూడా పాల్గొన్నారు.

# దుర్గమ్మ ఆలయంలో ఆగస్టు 8 నుండి పవిత్రోత్సవాల సందర్భంగా ఆర్జిత సేవలు రద్దు - నేటినుండి శ్రావణమాసం ఉత్సవాలు

**ఇంద్రకీలాద్రి, జూలై 24, ప్రభాతవార్త** దుర్గమ్మవారికి శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం లో పనిచేస్తున్న ఉద్యోగులందరూ ఇఒ వికె శీనా నాయక్ నేతృత్వంలో గురువారం ఆషాడ మాసం సారె నందించారు. ఆలయ వైదిక బృందం రు.4,25,000లతో 40 గ్రాముల బంగారు హారాన్ని సారెతో పాటు అందించారు. వేదమంత్రాలు, మేళతాళాలు, మంత్రపఠనాలతో డోలు, సన్నాయిలతో శ్రీ అమ్మవారి కీర్తనలను పలికిస్తూ దుర్గమ్మవారికి ఆషాడమాసం చివరిరోజు సారెను అందించారు. కార్యక్రమంలో ఇఒ వికె శీనా నాయక్ ఇతర అధికారులు, వైదిక బృందం, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. - చివరిరోజు వెల్లువెత్తిన భక్తబృందాలు: ఆషాడమాసం చివరిరోజు అమావాస్య నాడు దుర్గమ్మవారికి సారెను అందించడానికి భక్తబృందాలు వెల్లువెత్తాయి. - నూతన యాగశాలలో చండీహోమములు ప్రారంభం: చండీహోమం, విఘ్నేశ్వర, సరస్వతి, తదితర హోమాది క్రతువులు దేవస్థానంలో శ్రీకృష్ణ, రాధల మూర్తులు వేంచేసియున్న ప్రాంతంలో నూతనంగా నిర్మాణమైన యాగశాలలో నిర్వహించడం వేదోక్తంగా గురువారం ప్రారంభించారు. - ఆగస్టు 8 నుండి పవిత్రోత్సవాలు: దుర్గమ్మవారి ఆలయంలో ఆగస్టు 8 నుండి 10 వరకు 3 రోజులపాటు పవిత్రోత్సవాలు నిర్వహిస్తామని ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆ మూడు రోజులు ఆర్జితసేవలు అన్ని రద్దు చేస్తున్నామన్నారు. -ఆగస్టు8న వరలక్ష్మి వ్రతం: దుర్గమ్మవారి ఆలయంలో ఆగస్టు8న వరలక్ష్మి వ్రతం ఏకాంతంగా నిర్వహిస్తామని ఇఒ తెలిపారు. ఈ సందర్భంగా దుర్గమ్మవారు వరలక్ష్మి వ్రతం సందర్భంగా వరలక్ష్మీదేవిగా భక్తులను అనుగ్రహిస్తారన్నారు. - 22న సామూహిక వరలక్ష్మి వ్రతాలు: ఆగస్టు 22న సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహిస్తామన్నారు. రు.1500 ఉభయంతో ఆర్జిత సేవగా ఉదయం 7 నుండి నిర్వహిస్తామన్నారు. ఉచితంగా వ్రతంలో పాల్గొనే భక్తులకు ఉదయం 10.30 నుండి 11 వరకు సామూహిక ఉచిత వరలక్ష్మి వ్రతాలు జరుగుతాయని భక్తులు పాల్గొని దుర్గమ్మవారి అనుగ్రహానికి పాత్రులవ్వాలన్నారు. పాల్గొనదలచిన భక్తులు ఆగస్టు 18 నుండి దరఖాస్తులు ఇస్తామన్నారు. - ఆగస్టు 16న శ్రీకృష్ణాష్టమి వేడుకలు: దుర్గమ్మవారి ఆలయంలో ఆగస్టు 16న శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తామని ఇఒ తెలిపారు.




దుర్గమ్మవారికి ఆషాడం సారెతో పాటు బంగారుహారం అందిస్తున్న దృశ్యం

# లిక్కర్ స్కాం లో సిట్ విచారణ కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుంది :ఎపి పిసిసి చీఫ్ షర్మిల

విజయవాడ, జూలై 24, ప్రభాతవార్త ప్రతినిధి: లిక్కర్ స్కాం లో సిట్ విచారణ కొండను తవ్వి ఎలకను పట్టినట్లుందని ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల వ్యాఖ్యానించారు. ఎంతసేపు డిస్టిలరీ ల చుట్టే విచారణ సాగుతుంది.. లిక్కర్ స్కాం వెనుక కమీషన్ల మాత్రమే చూపుతున్నారన్నారు. కానీ క్యాష్ రూపంలోనే లావాదేవీలు నిర్వహించి.. పన్నులు చెల్లించని మద్యాన్ని పెద్ద ఎత్తున అమ్మారని ఆరోపించారు. డెన్ లు ఉన్నాయని, కిక్ బ్యాగ్స్ అందాయని,నెలకు 50 నుంచి 60 కోట్లు ముడుపులు అందాయని అంటున్నారు.. లిక్కర్ స్కాం ఇంతకే పరిమితం కాదని స్పష్టం చేశారు. లిక్కర్ స్కాం లో 3500 కోట్లు మాత్రమే కాదున్నారు. డిస్టిలరిల దగ్గర నుంచి కన్స్యూమర్ వరకు మద్యం చేరడం మొత్తం కుంభకోణం మే .. లిక్కర్ స్కాంలో ప్రపంచంలో ఎక్కడ లేని అవినీతి జరిగిందని స్పష్టం చేశారు. డిజిటల్ పేమెంట్స్ లేకుండా ఓన్లీ క్యాష్ పద్ధతి ప్రపంచంలో ఆంధ్ర రాష్ట్రంలో మాత్రమేనని.. డిజిటల్ పేమెంట్స్ ఉండాలని చెప్పే ఈ యుగంలో కూడా ఓన్లీ క్యాష్ అనడం బహుశా ఎక్కడా జరగలేదన్నారు. ఓన్లీ క్యాష్ పద్ధతిలో మద్యం అమ్మకాలు చేసింది అనధికార అమ్మకాల కోసమేనని.. నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ ను భారీగా అమ్మారు అనధికార మద్యం అమ్మి వేల కోట్లు దోచేశారన్నారు. అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు లిక్కర్ స్కాం మీద శ్వేతపత్రం ఇచ్చారని.. లక్ష కోట్ల మద్యం అమ్మకాలు జరిగితే డిజిటల్ పేమెంట్స్ కేవలం 600 కోట్లు వచ్చాయన్నారు. 99 వేల కోట్లు ఎక్కడ పోయాయో తెలియదు అన్నారని. ఒక్క శాతం కూడా లిక్కర్ సొమ్ము ప్రభుత్వానికి రాలేదు అన్నారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి హోదాలో చేసిన ఆరోపణలో విచారణ జరపాల్సి ఉందని డిమాండ్ చేశారు. లక్ష కోట్ల లిక్కర్ స్కాం పై నిజాలు నిగ్గు తేల్చాలన్నారు. ద్రిశి హయంలో ట్రస్టెడ్ లిక్కర్ అమ్మలేదు.. హానికరమైన మద్యాన్ని అమ్మారు .. అటువంటి కంపెనీలకే అనుమతులు ఇచ్చారు.. రాష్ట్రంలో ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుకున్నారని మండిపడ్డారు.

రాష్ట్రంలో 30 లక్షల మందికి కిడ్నీ,లివర్ సమస్యలు వచ్చాయని కూటమి ప్రభుత్వం చెప్పింది. రాష్ట్రంలో హానికరమైన మద్యాన్ని తాగి 30 వేల మంది వరకు చనిపోయారని చెప్పారు. లక్షల మందికి నరాల బలహీనత సమస్యలు వచ్చాయని మీరు నియమించిన కమిటీలు రిపోర్ట్ ఇచ్చాయి. ఈ అంశంపై కూడా దర్యాప్తు జరగాలన్నారు.క్యాష్ పద్ధతిలో ఎందుకు అమ్మకాలు చేశారో విచారణ జరగాలి... ట్రస్టెడ్ కంపెనీ ల లిక్కర్ ను ఎందుకు నిషేధించారో విచారణ జరగాలి.

# బాలల హక్కులపై రాష్ట్ర స్థాయి సమీక్ష సమావేశం

## - అన్ని విభాగాల యాక్షన్ ప్లాన్ పునర్విచారణ

**తిరుపతి కలెక్టరేట్, జూలై 24 ప్రభాతవార్త :** రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సంఘం సభ్యురాలు ఎల్. పద్మావతి తిరుపతి జిల్లాలో పర్యటించి, 2025 జూలై 24న జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశం ప్రధాన ఉద్దేశ్యం జిల్లాలో బాల్య వివాహాల నివారణ, బాలల హక్కుల అమలు, చైల్డ్ రిలేటెడ్ యాక్ట్స్‌పై వివిధ శాఖల సమన్వయంతో సమీక్షించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించబడిన ఈ కార్యక్రమానకి జిల్లాలోని వివిధ విద్యా సంక్షేమ, ఆరోగ్య, పోలీస్, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణ, చట్టాల అమలు, అధికారుల సమన్వయంపై స్పష్టత కలిగించిందని, అన్ని శాఖల సమిష్టి చర్యలతోనే బాల్య వివాహాలు, బాల కార్మికులు, డ్రాప్ అవుట్స్ వంటి సమస్యలను ఎదుర్కోనగలమని అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్, సమగ్ర శిక్షణ అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ గౌరిశంకర్ రావు, ఆర్ఐవోలు, డీవీఈవోలు, ఎంఈఒలు, అన్ని యాజమాన్యాల పాఠశాలల హెచ్‌ఎంలు, కేజీబీవీ ప్రిన్సిపాల్స్, రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్స్‌లు, ఇతర లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు, ఎన్‌జీఓ ప్రతినిధులు పాల్గొన్నారు.

# మద్యం కుంభకోణం నిందితులకు రెడ్‌కార్నర్ నోటీసులు!

## యుఎఇ,థాయ్‌లాండ్‌లలో 8 మంది ఉన్నట్లు గుర్తింపు

**విజయవాడ,జులై 24,ప్రభాతవార్త** ప్రతినిధి విదేశాలలో ఉన్న మద్యం కుంభకోణం కేసు నిందితుల్ని భారత్‌కు రప్పించే చర్యలను సిట్ ప్రారంభించింది. ఇంటర్‌పోల్ ద్వారా వీరిపై త్వరలో రెడ్‌కార్నర్ నోటీసులు జారీ చేయించనుంది. కేసులో నిందితులు,అనుమానితులైన 8 మంది యూఏఈ(దుబాయ్)థాయ్‌లాండ్‌లలో ఉన్నట్లు సిట్ గుర్తించింది. వారిని ఎక్స్‌ట్రాడిషన్(నేరగాళ్ల అప్పగింత) లేదా డిపోర్టేషన్(ఆయా దేశాల నుంచి బహిష్కరణ)ద్వారా భారత్‌కు తీసుకురావాలని నిర్ణయించింది. ఇందుకు అవసరమైన సాయం, సమన్వయం కోసం తాజాగా మన విదేశాంగ శాఖకు లేఖ రాసింది.

# 14 నెలల పాలనలో ఒక్క వర్గానికైనా మేలు జరిగిందా?

## - ప్రభుత్వపథకాలు కనుమరుగయ్యాయి.. హామీలు తుడిచి పెట్టుకు పోయాయి: వైఎస్ఆర్ సిపి ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి

**విజయవాడ,జూలై24.ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజల సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం విస్మరించిందని వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ప్రజలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, వ్యాపారస్తులు అన్ని వర్గాల వారిని బాగోగుల కోసం కృషిచేయడం లేదన్నారు. అధికారం లోకి వచ్చి పధ్నాలుగు నెలలు పూర్తి అవుతున్నా ఎంత సేపూ రాజధాని నిర్మాణంతో అద్భుతాలు జరుగుతాయని భ్రమింపచేయడమని శ్రీకాంత్‌రెడ్డి మీడియాతో అన్నారు. లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు, లక్షల ఉద్యోగాలు వచ్చాయంటూ అసత్య ప్రచారాలను అవే వాస్తవాలుగా పత్రికలలో కనిపించే విధంగా చేస్తున్నారన్నారే తప్పితే క్రింది స్థాయిలలో ఏఒక్క వర్గానికి, ఏ ఒక్కరికీ మేలు జరిగినట్లుగా కన్పించడం లేదన్నారు.ప్రజల స్థితిగతులను పూర్తిగా మరచిపోయి, లేనివి వున్నట్లుగా భ్రమింప చేసేందుకు లిక్కర్ స్కామ్ అనో, అక్రమ కేసులు పెడుతూ ప్రజల ఆలోచనలను దారిమళ్లించడం తప్పితే ప్రజల కు మేలు చేయడం కోసం దృష్టి సారించడం లేదన్నారు. లా అండ్ ఆర్డర్ అదుపులో లేకుండా పోయిందన్నారు. పార్టీల పరంగా, వ్యక్తుల పరంగా పోలీసులకు ప్రభుత్వం ఆదేశాలిస్తూ ఏమర్జెన్సీ పాలనను తలపిస్తోందన్నారు. అంతకు ముందు 30 వేలమంది మహిళల గురించి మాట్లాడిన పవన్ కళ్యాణ్ ఇప్పుడు నోరు తెరవడం లేదన్నారు. రోజుకు అనేక సంఘటనలు జరుగుతున్నాయని, మహిళల ను దారుణాతి దారుణంగా అత్యాచారాలకు గురవుతున్నారని, ఏ ఒక్క కేసును ఛేదించలేకపోయారని, నంద్యాల జిల్లా ముచ్చుమర్రి సంఘటన అతీగతీ లేదని, మొన్న సమాజం భయపడేవిధంగా గండికోట సంఘటన ఇలా చెప్పుకుంటే పోతే ఎన్నో సంఘటనలు జరిగాయన్నారు. మహిళలు, బాలికలకు రక్షణ లేకుండా పోతోందన్నారు.

# ఘనంగా తెలంగాణ సాయుధ పోరాట యోధుడు వాసిరెడ్డి నాగేశ్వరరావు 66వ వర్ధంతి

**విజయవాడ,జూలై 4,ప్రభాతవార్త ప్రతినిధి:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు అమరుడు వాసిరెడ్డి నాగేశ్వరరావు 66వ వర్ధంతి కార్యక్రమాన్ని కొడవటికల్లులో గల ఆయన అమర స్థూపం వద్ద రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ముందుగా అమర స్థూపం వద్ద ఎర్రజెండాను రైతుకూలీ సంఘం ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షులు యం.రాంబాబు ఎగురవేసి జోహార్లు తెలిపారు. అనంతరం నాగేశ్వరరావు చిత్రపటానికి మేదరమెట్ల కోటయ్య,వై.నాగేశ్వరరావు,స్త్రీ విముక్తి సంఘటన నాయకురాలు కామేశ్వరీ మొదలగు వారు పూలదండలు పూలతో ఘనంగా నివాళులర్పించారు.జోహార్లు తెలిపారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం అధ్యక్షుడు రాంబాబు మాట్లాడుతూ ఈ దేశంలో దోపిడీ,పీడన,అణచివేతలు లేని ప్రజలంతా సమానంగా బ్రతికే సమసమాజం ఏర్పాటు కోసం ఎందరో మహనీయులు తమ ప్రాణాలను త్రుణప్రాయంగా అర్పించారని అన్నారు. దున్నేవానికి భూమిపై హక్కు ఉండాలని అనేక జమిందారీ,భూస్వామ్య కమ్యూనిస్టు పార్టీ సాధించిందని గుర్తు చేశారు.నేటి పాలకులు స్వాతంత్రోద్యమ స్ఫూర్తికి భిన్నంగా,రైతాంగ భూములను అంబానీ-అదానీలకు,కార్పొరేట్ సంస్థలకు లక్షలాది ఎకరాలను చట్టబద్ధంగా అప్పజెబుతూ రైతాంగాన్ని భూమి నుంచి దూరంగా గెంటివేసే చర్యలు తీసుకున్నారన్నారు. విజన్ 2047 నాటికి ఆ ప్రకారం 50 ఎకరాల లోపు ఉన్న రైతులనే వారిని లేకుండా చేయాలన్న నిర్ణయం తీసుకున్నారన్నారు. ఈ దశలో అమరులు చూపిన బాటలో పయనిస్తూ పాలకవర్గ ప్రభావాలకు లోనుకాకుండా సమస్త పీడిత ప్రజలతో రైతాంగం ఐక్యమై నూతన ప్రజాస్వామిక వ్యవర్ధ కోసం ఉద్యమించాలని ముగించారు.ఈ కార్యక్రమంలో రైతుకూలీ సంఘం జిల్లా నాయకులు వై.నాగేశ్వరరావు, ఎ.నాగమల్లేశ్వరి,యం.నర్సింహారావు,కామేశ్వరి తదితరులు నాయకత్వం వహించారు.

# రిలయన్స్ సిబిజి ప్లాంట్ల నిర్మాణం వేగవంతం చేయాలి: మంత్రి గొట్టిపాటి రవి కుమార్



**విజయవాడ.జూలై24,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేస్తున్న కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ప్లాంట్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యే విధంగా పనులను వేగవంతం చేయాలని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ రిలయన్స్ ప్రతినిధులను కోరారు. రిలయన్స్ గ్రీన్ ఎనర్జీలో భాగంగా సీబీజీ ప్లాంట్లు నిర్మాణాలు ప్రాజెక్టులకు స్థలాల కేటాయింపు తదితర అంశాలపై గురువారం సచివాలయంలో రిలయన్స్ సంస్థ ప్రతినిధులతో మంత్రి గొట్టిపాటి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లాను ఇంటిగ్రేటెడ్ సీబీజీ హబ్ గా అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. సీబీజీ ప్లాంట్లతో రైతులకు మెరుగైన కౌలు, యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి తెలిపారు. రిలయన్స్ గ్రీన్ ఎనర్జీ పెట్టుబడులు, ప్లాంట్ల నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. "ప్రకాశం జిల్లాలోని వాయుమడుగు, పీసీ పల్లి ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న ప్లాంట్లను 26 మార్చి 2026 నాటికి ప్రారంభించాలి. రిలయన్స్ సీబీజీ ప్లాంట్ల నిర్మాణంపై ప్రతీ 15 రోజులకు సమీక్ష నిర్వహిస్తాం. ప్లాంట్ల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్ష జరుగుతుంది. ఈ రెండు ప్లాంట్లు మాత్రమే కాకుండా జిల్లాలో మరిన్ని ప్లాంట్లు ఏర్పాటు చేసి ఉమ్మడి ప్రకాశం జిల్లాను సీబీజీ హబ్‌గా అభివృద్ధి చేస్తాం. నిరుపయోగంగా ఉన్న భూములకు వినియోగంలోకి తెస్తున్నాం. ప్రభుత్వ భూమికి ఎకరానికి రూ.15 వేలు, ప్రైవేట్ భూమికి రూ.31వేలు కౌలు చెల్లింపు జరుగుతుంది. ప్లాంట్ల ఏర్పాటు ద్వారా జిల్లాల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయి. తదుపరి దశలో నెల్లూరు జిల్లాలోని కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో కూడా ప్లాంట్లు ఏర్పాటవుతాయి" అని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ స్పష్టం చేశారు.

# రాష్ట్రంలో పెట్టుబడులకు ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల ఆసక్తి

## : మంత్రి కొలుసు పార్థసారధి

**విజయవాడ,జూలై24,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో పెట్టుబడులకు ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలు ఆసక్తి చూపుతున్నాయని సమాచార శాఖా మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. ఎలక్ట్రానిక్ పాలసీ ద్వారా పరిశ్రమలకు కేంద్రం, రాష్ట్రం నుంచి అనేక ప్రోత్సాహకాలు అందుతాయని పేర్కొన్నారు. విశాఖలో ఐటీ సేవల కోసం పలు కంపెనీలు ప్రతిపాదనలు ఇచ్చాయన్నారు. గురువారం ఏపీ పబ్లిసిటీ సెల్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ పెట్టుబడులకు గమ్యస్థానంగా ఏపీ నిలిచేలా పాలసీలకు ముఖ్యమంత్రి అధ్యక్షతన నేడు జరిగిన కేబినెట్ ఆమోదం తెలిపినట్లు మంత్రి పార్థసారథి పేర్కొన్నారు. ఏపీ ఎలక్ట్రానిక్స్ తయారీ పాలసీకి మంత్రిమండలి ఆమోద ముద్ర వేసినట్లు చెప్పారు. తద్వారా యూపీ, గుజరాత్, తమిళనాడు లబ్ధి పొందాయన్నారు.

# నోవా ఎయిర్‌తో శ్రీసిటీ ఒప్పందం

## పారిశ్రామికవాడలో నైట్రోజన్ గ్యాస్ పైపులైన్ ఏర్పాటు




శ్రీసిటీ పారిశ్రామికవాడలో నైట్రోజన్ గ్యాస్ పైపులైన్ ఏర్పాటు

**సత్యవేడు, జూలై 24 ప్రభాతవార్త:** పారిశ్రామిక కేంద్రంలో ప్రపంచ శ్రేణి మౌలిక సదుపాయాల కల్పనలో శ్రీసిటీ మరో ముందడుగు వేసింది. నైట్రోజన్ గ్యాస్ పైపులైన్ ఏర్పాటులో భాగంగా నోవా ఎయిర్ టెక్నాలజీస్ ప్రైవేటు లిమిటెడ్‌తో శ్రీసిటీ ఒప్పందం కుదుర్చుకుంది. దీని ద్వారా ఈ ప్రాంతంలోని తయారీ రంగ పరిశ్రమలకు స్థిరమైన, నాణ్యమైన నైట్రోజన్ గ్యాస్‌సరఫరా అవుతుంది. ఒప్పందం మేరకు, నోవా ఎయిర్ సంస్థ సొంతంగా పైపులైన్ వ్యవస్థ ప్రణాళిక, నిర్మాణం, నిర్వహణ చేపడుతుంది. పారిశ్రామికవాడ అంతటా సమర్థవంతమైన గ్యాస్ పంపిణీని అనుమతిస్తూ అవసరమైన ప్రత్యేక హక్కులను కంపెనీకి మంజూరు చేసింది. కొనసాగుతున్న పారిశ్రామిక కార్యకలాపాలకు అంతరాయం లేకుండా దశలవారీగా ఈ ప్రాజెక్టు అమలు చేయబడుతుంది. ఈ ఒప్పందం పట్ల నోవా ఎయిర్ టెక్నాలజీస్ ఎండీ, సీఈవో గజానన్ నబార్ సంతోషం వ్యక్తం చేశారు. యూటిలిటీ పైపులైన్ నెట్‌వర్క్ సదుపాయం అభివృద్ధి చెందిన దేశాల్లోని పారిశ్రామిక పార్కుల్లో సర్వ సాధారణమైనది కాగా, భారతదేశంలో ఈ తరహా చొరవ ఇదే మొదటి సారి కావచ్చని వ్యాఖ్యనించారు. వినియోగదారులకు స్థిరమైన, నాణ్యమైన గ్యాస్ సరఫరా పరిష్కారాలను అందించడానికి, ఉత్పాదకతను పెంచడానికి ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం తమకు వీలు కల్పిస్తుందని పేర్కొన్నారు. కీలకమైన ఈ సదుపాయం శ్రీసిటీ పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందని పై రెండు సంస్థలు స్పష్టం చేస్తున్నాయి.

# భార్యపై అనుమానం.. ఫీల్డ్ అసిస్టెంట్‌పై హత్యాయత్నం

## తిరుపతి రేణిగుంటలో ఘటన

**రేణిగుంట జూలై 24 ప్రభాతవార్త** భార్యపై అనుమానంతో ఓ వ్యక్తి తన అన్నతో కలిసి ఫీల్డ్ అసిస్టెంట్‌పై హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం ఉదయం తిరుపతి జిల్లా రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ దొడ్ల మిట్ట నందు సంచలనం రేపింది.. పోలీసుల కథనం మేరకు..దొడ్ల మిట్ట గ్రామానికి చెందిన రామాంజనేయులు అనే ఆటో డ్రైవర్ తన భార్యకు ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నవీన్ ప్రసాద్‌తో వివాహేతర సంబంధం ఉందని అనుమానపడ్డాడు. ఈ అనుమానం కాస్త పెనుభూతంగా మారి నవీన్ ప్రసాద్‌ను హత్య చేయడానికి పాల్పడే వరకు దారితీసింది. ఫీల్డ్ అసిస్టెంట్ నవీన్ ప్రసాద్ వద్ద ఉపాధి హామీ కూలిగా రామాంజనేయులు భార్య పనిచేస్తోంది. గత మూడు నెలల క్రితం భర్త తనకు ఫీల్డ్ అసిస్టెంట్ తో వివాహేతర సంబంధం ఉన్నట్లు అనుమానిస్తున్నాడని పని వెళ్లడం మానేసింది. అయినప్పటికీ రామాంజనేయులు అనుమానం తీరలేదు. భార్యను రకరకాలుగా వేధించడంతో ఆమె ఒకటిన్నర నెల క్రితం తన పుట్టింటికి వెళ్ళిపోయింది. నవీన్ ప్రసాద్ వల్లే తన భార్య వెళ్ళిపోయిందన్న కోపంతో రామాంజనేయులు తన అన్నతో ఆదినారాయణతో కలిసి నవీన్ హత్య చేయడానికి పథకం రూపొందించారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి రెండు గంటల సమయంలో అన్నదమ్ములిద్దరూ కలిసి సీసాలో పెట్రోల్ నింపుకొని దొడ్లమిట్టలో వారు ఉంటున్న ఇళ్ళకి 50 గజాల దూరంలో ఉన్న నవీన్ ప్రసాద్ ఇంటి బెడ్ రూమ్ వద్దకు వెళ్లి కిటికీ నుండి సీసాలోని పెట్రోల్ బెడ్రూంలో పోసి నిప్పంటించారు.

# నదులు అనుసంధానంతోనే రాష్ట్రం సస్యశ్యామలం

## : మంత్రి నిమ్మల రామానాయుడు

**విజయవాడ,జూలై 24.ప్రభాతవార్త ప్రతినిధి:** జలవనరుల సద్వినియోగంతోనే ఏ ప్రాంతాన్ని అయినా సస్యశ్యామలం చేయవచ్చని, కరవు కాటకాలను పారదోలవచ్చని సర్ ఆర్థర్ కాటన్ మహాశయుడు నిరూపించారని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రశంసించారు. ఆయన స్ఫూర్తిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదర్శంగా తీసుకుని రాష్ట్రంలో నదుల అనుసంధాన ప్రక్రియకు శ్రీకారం చుట్టారని స్పష్టం చేశారు. నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రాన్ని కరువు రహిత ప్రాంతంగా మార్చవచ్చని, ప్రతి ఎకరాకు నీరిచ్చి సిరిసంపదలు సృష్టించవచ్చని కార్యాచరణకు దిగినట్లు మంత్రి చెప్పారు.

# జాతీయ స్థాయిలో కమిటీ బీటెక్ కోర్సుల్లో స్పేస్ టెక్నాలజీ ఎడ్యుకేషన్ :వైసిపి ఎంపి మేడా రఘునాథరెడ్డి

**రాజంపేట, జూలై 24 ప్రభాతవార్త** దేశవ్యాప్తంగా బీటెక్ కోర్సులలో ఫేస్ టెక్నాలజీ పాఠ్యాంశాలను ప్రవేశపెట్టినందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఈ మేరకు అఖిల భారత సాంకేతిక విద్యా మండలి కూడా అందుకు ఆమోదం తెలిపిందని ప్రధానమంత్రి కార్యాలయం స్పష్టం చేసింది. ఆంధ్ర రాష్ట్రంలో స్పేస్ టెక్నాలజీకి సంబంధించి తొమ్మిది 9 స్టార్టప్‌లు లిస్టింగ్ అయినట్లు వెల్లడించింది. రాజ్యసభలో వైసిపి ఎంపీలు మేడా రఘునాథరెడ్డి బీదర్ మస్తాన్రావు అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానంలో ఆంధ్రప్రదేశ్ సామర్థం గురించి ప్రశ్నలు సంధించారు.

భారతదేశ అంతరిక్ష సాంకేతిక తయారీలో, అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ పాత్రను ప్రశ్నించారు. ఈ మేరకు ప్రధానమంత్రి కార్యాలయం నుంచి డాక్టర్ జితేంద్ర సింగ్ ఎంపీలు అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం పంపారు.అంతరిక్ష తయారీ క్లస్టర్‌ను స్థాపించడంలో ఆసక్తిని కోరుతూ ఆంధ్రప్రదేశ్‌తో సహా వివిధ రాష్ట్రాలను కేంద్రం సంప్రదించిందన్నారు.

# ఎపిటిఎస్ ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ అవగాహన సదస్సులు

## - ఎపి టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహన కృష్ణ



**విజయవాడ,జూలై24,ప్రభాతవార్తప్రతినిధి:** సైబర్ నేరగాళ్ల నుంచి ప్రజలను రక్షించేందుకు ఏపీటీఎస్ ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ అవగాహన సదస్సులు నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహన కృష్ణ తెలిపారు. గురువారం విజయవాడ ఆర్ అండ్ బీ బిల్డింగ్ లోని ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో చైర్మన్ మన్నవ మోహన కృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో 24 గంటలూ ఐటీ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ను పర్యవేక్షిస్తూ ముందస్తు హెచ్చరికలు అందిస్తూ ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ (ఏపీటీఎస్) కీలక భూమి పోషిస్తుందన్నారు. సైబర్ మోసాలపై ప్రజల్లో అవగాహన, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రాష్ట్రవ్యాప్తంగా సైబర్ సెక్యూరిటీ అవగాహన సదస్సులు నిర్వహిస్తావన్నారు. దీనివల్ల సైబర్ నేరాలకు నేరగాళ్లు ఏ విధంగా నేరాలకు పాల్పడుతున్నారు అనే విషయాలతో పాటు వాటి నుంచి ఎలా అనంతరం ఎలా ఫిర్యాదు చేయాలి అనే విషయాలపై అవగాహన సదస్సుల్లో తెలియజేస్తామన్నారు. ఇటీవల కాలంలో ప్రపంచవ్యాప్తంగా సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోయాయని సాంకేతికత ద్వారా వీటిని అరికట్ట వలసిన అవసరం ఉందన్నారు. సైబర్ సెక్యూరిటీ రంగంపై ఆసక్తి ఉన్న గ్రాడ్యుయేషన్ పూర్తి అయిన విద్యార్థులు మరియు ఐటీ నిపుణులకు శిక్షణ కోసం రాష్ట్రస్థాయి సైబర్ సెక్యూరిటీ హ్యాకథాన్ (బీతిదిరీతిగిబీవీవి 2025) ను నిర్వహించడం జరిగిందని, అందులో ఎంపికైన వారికి ఆరు నెలలపాటు సైబర్ సెక్యూరిటీ లో శిక్షణ ఇచ్చామని, శిక్షణా కాలంలో నెలకు రూ. 10 వేల స్టయ్ ఫండ్ అందించామన్నారు. అనంతరం ఇంటర్న్ షిప్ పూర్తిచేసిన 30 మందికి సర్టిఫికెట్స్ ను అందించామన్నారు. సైబర్ సెక్యూరిటీ లో నిపుణులుగా శిక్షణ పూర్తి చేసుకున్న వారికి దేశ, విదేశాల్లో అనేక ఐటీ కంపెనీల్లో అవకాశాలు న్నాయన్నారు. సైబర్ నేరగాళ్లు డేటాను దొంగిలించటం, బెట్టింగ్ యాప్‌ల ద్వారా తప్పు దోవ పట్టించి దోచుకుంటున్నారన్నారు.

11 page.qxd:25-7P g7exHMNWJQE.qxd 01/01/01 9:57 AM Page 1



# అప్రమత్తంగా ఉంటూ జిల్లాల్లో పర్యటించండి

## వరద ప్రభావిత ప్రాంతాల నుంచి గర్భిణులను తరలించాలి

### ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను ఆదేశించిన మంత్రి దామోదర రాజనర్సింహ

**హైదరాబాద్, జూలై 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉంటూ.. జిల్లాల్లో పర్యటించాలని వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. సంగారెడ్డి నుంచి వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, ఇతర ఉన్నతాధికారులతో మంత్రి గురువారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. హైరిస్క్ జోన్లలో ప్రివెంటివ్ మెజర్స్‌పైన దృష్టి పెట్టాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల నుంచి గర్భిణులను తరలించాలని సూచించారు. హాస్పిటల్స్‌లో సానిటేషన్‌పై స్పెషల్ ఫోకస్ పెట్టాలని.. పరిశుభ్రత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. హాస్పిటల్స్‌లో ఉన్న క్యాంటీన్లలో తనిఖీలు చేయాలని ఫుడ్ ఇన్‌స్పెక్టర్లను మంత్రి ఆదేశించారు. హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, ఇతర ఉన్నతాధికారులతో గురువారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. కేసులు ఎక్కువగా నమోదవుతున్న ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో పంచాయతీరాజ్, మున్సిపల్ డిపార్ట్‌మెంట్లను అలర్ట్ చేయాలని ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో అవేర్‌నెస్ క్యాంపులు, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ ప్రాంతాల్లో యాంటిలార్వల్ ఆపరేషన్స్, ఫాగింగ్, ఇండోర్ స్ప్రేయింగ్ విస్తృతంగా చేయాలన్నారు. క్రమం తప్పకుండా మంచి నీటి నమూనాలను పరీక్షించాలన్నారు. సీజనల్ వ్యాధులతో ప్రభుత్వ హాస్పిటల్స్‌లో ఓపీ, ఐపీ పెరిగే అవకాశం ఉన్నందున.. ఓపీ కౌంటర్లను పెంచాలని, అవసరమైతే ఓపీ టైమింగ్స్‌ను పొడిగించుకోవాలని మంత్రి ఆదేశించారు. అన్నిరకాల మెడిసిన్స్, డయాగ్నస్టిక్ ఎక్విప్‌మెంట్స్, టెస్టింగ్ కిట్స్ సరిపడా అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఇన్‌పేషెంట్లు, అవుట్ పేషెంట్లకు అవసరమైన అన్ని టెస్టులు హాస్పిటల్స్‌లోనే చేయాలన్నారు. టీ-డయాగ్నస్టిక్ సెంటర్లపై పర్యవేక్షణ పెంచాలని, అన్ని రకాల టెస్టులు చేయడంతోపాటు, అదేరోజు పేషెంట్లకు రిపోర్టులు అందజేయాలన్నారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లో సానిటేషన్, డైట్ నిర్వాహణ సరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు హాస్పిటల్స్‌లో తనిఖీ చేయాలని మంత్రి ఆదేశించారు. హాస్పిటల్స్‌లో వార్డులు, వాష్‌రూమ్‌లు పరిశుభ్రంగా లేకపోయినా, పేషెంట్లకు అందించే ఆహారంలో నాణ్యత లోపించినా హాస్పిటల్ సూపరింటెండెంట్, ఆర్‌ఎంవోలు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేటు హాస్పిటల్స్‌లో జిల్లా, రాష్ట్రస్థాయి ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు రెగ్యులర్‌గా తనిఖీలు చేయాలన్నారు. ప్రైవేటు హాస్పిటళ్లపై నిఘా పెంచాలని, డెంగ్యూ, ప్లేట్‌లెట్స్ పేరిట ప్రజలను దోచుకునే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బిల్లులు అధికంగా వేసే హాస్పిటళ్లపై నిబంధనల ప్రకారం వ్యవహరించి, పేషెంట్లను దోచుకోకుండా చూడాలన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ పనులు ఊపందుకున్న క్రమంలో రైతులు ఎక్కువ సమయం పొలాల్లోనే గడుపుతారని.. ఈ క్రమంలో పాము, తేలు కాటు గురయ్యే ప్రమాదం ఉంటుందని మంత్రి హెచ్చరించారు. ప్రైమరీ హెల్త్ సెంటర్ నుంచి టీచింగ్ హాస్పిటల్ వరకూ అన్ని హాస్పిటల్స్‌లో పాము, తేలు కాటు పేషెంట్లకు ట్రీట్మెంట్ అందించేందుకు అవసరమైన మెడిసిన్, ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వచ్చే రోగులకు, గర్భిణులకు తక్షణమే వైద్య సేవలు అందించాలని.. వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. వరద ముప్పు ఉన్న ప్రాంతాల్లో నివసిస్తూ.. ఎస్టిమేటెడ్ డెలివరీ డేట్ దగ్గరలో ఉన్న గర్భిణులను హాస్పిటల్స్‌లోని బర్త్ వెయిటింగ్ రూమ్స్‌కు తరలించి సేవలందించాలని మంత్రి సూచించారు. ఇంట్లోనే ఫ్రెష్‌గా వండుకుని తినాలని ప్రజలకు మంత్రి విజ్ఞప్తి చేశారు. మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో దగ్గు, జలుబు, జ్వరం, డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు.



నల్ల బాలు (శశిధర్ గౌడ్) కుటుంబసభ్యులతో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

# భయపడకండి.. మీకు నేనున్నా

## తప్పుడు కేసులకు బెదిరిపోవద్దు

### నల్ల బాలు కుటుంబసభ్యులకు కెటిఆర్ భరోసా

**పటాన్‌చెరు, జూలై 24,ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ సోషల్ మీడి యా కార్యకర్తలపై పెడుతున్న అక్రమ కేసులకు భయపడవద్దని, ప్రతి ఒక్కరికి తనతో పాటు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) భరోసా ఇచ్చారు. సోషల్ మీడియాలో ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్న ఆరోపణలపై అరెస్టై బెయిల్‌పై తిరిగి వచ్చిన నల్ల బాలు (శశిధర్‌గౌడ్)ను సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో పోచారం గ్రామంలో నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కో ఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులతో కలిసి మాజీ మంత్రి కేటీఆర్ పరామర్శిం చారు. ఈ సందర్భంగా శశిధర్ గౌడ్ ఇంటికి కేటీఆర్ చేరుకుని ఆయనతో పాటు కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. నల్ల బాలు కుటుంబ సభ్యులతో కలసి కేటీఆర్ కేక్ కట్‌చేసి తన జన్మదిన వేడుకను జరుపుకున్నారు. శశిధర్ గౌడ్ పిల్లలకు బహుమతులు అందించారు. వారితో కలిసి భోజనం చేశారు.

# కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు భేటీ

**హైదరాబాద్, జూలై 24, ప్రభాతవార్త:** కేంద్ర హోంమంత్రి అమిత్ షాను బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్‌రావు మర్యాదపూర్వకంగా కలిసారు. గురువారం ఢిల్లీలో అమిత్ షాతో భేటీ అయ్యారు. రాష్ట్ర



అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత ఇప్పటికే పలువురు కేంద్ర మంత్రులు, జాతీయ అధ్యక్షులను కలిసిన రాంచందర్‌రావు, గురువారం అమిత్‌షాతో భేటి అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర పరిస్థితులను వివరించారు.

## గ్రామస్థాయిలో కాంగ్రెస్‌ను బలోపేతం చేయండి : నాయకులు

**నకరికల్లు, జూలై 24 ప్రభాతవార్త :** గ్రామస్థాయి నుండి కాంగ్రెస్ పార్టీ కమిటీలను బలోపేతం చేయాలని ఏఐసిసి సెక్రటరీ గణేష్‌కుమార్ అన్నారు. గురువారం కాంగ్రెస్‌పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని డిసిసి అధ్యక్షులు జి.అలెగ్జాండర్ సుధాకర్ నాయకత్వంలో నిర్వహించారు. గణేష్‌కుమార్ మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో పార్టీకి బలమైన క్యాడర్ ఉందన్నారు. వారిని యాక్టివ్ చేసుకోవాలన్నారు. కార్యకర్తలు పార్టీ అభివృద్ధిపై సూచనలు చేశారు. రాహుల్‌గాంధీని ప్రధానిగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో వై.ఎస్.షర్మిళ నాయకత్వంలో ముందుకు వెళ్ళాలని సూచించారు. అధికార ప్రతినిధి మస్తాన్‌వలి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోహన్‌రెడ్డి, బోయపాటి రామాంజనేయులు, చుక్కా చంద్రపాల్, ఎం.రాధాకృష్ణమూర్తి, పమిడి నాగేశ్వరరావు, రామచంద్రారెడ్డి, యల్లమందారెడ్డి, గంటా గోపి, బాషా తదితరులు పాల్గొన్నారు.

## ఉభయసభల్లో లోతైన చర్చ జరగడం అత్యంత అవశ్యం

గుంటూరు కల్చరల్,జూలై 24,ప్రభాతవార్త : ఆపరేషన్ సింధూర్,బీహార్‌లో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల సవరణల మీద,జస్టిస్ యశ్వంత్ సిన్హా వ్యవహారంపైనా సమగ్రమైన చర్చ పార్లమెంట్ ఉభయసభల్లో జరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని అవగాహన సంస్థ సభ్యుల చర్చా కార్యక్రమంలో విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.చర్చలో ఉపాధ్యాయ ఉద్యమనేత ఏ.వి.రామారావు మాట్లాడుతూ పహల్గాం ఉగ్రదాడి-ప్రతీకార ఆపరేషన్ సింధూర్ దేశ పరువు ప్రతిష్టలతో ముడిపడిన అంశమని దీనిపై పార్లమెంట్‌లో అర్ధవంతమైన, విలువైన,లోతైన చర్చ జరగాలన్నారు. పహల్గాం,సింధూర్ రెండూ కూడా జవాబు లేని అనేక ప్రశ్నలను మిగిల్చాయని ప్రజలకు నిజాలు నిర్భయంగా చెప్పటానికి పార్లమెంట్‌ను మించిన వేదిక లేదన్నారు.ఈ నేపథ్యంలో అధికార పక్షాన్ని అవమానించడమో,నిలదీయటమో లక్ష్యంగా కాక చర్చహుందాగా జరిగేలా విపక్షం చూడాలన్నారు.చర్చలో విద్యావేత్త సింగరయ్య,విశ్లేషకులు ఎస్.రవిబాబు,విశ్రాంత అధికారి భావన్నారాయణ, మల్లేశ్వరరావు, వెంకటేశ్వర్లు,త దితరులు ప్రసంగించారు.

## విద్యార్థుల వైఖరి విజయాన్ని తెస్తుంది

**గుంటూరు విద్య,జూలై 24,ప్రభాతవార్త :** స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాల విద్యార్థులు అనుసరించాల్సిన వైఖరి వారికి విజయాన్ని తెచ్చి పెడుతుందనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం తెలియజేశారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ ఔషధ సంస్థ ఎమ్మార్ 2 ఏరియా మేనేజర్,కేరీర్ మెంటార్ గోవిందరాజుల నారాయణ ప్రసాద్ మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థుల వైఖరి పునాది వంటిదని,అదే నాయకత్వ లక్షణాలకు,విజయానికి దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ జూపూడి రంగరాజు,కళాశాల సెక్రటరీ,కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావులు తమ కళాశాలను ఎంపిక చేసుకొని మాట్లాడినందుకు నారాయణ ప్రసాద్‌కు అభినందనలు తెలియజేశారు.

# కాళేశ్వరం ఫోన్‌ట్యాపింగ్ నిందితులను వదలం

## ఏడు లక్షల కోట్ల అప్పులపాలైన ధనిక రాష్ట్రం

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**హైదరాబాద్, జూలై 24, ప్రభాతవార్త:** కాళేశ్వరం పై విచారణ జరుగుతోందని అందులోని సూత్రధారులు, పాత్రధారులను ఫోన్ ట్యాపింగ్ నిందితులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హెచ్చరించారు.గాంధీ భవన్‌లో గురువారం అందుబాటులో ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ బిజెపి బిఆర్ఎస్ గల్లీలో లొల్లి ఢిల్లీలో దోస్తీ అనే వైఖరితో ప్రదర్శిస్తున్నారని వెనుకబడిన తరగతుల ప్రజలు గుర్తించాలని ఆయన కోరారు. తెలంగాణలో పదేళ్ల పాటు ఫోన్ ట్యాపింగ్ చేసి దొరికిపోయిన దొంగలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆడిపోసుకునే విధంగా సొంత ప్రత్రికలో రోత రాతలు రాస్తున్నారని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ దొంగల పాపం పండిదని ఆది అన్నారు. లోక్‌సభ ఎన్నికలో గుండు సున్నాకు పరిమితమయ్యారు.

ఫోన్ ట్యాపింగ్ లో సూత్రధా రులు, పాత్రధారులు పాత్ర తేలాల్సి ఉందని తెలి పారు. కలుగులో దాకున్న కూడా ఫోన్ ట్యాపింగ్ నిందితులను వదిలే ప్రసక్తే లేదని అన్నారు.కెటిఆర్ లోకేష్ తో భేటీ అయ్యారని సిఎం రేవంత్ చేసిన వ్యాఖ్యల్లో తప్పే ముందని ప్రశ్నించారు. వారి భేటీకి ఫోన్ ట్యాపింగ్ కి సంబంధం లేదని ఫోన్ ట్యాపింగ్ చేయాల్సిన కర్మ కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని అన్నారు.ఫోన్ ట్యాపింగ్ బురద కాంగ్రెస్ పార్టీకి అంటించే ప్రయత్నం బిఆర్ఎస్ చేస్తోందని ఆయన అన్నారు.మా నాయకుడు దమ్మున్న నాయకుడు అని కీర్తించారు. మా పార్టీలో అంతర్గత ప్రజా స్వామ్యం ఎక్కువ, బిఆర్ఎస్‌లో నియంతృత్వ పోకడలు ఎక్కువ అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటే పేదల ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వంపై విష ప్రచారం చేసే బిఆర్ ఎస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎదురుదెబ్బ తప్పదని జోస్యం చెప్పారు.కెసిఆర్ ప్రతిపక్ష పాత్ర పోషించలేక ఫాం హౌస్ కి పరిమితమయ్యారని అన్నారు.మీ పత్రికల్లో మీరే రాసుకొని డబ్బా కొట్టుకోండని అన్నారు మీ పత్రికలో రోత రాతలు మానుకో కుంటే మంచిదని హితవు చెప్పారు.

ఫోన్ ట్యాపింగ్ తో సినీతారలు, జడ్జీలు, భార్య భర్తలు మాట్లాడుకున్న మాటలను విన్నారని కవితే బహిరంగంగా చెబుతున్నారని గుర్తుచేశారు.ఫోన్ ట్యాపింగ్ బురద మాకు అంటించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆవేదన చెందారు.ఫోన్ ట్యాపింగ్ సూత్రధారులు లెక్క తేలాల్సి ఉందని చెప్పారు బిఆర్ఎస్ పార్టీనుంచి తెలంగాణ పదం తొలగించిన రోజే పేగు బంధం తెగిపోయిందని అన్నారు.మహాలక్ష్మి పథకంతో మహిళలకు 237 కోట్ల ప్రయోజనం కలిగిందని వెల్లడించారు. బిఆర్ఎస్ పదేళ్ల హయంలో పది రేషన్ కార్డులు ఇవ్వలేదు,పదేళ్లలో ఏ ఒక్క నియోజకవర్గంలో ఒక్క డబుల్ బెడ్ రూం ఇచ్చిన పాపాన పోలేదని విమర్శించారు. ధనిక రాష్ట్రం కాస్తా 7 లక్షల కోట్లకు అప్పులు కట్టే దుస్థితి దాపురించింది. ఎస్సీ వర్గీకరణ, బిసికుల గణన చేపట్టి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్త శుద్ధి నిరూపించుకుందని అన్నారు. ప్రశ్నించే గొంతులకు తెలంగాణ ప్రజలు పట్టం కట్టారు.

# పెన్షన్‌ల పంపిణీలో కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

### మంత్రి సీతక్క

**హైదరాబాద్, జూలై 24, ప్రభాతవార్త:** పింఛన్ లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా పెన్షన్ అందించేందుకు నూతన టెక్నాలజీని ఉపయోగించుకోవాలని, పింఛన్లు అందించడం సామాజిక బాధ్యత అన్నారు. చేయూత పెన్షన్ల పంపిణీపై ప్రజాభవన్‌లో మంత్రి సీతక్క గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. పేదరిక నిర్మూలన కోసం మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, ఇందిరా మహిళా క్యాంటీన్‌లు ఇస్తున్నామని వెల్లడించారు. ప్రమాద బీమా ద్వారా పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు మంత్రి సీతక్క. 15 సంవత్సరాల వయస్సు నుంచే మహిళా సంఘాల్లో సభ్యులుగా అవకాశం కల్పిస్తున్నా మన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితే కుటుంబం బాగు పడుతుందన్నారు. ఆర్టీసీలో 200 కోట్ల మహిళా ప్రయాణాలు జరిగాయంటే.మహిళలకు ఫ్రీ బస్సు బాగా ఉపయోగపడుతోందని,వారు ఫ్రీ బస్సు ఎక్కడమే కాదని,మహిళలను బస్సు ఓనర్లను చేసింది తమ ప్రభుత్వమే నన్నారు. పేదరికం తగ్గించకపోతే సమాజంలో అంతరాలు పెరుగుతాయని,నిజమైన లబ్ధిదారులకు పింఛన్లు చేరే విధంగా అధికారులు కఠిన నిబంధనలు అమలు చేయాలని సూచించారు. అనర్హులు పెన్షన్ తీసుకుంటే పేదవారికి అన్యాయం చేసినట్లు అవుతుందన్నారు.సాంకేతిక కారణాలతో పింఛన్లు ఆలస్యం అయితే ముందే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఫేషియల్ రికగ్నైజేషన్ ద్వారా అర్హులకే పింఛన్లు అందుతోందన్నారు.ప్రతీ నెల రూ.1000 కోట్ల పెన్షన్లు పంపిణీ చేస్తున్నామన్నారు.పిల్లలు వదిలేసిన తల్లిదండ్రులకు ప్రభుత్వం ఇచ్చే పెన్షనే చేయూతని.. అదే వారి ధైర్యమన్నారు.ఈ క్రెడిట్ అంతా ఐఏఎస్ దివ్యాకే దక్కుతుందని,ప్రతీ అధికారి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాల న్నారు. అధికారులూ పెన్షనర్ల కష్ట సుఖాలు తెలుసు కోవాలని, మానవ సేవే మాధవ సేవ అని మంత్రి సీతక్క పేర్కొన్నారు. సమావేశంలో సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్, డైరెక్టర్ గోపీ,జిల్లా ప్రాజెక్ట్ ఆఫీసర్స్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

# బిసి నాయకుడికి సిఎం పదవి అప్పగించండి

**హైదరాబాద్, జూలై 24, ప్రభాతవార్త:** బిసిల పట్ల నిజమైన చిత్తశుద్ధి ఉంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే రాజీనామా చేయాలని సిర్పూర్ శాసనసభ్యుడు డా. పాల్వాయి హరీష్ బాబు డిమాండ్ చేశారు. గురువారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. దమ్ముంటే బలహీన వర్గానికి చెందిన బిసి నాయకుడికి ముఖ్యమంత్రి పదవిని అప్పగించండి. బిసిలపై ప్రేమ చూపిస్తున్నట్టుగా నటిస్తున్న రేవంత్ రెడ్డి భారతీయ జనతా పార్టీపై విమర్శలు చేయడం సిగ్గుచేటు అన్నారు. బిసిలకు ఏ పార్టీ ఏమి చేసిందనే అంశంపై బహిరంగ చర్చకు బిజెపి సిద్ధంగా ఉందని, సిఎం రేవంత్ రెడ్డి దమ్ముంటే దీనిపై స్పందించాలని అన్నారు. భారతదేశంలో 50 ఏళ్లకుపైగా పాలించిన కాంగ్రెస్ పార్టీ ఒక్కసారి కూడా బలహీన వర్గాలకు చెందిన వ్యక్తిని ప్రధానిగా చేయలేదని అన్నారు. ఒక్కసారైనా బిసిలకు రాష్ట్రపతి అయ్యే అవకాశం కల్పించలేద న్నారు. ఎమర్జెన్సీ అనంతరం దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌ను ప్రజలు తిరస్కరించి నప్పటికీ, రాష్ట్రంలోని బడుగు,బలహీన వర్గాల ప్రజలు మెదక్ నుంచి ఇందిరాగాంధీ గారిని ఎంపిగా గెలిపించి రాజకీయ పునర్జన్మ ప్రసాదించారని అన్నారు. కానీ గెలిచాక కూడా బిసిలకు ప్రధాని, రాష్ట్రపతి, ముఖ్యమంత్రి పదవులు ఇవ్వకుండా అవమానించడమే కాంగ్రెస్ చరిత్రగా మిగిలింది.1989లో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఘోర ఓటమి పాలైనప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం కాంగ్రెస్‌కు 39 లోక్‌సభ స్థానాలు ఇచ్చిన తెలుగు ప్రజలను కూడా 2004, 2009లో ఎంపిలను గెలిపించినా కాంగ్రెస్ వంచించింది. ఈ దేశంలో తొలిసారి బిసి వ్యక్తిని ప్రధానిగా చేసిన ఘనత భారతీయ జనతా పార్టీదే. మూడుసార్లు బిసి వ్యక్తిని ప్రధానిగా కొనసాగించి, కేంద్ర మంత్రివర్గంలో 27 మంది బిసిలకు స్థానం ఇచ్చిన ఘనత బిజెపిదే. అనేక రాష్ట్రాల్లో బిసిలను ముఖ్యమంత్రులుగా చేసిన ఘనత కూడా బిజెపిదే. దళిత, గిరిజన, మైనారిటీ వర్గాలకు అత్యున్నతమైన రాష్ట్రపతి పదవిని కల్పించిన ఘనత కూడా భారతీయ జనతా పార్టీదే.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు అర్ధ శతాబ్దం పాటు పాలించిన కాంగ్రెస్ ఒక్కసారి అయినా బిసిని ముఖ్యమంత్రిగా చేయలేదు. రాష్ట్ర జనాభాలో సగం మంది బిసిలు ఉన్నా... రేవంత్ రెడ్డి కేబినెట్‌లో ఆ మేరకు ప్రాతినిధ్యం కల్పించారా? నామినేటెడ్ పదవుల్లోనూ బిసిలకు అన్యాయమే జరిగింది. అటువంటి కాంగ్రెస్ పార్టీ ఈరోజు బిసిల గురించి మొసలికన్నీరు కారుస్తుందన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణలోని బడుగు, బలహీన వర్గాల ప్రజలు కాంగ్రెస్‌కు తప్పకుండా చరమగీతం పాడుతారు.

# కెజిబివిల్లో స్పౌజ్, మ్యూచువల్ బదలీలకు అనుమతి

**హైదరాబాద్, జూలై 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు(కెజిబివి)ల్లో బదలీలకు అనుమ తిస్తూ సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్(ఎస్‌పిడి) మెమో జారీ చేశారు. అయితే వీటిలో అన్ని రకాల బదలీలకు కాకుండా కేవలం స్పౌజ్, మ్యూచివల్ బదలీలకు మాత్రమే అవకాశం కల్పించారు. కెజిబివిల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు స్పౌజ్, మ్యూచివల్ బదలీల్లో ఏదో ఒకదానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కెజిబివిల్లో బదలీలకు సంబంధించిన దరఖాస్తులను ఈ నెల 26 లోగా ఎస్‌పిడి ఆఫీసుకు అందించాలని మోమో నంబర్ 3638ను ఎస్‌పిడి జారీ చేశారు. జిల్లా విద్యాధికారులు(డిఈవో)లు కెజిబివిల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల నుంచి దరఖా స్తులను స్వీకరించి ఈ నెల 26 వరకు ఎస్‌పిడి ఆఫీసుకు పంపించాల్సి ఉంటుంది. కాంట్రాక్ట్ ఉద్యోగులు స్పౌజ్, మ్యూచువల్‌లో ఏదో ఒకటి మాత్ర మే దరఖాస్తు చేసు కోవాలని మెమోలో స్పష్టం చేశారు.

**ఖాళీల్లో సాధారణ బదలీలకూ అవకాశం ఇవ్వాలి:యుటిఎఫ్**

కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో దంపతులు(స్పౌజ్), పరస్పర(మ్యూచువల్) బదిలీలకు దరఖాస్తు చేసుకోవాలని, వారి వివరాలను ఈనెల 26లోగా ఎస్‌పిడి కార్యాలయానికి పంపాలని ఆదేశిస్తూ సమగ్ర శిక్ష, రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ మెమో నెం 3638 ద్వారా ఉత్తర్వులు ఇచ్చారని.. ఈ ఉత్తర్వులను టిఎస్ యుటిఎఫ్ స్వాగతి స్తుందని సంఘం రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్ తెలిపారు. అయితే ఇటీవల పలు కెజిబివిలు అప్ గ్రేడ్ అయ్యాయని... కొందరు సిబ్బంది ఇతర ఉద్యోగాలకు పోవడంతో ఖాళీలు ఏర్పడ్డాయని తెలిపారు. పలువురు ఉద్యోగులు అతి తక్కువ వేతనంతో దూరప్రాంతాల్లో పని చేస్తూ బదిలీలు కోరుకుంటున్నారని.. గత మూడు సంవత్సరాల్లో బదిలీలు జరిగినా వారిలో చాలా మందికి అవకాశం రాలేదన్నారు. అటువంటి వారికి మేలు జరిగే విధంగా నూతనంగా మంజూరైన, ఖాళీగా ఉన్న పోస్టుల్లో సాధారణ ఉద్యోగు లకు కూడా బదలీ (షిఫ్టింగ్)కి అవకాశం కల్పించాలని, దరఖాస్తు గడువును మరో రెండు రోజులు పొడిగించాలని వారు డిమాండ్ చేశారు.

# జస్టిస్ పున్నయ్య కమీషన్ 42సిఫార్సులను సమర్ధవంతంగా అమలు చేయాలి

**గుంటూరు విద్య,జూలై 24,ప్రభాతవార్త :** రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డోల వీరాంజనేయస్వామి ని రాష్ట్ర సచివాలయంలోని ఆయన చాంబర్లో,ప్రముఖ సామాజిక వేత్త,జాతీయ స్థాయి దళిత నాయకులు డాక్టర్ రాజా సుందర్‌బాబు కలిసి జస్టిస్ పున్నయ్య 42సిఫార్సులను అమలు జరిగేలా చర్యలు చేపట్టాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.ఎస్సీ ఎస్టీలకు సంబంధించిన పలు చట్టాలను సమర్ధవంతంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.సిఫార్సులన్నీ అమలుచేస్తే ఎస్సీ,ఎస్టీ బాధితులకు మంచి జరుగుతుందని ఆ వినతిపత్రంలో డాక్టర్ గోళ్ళ మూడి మంత్రికి నివేదించారు.ఎస్సీ,ఎస్టీ రూల్ స 16ప్రకారం సంవత్సరంలో రెండుసార్లు జనవరి,జూలై నెలలో రాష్ట్ర ముఖ్యమంత్రి అధ్యక్షతన హై పవర్ కమిటీ సమావేశం జరిపి సమీక్షించాల్సిన అవసరం ఉందని,అలాగే సాంఘీక సంక్షేమ శాఖమంత్రి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి అడ్వైజరి కమిటీ ఏర్పాటు కావలసి ఉందని పేర్కొన్నారు.డిజిపి ఆధ్వర్యంలో ఒక రాష్ట్రస్థాయి ఎస్సీ ఎస్టీ ప్రొటెక్షన్ సెల్‌ని నియమించి ఆ ప్రకారం పోలీస్ అట్రాసిటి కేసుల్లో సమర్ధవంతంగా పనిచేసే విధంగా చూడాల్సిన బాధ్యత డిజిపి పై ఉందని,జీవో నెంబర్ 72పై బ్యాన్ ఎత్తివేసి బడ్జెట్ కంట్రోల్లో లేకుండా ఎస్సీ స,ఎస్టీ అత్యాచార బాధితులకు ఆర్థిక నష్టపరిహారాలు జాప్యం లేకుండా అందించాల్సిన అవసరం ఉందని మంత్రి దృష్టికి తెచ్చారు.



పోలీస్ విజేతలను అభినందిస్తున్న డిజిపి జితేందర్

# 'వరల్డ్ పోలీస్, ఫైర్ గేమ్స్' పోలీస్ విజేతలకు డిజిపి అభినందన

**హైదరాబాద్,జూలై24,ప్రభాతవార్త:** వరల్డ్ పోలీస్, ఫైర్ గేమ్స్‌లో విజేతలుగా నిలిచిన తెలంగాణ పోలీస్ క్రీడాకారులను గురువారం డిజిపి జితేందర్ అభినందించారు. జూన్ 27 నుంచి జూలై 6 వరకు అమెరికాలో జరిగిన క్రీడల్లో పోలీసులు 10 పతకాలు సాధించి సత్తా చాటారు. మూడు గోల్డ్, ఒక సిల్వర్, ఆరు బ్రాంజ్ మెడల్స్ వరించాయి. తెలంగాణ పోలీస్ టీమ్ వాటర్ స్పోర్ట్స్ కోచ్ పి.కృష్ణారావు (వనపర్తి హెడ్ కానిస్టేబుల్) రెండు బంగారు పతకాలు గెలిచారు. 50 ఏళ్ల కేటగిరీలో 2000 మీటర్లు, 500 మీటర్ల రోయింగ్ క్రీడల్లో విజేతగా నిలిచారు. ఆదిలాబాద్‌కు తెలంగాణ పోలీస్ అథ్లెటిక్స్ కోచ్ మహ్మద్ బాబా (కామారెడ్డి జిల్లాలోని పెద్దకొడప్గల్ పీఎస్‌లో కానిస్టేబుల్) 35ఏళ్ల కేటగిరీలో షాట్‌పుట్, 110 మీటర్ల హర్డిల్స్‌లో రెండు కాంస్య పతకాలు, తెలంగాణ పోలీస్ త్రైయాథ్లెట్ ప్లేయర్స్ గోపాలకృష్ణయ్య సైబరాబాద్ రాజేంద్రనగర్ హెడ్ కానిస్టేబుల్ 40 ఏళ్ల కేటగిరీలో 80 కిలోలలోపు క్యోరుగి ఈవెంట్‌లో ఒక రజతం, రికగ్నైజ్డ్ పూమ్‌సే , ఫ్రీస్టైల్ పూమ్‌సేలో పోటీపడి రెండు కాంస్యాలు దక్కాయి. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అంబర్‌పేట్ హెడ్‌క్వార్టర్స్‌లో పనిచేసే ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుల్ డీ సంజీవ్ కుమార్ మూడు పతకాలు గెలిచారు. 30 ఏళ్ల కేటగిరీ క్యోరుగి క్రీడలో బంగారు పతకం, రికగ్నైజ్డ్ పూమ్‌సే, ఫ్రీస్టైల్ పూమ్ సేలో రెండు కాంస్యాలు వచ్చాయి. అభినందన కార్యక్రమంలో ఐజిపి స్పోర్ట్స్ ఎం రమేష్, స్పోర్ట్స్ ఆఫీసర్, డిఎస్పి ఆర్వీ రామారావు పాల్గొన్నారు.

# పట్టణంలో ఎమ్మెల్యే పర్యటన

**నకరికల్లు, జూలై 24 ప్రభాతవార్త :** పట్టణంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శ్రీకారం చుట్టారు. చిలకలూరిపేట అసిస్ట్



స్వచ్ఛంధ సంస్థ సహకారంతో పట్టణంలో పేదవర్గాల వారి కోసం ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టామన్నారు. సత్తెనపల్లిరోడ్డులోని స్టేడియం వద్ద, చంద్రబాబునాయుడు కాలనీలో బోరింగ్ పంపుల ఏర్పాటుకు కార్యక్రమం నిర్వహించామన్నారు. అసిస్ట్ స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధులు ముత్తినేని వెంకటేశ్వర్లును ఎమ్మెల్యే అరవింద్‌బాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పులిమి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర జట్టుకు పల్నాడు నుండి ముగ్గురు స్విమ్మర్లు ఎంపిక

ఫిరంగిపురం, జూలై 24 ప్రభాతవార్త : రాష్ట్రస్థాయి వాటర్ పోలో ఎంపికల్లో పల్నాడు జిల్లా స్విమ్మర్లు ప్రతిభ చూపారు. జూలై 19,20 తేదీలలో విశాఖపట్నంలో జరిగిన ఈ పోటీలలో పాల్గొన్న జిల్లా స్విమ్మర్లు మంచి ప్రతిభను చూపారు. జిల్లా నుండి పోటీలకు ఎంపికైన ఆర్.హర్షవర్ధన్‌రాజు, వై.మధుకిషోర్, కె.శివసాకేత్‌లు స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాల స్విమ్మింగ్ ఫూల్‌లో శిక్షణ పొందుతున్నట్లుజిల్లా అసోసియేషన్‌కార్యదర్శి వై.వి.సుబ్బారెడ్డి




తెలిపారు. కోచ్ సురేష్ ఆధ్వర్యంలో ఆగస్టు 4 నుండి 8 వరకు బెంగుళూరులో జరగబోయే 51వ జూనియర్ నేషనల్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ వాటర్ పోలో టీమ్‌కు వారు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. బాలికల విభాగంలో నిత్య, అండర్-17 విభాగంలో 50 మీటర్ల ఫ్రీ స్టైల్ ఈత పోటీలలో 48.02 సెకన్ల సమయంలో అద్భుత ప్రదర్శనతో కాంస్య పతకాన్ని సాధించారని కార్యదర్శి వై.వి.సుబ్బారెడ్డి తెలిపారు. స్విమ్మర్స్‌ను కోచ్ సురేష్ అభినందించారు.

## గుర్రం జాషువాకు నివాళులర్పించిన డాక్టర్ గజ్జల

సత్తెనపల్లి, జూలై 24 ప్రభాతవార్త : నవయుగ కవిచక్రవర్తి గుర్రం జాషువాకు డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి గురువారం నివాళులర్పించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో జాషువా చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ సంస్కర్త జాషువా అన్నారు. సమాజాన్ని ఉద్ధరించే విధంగా ఆయన రచనలు ఉండేవన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం కళాప్రపూర్ణ బిరుదుతో సత్కరించిందన్నారు. భారత ప్రభుత్వం ఆయనకు పద్మభూషణ్ అవార్డును అందజేసిందని డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏసిటి కేబుల్ ప్రసారాల వైర్లను తొలగించడం సరికాదు

**బాపట్ల,జులై24,ప్రభాతవార్త:** బిసిటీ కేబుల్ యాజమాన్యం నియంత ధోరణి అదుపు చెయ్యాలి విన్నకోట వీరయ్య నాయుడు అన్నారు. బాపట్ల పట్టణం కేబుల్ నెట్వర్క్ ప్రసారాలకు అంతరాయం కలిగించేలా బిసిటీ కేబుల్ నెట్వర్క్ యాజమాన్యం చేస్తున్న దుశ్చర్యలను ఖండిస్తూ ఏసిటీ కార్యాలయం నుండి తహసిల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ కార్యక్రమాన్ని గురువారం కేబుల్ అపరేటర్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసిటీ నెట్వర్క్ కార్మిక సంఘం నాయకుడు విన్నకోట వీరయ్య నాయుడు మాట్లాడుతూ పట్టణంలో గత 40 సంవత్సరాలుగా కేబుల్ ప్రసారాలు వివిధ నెట్వర్క్ ద్వారా నిర్వహిస్తూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ప్రసారాలను అందిస్తూ పనిచేశామన్నారు. కొత్తగా ఏర్పడిన బాపట్ల కేబుల్ టెలివిజన్ యాజమాన్యం ఏ సిటీ కేబుల్ టెలివిజన్ ప్రసార వైర్లను తొలగిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని. రాజకీయ నాయకుడి అండదండలతో దుశ్చర్యలకు పాల్పడుతున్నారని వారి నియంత ధోరణిని అరికట్టాలని ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ గంగాధర్ గౌడ్ కు అర్జీ అందించారు. ఈ నిరసన ర్యాలీలో పట్టణ మండల కేబుల్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

# గేదెను ఢీ కొట్టిన ఆటో

## పలువురికి తీవ్రగాయాలు

**బాపట్ల,జులై24,ప్రభాతవార్త:** గేదెను ఆటో ఢీ కొట్టిన సంఘటనలో పలువురికి తీవ్రగాయాలైన సంఘటన మండల పరిదిలోని జమ్ములపాలెం వద్ద గురువారం ఉదయం చోటు చేసుకుంది.బాదితుల కథనం ప్రకారం జమ్ముల పాలెం నుంచి బాపట్ల వస్తున్న అటో రోడ్డు పై వెలుతున్న గేదెను ఢీ కొట్టింది. ఈ సంఘటనలో అటోలో ప్రయానిస్తున్న ప్రయానికులు ఇద్దరు చిన్నారులు,ఇద్దరు మహిళలకు తీవ్రగాయాలు అయ్యాయి.గమనించిన స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు.

25-7pg10exCR.qxd:25-7pg10exCR.qxd 01/01/01 10:00 AM Page 1






## ఆసియా స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో..
# స్వర్ణంతో చరిత్ర సృష్టించిన శ్రేయసి

**న్యూఢిల్లీ:** ఆసియా రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్-2025లో భారతదేశంలోని అగ్రశ్రేణి ఇన్‌లైన్ స్కేటర్లలో ఒకరిగా ఎదిగిన శ్రేయసి జోషి సంచలన ప్రదర్శన చేసింది. దక్షి ణ కొరియాలో గురువారం జరిగిన ఆసియా రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఇన్‌లైన్ ఫ్రీస్టైల్‌క్లాసిక్ స్లాలోమ్ ఈవెంట్‌లో శ్రేయసి జోషి స్వర్ణం సాధించి చరిత్ర సృష్టించింది. సీనియర్ బాలికల విభాగంలో ఆమె 83.33 పాయింట్లతో అత్యధిక స్కోరును నమోదు చేసింది. ఫలితంగా 21 ఏళ్ల ఈ స్కేటర్ ఆసియా టైటిల్ గెలుచుకున్న తొలి భారతీయురాలిగా నిలిచింది. కాగా పూణేలో జన్మించిన శ్రేయసి మరియు 9 సార్లు జాతీయ ఛాంపియన్ అయిన ఆమె సోదరి స్వరాలి చిన్న వయసులోనే స్కేటింగ్ ప్రారంభించారు. ఆరేళ్ల వయసులోనే ఈ జంట జాతీయ స్థాయిలో విజయం సాధించింది. 10 సార్లు జాతీయ ఛాంపియన్ అయిన శ్రేయసి, 2022 హాంగ్‌జౌ ఆసియా క్రీడలలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించిన పూణే నుండి ఏడుగురు స్కేటర్లలో ఒకరుగా ఉంది. 12 సంవత్సరాల వయస్సులో, శ్రేయసి చైనాలోని నాన్జింగ్‌లో జరిగిన 2017 ప్రపంచ రోలర్ క్రీడలలో ఫ్రీస్టైల్ మరియు స్పీడ్ స్లాలోమ్‌లలో పోటీ పడింది. ఆమె వరుసగా 20వ మరియు 22వ స్థానాల్లో నిలిచింది. శ్రేయసి మరియు ఆమె సోదరి స్వరాలి ఆగస్టు 7-17 తేదీలలో పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనాలోని చెంగ్డులో జరగనున్న 2025 ప్రపంచ క్రీడలపై దృష్టి సారించారు.



## వరల్డ్ స్క్వాష్ ఛాంపియన్‌షిప్..
# అనాహత్ వరుసగా మూడో విజయం

న్యూఢిల్లీ: ప్రపంచ జూనియర్ స్క్వాష్ ఛాంపియన్‌షిప్-2025లో భారత్ క్రీడాకారిణి అనాహత్ సింగ్ దూసుకుపోతోంది. ఈజిప్టులోని కైరోలో జరిగిన ప్రపంచ జూనియర్ స్క్వాష్ ఛాంపియన్‌షిప్‌లో మహిళల సింగిల్స్ విభాగంలో అనహత్ తన ఆధిపత్య ప్రదర్శనను కొనసాగించి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. రెండో సీడ్ భారత క్రీడాకారిణి ప్రీ క్వార్టర్ ఫైనల్స్‌లో బ్రెజిల్‌కు చెందిన లారా డా సిల్వాను 11-5, 11-2, 11-6 తేడాతో ఓడించి, టోర్నమెంట్‌లో వరుసగా మూడో గేమ్ విజయాన్ని నమోదు చేసింది. అంతకుముందు 17 ఏళ్ల భారత క్రీడాకారిణి మరో స్ట్రెయిట్‌గేమ్ మ్యాచ్‌లో ఫ్రెంచ్ క్రీడాకారిణి ఇనెస్ గుయోట్‌తో (11-1, 11-6, 11-1) తన రౌండ్ ఆఫ్ 32 మ్యాచ్‌ను గెలుచుకుంది. మహిళల సింగిల్స్ రౌండ్ ఆఫ్ 16లో మిగిలి ఉన్న ఏకైక భారత ప్రతినిధి ఆమె. మిగిలిన నలుగురు పోటీదారులు అనికా దుబే, రుద్ర సింగ్, ఆరాధ్య పోర్వాల్ మరియు నవ్య సుందరరాజన్ రెండవ రౌండ్‌లోనే ఓడిపోయారు. అనాహత్ ఇప్పుడు పతకానికి కేవలం ఒక అడుగు దూరంలో ఉంది, ఆమె ఈజిప్టుకు చెందిన మలికా ఎల్కరాక్సీ మరియు అమెరికాకు చెందిన సమంతా జాఫీ మధ్య జరిగే మ్యాచ్ విజేతతో తలపడనుంది. మరోవైపు మూడో రౌండ్ మ్యాచ్‌లలో అరిహంత్ కెఎస్, యుషా నఫీస్, ఆర్యవీర్ దివాన్ అనే ముగ్గురు ఆటగాళ్లు ఓడిపోవడంతో భారత పురుషుల సింగిల్స్ ప్రచారం ముగిసింది.

# ఆసియాకప్‌లో హైవోల్టేజ్ మ్యాచ్
## పాకిస్థాన్‌తో భారత్ ఢీ.. తటస్థ వేదికల్లో ఆడేందుకు బిసిసిఐ గ్రీన్‌సిగ్నల్

**న్యూఢిల్లీ:** ఈ ఏడాది ఆసియా కప్ జరగనుంది. ఈ టోర్నమెంట్‌కు సంబంధించిన షెడ్యూల్ ఇంకా ప్రకటించాల్సి ఉంది. ఈ టోర్నీలో భారత్, పాకిస్తాన్ ఒకే గ్రూప్‌లో ఉండొచ్చని తెలుస్తున్నది. భారత క్రికెట్ నియంత్రణ బోర్డు (బీసీసీఐ) ఈ టోర్నమెంట్‌ను తటస్థ వేదికలో నిర్వహించడానికి అంగీకరించింది. ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) నుంచి ఉటంకిస్తూ బీసీసీఐ సెప్టెంబర్‌లో యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్ (యూఏఈ) ఆసియా కప్‌ను నిర్వహించే అవకాశం ఉంది. టోర్నీలో భారత్, పాక్ మధ్య మ్యాచ్ జరిగే అవకాశం ఉందని పేర్కొంది. ఇదిలా ఉంటే ఆసియా కప్‌కు సంబంధించి కొద్దిరోజుల్లే ప్రకటన వెలువడే అవకాశం ఉందని బీసీసీఐ కార్యదర్శి దేవ్‌జిత్ సైకియా తెలిపారు. ఆసియా కప్‌ను యూఏఈ నిర్వహిస్తున్నందున భారత జట్టు పాక్‌తోను బీసీసీఐ ఆడుతుందని ఏసీసీ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా తెలిపింది. ఆసియా కప్ వేదికపై చర్చించేందుకు ఏసీసీ సభ్యదేశాలన్నీ సమావేశమైన




విషయం తెలిసిందే. బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా వర్చువల్‌గా సమావేశంలో పాల్గొన్నారు. సెప్టెంబర్‌లో పక్షం రోజుల పాటు ఈ టోర్నీ జరుగనున్నది. ఇదే నెల చివరి వారం నుంచి వెస్టిండిస్‌తో భారత్ టెస్ట్ సిరీస్ ఆడనున్నది. ఢాకాలో ఏసీసీ చైర్మన్, పాకిస్తాన్ బోర్డు చీఫ్ మొహ్సిన్ నఖ్వీ కూడా ఈ కాంటినెంటల్ ఈవెంట్‌లో ఇండోపాక్ మ్యాచ్‌పై ప్రశ్నించగా త్వరలోనే వివరాలను ప్రకటిస్తామన్నారు. బీసీసీఐతో చర్చలు జరిపామని కొన్ని సమస్యలు త్వరలోనే కొన్ని సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. 25 మంది సభ్యుల్లో డైరెక్టర్‌గా కొందరు, మరికొందరు వర్చువల్‌గా పాల్గొన్నారని నఖ్వీ తెలిపారు. అయితే బీసీసీఐ ఒత్తిడి నేపథ్యంలో ఎజెండాలోని పది అంశాల్లో కేవలం రెండింటిపై మాత్రమే చర్చించినట్లు సమాచారం.



# సన్‌రైజర్స్ హైదరాబాద్ విస్తరణ
## నార్తర్న్ సూపర్ ఛార్జర్స్ కొనుగోలు
## వరల్డ్ క్రికెట్‌లో తదుపరి అడుగు
## ఇప్పటికే సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ టోర్నమెంట్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు యజమానిగా ఉన్న కావ్య మారన్ ప్రస్తుతం తన సామ్రాజ్యాన్ని ఇంగ్లాండ్ వరకు విస్తరించారు. ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు నిర్వహించే "ది హండ్రెడ్" క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే నార్తర్న్ సూపర్ ఛార్జర్స్ జట్టును సన్ టీవీ నెట్‌వర్క్ అధికారికంగా కొనుగోలు చేసింది. ఈ మెగా ఒప్పందం విలువ సుమారు 100.5 మిలియన్ పౌండ్లు అంటే భారత విలువలో దాదాపు రూ.1.161 కోట్లు. ఈ అతిపెద్ద కొనుగోలు ద్వారా సన్‌రైజర్స్ గ్రూప్ ప్రపంచ క్రికెట్ రంగంలో తన తదుపరి అడుగు వేసింది. నార్తర్న్ సూపర్‌ఛార్జర్స్ జట్టు గత ఆర్థిక సంవత్సరం ఆదాయం కేవలం రూ.22 కోట్లు ( 1.89 మిలియన్లు) మాత్రమే. అయితే, సన్ టీవీ గ్రూప్ అంతకంటే 53 రెట్లు ఎక్కువ ధర చెల్లించి, అంటే రూ.1,161 కోట్లకు కొనుగోలు చేసింది. ఇది చాలామందికి ఆశ్చర్యం కలిగించినప్పటికీ, దీని వెనుక ఒక బలమైన కారణం ఉంది. ఈ జట్టు ఇప్పటికే లాభాల్లో నడుస్తోంది. అంతేకాకుండా, 100 బంతులు మాత్రమే ఉన్న "ది హండ్రెడ్" టోర్నమెంట్, ప్రపంచ వ్యాప్తంగా అభిమానులలో వేగంగా ప్రాచుర్యం పొందుతోంది. దీని భవిష్యత్ వృద్ధిని పరిగణనలోకి తీసుకునే సన్ టీవీ ఈ పెట్టుబడిని పెట్టింది. ఈ ఒప్పందానికి సంబంధించిన అన్ని పనులు డిసెంబర్ 31, 2025 లోపు పూర్తవుతాయని ఆశిస్తున్నారు. కాగా సన్ టీవీ గ్రూపునకు క్రికెట్ జట్లను నిర్వహించడం కొత్తేమీకాదు. ఇప్పటికే ఐపీఎల్ టోర్నమెంట్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టును, దక్షిణాఫ్రికాలో జరిగే ఎస్ఏ20 టోర్నమెంట్‌లో సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ జట్టును విజయవంతంగా నిర్వహిస్తోంది. ఈ క్రమంలో ప్రస్తుతం మూడో ఖండంలో మూడో జట్టుగా నార్తర్న్ సూపర్ ఛార్జర్స్ జట్టును కొనుగోలు చేసింది. ఈ విషయంపై స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు అందించిన నివేదికలో క్రీడా రంగంలో మా ప్రపంచ స్థానాన్ని విస్తరించే లక్ష్యంతో ది హండ్రెడ్‌టోర్నమెంట్‌లో భాగంగా ఉన్ననార్తర్న్ ఛార్జర్స్ క్లబ్‌లో పెట్టుబడిపెట్టాం అని సన్‌టీవీ పేర్కొంది.

# చైనా ఓపెన్‌లో ప్రణయ్ నిష్క్రమణ
## క్వార్టర్ ఫైనల్స్‌కు సాత్విక్-చిరాగ్

**న్యూఢిల్లీ:** చైనా ఓపెన్-2025 టోర్నమెంట్‌లో హెచ్ఎస్ ప్రణయ్ మళ్ళీ అస్థిరతతో ఇబ్బంది పడ్డాడు. మొదటి రౌండ్‌లో కష్టపడి గెలిచినా రెండో రౌండ్‌లో పోరాడి ఓడి నిష్క్రమించాడు. చైనాలోని చెంగ్జౌలో జరిగిన గురువారం జరిగిన రెండవ రౌండ్‌లో ప్రణయ్ చైనీస్ తైపీకి చెందిన చౌ





టియెన్ చెన్ చేతిలో 21-18, 15-21, 8-21 తేడాతో ఓడిపోయాడు. మొదటి గేమ్‌లో ప్రణయ్ బలంగా ఆడి ప్రారంభంలో 4 పాయింట్ల ఆధిక్యాన్ని సాధించాడు, చౌ ఆలస్యంగా ఆధిక్యంలోకి వెళ్ళినప్పటికీ అతను దానిని అంతటా కొనసాగించాడు మరియు మొదటి గేమ్‌ను కైవసం చేసుకున్నాడు. రెండవ గేమ్‌లో అతను చాలా గట్టి ఆరంభాన్ని పొందాడు, ఇద్దరు ఆటగాళ్లు దగ్గరగా ఉండటంతో స్కోరు 13-13తో సమంగా ఉంది. అయితే, ప్రణయ్ ఆ తర్వాత వరుసగా ఆరు పాయింట్లు కోల్పోయాడు. ఇది ఆట వేగాన్ని పూర్తిగా మార్చివేసింది. ఈ మ్యాచ్ నిర్ణయాత్మక మ్యాచ్‌లోకి ప్రవేశించింది, ప్రపంచ 6వ నంబర్ ఆటగాడు చౌ, రెండు తీవ్రమైన మరియు హోరాహోరీగా జరిగిన ఆటల తర్వాత ప్రణయ్ ఇబ్బందులు పడటంతో అతనిపై సులభంగా గెలిచాడు. ఇక చివరి సూపర్ 1000 టోర్నమెంట్ ఆఫ్ ది ఇయర్, చైనా ఓపెన్‌లో భారత పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్ రాంకిరెడ్డి-చిరాగ్ శెట్టి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నారు. 16వ రౌండ్ పోరులో సాత్విక్ మరియు చిరాగ్ ద్వయం 21-19, 21-19 తేడాతో ఇండోనేషియాకు చెందిన ఉన్నత శ్రేణి జంట లియో కర్నాండో మరియు బాగాస్ మోలానాపై వరుస గేమ్‌లను గెలుచుకుంది. గత నెలలో ఇండోనేషియా ఓపెన్ మొదటి రౌండ్ మ్యాచ్‌లో లియో మరియు బాగాస్‌లపై విజయం సాధించిన తర్వాత భారత జంటకు ఇది వరుసగా రెండో విజయం.



# ఇండో-బ్రిటన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం
## ఫార్మా, వ్యవసాయం, వస్త్ర పరిశ్రమకు ఎంతోమేలు!

**లండన్,జూలై 24:** బ్రిటన్ భారత్‌లమధ్య జరిగిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో వ్యవసాయం, ఫార్మారంగాలకు మంచి బూస్ట్ లభిస్తుందని మార్కెట్‌నిపుణుల అంచనా. రెండుదేశాలమధ్య ఆర్థికపరస్పర భాగస్వామ్యంకోసం స్వేచ్ఛా విపణి వాణిజ్యఒప్పందంపై ఇరువురుప్రధానులు నరేంద్రమోడీ,కీర్ స్టార్మర్లు సంతకాలుచేసారు. అధికారికంగా గురువారమే ఈ పత్రాలు విడుదలయ్యాయి. కొన్నేళ్లపాటు సమగ్ర చర్చలు సంప్రదింపులు జరిపిన తర్వాత నరేంద్రమోడీ చొరవతో ఈ ఒప్పందం కార్యరూపంలోకి వచ్చింది. భారత ఫార్మారంగం ఈ ఒప్పందంతో భారీ ప్రయోజనాలు రాబట్టుకుంటుందని అంచనా.

స్వల్పస్థాయిలో మాత్రమే సుంకాలుంటాయి. భారత ఫార్మా ఎగుమతులు ప్రస్తుతం బ్రిటన్‌కు 100 కోట్ల డాలర్లుగా ఉనానయి. అలాగే యుకె దిగుమతులు 30 బిలియన్ డాలర్ల విలువైనవి ఉన్నాయి. జనరిక్స్, మెడ్‌టెక్ విభాగాల్లో ఈసుంకాల తొలగింపులవల్ల ఫార్మారంగానికి భారీ ప్రయోజనం చేకూరుతుందని అంచనా. ఇక వ్యవసాయ రంగం పరంగా 95శాతం డ్యూటీ ఫ్రీ విభాగంలోకి వస్తాయి. ఆహార గింజ ఉత్పత్తులు అంటే పసుపు, మిరియాలు, యాలకులు, మామిడి గుజ్జు, జలచరాల ఉత్పత్తులు ష్రింప్, తునా రొయ్యలు, చేపల ఉత్పత్తులకు భారీ ప్రయోజనం చేకూరుతుంది. ఈ ఒప్పందం వల్ల భారత్‌నుంచి వ్యవసాయ ఎగుమతులు పెరుగుతాయి. వచ్చే మూడేళ్లలోనే 20శాతంపెరుగుతాయని అంచనా. అంతేకాకుం బనారసి, చందేరి వారసత్వ ఉత్పత్తులు, వస్త్రాలు వంటివాటికి పూర్తి స్థాయిలోమేలుజరుగుతుంది. చేతివృత్తులు, హస్తకళల తయారీలకు మంచి ప్రయోజనమని చెపుతున్నారు. ఇక వస్త్రపరిశ్రమలకు ఈ సుంకాల భారం తగ్గుతుంది. అంతకుముందు 12శాతంగా ఉన్న సుంకాలు పూర్తిగా తొలగించారు. బంగ్లాదేశ్, పాకిస్తాన్‌లు కొంతమేర పోటీ ఇచ్చినప్పటికీ ఈ సుంకాల తొలగింపుతో భారత్‌కు ఎంతోమేలు జరుగుతున్నది. అలాగే ఆభరణాల రంగానికి భారీ ఊతం లభించింఇ. భారత జ్యూయెలరీ రంగానికిసుంకాల సడలింపులు ఉన్నాయి. వచ్చే రెండుమూడేళ్లకుగాను ఎగుమతులు రెట్టింపు అవుతాయని అంచనా. 3బిలియన్ డాలర్ల ఆభరణాలను సాలీనా యుకె దిగుమతిచేసుకుంటున్నది. ప్రస్తుతం 941 మిలియన్ డాలర్లుగా ఈ ఆభరణాల ఎగుమతులు ఉంటాయని అంచనా. ఇక స్కాచ్ విస్కి ధరలు కూడా తగ్గుతాయి. భారత్‌కు ఎక్కువగా బ్రిటన్‌తయారీ స్కాచ్ వస్తుంది. దీనివల్ల భారత్‌లో ధరలు తగ్గే అవకాశం ఉంది. అలాగే ఎక్సైజ్ రాబడులుకూడా పెరుగుతాయని అంచనా. వచ్చే 12 నెలల్లో వీటి ధరలు తగ్గి అన్ని వర్గాలకు స్కాచ్ అందుబాటులోకి వస్తుందని అంచనా. ఇక భారత్ ఎగుమతిమార్కెట్‌కు బ్రిటన్ కూడా తోడు కావడంతో సేవలరంగానికి మంచి ఊతం లభిస్తుంది. భారతీయ ఐటి, ఫైనాన్స్, విద్య ఇతర సేవారంగా నిపుణులకు యుకెలో మంచి మార్కెట్ లభిస్తుంది. డిజిటల్ సేవల్లో భారత్ ఇప్పటికే ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందింది. భారతీయ చెఫ్‌లు, యోగా శిక్షకులు, సంగీతకారులు యుకె జాబ్ మార్కెట్‌కు సులువుగా చేరుకోగలుగుతారని నిపుణుల అంచనా.

## బజాజ్ ఫైనాన్స్‌కు నికరవడ్డీ
# ఆదాయం బూస్ట్!

**ముంబయి,జూలై 24:** బజాజ్‌ఫైనాన్స్‌కు తొలిత్రైమాసికంలో నికరవడ్డీ ఆదాయం భారీవృద్ధిని నమోదుచేసింది. 22శాతం వృద్ధితో మొత్తం నికర లాభం రూ.4765 కోట్లు ఆర్జించినట్లు కంపెనీ గురువారం ప్రకటించింది. మార్చితోముగిసిన తొలిత్రైమాసికంలో గత ఏడాది 3940 కోట్లుమాత్రమే ఆర్జించింది. అదే జూన్‌త్రైమాసికంలో 22శాతం పెరిగి 10,227 కోట్లు ఆర్జించింది.గత త్రైమాసికంలో 8910 కోట్లు ఆర్జించింది. స్థిరాస్తిప్రమాణాలు మాత్రం క్షీణించాయి. స్థూల నిరర్థక ఆస్తులు 1.03శాతంగా ఉంటే గత త్రైమాసికంలో 0.96శాతం మాత్రమే ఉన్నాయి. నికర నిరర్థక ఆస్తులు 0.5శాతంగా ఉన్నాయి. గత త్రైమాసికంతోపోలిస్తే స్వల్పంగాపెరిగాయి. నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ అయిన బజాజ్‌ఫైనాన్స్ ఈ త్రైమాసికంలో కేటాయింపులు 26శాతంపెరిగి 2120 కోట్లుగా ఉన్నాయి. క్రమానుగతంగా 2300 కోట్లవరకూ ఉన్నట్లు కంపెనీ ప్రకటించింది.




ప్రస్తుత నిర్వహణలో ఉన్న బజాజ్‌ఫైనాన్స్ ఆస్తులు 25శాతంపెరిగి 4.41 లక్షలకోట్లకు పెరిగాయి. పెరుగుదలకు ఎక్కువగా తనఖా ఆస్తులు వాటా ఎక్కువ ఉంది. 1.09 లక్షలకోట్లు ఇవే ఉన్నాయి. పట్టణ బిజినెస్ రుణాలు 29శాతంపెరిగి 71,628 కోట్లకు చేరాయి. ఎస్ఎంఇ రుణపరపతి కూడా 29శాతంపెరిగి 40,791 కోట్లకు చేరింది. త్రీవీలర్‌ఫైనాన్స్ 20శాతం క్షీణించి 19,689 కోట్లుగా ఉంటే గ్రామీణప్రాంతాల్లో బి2సి రుణాలు 20శాతంపెరిగి 17,770 కోట్లకు చేరాయి. కార్లరుణాలు 44శాతంపెరిగి 8710 కోట్లకు చేరాయి. బంగారం తాకట్టు రుణాలుకూడా 82శాతంపెరిగి 5494 కోట్లవరకూ ఉన్నట్లు కంపెనీ ప్రకటించింది. నాన్‌బ్యాంక్ సంస్థ అయిన బజాజ్‌ఫైనాన్స్‌లో డిపాజిట్లు కూడా 15శాతంపెరిగి 72,109 కోట్లకు చేరాయి.

## వాణిజ్యం




# కేంద్రానికి ఎల్ఐసి డివిడెండ్ రూ.7324 కోట్లు

**న్యూఢిల్లీ,జూలై 24:** ప్రభుత్వరంగంలోని జీవితభీమా సంస్థనుంచి కేంద్ర ప్రభుత్వానికి ఈఏడాది 7324 కోట్లరూపాయలు డివిడెండ్‌రూపంలో అందుతున్నది. దేశంలోనే అతిపెద్ద బీమా కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఈమేరకు ప్రభుత్వంనికి ప్రతి వాటాకు 12రూపాయలుచొప్పున డివిడెండ్ ఇవ్వాలనినిర్ణయించింది. 2025 మార్చి 31వ తేదీతోముగిసే ఆర్థికసంవత్సరానికిగాను ఈ డివిడెండ్ అందుతుంది. అయితే కార్పొరేషన్ సర్వసభ్యసమావేశంలో ఆమోదం పొందాల్సి ఉంది.

ఆగస్టు 26వ తేదీ ఎల్ఐసి సర్వసభ్య సమావేశం జరుగుతుందని స్టాక్ ఎక్స్ఛేంజిలకు నివేదిి చ్చింది. అలాగే అర్హులైన వాటాదారులకు జులై 25వతేదీ గడువుతేదీగా డివిడెండ్‌చెల్లింపునకు నిర్ణయించింది. అర్హులైన వాటాదారులందరూ ప్రతి వాటాకు 12రూపాయలుచొప్పున డివిడెండ్ పొందుతారు. బిఎస్ఇవద్ద అందుబాటులో ఉన్న గణాంకాలను పరిశీలిస్తే కేంద్రానికి ఎల్ఐసిలో 96.50శాతం షేర్లు ఉన్నాయి. అంటే 6,10,36,22,781 ఈక్విటీ వాటాలు కేంద్రానికి ఉన్నట్లు తెలిసిందే. ఇపుడు ఈ వాటాలన్నింటినీ కలిపి గణించి మొత్తం డివిడెండ్‌రూపంలో రూ.7324 కోట్లు అందించేందుకు ఎల్ఐసి నిర్ణయించింది.

# ది ఎగ్జిక్యూటివ్ ఇండియా రూ.2600 కోట్ల నిధుల సమీకరణ

**బెంగళూరు,జూలై 24:** బెంగళూరుకేంద్రంగాపనిచేస్తున్న ది ఎగ్జిక్యూటివ్ సెంటర్ కంపెనీ తాజాగా 2600 కోట్లరూపాయలు నిధులు సమీకరటించాలని నిర్ణయించింది. ఈమేరకు సెబీ వద్ద డిఆర్‌హెచ్‌పి దాఖలుచేసింది. ఎన్ఎస్ఇ, బిఎస్ఇల్లో లిస్టింగ్‌చేసేందుకు కూడా కంపెని నిర్ణయించింది. టెక్ అబూదాబిలో ఈ నిధులను పెట్టుబడులుగాపెట్టాలని, కంపెనీకి అనుబంధంగా దుబాయి యూనిట్ పనిచేస్తున్నందున మరింత విస్తరణకు ఈనిధులు వెచ్చించాలని నిర్ణయించింది. టిఇసి సింగపూర్(ఎస్‌జిపి), టెక్‌దుబాయి, రెండు అనుబంధ సంస్థలు కూడా ముందు టెక్ సింగపూర్‌పరిధిలోనే పనిచేస్తున్నాయి. కోటక్ మహీంద్ర క్యాపిటల్‌కంపెనీ, ఐసిఐసిఐ సెకూనయరిటీస్, నోమురా ఫైనాన్షియల్ అడ్వ యిజరీ సెక్యూరిటీస్, సంస్థలు బుక్‌రన్నింగ్ లీడ్‌మేనే జర్లుగా వ్యవహరిస్తున్నాయి. ఆఫర్‌ఫర్‌సేల్ కంపెనీపరంగా ఇప్పటివరకూ వెల్లడికాలేదు. అయితే సెబీకి మాత్రం దరఖాస్తుచేసింది. కొన్ని ప్రత్యేక సెక్యూరిటీలనున జారీచేసి ప్రాధాన్యతా ఆఫర్ లేదా నిర్దేశిత మరే ఇతర విధానం లో అయినా సరే 5200 మిలియన్ రూపాయలు సమీకరిం చేందుకు నిర్ణయించింది. అయితే డిఆర్ఎహెచ్‌పితోపాటు రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీలవద్దకూడా దాఖలుచేసింది. ఐపిఒ ప్లేస్‌మెంట్‌కకు ముందస్తుప్రక్రియగానే కంపెనీ చెపుతోంది. కంపెనీ ఎండి మనిష్ ఖేడియా మాట్లాడుతూ వచ్చే మూడేళ్లలో గణనీయమైన వృద్ధిని సాధిస్తామని, 25నుంచి 30 శాతం సిఎజిఆర్‌సాధించగలమని చెపుతున్నారు. ప్రస్తుతం 18నుంచి 20శాతం వృద్ధిసాధించామని, అదనంగా మా పెట్టుబడులను ఈ కాలంలో మరింతగా పెంచుకుంటామని ఎండి వెల్లడించారు. కంపెనీ ప్రీమియం ఫ్లెక్సిబుల్ స్పేస్ సొల్యూషన్స్‌ను అందిస్తోంది. భారత్; సింగపూర్; మధ్యప్రాచ్యం, దుబాయి, అబూదుబాయి, యుఎఇ, ఆసియా, ఇండోనేసియాలోనిజకార్తా, వియత్నంలోని హోచిమిన్‌సిటీ, ఫిలిప్పైన్స్‌లోని మనిలా, శ్రీలంకలోని కొలంబో నగరాల్లో ప్రీమియం స్పేస్ వాణిజ్యకార్యకలాపాలునిర్వహిస్తోంది.





# అదానీ నికరలాభం రూ. 512.48 కోట్లు

**ముంబయి,జూలై 24:** ఆదానిఎనర్జీ సొల్యూషన్స్ తొలిత్రైమాసికంలో 512.48 కోట్ల నికరలాభం నమోదుచేసింది. గత ఏడాది ఇదేకాలానికి 823.92 కోట్లునష్టం చవిచూసిన కంపెనీ క్రమేపీ కోలుకుంది. అయితే లాభం మాత్రం వార్షిక పద్ధతిలోచూస్తే 20.8శాతం తగ్గింది. నాలుగోత్రైఆమిసంలో 647.15 కోట్లుగా ఉన్నట్లు తేలింది. లావాదేవీలద్వారా కంపెనీల రాబడులు 26.78శాతంపెరిగి 6819.28 కోట్లకు చేరాయి. ఇదే తొలిత్రైమాసికం వరకూ చూస్తే 5378.55 కోట్లుగా ఉంది. గతనాలుగోత్రైమాసికంలో 6347.58 కోట్ల నుంచి 7.4శాతంపెరిగినట్లు కంపెనీ ప్రకటించింది. కంపెనీ ఖర్చులు తొలిత్రైమాసికంలో 32శాతంపెరిగి 5863.55 కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదేకాలంలోచూస్తే 4443 కోట్లు కాగా నాలుగోత్రైమాసికంలో 5411.6కోట్లుగా ఉన్నాయి. అంటే 8.35శాతంపెరిగాయి. పన్నులచెల్లింపులకు ముందు రాబడులు 14శాతంపెరిగి 2017 కోట్లుగా ఉన్నాయి. తొలిత్రైమాసికంలో ఆదాని ఎనర్జీ మూడు ట్రాన్స్‌మిషన్‌ప్రాజెక్టులను ప్రారంభించింది. ఖావ్‌డా ఫేజ్2 పార్ట్-ఎ గురజాత్, ఖావ్‌డా పూలింగ్‌స్టేషన్‌వన్; కెపిఎస్‌వన్, సంగోడ్ (రాజస్థాన్)లలో ప్లాంట్లను ప్రారంభించినట్లు వెల్లడించింది. అలాగే తాలేగాంవ్‌లైన్‌లో కొత్త ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టుకూడా ప్రస్తుతం పూర్తికావచ్చే దశలో ఉంది. దీనితో కంపెనీ ఆర్డర్‌బుక్ 59,304 కోట్లుగా ఉంది. ఆదాని ఎనర్జీ సొల్యూషన్స్ 849.4 చొప్పున బిఎస్ఇలో ట్రేడ్ అయ్యాయి. ప్రతిషేరుకు రాబడి రూ.4.27గా కంపెనీ గణించింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14